జ్ఞాన యోగం

# విశ్వ వేదన



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 9042020123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014


# విశ్వవేదన

భక్తి వేదాంత వేదనా

నివేదనాత్మక స్తుతి కావ్యము

' శ్రీపాదపాంశువు '

అగస్త్యరాజు సర్వేశ్వరరావు




ఈ నక్షత్రములున్ గ్రహమ్ములును సూర్యేంద్వాది గోళంబులె
ద్దానందోచు ? తదాద్యశక్తి యెదియో ? తద్రూపమెట్లుండునో ?
ప్రాణంబేకడనుండి వచ్చి యెట జేరంబోవునో ? ఇంతకీ
మేనన్నేనని పల్కు తత్వమెద్దియో ? మిథ్యాజగంబేమిటో ?

# ప్రాజ్ఞవాణి

అవధాని శిరోమణి, బ్రాహ్మీవిభూషణ, కవితాసుధాకర, అవధాన
కళాప్రపూర్ణ, సారస్వత శిరోమణి, కవికేసరి
శ్రీ అష్టకాల నరసింహరామశర్మగారు M.A.,
సరస్వతీక్షేత్ర నిర్మాత, అనంతసాగర్ పోస్టు,
మెదకుజిల్లా, Pin - 502 267.

## శ్రుతి




"య ఈం స్వరంతం గుహ్యామే వానుస్వరన్
ఓమితి స్వరాం వాచం సముచ్చరతి
యోవాఽక్షరం సదు బ్రహ్మాపరమం
స సత్యోఽయ మమృతో విశ్వవేదాః" ||

"బ్రహ్మాణస్పతి భూర్భువః స్వ స్తిసృభి
ర్వ్యాగ్భి ర్వ్యాహృతిభి ర్నిదధే పదాని
పృథివీ మంతరిక్షం దివంచాధి
సత్రిపాత్ పురుషోఽయం సాకం వాచా" || ఛందోదర్శనము.

ఈ మంత్రములు ఓంకారముయొక్క పాదుర్భావమును; సృష్టిప్రక్రియారంభమును దెలుపుచున్నవి. అవ్యక్తనాద బ్రహ్మమై గుహ్యాప్రణవముగా గీర్తింపబడిన ఈంకారము, తొలుత బరమాకాశమునుండి ఓంకారమను స్వరమును బలికినది. ఆ యోంకారమే సర్వచరాచర సృష్టికి మూలబీజమై భూః భువః సువః అను వ్యాహృతిత్రయమునకు, జన్మనిచ్చినది. ఇట్లు జరిగిన నాదవ్యక్తీకరణకు, బరమాత్మ పరబ్రహ్మపద వాచ్యమగుటకు, దదీయ మాయారూప మిథున మవసరమైనది. తన్మిథునత్వమును బొందిన వాక్కునకు, సభేద మనివార్యమైనది. పరబ్రహ్మముతో దన తాదాత్మ్యమును వ్యక్తీకరించుటకు పై నాదము లావశ్యకములైనవి.

నిర్గుణ నిరాకార పరబ్రహ్మమునకును జగత్సృష్టి యనివార్యమైనది. త్రివ్యాహృతులు. పంచభూతముల సృష్టించుకొనినవి. ఆ పంచభూతముల

ద్వారా మాయావృత జీవ జననము జరిగినది. తదంశయగు జీవాత్మ, పరమాత్మతత్త్వమునుండి ప్రయోజనార్థమై విడివడి, మాయావృతేంద్రియ మనోబుద్ధి చిత్తాహంకారములతో, జన్మ జరా మరణాది సమస్త వికారములతో, పాంచభౌతిక దేహాభిమానియై, ప్రాణిగా నవతరించినది. ఆ ప్రాణి శరీర రక్షణార్థమై యాహార మపేక్షించినది. ఆ యాహారాన్వేషణకై చలన శీలము కావలసివచ్చినది. ఆ కారణమున గర్మజ్ఞానేంద్రియములతో గూడి జీవికను గొనసాగించుచు వచ్చినది. ఉపాధి భేదమునుబట్టి మనస్సు తనవంతు కర్తవ్యమును బ్రేరేపించు సమయమున, బుద్ధి తనదగు పాత్ర నిర్వహించుటకు దగిన యుపాధిలో ప్రవేశించుటతో, నాలోచనా విధానము పెరిగి, శీతోష్ణ సుఖ దుఃఖాద్యనుభవమును, దజ్జన్య జ్ఞానమును బొంది, స్మృతి వ్యవహారమున భూతమును వర్తమానమున నుపయోగించుకొని, భవిష్యత్తు నూహించు స్థితికి నెదిగినది. తద్భవిష్యదృష్టి యిహలోక విచారమొనర్చి, యాంతర దృష్టితో బంచభూతములను దనకనుకూలముగా నుపయోగించుకొను కృషితో నవసరమైన యాత్మరక్షణకై యెదిరించుచు, జీవన సమరమును గొనసాగింపనేర్చినది. తన బుద్ధి కతీతమగు శక్తి యెదియో తనను బరోక్షముగా నడిపించుచున్నదను విశ్వాసమును బొంది, దానిని సుముఖము గావించు నాధ్యాత్మిక దృష్టిని బెంచుకొని, పెక్కు విధములగు తపస్సులనాచరించి, తదనుభూతుల ద్వారా, భావితరములకు సులభతరముగా, బ్రహ్మసాక్షాత్కారమును బొందుటకు వీలుగా గల, తపశ్చర్యలతోపాటు సామాన్యులకు గూడ సులభమగు ననేకోపాసనా విధానములను దెలియజేయుటకై, బహు విధములుగా ఉపనిషత్తుల రూపముననను, తదా చరిత వ్యక్తుల జీవన విధానములను దెలుపు కథల రూపముననను, దచ్ఛక్తి పారమ్యము చాటబడినది.

ఈ విధముగా నా శక్తి నిరాకారముగా నుపాసింపబడుచున్న కాలముననే, దానికొక రూపమును భావించి, తద్రూపము నుపాసించు విధానము బయలుదేరినది. దానిని సగుణోపాసనగా బిలిచిరి. ఆ సగుణోపాసనలో సగుణ సాకారము సగుణనిరాకారము అను ద్వివిధోపాసన యేర్పడినది. ఔపచారికముగా నర్పింపవలసిన వస్తువులను బ్రత్యక్షముగా నర్పించుకొనుట, సగుణ సాకారము. అర్పించలేని వస్తువులను గేవల నామోచ్చారణముతో సమర్పించుట సగుణనిరాకారముగా బిలువవచ్చును. నిరాకార పర్యవసాయికముగా సగు సగుణోపాసన సగుణ నిరాకార మగునని కొందరు.

సగుణా నిర్గుణా చేతి ద్విధాప్రోక్తా మనీషిభిః
సగుణా రాగిభిస్సేవ్యా, నిర్గుణాతు విరాగిభిః ॥

ఇట్లు సగుణోపాసన రాగులకు, నిర్గుణోపాసన విరాగులకని దేవీభాగవతము నుడివినది.

ఉపాసనలో నుపాస్యదైవము భిన్నరూపములయి శివ విష్ణు దేవీ గణేశ సౌర రూపములుగా బూజ లందుచున్నది. ఉపాస్యదైవముల సంఖ్య పెరుగుటను వేదము కూడ ననుమతించినది.

'యం కామయే తం తముగ్రం కృణోమి, తం బ్రహ్మాణం తం ఋషిం తం సుమేధామ్' (ఋ. 10-125-5).

పైన బేర్కొనబడిన దేవత లందఱికిని అథర్వశీర్షోపనిషత్తులు గలవు. కాని దేవీపరముగా ఒకే అథర్వశీర్షోపనిషత్తు కలదు. దేవీపరముగా భేదము లేని రీతిగా త్రిమాతలకును ఒకే యుపాసనా విధానము నెగడుచున్నది. పురుష రూపమున నున్న దేవతలందఱు దేవ్యంశములేయని దేవీభాగవతము నుడువుచున్నది. "నామభేదా ద్భవేద్భిన్నా నభిన్నా పరమార్థతః" (దే.పు.1814).

"ఉమేతి కేచిదాహుస్తాం శక్తిర్లక్ష్మీతి చాపరే
భారతీత్యపరేచైనాం గిరిజేత్యంబికేతిచ.
దుర్గేతి భద్రకాళీతి చండీ మాహేశ్వరీ తథా
కౌమారీ వైష్ణవీచైవ వారా హ్యైంద్రీతి చాపరే
బ్రాహ్మీతి విద్యావిద్యేతి మాయేతిచ తథాపరే
ప్రకృతీత్యంతరా చైవ వదన్తి పరమార్థతః " ॥ (శాక్తానంద తరంగిణి)

ఇట్లు భిన్న నామములతో నుపాసింపబడుచున్నను, దేవియే యేకైకమైన ఆద్యశక్తిగా నారాధింపబడుచున్నది. బ్రహ్మపద సంబంధియగు చిద్భావాశ్రయముగా విష్ణువు, సద్భావాశ్రయముగా శివుడు, తేజోభావాశ్రయముగా సూర్యుడు, బుద్ధిప్రధానాశ్రయముగా గణపతి, భగవచ్ఛక్తి ఆశ్రయముగా దేవ్యుపాసన, చెప్పబడినది. దేవ్యథర్వశీర్షోపనిషత్తు ప్రకారము –

"దేవీ హ్యేకాగ్ర ఆసీత్। సైవ జగదండ మసృజత్। తస్యా ఏవ బ్రహ్మా అజీజనత్, విష్ణురజీజనత్, రుద్రోఽజీజనత్, సర్వేమరుద్గణా అజీజనన్।.....

నర్వమజీజనత్ ....... సైషా వరాశక్తిః" అందుకే శక్త్యుపాసకులే ఎక్కువయని చెపు ్రటు.

"శాక్తా ఏవ ద్విజా స్సర్వే న శైవా న చ వైష్ణవాః ।
ఉపాసతే యతోదేవీం గాయత్రీం వరమాక్షరీం ॥ (దేవీభాగవతము)

శాక్తోపాసన వైదికము కాదనియు, కేవలము తాంత్రికమనియు, వాదించు వారలకు అది వైదికమేయని, అవైదికము కాదని క్రింది యుపపత్తుల ద్వారా నిరూపింపబడుచున్నది.

"తామగ్ని వర్ణాం తపసా జ్వలంతీం । వైరోచనీం కర్మఫలేమ జుష్టామ్।
దురాం దేవీం శరణమహం ప్రపద్యే । నుతర సితరసే నమః" ॥
(అధర్వవేదం 10-127-12)

"పావకానః నరన్వతీ వాజేభిర్వాజినీవతీ । యజ్ఞం వష్టు ధియా వనుః"
(ఋగ్వేదం 1-2-10)

"యద్వాగ్వదంత్యవిచేతనాని రాష్ట్రీదేవానాం నిషసాదమంద్రా ।
చతస్ర ఊర్జం దుదుహే వయాంసి క్వస్విదస్యాః పరమం జగామ"
(ఋగ్వేదం 8-100-10)

"మమయోని రప్స్వంతః నముద్రే" (ఋగ్వేదం 10-125-7)

"అహమేవ వాత ఇవ ప్రవామ్యారభమాణా భువనాని విశ్వా"
(ఋగ్వేదం 10-125-8)

"తాంమా దేవా వ్యదధుః పురుత్రా" (ఋగ్వేదం 10-125-3)

"అహం రుద్రేభి ర్వసుభిశ్చరా మ్యహ మాది త్యైరుత విశ్వదేవైః"
(ఋగ్వేదం 10-125-1)

"మయాసోఽన్నమత్తి, యోవిపశ్యతి, యఃప్రాణితియ ఈం శృణోత్యుక్తమ్"
(ఋగ్వేదం 10-125-4)

"అహం రుద్రాయ ధనురాతనోమి, బ్రహ్మద్విషే శ[illegible] హంతవా ఉ"
(ఋగ్వేదం 10-125-6)

ఇట్లు శక్తి మహిమను వేదము వేనోళ్ళ చాటుచున్నది.

"శక్తిశ్చ శక్తిమద్రూపాత్ వ్యతిరేకం న వాంఛతి" (దేవీభాగవతము)

సీతోపనిషత్తులోనూ, "అధాతో బ్రహ్మజిజ్ఞాసా" అను సూక్తియే కలదు. వరబ్రహ్మమునకు శక్తికి, భేదమున్నచో "అధాతో శక్తి జిజ్ఞాసా" అని

యుండెడిది కదా! అట్లు లేదు కావున శక్తికి బ్రహ్మమునకు భేదము లేదని తెలియుచున్నది.

"సరస్వతి త్వం రుద్రేణ విద్యుతోప
సంహితా స్వరసీహా రవఘోనాంతః ।
రుద్రాణీ మధ్యమా గౌరి గరీయసీ
వాగ్విదా ప్రతిమానం విశ్వస్యాధిబీజమ్" ॥
"బ్రహ్మణస్పతి త్వం పరమే వ్యోమని
సన్నమాత్రః సన్నపాద్ వాచాపురుషః ।
స్వతో నప్రతివద్యసే పరశ్చాతో
వాగ్విదా సమానా పురుషస్యాత్మా ॥ (ఛందోదర్శనం)

ఉపనిషత్తులు కూడ దేవీతత్వాన్నిట్లు గ్గడించినవి. శ్వేతాశ్వతరోపనిషత్తు, త్రిగుణాత్మికా ప్రకృతి మఱియు మాయ యొక్క యభిన్నత్వ నిరూపణ చేయుచు ప్రకృతియే మాయ యనియు, మహేశ్వరుడు దాని కధిష్ఠాత యనియు, దెలిపినది.

"మాయాంతు ప్రకృతిం విద్యా న్మాయినంతు మహేశ్వరమ్ ।
తస్యావయవభూతైస్తు వ్యాప్తం సర్వమిదం జగత్ ॥
"అజామేకాం లోహిత శుక్ల కృష్ణాం
బహ్వీః ప్రజాః సృజమానాం సరూపాః" ॥ (శ్వేతాశ్వతరం)
"గాయత్రీవా ఇదం సర్వం భూతం యదిదం కించ వాగ్వై
గాయత్రీవాగ్వా ఇదం సర్వం గాయతిచ త్రాయతేచ" ॥ (ఛాందోగ్యం 3-12-1)
"యథా నద్యః స్యందమానాః సముద్రే
అస్తం గచ్ఛంతి నామ రూపే విహాయ ।
తథా విద్వాన్ నామరూపాద్విముక్తః
పరాత్పరం జగదంబా ముపైతి" ॥ (గుహ్యకాళికోపనిషత్తు)

ఇంతేగాక శ్రీసూక్త దుర్గాసూక్తాదులు, త్రిపుర తాపినీ, దేవీ, సరస్వతీ రహస్యాద్యుపనిషత్తులు, స్మృతి పురాణేతిహాసాగమ రహస్య సంహితాదులు, యామలార్ణవ తంత్రాదులు, శక్త్యుపాసనా విధానమును విస్పష్టము చేసినవి. సౌందర్యలహరి దేవీస్తోత్రములలో దలమానికమైనది. ఈ విధముగా శక్త్యుపాసన సర్వనిష్ఠమై సర్వాధికమై యొనలారుచున్నదనుట నిర్వివాదము.

ఈ విషయమునే శ్రీ అగస్త్యరాజు సర్వేశ్వరరావుగారి విశ్వవేదన తెలుగు పద్యములలో బూర్తిగా గృషిచేసిన దనవచ్చును. ఈ కృతి వారి మనః పరిపక్వతను బ్రకటపరచుచున్నది. వీ రింతకుముందు "శ్రీమాత గాయత్రి " అను గ్రంథమున గాయత్ర్యుపాసనా విధానమును వివరముగా దెలిపిరి. సరసకవులైన వీరు వృత్తిరీత్యా అధ్యాపక ప్రాధ్యాపకత్వములు నెఱపుటవలన నేమో, జ్ఞానప్రధానాలోచనా విధానము ప్రకటపరచినారు.

వీరి రచన సాహిత్యము నందేగాక వేదాంతమునందును ధారావాహికముగా సాగుటతో, జేయి తిరిగిన వీరి కవితామూర్తిమత్వము కనులకు గట్టగలదు. వీరి పద్యములు సరళములై సుబోధములైయున్నను, గూఢవిషయము కనుక తాత్పర్యాపేక్షితములైనవి.

ఉపనిషన్మంత్ర బోధితమగు సమస్త విషయమును దెనుగున పద్యబద్ధము గావించుటకుదోడు, తాత్పర్యమును మధ్య ననేక విశేషములతో వ్రాసి, పాఠకులకెంతో సులభతరము చేసినారు. వీరి శైలి యెంత సులభమో క్రింది పద్యమున గమనింపవచ్చును.

చం॥ కనబడు నీ ప్రపంచమును గాల్పనికంబను టెట్లు? కానిచో
విసబడు నా ప్రపంచ మవివేక వికల్ప మనంగ జెల్లునే ?!
కనబడు దానియం దణగి కన్నులకుం గనరాక, యేకతా
జనిత మహత్వ పూర్ణమగు సత్యమొకండు విశానమొందెడిన్ ॥ (19)

అమ్మవారి నాయన చూచిన విధానము

"ఒకచో భీకర కాళికావపుషవై యొండొక్కచో దుర్గవై....." అనే 31వ పద్యంలో కనిపిస్తుంది.

"ప్రతి పాదధ్వని నీదిగా దలచి మద్ద్వారంబున న్నిల్చితిన్ ......" అనెడి 44వ పద్యము వీరి భక్తి పారమ్యమునకు సూచకముగ నున్నది.

"గళమున వాతము స్ఠఫము గ్రమ్ముచు....." అనే 48వ పద్యమందలి కవియూహ అద్భుతముగ నున్నది.

ఉపాసనలో సుప్రభాతము పలుకుట, నిద్రపుచ్చుట భాగములే యైనను వీనిలోని సామంజస్యమును కవి ప్రశ్నించిన విధము చక్కగా నున్నది. ఉపాసనా ప్రక్రియలో చివరకు అహమెట్లు కన్పించును? తదుపరి కర్తవ్యమును దెలుపుచు - "ఒక్కొక మెట్టు నెక్కిచన నుండిన దేమియు గానరాదు....."

(136) అనే పద్యంలో చక్కగా వర్ణించినారు. ఆత్మసాధనలో ఒక్కొక్క మెట్టు నెక్కుచు బోవ బోవ తుదకు నహము దప్ప నేముండెనో యగుపించదు. ఆ యహము కూడ నుండెనో లేదో తెలుపుటకు మాటల కందదు. మనన్సునకు దక్కదు. శబ్దము కాని శబ్దమై, పరానందవిద్రూపమున నెలకొని యుండును. సర్వకృత్యము లుడిగినట్లు తోచు తద్రూపమైన యాత్మ జయించుగాక! అని ముగిస్తారు.

ఇంత సరళముగా వేదాంతము నందించుట, సీతారామాంజనేయ సంవాద గ్రంథ కర్తయైన శ్రీ పరశురామపంతుల లింగమూర్తిగారి కొక్కరికే సాధ్య మనుకున్నాను. వీరును సరళసుందరముగా వేదాంతమును భక్తజనుల కందించి ధన్యులైనారు. ఎడనెడ దీర్ఘ సమాసములు కనుపడినను అవి సహజమధురములై ద్రాక్షాపాకముననే యున్నవి. 'ఆత్మ సంస్థియా వాసిత సృష్టికల్పన వివర్తనము', 'ధ్వాంత సంశ్రిత విభా పరినిష్ఠ విశిష్టము' ఇట్లొకటి రెండు, వెదకువారికే కష్టముగా దొఱుక గలవు.

నిగూఢతత్త్వము నిట్లలతి పదములతో బొదుగుట చక్కని కవితా శిల్పమే యగును. ఇది జననాంతర పుణ్య విశేష లబ్ధముగాక నేమగును? గంభీరమగు వేదాంత సముద్రము నాపోశనము పట్టిన వీ రగస్త్యరాజు వారగుట దైవికము. అక్కడక్కడ,, గేవలాధ్యాత్మిక దృష్టి తక్కి చూచిన, గొన్ని యెడల సరళాదేశముల యందు శ్రద్ధ వహింపక పోవుట తప్ప, సర్వము సుసంపన్నము, అద్భుతము, ఆనందదాయకము. ఈ కృతి మదిష్టదైవమగు అనంతసాగర క్షేత్రాధిష్ఠిత సరస్వతీమాత కంకితము చేయుచు, కవిగారు "నీ విడినట్టి వాక్కు నిదె నీకు సమర్పణ సేయుచుంటి నా భావము నీవ యౌట" అన్నారు. ఆత్మనిండిన మాట ఇది. అన్మదాదుల కానందపు దేట. ధన్యజీవులు వీరు.

నాకీ మాటలు నాల్గు వ్రాయుటకు బుణ్యంబిట్లు వీలిచ్చెనా యని ముగించుచున్నాను.

ఇతి శం

శ్రీ సరస్వతీ క్షేత్రము — అష్టకాల నరసింహరామశర్మ

24-8-1996.

వ్యాకరణాధ్యాపక, విద్యాప్రవీణ
శ్రీ చింతలపాటి పూర్ణానన్దశాస్త్రి M.A., గారు
వేద సంస్కృత కళాశాల,
మూలపేట, నెల్లూరు - 3.

# ఆనన్దసుషమ

"జ్ఞానాదేవతుకైవల్యమ్", "తరతిశోకమాత్మవిత్" మొదలగు ఉపనిష ద్వాక్యములు ఆత్మజ్ఞానమువలననే మానవులకు జనన మరణాది సంసారబాధలు తొలగి సుస్థిరమైన పరమానన్ద రూపమగు మోక్షము సిద్ధించునని చెప్పుచున్నవి.

అట్టి అఖండాఽద్వితీయ ఆత్మానన్ద రసాఽనుభూతి నందించుటలో శివానన్దలహరి, సౌన్దర్యలహరి వంటి స్తోత్రగ్రంథముల వలె, శ్రీపాదపాంశువు, కావ్యకళాకృషీవల, మధురకవి, శ్రీ అగస్త్యరాజు సర్వేశ్వరరావుగారి, - సర్వేశ్వరానుగ్రహాలబ్ధ సత్కవితాసారస్వతసర్వస్వమైన, - యీ విశ్వవేద నాఖ్యమగు కావ్యసరోవరము, సాంసారికక్లేశ తాపత్రయ దావోదీర్తులకు, సరస మధుర గంభీర దివ్యవాగమృత రసనిష్యందధుని యనుటలో సందేహము లేదు.

## నామ వైశిష్ట్యము :

ఈ కవివర్యులు తమ గ్రంథమునకు విశ్వవేదనా నామము నుగ్గడించుట యందే దీని వైశిష్ట్యము దెలియుచున్నది. ఇది పలువిధముల సార్థకనామము. విశ్వమనగా జగత్తు అని యొక అర్థము. వేదన యనగా జిజ్ఞాసారూపమైన విచారణయని యొక అర్థము. ఇదియే భూనభోగ్రహ తారాదిరూపమైన యీ స్థావర జంగమాత్మకమగు జగత్తునకు మూలాధారమేదియో, గమ్యమగు చరమాఽవధి యేదియో, తెలిసికొనుటకు, జీవునకు గలిగెడు చిత్రవిచిత్ర భావనలతో వెలువడు ఆవేదన. నివేదించుకొనుటనియు, మఱియొక అర్థము.

ఇట గ్రంథారంభము నుండి, "శ్రీతత్త్వమ్ము నెఱుంగ నెంచి మదిలో జింతింతు" (1) "ఈ సచరాచరంబఖిల మే పరతత్త్వగతంబొ!" (13) మున్నగు పద్యములతో, బహువిధ భావోల్లేఖనములతోభక్తి జ్ఞాన మార్గములతో, సగుణ నిర్గుణోపాసనారీతులతో, ఆర్తితో, గజేంద్రుడు విష్ణువునకు మొఱబెట్టిన విధమున, జీవుడు తన కష్టసుఖములను పరదేవతకు నివేదించుట స్పష్టముగ

కనిపించుచున్నది. ముముక్షువులకు శమదమాది సాధన చతుష్టయ సంపదతో బాటు, ఈ జిజ్ఞాస యేర్పడనిదే వేదాన్త తత్త్వము బుద్ధ్యారూఢము గాదు. కనుకనే బ్రహ్మసూత్రములలో ప్రప్రథమముగ "అథాతో బ్రహ్మజిజ్ఞాసా" అని, దీని ప్రాముఖ్యము చెప్పబడినది.

మఱియు - ఈ జీవుని జిజ్ఞాసకు ప్రధానమైన సమాధానము గూడ నామమునందే యున్నది. విశ్వం = వ్యాపకం పరమాత్మానమ్, వేదయతి = సర్వ జగన్నివాసతయా అఖ్యాతి" అను వ్యుత్పత్తిచే, సర్వవ్యాపకమైన పరమాత్మతత్త్వమే సర్వజగమున కాధారమను సిద్ధాన్తార్థమును గూడ తెలుపుచు, అది మిగుల సార్థకమై శోభిల్లుచున్నది. "విష్ణు - వ్యాప్తౌ" అను ధాతువు నుండి యేర్పడిన విశ్వశబ్దము, సర్వవ్యాపకుడైన పరమాత్మ అను నర్థమును ప్రధానముగ బోధించును. కనుకనే "విశ్వం విష్ణు ర్వషట్కారః" అని విష్ణుసహస్రనామ స్తోత్రములో విశ్వశబ్దము ప్రథమముగ పేర్కొనబడినది.

ఇక వేదనాశబ్దము "విద - చేతనాఖ్యాన నివాసేషు" అను ధాతువుచే సిద్ధమైనది. కనుక నీ గ్రంథము " పరమాత్మ జగత్తుకంటె అభిన్నమై, జగత్తుకు వ్యాపకమై, తనయందు అఖిల భూతముల సృష్టి స్థితి లయాదులను జరుపునట్లు" తెలుపుచున్నదని యీనామకరణములోని ఔచిత్యము విభావనీయము.

ఇంకను - "జన్మాద్యస్యయతః" శాస్త్రయోనిత్వాత్" ఇత్యాది బ్రహ్మసూత్రములను, శాంకర భాష్యాదులను, దుర్గా సప్తశతి, దేవీభాగవతము, లలితాసహస్రనామ భాష్యము మొదలగువానిలోని తత్త్వమును, మంత్రశాస్త్ర విశేషములను, శ్రీవిద్యాసంప్రదాయముతో సరిగా సమన్వయపఱచి, దేవీపరముగ సమస్తమును తెలుపుట చేతను, దీనికి "విశ్వవేదన" యను నామము సార్థకమేయైనది.

## రచనానైపుణ్యము :

వీరి గ్రంథమునందలి "సేనొక వాహినీజనిత నిర్మలవీచికనై" (40) అను పద్యము, జీవబ్రహ్మైక్యమును కడుంగడు హృద్యమగు దృష్టాన్తముతో బోధించినది.

సముద్రములో ఉత్పన్నమై సముద్రములోనే లీనమైన తరంగము, సముద్రజలముకంటె వేరుగానట్లు, ఆత్మలో యేర్పడిన జీవభావము జ్ఞానముచే ఆత్మలోనే అన్తరించిన పిమ్మట, ఆత్మయే యగును గాని వేరుగాదనుట కిది

సమర్థమగు దృష్టాన్తము. కనుకనే శ్రీశంకరులు తమ షట్పదీస్తవమున "సాముద్రోహి తరఙ్గః" - అని యీ దృష్టాన్తమును పేర్కొనిరి.

మఱియు సంధ్యావన్దనమునన్దలి గాయత్రీ సావిత్రీ సరస్వతీ బ్రాహ్మీ వైష్ణవీ రౌద్రీ తత్వములను వాని అభిన్నత్వమును విశదీకరించి, సంధ్యోపాసనా పరమార్థమును బోధించుటకు శ్రీకవివర్యులు -

"నిర్గుణమైనచో దెలియనేర రటంచు గుణ ప్రపన్నవై" (91)

"సృష్టింగూర్ప రజోగుణ ప్రకృతివై" (103)

"ఓజన్వంతము సృష్టిపోషకము నిత్యోన్మేషమౌ వైష్ణవీ" (ప. 106)

ఇత్యాది పద్యములలో అనవద్యమగు వ్యాఖ్య నొనర్చి కృతకృత్యులైరి.

**కథానుషంగము :**

అట్లే - "పరశివునూర్ధ్వభాగమున పద్మజుడున్ దనుమధ్యమందు శ్రీహరియు" (100)

"త్రిపురములౌ శరీరములు దేహిహృదంతర భాసి యీశుడే" (101),

అను పద్యములలో త్రిపురసుందరీ తత్వమును, నామ నిర్వచనమును, కథామాత్రసారముగ కాక, ఆధ్యాత్మిక సమన్వయముతో వివరించుట ప్రశంసనీయము.

- "వెన్నెముకన్ గ్రహించి కనిపించని కవ్వముచేసి త్రాళ్ళుగా నన్నుచ శ్వాసయుగ్మమును" (108) అను పద్యములో యోగిపుంగవులు తమ ధ్యానమార్గముచే ఉచ్ఛ్వాస నిశ్శ్వాసముల ద్వారా పరదేవతను సాక్షాత్కరించుకొనుటను, సముద్రమథన - లక్ష్మీజనన వృత్తాన్తము ద్వారా బోధించుట, పుణ్యకథావర్ణనాలంకార నైపుణ్యము నగణ్యముగ తెలుపుచున్నది.

**ఆత్మవేదన :**

గ్రంథాన్తమున - "ఒక్కొక మెట్టు నెక్కి చన నుండిన దేమియు గానరా దహంబొక్కటి తక్క ....... తదాత్మ జయించు గావుతన్" (136) ఈ పద్యములో ఆత్మభావపరిణతి విశేషముచే, "అహం" అను భావమును క్రమముగ పరిత్యజించి, ఆనన్దస్వరూపమైన ఆత్మకు జయజయధ్వానములు

బల్కుటతో, విశ్వస్వరూప పరమాత్మకు, తమ విశ్వకవితా నివేదనము చేయుట, వీరి భక్తి జ్ఞాన కవితా సమాధిస్థితికి పరమోత్కర్ష యనవచ్చును.

ఆత్మానన్దామృతాబ్ధి నాపోశన పట్టిన యీ కవిరాజు, సర్వవిద్యాసరిత్కవితాసారమైన సర్వేశ్వరుడై నామసార్థక్యముతో బాటు జన్మసార్థక్యము వడసి, మనకును ధన్యత్వము ననుగ్రహించినారు. వీరికి నా కృతజ్ఞతాప్రణామములు.

"జయన్తితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః"

నెల్లూరు
5-9-1996

ఇట్లు
చిన్తలపాటి పూర్ణానన్దశాస్త్రి

శృంగేరిపీఠ ఆస్థాన విద్వాంసులు, 'అర్షవిద్యాభూషణ'
శ్రీ మల్లాప్రగడ శ్రీరంగారావుగారు
శ్రీ శారదానదనం, సర్కిల్‌పేట, మచిలీపట్నం.

# సన్నుతి

మధురకవి, కావ్యకళాకృషీవలులు, శ్రీపాదపాంశువు శ్రీ అగస్త్యరాజు సర్వేశ్వరరావుగారి 'విశ్వవేదన,' ఆమూలాగ్రము రెండుసార్లు చదివించి అనితరమైన ఆనందము నందించినది.

విశ్వుడైన పరమాత్మకు నివేదించు వేదనగా, విశ్వుడైన జీవుని ఆవేదనగా, యీ విశ్వమందలి భగవతి వ్యాపినిగా సర్వేశ్వరరావుగారు తమ లేఖిని నుండి అమృతధారగ ఆనందరస ప్రవాహమును ఆస్తికలోకానికి ప్రసరింపచేశారు.

ఇంతకుపూర్వము వీరు అనేక గ్రంథములను రచించి కవితారచనలో సిద్ధహస్తులై సాహితీహృదయులకు ఆనంద సమారాధన గావించిన అదృష్టవంతులు.

ఈ 'విశ్వవేదన' లో మంత్ర, యంత్ర, తంత్ర, యోగశాస్త్రరహస్యములను, సూర్యచంద్రాది గ్రహముల స్థితిని నక్షత్రముల సంచార సన్నివేశములను, ఆత్మతత్వరహస్యమును, జీవుడనుభవించు కష్ట సుఖములను, జగన్మాతయగు పరాశక్తికి నివేదించుటలో వీరి రచనావైఖరి, భావవివరణ, అర్థవిశ్లేషణ, ఆధ్యాత్మిక సాధనానుభవములతో అందరి హృదయాలను ఆకట్టుకొని, ఆలోచింపచేసి ఆత్మతత్వాన్వేషణలో అభిరుచిని, ఆసక్తిని కలిగింపచేయు ననుట నిర్వివాదము.

ఈ కావ్యమందలి ఉత్తరభాగమున పరాశక్తి నామములలోని యౌచిత్యమును వివరించుచు సోపపత్తికముగ అనేక ప్రామాణిక గ్రంథముల నుండి నిరూపణ చేయుచు శ్రీ లలితా సహస్రనామములలోని కొన్నిటిని సందర్భోచితముగ వ్యాఖ్యానించుచు ఉపాసకులకు సాధకులకు వీరు మహోపకారమొనర్చినారు.

అక్షరోపాసనలో అగ్రేసరులైన వీరు అలవోకగా పద్యములందు మంత్ర, యోగ రహస్యములను, నిగూఢార్థములను సులభరీతిని విశ్లేషించి తమ అధ్యాపకత్వ అనుభవ విశేషమును అందించుచు పాఠకుల మనస్సును పరాశక్తి పదాయత్తము గావించినారు.

కథారూపముగనో, భక్తిభావ సహిత శతక రూపముగనో పద్యరచన సులభము కావచ్చు కాని, మంత్రశాస్త్రమందలి గంభీర భావాలను యోగమందలి నిగూఢ తత్త్వమును ఛందోబద్ధమైన కవితలో రంగరించి ఉగ్గుపాల వలె అందించుట అనన్యసాధ్యము.

"ఆధారాదిషడబ్జముల్ ....... సదాముక్తుల్ గదా ముక్తిదా' అను 79వ పద్యమున శ్రీచక్ర స్వరూపమును వివరించుట, "గుండియ నాక్రమించితివి..... కరణత్రయంబుగా" అను 82వ పద్యమందు పరాశక్తియే శ్రీ, వాణి, పార్వతి రూపములు దాల్చినట్లు ధ్వన్యాత్మకముగా చెప్పుట, శంకరభగవత్పాదుల సౌందర్యలహరిలోని "దృశాద్రాఘీయస్యా..... అను 57వ శ్లోకమునకు, వీరి అనుభావకవితాధార "నీపద పారిజాత..... చల్లు గదా సుధాంశువుల్"గా ప్రస్తరించుట, 'నాదరూప' 'నామరూప వివర్జిత' అను శ్రీ లలితా నామములకు వీరి 88, 89 పద్యములు మకుటాయమానమగుట, వీరి కవితా మాధురీమహిమకు తార్కాణములుమాత్రమే. ఉపనిషత్తులనుండియు, దుర్గా సప్తశతి, శారదాతిలకము, భగవద్గీత, కామకళా విలాసము, మున్నగు గ్రంథముల నుండి పద్యభావ వివరణలో ప్రమాణ వాక్యముల నిరూపించు వీరి పరిశోధనా కృషి, బహు గ్రంథ పఠనాపాటవము వెల్లడియగుచున్నది.

"నవ యోన్యాత్మకమైన వ్యూహరచనా.... సేకూర్చుచున్" (94) అను పద్యమందు మూలప్రకృతి, ప్రకృతి లక్షణాలను వివరించుపట్ల శారీరక మీమాంసను కూడ స్మరించి మరింత దీప్తిని కలిగించుట విషయ వివరణలో వీరికి గల శ్రద్ధ ద్యోతకమగును.

అమ్మవారి పాదపద్మ కాంతి కిరణ ప్రభావమును వివరించు "సర్వాతీతము కావకాద్భుత వపుస్సౌందర్య ..... శాసింపవే" (99) అను పద్యము, త్రిపురసుందరుని అర్ధాంగిగ త్రిపురసుందరియైనదని తెల్పు " పరశివు నూర్ధ్వభాగమున.... దెల్పశక్యమే" అను 100వ పద్యము, వీరి శ్రీవిద్యాతత్త్వ వేతృత్వమును స్పష్టము చేయుచున్నవి.

కుండలినీశక్తి ప్రసారమును వివరించు "స్వాధిష్ఠానమునం గృశానుడును.... భాసింపవే జీవులన్" అను 109వ పద్యము మూలాధారాది సహస్రారాంతచక్రముల స్వరూప స్వభావములతో కుండలినీశక్తిగా ప్రసారం చేస్తున్న పరాశక్తి ప్రభావమును గోచరింపచేయుచున్నది.

వీరి పద్యములన్నియు సాంకేతిక శాస్త్ర పదజాలములతో కూడియున్నందున సామాన్యులకర్థమగుటకై ప్రతి పద్యమునకు పలయునంత వివరణ అందించి పాఠకులకు విషయగ్రహణాసక్తిని కలిగించినారు.

కావ్యాంతమున 134, 135, 136 పద్యములలో వీరు వేదన, నివేదన స్పష్టముచేస్తూ, 137వ పద్యమందు అద్వైత పరమార్థము నందుకొనిన తన అదృష్టమును మధుర సాకృతిగా విశ్వవేదనగా వెల్లడించి, శ్రీఅగస్త్యరాజు సర్వేశ్వరరావుగారు తమ జన్మను సార్థకము చేసికొని, సాధకులకు దివ్యసందేశము నందించి, 'గురుమండలరూపిణీ'యైన శ్రీమాత అనుగ్రహమునకు సోపాన మందించినారు.

వీరి ప్రతిపద్యమును వ్యాఖ్యానించి అంతర రహస్యములను వెల్లడించాలని నాకు తోచినను చాలవరకు రచయితయే అవసరమైనంతవరకు విపులీకరించినందున ఆయత్నము విరమించితిని.

శ్రీమాతను ఆరాధించుచు, ఆమె తత్త్వమును పరిపూర్ణముగ అనుసంధానము చేసికొని, శ్రీవిద్య - బ్రహ్మవిద్యల కభేదమును నిరూపించి, ముముక్షువులకు ఆత్మానందానుభూతిని యీ రచన ద్వారా కలిగించిన శ్రీ సర్వేశ్వరరావుగారు ఆధ్యాత్మిక క్షేత్రకృషీవలులై పరమానంద సస్యమును పండింపజేసి, ఇతోధికముగ పాయసాన్నమును పంచిపెట్టగలరని యాశించుచు, శ్రీమాత వీరికట్టి శక్తిసామర్థ్యములను, ప్రతిభా పాటవములను ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను.

'జయంతితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః' సర్వే భద్రాణి పశ్యన్తు.

మల్లాప్రగడ శ్రీరంగారావు

ఆచార్య వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి గారు
ఎం.ఏ. (సంస్కృతం) ఏం.ఏ. పి.హెచ్.డి.
తెలుగుశాఖ
ఆంధ్ర విశ్వకళాపరిషత్తు, విశాఖపట్నం - 3.

# పరితోషము

ఇది విశ్వవేదన. విశ్వశబ్దమునకు బరమాత్మయని యర్థము. విష్ణుసహస్రనామస్తోత్రము విశ్వశబ్దముతోనే యారంభింపబడినది. శంకరభగవత్పాదులు ఆ శబ్దమునకు వ్యాఖ్య గావించుచు "బ్రహ్మైవేద విశ్వమిదం వరిష్ఠమ్, పురుష ఏ వేదం విశ్వమ్, తత్ సృష్ట్వా తదేవాను ప్రవిశత్" మున్నగు నుపనిషద్వాక్యముల నుదాహరించుచు "పరమాత్మ" అని యర్థనిర్ణయము గావించినారు. వేదనయనగా జ్ఞానమని యర్థము. విశ్వమునకు అనగా బరమాత్మకు సంబంధించిన జ్ఞానము నుపదేశించు గ్రంథము గావున విశ్వవేదనమను నామము ఈ గ్రంథమునకు సార్థకము.

పరమార్థమున బరమాత్మ నిరాకార నిరంజన శుద్ధ బుద్ధ చైతన్యాత్మకము, సచ్చిదానందమయము, ఏకము, అద్వితీయము, అఖండము. కాని ఉపాసకుల సౌలభ్యమునకై విభిన్న నామరూప లక్షణములతో గొలువబడుచున్నది. "ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణోరూపకల్పనా" అని శాస్త్ర మర్యాద. ఆ పరతత్త్వమును స్త్రీమూర్తిగా జగన్మాతగా శ్రీదేవిగా ఆరాధించుట యొక విశిష్టమైన సంప్రదాయముగా నేర్పడినది.

"యతోవా ఇమాని భూతాని జాయన్తే యేన జాతాని జీవన్తి

యత్ప్రయంత్యభిసంవిశన్తి తద్విజజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి" -

అను శ్రుతివాక్యము ననుసరించి సమస్తలోకములు ఆ తల్లినుండియే సముద్భవించిన వనియు, ఆ తల్లి కరుణాకటాక్షము చేతనే జీవించుచున్నవనియు, ఆ తల్లికభిముఖముగ బయనించుచు జివరకు లయమొందుననియు, సమన్వయము.

అద్వైత తత్త్వ ప్రతిపాదకముగా మహాభాష్యరచన గావించిన శంకర భగవత్పాదులు గూడ ఆ అమ్మవారి సౌభాగ్య సర్వస్వమును సౌందర్యలహరియను మహాకావ్యమున మధురకవితోక్తులతో మంత్ర శాస్త్ర సంప్రదాయానుగుణముగ సంస్తుతించినారు. ఆ తల్లితో గూడినప్పుడే

ఈశ్వరుడు సృష్టికార్యము గావింపగలడనియు, నట్లుకానిచో లేశమాత్రముగా కదలుటకు గూడ కుశలుడు గాజాలడనియు, "శివశ్శక్త్యాయుక్తో యదిభవతి శక్తః ప్రభవితుం నచేదేవం దేవో నఖలు కుశలః స్పందితుమపి" అని యుద్ఘోషించినారు.

"శ్రీపాదపాంసువు" అగస్త్యరాజు సర్వేశ్వరరావుగారు వందితులు. అనగా ఆత్మజ్ఞానసంపన్నులు. "వందా ఆత్మ విషయం బుద్ధిః యేషాం తే వందితాః" అని జగద్గురు శంకర దేశికుల యభిభాషణము. తాము పొందిన ఆత్మానుభూతిని "విశ్వవేదన" యను పేర బద్యకావ్యమును రచించిన శ్రీ సర్వేశ్వరరావుగారు కృతకృత్యులు. సర్వజన సమభినంద్యులు.

"శ్రీ తత్త్వమ్ము నెఱుంగ నెంచి మదిలో జింతింతు దన్మూలమున్" అను గ్రంథారంభము శుభావహముగా నున్నది. చింతించుటయనగా దమకు గల్గిన యనుభూతిని మననము గావించుకొనుట. "ఆత్మావారే ద్రష్టవ్యః శ్రోతవ్యః మంతవ్యః నిధిధ్యాసితవ్యః" అని ఉపనిషద్వాణి. దర్శన శ్రవణ భాగ్యము నొందిన పిమ్మట చేయదగిన మననమును శ్రీ అగస్త్యరాజు సర్వేశ్వరరావుగారు ఈ గ్రంథరూపమున ఆవిష్కరించినారని తాత్పర్యము. భక్తకవి పోతన గూడ "శ్రీకైవల్యపదంబు చేరుటకునై చింతించెదన్..... " అని భాగవతరచనకు శ్రీకారము చుట్టినాడు. కావున శ్రీ సర్వేశ్వరరావుగారి చింతించెదన్ - అను ప్రయోగము సాభిప్రాయముగా నున్నది.

క్షణికము నశ్వరము వ్యక్తమధ్యమునైన దేహమునకై తాపత్రయపడువారి అజ్ఞానమును జక్కగా "తొలుతన్ లేదు తదంతమందయిన నుద్యోతింప దీమధ్యలో గలవోలెం గనుపించి మాయమగు...." అను పద్యమున గవిగారు నిరూపించినారు.

శ్రీ చక్రవైభవము "ఆధారాది షడబ్జముల్ నిటలమధ్యస్థాన మాపైని నూర్ధ్వాధిష్ఠానము ......" అను పద్యమున బరమ రమణీయముగ నభివర్ణింపబడినది.

"నన్ను నీ ప్రాపున నిల్పి తోడగుము భార్గవి! గమ్యము చేరునంతకున్; సంశోధన కోర్చు శక్తియు బ్రచోదనమీయవె ; నీ వద పారిజాత పరిణిష్ఠితమైనది నామనంబు ; బంధవరిముక్తికి మార్గము చూపు ; సుఖంబిడు బంధవిముక్తి నొక్కటే కోరుదు " - మొదలైన వాక్యములలో గవిగారి యార్తి యాత్మీయత ప్రస్ఫుటమగుచున్నది.

ఈ "విశ్వవేదన" యను కావ్యము ఆత్మతత్త్వనిరూపకము, శ్రీ విద్యాప్రబోధాత్మకము, యోగమార్గ నిర్దేశకమునైన మధురకృతి. గ్రంథతత్త్వమును నిశితముగ సమీక్షించినచో "జగద్గురు" శంకరభగవత్పాదుల "సౌందర్యలహరి"కి ఈ మధురకృతి అత్యంత సన్నిహితమైనదని విశదము కాగలదు. తపోనుష్ఠాననిష్ఠాగరిష్ఠులైన శ్రీ అగస్త్యరాజు సర్వేశ్వరరావుగారిని అభినందింపక తప్పదు. వారే గ్రంథమునకు వ్యాఖ్య గావించుట హర్షణీయము. వ్యాఖ్యన నిరపేక్షముగ తత్త్వగ్రహణము దుష్కరమైయుండెడిది. పద్యములన్నియు సహజ ధారాశుద్ధితో రచింపబడినవి. సహృదయ హృదయంగమముగ, సుమనోమనోహరముగ, మధురార్థభావ గంభీరముగ, పరతత్త్వ ప్రతిపాదకముగ విశ్వవేదన - అను మహాకావ్యమును సంతరించిన శ్రీ సర్వేశ్వరరావుగారు జగన్మాత అనుగ్రహముచే నింకను ఇట్టికృతులను రచింతురుగాక!

జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః
నాస్తి యేషాం యశః కాయే జరామరణజం భయమ్ -

శుభం భూయాత్

24-10-96 వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి

---

ఇట్టి అమూల్యమయిన తమ యభిప్రాయమును తెలిపిన ఆచార్య వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రిగారికి నా కృతజ్ఞతాపూర్వక నమస్సుమనస్సులు.

— రచయిత

"సద్గ్రంథములు జీవమున్న దేవతామూర్తులు.

వాని ఆరాధనమున ఔజ్జ్వల్యము, ఉల్లాసము, తక్షణమే లభిస్తాయి".

- యుగద్రష్ట తపోనిష్ఠ వందిత శ్రీరామశర్మ ఆచార్య.

# అంజలి

విశ్వవేదన గ్రంథమును చదువగా విని, అయాచితముగ ఒక్కొక్కరు రూ.1,116/- లు ఇచ్చి, కావ్యప్రకాశమునకు ప్రోత్సహించిన రసజ్ఞులు శ్రీ అష్టకాల నరసింహరామ శర్మ (ఆనందసాగర్, మెదకుజిల్లా), శ్రీ యస్. సాయన్నగౌడు (గోదావరి ఖని, కరీంనగర్ జిల్లా) శ్రీ బొట్లగూడూరు ప్రభాకరరావు (Exe. Engr., నెల్లూరు)లకు మొట్టమొదట నా హృదయాంజలి.

గ్రంథ ముద్రణకు రూ.4,000/-లు గుప్తదానమిచ్చిన వదాన్యశేఖరుని అభినందించుచు -

ఓయన్న! గుప్త దానము

సేయన్, సిరులూరు చలంజు, చెలముల జలమ ;

ట్లాయువు నారోగ్యంబును

శ్రేయము సిద్ధింప, రామచిన్మూర్తి దయన్॥ అని ఆకాంక్షించుచు,

ఇంకను తమ సౌజన్యసహాకారములందించిన సర్వశ్రీ వాయుగుండ్ల చెంచురత్నయ్య, (వానప్రస్థకార్యకర్త విశ్వహిందూపరిషత్, ఆత్మకూరు), దోర్నాదుల పెంచలరెడ్డి(ఆత్మకూరు), గుంపెర్ల నరసింహులుశెట్టి,(ఆత్మకూరు) లకును,

కోరిన వెంటనే తమ అమూల్యాభిప్రాయములు వ్రాసి పంపిన విపశ్చిద్వరేణ్యులు సర్వశ్రీ అష్టకాల నరసింహరామ శర్మ, చింతలపాటి పూర్ణానందశాస్త్రి, మల్లాప్రగడ శ్రీరంగారావుగారలకును,

ముచ్చటగా ముద్రించి యిచ్చిన శ్రీవెన్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ వారికిని నా కృతజ్ఞతాంజలులు.

ఇట్లు
శ్రీ పాదపాంశుపు
అగస్త్యరాజు సర్వేశ్వరరావు

# ముందుమాట

ఇది విశ్వవేదన. విశ్వుని వేదన. కనుక ఆత్మ ఘోష యనవచ్చును. ఆత్మను గురించిన ఘోష, ఆత్మ కొఱకైన ఘోష. ఇందులో ఆత్మ ఒకటే, అనుభవము ఒకటే, ఘోష కూడ ఒకటే. కాగా ఒకటి కానిది జిజ్ఞాన మాత్రమే. జిజ్ఞానను బట్టి గ్రంథమర్థమగును. కొందఱికి ఇందేమున్న దనిపించినను కొందఱికి ఏదో ఉన్నదనిపింపవచ్చును. కొందఱికి ఆర్తి కనిపించిన, కొందఱికి ఆత్మీయత తోపవచ్చును. కొందఱికి కాలము చెల్లిన యతి గణ ప్రాసానుగత పద్యరచనయైన, కొందఱికి నిస్సార వచన కవితా మరుభూమిలో ఎక్కడో కనిపించు ఛందోబద్ధ రసమయ శీతల విరామా రామముగా (a fertile green spot - oasis - in the midst of a desert) తోపవచ్చును. కొందఱి మతమున శుష్క వేదాంతముగా తోచినను కొందఱికి సత్యాన్వేషణానుభవము గోచరింపవచ్చును. అట్లు భావించుటలో విప్రతిపత్తి లేదు. చదువరి అధికారమును జిజ్ఞాసా తీవ్రతను బట్టి అనుభవము మారుచుండును. వాస్తవమునకు ఇది విశ్వవేదన, విశ్వుని వేదన, విశ్వాత్మకు నివేదన.

ఇది భక్తి వేదాంత వేదనా నివేదనాత్మక స్తుతి కావ్యము. గ్రంథము యొక్క పూర్వార్థమున సర్వజ్ఞత్వ సర్వేశ్వరత్వ అంతర్యామిత్వాది విశేషణ విశిష్టుడయిన పరమాత్మ నిజమాయావిష్టుడై ఆవరణమును గ్రహించి, కించిద్జ్ఞత్వ కర్తృత్వ భోక్తృత్వాది గుణములతో కుంచించుకొనిపోయి జీవాత్మ యగుటయు, ప్రకృతి ప్రేరితుడై వివిధ సౌందర్య దర్శన లాలసు డగుటయు, అహంకరించి భేదమును భావించుటయు కనిపించు ప్రపంచోత్పత్తిని గూర్చి పరిపరి విధముల ఊహించుటయు, ఈ వ్యావహారిక జగత్తు సహితము సత్యమే యను విభ్రాంతి నందుటయు, నిరాకారయైన పరాశక్తి తా నూహించిన రూపముతో దర్శన మిచ్చునని భావించి, ఆమెకొఱ కన్వేషించుటయు, స్పందమనోజ్ఞయైన పరదేవతను దర్శింప లేక తపించుటయు, తన ఆర్తిని వెల్లడించుటయు, ఇత్యాది విషయములు చోటు చేసికొనినవి.

పరమాత్మకు పరాశక్తికి భేదము లేదు. ఒకటి ప్రకాశము, రెండవది తద్విమర్శ లేక తద్జ్ఞానము. ఒకటి వ్యక్తము రెండవ దవ్యక్తము. సత్తు - సద్రూపము, చిత్తు - చిద్రూపము, రసము - రసానందము మున్నగు ద్వంద్వములు ఏకభావ సంజనితములే. ఇట్టి ఆత్మకు నామము లేదు, రూపము లేదు, దేశ కాల పరిస్థితులు దానిని మార్చ లేవు. ఇక అది స్త్రీయా పురుషుడా

అనెడి ప్రశ్న ఉత్పన్నము కాదు. అది ఒక మతమునకు గాని సంప్రదాయమునకు కాని చెందినది కాదు. అది విశ్వశక్తి (Coismic Electro Magnetic Energy). అందఱికి సంబంధించినది. అందఱిని చైతన్యవంతులను చేయుచు, ప్రతి క్షణము తెలియబడుచునే యున్నది. కాని మనమే దానిని తెలిసికొనలేకున్నాము.

అన్ని రూపములు నామములు తనవే కనుక తల్లిగను, తండ్రిగను, సోదరుడుగను, హితుడుగను, అహితుడుగను ఇట్లనేక విధముల ఆశక్తి మన దైనందిన జీవితమున తారసపడుచునే యున్నది. దానిని గ్రహించు వివేకము మనకు కావలెను.

జీవి ఈ లోకమున మొదట పొందిన స్పర్శ తల్లిదే. మొదట వినిన మాట, చూచిన రూపము, తల్లివే. మొదట పొందిన అనుభవము కూడ తల్లి ప్రేమ నుండి స్తన్య రూపమున పెల్లుబికినదే. కనుక నే నా పరాశక్తిని తల్లిగనే భావించితిని. నేనే కాదు. జగద్గురువులు శ్రీశ్రీశ్రీ శంకర భగవత్పాదుల వారి నుండి వేదమూర్తి, తపోనిష్ఠ, యుగద్రష్ట పండిత శ్రీరామశర్మ ఆచార్య వఱకు గల పెద్దలందఱు ఆమెను తల్లిగా భావించి ఆరాధించినవారే. ఇక సామాన్యులయిన అస్మదాదుల సంఖ్య అగణ్యము.

ఈ విశ్వ మేమిటి? ఈ కదలెడి జీవులు, కదలని వస్తువులు ఎక్కడి నుండి వచ్చినవి ? ఈ నక్షత్రములు సూర్య చంద్రాది గ్రహములు శూన్యమయిన ఆకాశమున ఒక దానితో నొకటి ఘర్షణ పడక ఎట్లు నిలిచి యున్నవి ? ప్రాణస్వరూప మెట్టిది ? అది ఎక్కడ నుండి వచ్చుచున్నది ? తిరిగి ఎచటి కేగుచున్నది ? జీవుల శరీరములలో 'నేను' అని పలుకు తత్వ మేమిటి? ఒకటైన చైతన్యము, అనేక రూపములుగా ఎట్లైనది? ఈ జగత్తు శబ్దభవమా? జ్యోతి స్సంభవమా? నిత్యము కనిపించు ప్రపంచము సత్యమా? లేక కల్పితమా? దేనిని నమ్మవలెను? ఇట్టి ప్రశ్నలతో ప్రారంభమయిన గ్రంథము సమన్వయ మార్గమున నడచి, అంతయు ఆ పరాశక్తి విన్యాసమే అని సమాధాన మిచ్చును. జీవి తన కష్టములను సుఖములను వివిధానుభూతులను, తల్లిగా స్ఫురించిన ఆ పరాశక్తికి నివేదించుకొని ఆమె నుండి ఊరటను గోరును. ఆమెను కీర్తించి సహాయ మభ్యర్థించును. ఆమె ఆమెగా ఎట్లైనదో ఊహించుకొని ఆ తత్వమున తాను కూడ కలిసిపో నెంచును.

ఇక కావ్యోత్తరార్థము దేవీ సంకీర్తనమునకు అంకితమైనది. కర్మ జ్ఞాన భక్తి యోగములు భూమికగా అనేక మంత్ర తంత్ర శ్రుత్యర్థ సంకలితములు,

అనుభవైక వేద్యములు అయిన భావములతో శక్తి పారమ్యమును కీర్తించు పద్యములిందు గలవు. గాయత్రి సావిత్రి సరస్వతి లక్ష్మి లలితాద్యనేక నామములతో ఆరాధింపబడుచున్న శక్తి నుద్దేశించి, ఆ శక్తి తత్వ విభూతులు వెల్లడింపబడివి. అర్థనారీశ్వర తత్వము వివరింపబడినది. (28, 85, 86, 94, 96, 98, 118 పద్యములు) శివ కేశవ రామ కృష్ణ పరాశక్త్యభేదము స్మరింపబడినది. త్రిమూర్త్యాత్మకత నిరూపింపబడినది. సృష్టిక్రమము తెలుపబడినది. వేయేల? అద్వైతము పర్యవసానముగా ఆర్తి ఆత్మజ్ఞానము వేదన నివేదన పెనగి యొకటైనవి. ఇదీ క్లుప్తముగ ఇందలి ఇతివృత్తము. పాఠక సహోదరులు తమ తమ అనుభూతుల వెంట చదివి ఆనందింపగలరని ఆశించుచున్నాను.

*"కవిః కరోతి కావ్యాని, రసం జానంతి పండితాః |*
*తరుః ప్రసూతే పుష్పాణి మరు ద్వహతి సౌరభమ్"* ||

పద్యమునకు ఆదరణ లేని ఈ రోజులలో ఛందోబద్ధ కవిత యేల ? అను ప్రశ్నకు కాల మనంతము - విశ్వము విపులమని మాత్రము మనవి చేయుచు, జిజ్ఞాసువులైన సామాన్య పాఠకులకొఱకు, విషయము ఆధ్యాత్మిక మగుటచే, తాత్పర్య విశేషాంశములను వ్యాఖ్యాన పూర్వకముగ క్లుప్తముగ పొందుపఱచితిని. పండితులకు అవి నిరపేక్షణీయములు కావచ్చును.

ఇట్లు
'శ్రీ పాద పాంశువు'
అగస్త్యరాజు సర్వేశ్వరరావు

## విజ్ఞప్తి

కంప్యూటర్ ముద్రణలో అర్ధానుస్వార చిహ్నము లేనందున
అవి మానివేయబడినవి. అయినను పద్యములందు
చాలవఱకు సంధి కార్యానుగత
శబ్దరూపములే చూపబడినవి.

# పరతత్వము - మాతృభావ నౌచిత్యము

అద్వితీయము అనిర్వచనీయము విశ్వవ్యాప్త మయిన సత్యమునకు పరమాత్మ లేక పరబ్రహ్మమని పేరు. ఆ నిరాకార పరబ్రహ్మమే తల్లిగా భావింపబడి పరాశక్తి అనియు, తండ్రిగా ఊహింపబడి పరమేశ్వరుడనియు పిలువబడుచున్నది. స్త్రీ పురుష భావములతో ప్రకృతి పురుషులుగా జగజ్జననీ జనకులుగా తెలియబడునది పరాశక్తియైన ఆ పరబ్రహ్మమే. అది అనేక దివ్యరూపముల ధరించి సృజన రక్షణ మారణ తిరోధాన అనుగ్రహము లనెడి పంచకృత్యముల ద్వారా కాల చక్రమును త్రిప్పుచున్నది. అసలు కాల స్వరూపమదే కదా! క్రీడారూపమైన ఈ కార్య నిర్వహణకై బ్రహ్మ విష్ణు రుద్ర ఈశ్వర సదాశివులుగా ఆ పరాశక్తియే అభివ్యక్తమయినది. సరస్వతీ లక్ష్మి కాళీ దుర్గాది రూపముల దాల్చి వారికి తదనుగుణ సామర్థ్యములను చేకూర్చినది. ఇట్లు సర్వమును అధిష్ఠించి యున్న ఆ పరాశక్తినుండి విశ్వమేర్పడుటవలన, ఆమె ప్రసవిత్రియై మాతలకు మాతయైన శ్రీమాత యైనది.

శక్తిరూపము లనేకములు, నామము లసంఖ్యాకములు. ఆదిపరాశక్తి హిమవంతుని అనుగ్రహించి పార్వతియై జన్మించుటే గాక, వానికి దివ్యచక్షువుల నిచ్చి తన వివిధ రూపములను దర్శింపజేసినది. తొలుత గజచర్మాంబరధారిణియై త్రిలోచన త్రిశూలములతో, ధవళకాంతితో శివరూపమును జూపినది. పిమ్మట అనేక శిరస్సులతో, కన్నులతో, బాహువులతో పాదములతో విరాడ్రూపమున తోచినది. ఆవల నీలమేఘ ఛాయతో చతుర్భుజ శంఖ చక్ర గదా పద్మముల దాల్చి, కౌస్తుభాలంకారుడును, పీతవస్త్ర సంశోభితుడయిన విష్ణు స్వరూపమున గోచరించినది. అనంతరము ద్విహస్తుడు వనమాలా విభూషితుడు, నీలవర్ణుడు, వ్యత్యస్త పాదారవిందుడు అయిన శ్రీకృష్ణరూపమున మురళి వాయించుచు అగుపించినది. ఇట్లు శక్తి శక్తిమంతుడను భేదము లేక పరతత్వము వ్యక్తమయినది.

దేవీ భాగవతమున నారాయణుడు నారదునికి ఆదిపరాశక్తియొక్క వివిధ రూపములను విభూతులను వివరించియున్నాడు. పరాశక్తి పూర్ణరూపములలో శివపత్నియు గణేశ జననియు అయిన దుర్గ అగ్రగణ్య. పంచప్రాణాధిష్ఠాత్రియైన రాధ మఱియొక రూపము. గోలోకవాసినియైన ఈమె శ్రీకృష్ణుని శక్తియే. అలౌకిక ప్రేమ భావమున శ్రీకృష్ణుని ఆరాధించిన రాసక్రీడాధి దేవత ఈమె. శుద్ధ సత్వస్వరూపిణియై నారాయణుని పత్నియైన లక్ష్మీదేవి ఇంకొక రూపము. ఈమె సకల సంపదలకు అధిష్ఠాత్రి. విద్యావిజ్ఞానములకు అధిష్ఠాన దేవతయైన

సరస్వతి వేరొక రూపము. సంధ్యావందన మంత్రాధిష్ఠాత్రియగు సావిత్రి మరొక రూపము. ఈమె బ్రహ్మవర్చస్స్వరూపిణి, వేదమాత, ఆత్మశుద్ధి ప్రదాయిని. ఈ ఐదును జగదంబ యొక్క పూర్ణావతారములు

ఇంకను గోలోకమున శ్రీకృష్ణుని ధ్యానమం దవతరించిన సురభిదేవి (గోమాత) క్షీర దధి ఘృతాదులతో జీవుల పోషింప రూపము దాల్చిన పోషకశక్తియే. పావనాశినియగు గంగ, విష్ణుప్రమోదిని అయిన తులసి, నాగమాతయైన నాగేశ్వరి, శిశుసంరక్షిణియగు షష్ఠీదేవి, మంగళ చండి, కాళి, వసుంధర మున్నగునవి ఆ పరాశక్తి యొక్క అంశరూపములు.

దేవయజ్ఞాహుతి రూపిణి స్వాహా, పితృపిండదానరూపిణి స్వధా, అమృతస్వరూపిణి సుధా, సంతోషదాయిని తుష్టి, పోషణ రూపిణి పుష్టి, ప్రేమ చోదని దయా, ధైర్యశక్తి ధృతి, వాయుశక్తి స్వస్తి, దారిద్ర్యనివారిణి సంపత్తి, సత్యరూపిణి సతి, ధన్యుని పత్ని కీర్తి, పుణ్యుని భార్య ప్రతిష్ఠ, సత్కార్యాచరణ శక్తి సంసిద్ధ, అధర్ముని భార్య మిథ్య, సుశీలుని దయితలు లజ్జా, శాంతులు, కాలుని చెలులు సంధ్య దివా రాత్రులు, లోభుని సఖులు క్షుత్తు పిపాసలు - ఆ పరమేశ్వరియొక్క కళారూపములు. ఇంకను కళాంశ రూపములు కూడ పెక్కులు కలవు. ఇట్లు పరాశక్తి తల్లియై బహు విధముల మానవునిలో ప్రతి అంశమును స్పృశించుచు, నిరంతరము వానిని సంస్కరించుచు జ్ఞాన క్షీర ధారలతో పోషించి నడిపించుచున్నది. కనుకనే ఆమె శ్రీమాత. శ్రీమహారాజ్ఞి.

సర్వకార్య నిర్వహణకు మూలము శక్తి. శక్తి లేనిచో ఎంతటి మహత్పదార్థమైనను కదలజాలదు. సృష్టి విషయమును వేరుగా చెప్పవలెనా? అందువలననే ఆచార్య శంకర భగవత్పాదులు —

*"శివ శ్శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం ।*
*న చే దేవం దేవో న ఖలు కుశల స్స్పందితు మపి" ॥*

అని సౌందర్యలహరి ప్రప్రథమ శ్లోకమునందే శక్తి పారమ్యమును చాటి యున్నారు. మానవుని జీవితమున ఇది నిత్యానుభవమే కదా! శక్తి శివతత్వాంతర్గతము కనుక శివ శక్తులకు అభేదము. వారి అవినాభావ సంబంధమే జగద్రూపమున దర్శనీయమై, మనోరూపమున భావనీయమైయున్నది. అద్వయ మిథునమైన ఆ మూలశక్తిని మాతృమూర్తిగా భావించుట సముచితము కాదనగలమా?

కావలి
14-6-96

*అగస్త్యరాజు సుబ్బారావు*
విశ్వవేదన



# అంకితము

శ్రీమదనంతసాగర క్షేత్రాధిష్ఠాత్రి
శ్రీ సరస్వతీ శ్రీచరణ రాజీవములకు

శా॥ *శ్రీ తత్వార్థము సృష్టిమూలము మహాచ్ఛ్రీకామ కామేశ్వరీ*
*చైతన్యంబు దలంచి కావ్యసరణిన్ సాహిత్య సౌహార్ద సం*
*ప్రీతం జేయుచు విశ్వవేదన కృతిన్ విన్పింతు నొక్కింత, మ*
*చ్చేతో మోద మెలర్ప రమ్ము వరమేశీ! స్పంద రమ్యాకృతీ!* i

శుభప్రదమును ఆత్మస్వరూపమును సృష్టి కారణము నైన కామేశ్వర కామేశ్వరీ తత్వజ్ఞానమును స్మరించి, కావ్యమార్గమున, ఆత్మీయతతో, అర్థజ్ఞాన వివరణాత్మకమగు విశ్వవేదన (జీవునిబాధ) కృతిని విన్పించెదను. వరమేశ్వరీ! స్పందనమువలన మనోజ్ఞముగ తోచు రూపముతో నా డెందమున కానందము గూర్ప రమ్ము.

శ్రీకారము, సత్యము శివము జ్ఞానము ఆనందము ప్రకాశాత్మకము అయిన చైతన్యశక్తిని లేక బ్రహ్మమును వాగ్రూపమున తెలిపెడి వర్ణరాజము. ఇదే శ్రీతత్వము. శ్రీతత్వముయొక్క వ్యక్త రూపము శ్రీతత్వార్థము. అది సృష్టికి మూలకారణము, శ్రీమాత అని వ్యవహరింపబడుచున్న ఆదిపరాశక్తి లేక మూల ప్రకృతి.

తాను బహురూపములు కావలె ననెడి కోరిక పరమేశ్వరు నుండి వ్యక్తమగుట వలన, ఆయనయే కామేశ్వరుడు. ఆయనశక్తి లేక సామర్థ్యము కామేశ్వరి. వారికి సంబంధించిన చైతన్యము చలనాత్మకమైన జగత్ప్రాణము. సృష్టికి మూలము.

చం॥ *చలిమల వీడి, పాల్కడలి చక్కిని బాసి, యనంతసాగర*
*స్థలి దెలికొండ, రాగి దొన దాపున, గాపురముండి, తేనియల్*
*చిలుకుచు నాంధ్రబాష వలు చిన్నెలు వన్నెలు గూర్చు వాణి నా*
*జలరుహా గర్భు రాణి మది నంస్తుతి సేయుదు శబ్దకారిణిన్* ॥ *ii*

పుట్టినిండ్లయిన హిమాలయ క్షీర సాగరముల వదలి, అనంతసాగర మనుచోట శ్వేతాచలమందు, రాగి దొన సమీపమున నివసించుచు, తెలుగు భాషలో తేనియ లొలికించుచు చిన్నెలు వన్నెలు కూర్చెడి శబ్దకారిణియు విధిరాజ్ఞయు నైన వాణిని మదిలో స్తుతించెదను.

మెదక్ జిల్లా సిద్ధిపేట సమీపమున హైదరాబాద్ కరీంనగర్ రహదారిపై గల శ్వేతాచలమనెడి చిన్న కొండపై 'రాగిదొన'గా ప్రసిద్ధికెక్కిన నీటి బుగ్గకు చేరువను, శ్రీ సరస్వతీ దేవ్యాలయము నిర్మింపబడినది. నిర్మాత బ్రహ్మశ్రీ అష్టకాల నరసింహరామశర్మగారు.

చం॥ *భగవతి విశ్వరూపిణి గృపామృతవర్షిణి, నీలకైశిక*
*ప్రగళిత మేచక ప్రభవ, రాజ విరాజిత, నాసికా ప్రభా*
*స్థగిత సువర్ణభూషణ, లసచ్ఛ్రవణద్వయి, రమ్యలోచనన్,*
*నిగమ నుతన్, లలాట జిత నీరజవైరి భజింతు శారదన్* ॥ *iii*

ఉత్పత్తి స్థితి లయాదు లెఱిగిన పూజ్యురాలును, విశ్వమే రూపముగ కలిగినదియు, దయామృతమును వర్షించునదియు, నల్లని కేశములనుండి జారి రూపము దాల్చిన చీకటి కలదియు, చంద్రకళచే విరాజిల్లునదియు, నాసికా (ముక్కు) కాంతివలన కప్పివేయబడిన బంగారవు ముక్కువుడక కలదియు, నుదుటి కాంతిచే జయింపబడిన చంద్రుడు కలదియు అగు శారదాదేవిని సేవించెదను.

*"ఉత్పత్తిం చ వినాశం చ భూతానా మాగతిం గతిం*
*వేత్తి విద్యామవిద్యాం చ స వాచ్యో భగవానితి"* ॥

జగముల ఉత్పత్తి వినాశములను, భూతముల రాక పోకలను, విద్యా విద్యలను, తెలిసిన వాడు భగవానుడు. అట్టి స్త్రీ భగవతి.

ఉ॥ *కచ్ఛపి బూని వేదముల గాన మొనర్చి, తదీయ తత్త్వమున్*
*స్వచ్ఛతమంబు దెల్పి, భువి శబ్దము నర్థమయంబుజేసి న*

*ర్వ్యేచ్ఛమునౌ రసాకృతి మహోజ్జ్వలమై స్ఫురియింప, భేదభా*
*వేచ్ఛ నడంచు భారతి శుభేక్షణముల్ ప్రసరించుగావుతన్ ||* iv

కచ్ఛపి అనెడి వీణపయి వేదములను గానము చేసి స్వచ్ఛమయిన వేదార్థమును తెలిపి, ప్రపంచమును శబ్దార్థములతో నింపి, మిక్కిలి ఉన్నతమయిన రసస్వరూపమున చక్కగా ప్రకాశించుచు, భేదభావమును తొలగించునట్టి జ్ఞాన స్వరూపిణియైన భారతియొక్క మంగళకరములగు చూడ్కులు నాపై ప్రసరించునుగాక!

ఉ|| *బాసర గాంగ సైకత నివాసము గాదని, కొండ కొమ్మునన్*
*వాసము గోరి, యీ మెదకు ప్రాంతము నెన్నిక జేసికొన్న యా*
*భాసురమూర్తి, స్వీయపద పద్మ సుగంధము దాల్చి వచ్చు మ*
*చ్ఛ్వాస వికాసితం బగుచు భావపరంపర వీచు గావుతన్ ||* v

బాసరయందు గోదావరీ తీర సైకత ప్రాంతమున నివసించుట వలదని, కొండపై నుండ నెంచి ఈ మెదకు ప్రాంతమును ఎన్నిక చేసికొనిన ఆ జ్ఞాన ప్రకాశమూర్తి, తన పాదపద్మముల పరిమళమును వహించి వచ్చుచున్న నా ఊపిరిలో వ్యాపించి, భావ పరంపరను వీచునుగాక!

యావద్భారత దేశమున గల సరస్వతీ క్షేత్రములలో బాసర రెండవది. 1. కాశ్మీరమున, 2. బాసరయందు 3. అనంతసాగరమున కలవు. కర్ణాటకమందలి శృంగేరియందు సరస్వతి పేరున గాక శారద అని పిలువబడుచు శృంగేరి జగద్గురు శంకరాచార్య పీఠమునకు సంబంధించిన ఆలయము కూడ కలదు.

బాసర సరస్వతీదేవి మిక్కిలి మహిమగలది. ఆంధ్రప్రదేశమున అదిలాబాదు జిల్లాలో గంగ (గోదావరి) యొడ్డున, ఆంధ్ర కర్ణాటక మహారాష్ట్రముల సరిహద్దున గల బాసర గ్రామమునకు ప్రాచీన చరిత్ర కలదు. దీని పూర్వనామము 'వాసర'. ఇచట గల దేవీవిగ్రహము వ్యాసభగవానునిచే ప్రతిష్ఠింపబడుటవలన, ఈ గ్రామము తొలుత "వ్యాసపురి" 'వ్యాసర' గ అవతరించి 'వాసర'గ మారి, ప్రస్తుతం 'బాసర' అయినది. వ్యాసులవారు ప్రతి ఆదివారం రాత్రివేళ ఈ ఆలయ ప్రాంతమున తిరుగుచుందురని ప్రతీతి. చూచిన సిద్ధపురుషులును కలరు.

ఉ|| *శ్రీ నరసింహరామ కవిశేఖర నిర్మిత శారదాలయ*
*శ్రీ నిభమౌచు, మత్కృతి విశిష్టమునై యలరారు, నింక ద్వ*

*శ్రీ నిలయంబులై యవి ప్రసిద్ధము లయ్యెడు గాక! తల్లీ! ఆ*
*సీనవు గమ్ము నా హృదయ సీమను చిద్ఘన దివ్య రూపిణీ* ‖ vi

అవధాని శిరోమణి, కవితా సుధాకర, బ్రాహ్మీవిభూషణ, అవధాన కళాప్రపూర్ణ, శ్రీ అష్టకాల నరసింహారామ శర్మగారిచే నిర్మింపబడిన నీ ఆలయశోభతో నరితూగుచు నా కృతి కూడ విశిష్టమైయున్నది. ఇక అవి రెండును నీ కీర్తి నిలయములై ప్రసిద్ధి వహించునుగాక! ఘనీభవించిన చిత్తువలన దివ్యరూపముగల తల్లీ! నా హృదయ క్షేత్రమున వసింపుము.

శ్రీ శర్మగారికి బానర నరస్వతీదేవి స్వప్నమున సాక్షాత్కరించి తనకొక ఆలయమును నిర్మింపుమని పదేపదే ఆదేశించుటచే, వారు సామాన్య కుటుంబియైనను, పది సంవత్సరములు శ్రమించి, దానిని నరస్వతీ క్షేత్రముగ నిర్మించి ధన్యులైరి. ఇంకను తదున్నతికి కృషి చేయుచునే ఉన్నారు.

ఉ‖ *నీ యమృతంపు స్పర్శ హృది నిండి, యనిర్వచనీయ సౌఖ్య సం*
*ధాయిని యౌచు, ఘ్రాణ పరితర్పణమైన పరిమళంబునై*
*పాయక, మానసోల్లలిత భావ తరంగ మృదంగ నిస్వనం*
*బై యలరింప, నిల్చితి మదాత్మ నెదో యనుభూతి తోపగా* ‖ vii

అమ్మా! నీ అమృత మధురమైన నంస్పర్శ నా హృదయమును స్పృశించి, తెలుపజాలని సుఖము నిచ్చుటేగాక, ఘ్రాణేంద్రియమునకు సంతృప్తిని కలిగించు పరిమళమై, అంతతో నాగక, నా మానన నరోవరమున కదలాడు భావ తరంగముల మృదంగ ధ్వనులతో ఆనందింపజేయ, నాయం దెదో దివ్యానుభూతి కలిగి నిలిచియున్నాను.

ఉల్లలితము = కదలినది ; పరితర్పణము = సంతృప్తి

ఉ‖ *నీ విడినట్టి వాక్కు నిదె నీకు సమర్పణ సేయుచుంటి, నా*
*భావము నీవ యౌట దనుభావము నూని త్వదీయ సంస్తుతి*
*శ్రీవహనైక దర్పణ విశేషముగా గృతినిల్చె ; జూచి కొ*
*మ్మో విధిరాజ్ఞి! తత్కృతి సముజ్జ్వలమైన భవచ్ఛుభాకృతిన్* ‖ viii

నీ విచ్చిన వాక్కును నీకే సమర్పించుచున్నాను. నా ఆత్మ నీవే కనుక అది (వాక్కు) చక్కని నీ స్తుతి కావ్యముగా రూపుదాల్చి, నీ కీర్తికి దర్పణమై (అద్దమై) నిలిచినది. ఓ విధిరాజ్ఞీ! శోభాయమానమైన నీ శుభాకృతిని, అందు చూచికొనుము.

మ॥ *ఇదిగో ధర్మ, మధర్మ మల్లదిగో, అందే పూజ్యతాపూజ్యతల్,*
*ముదమున్ ఖేదము సైత ముంచితి, నటే పుణ్యంబు పాపంబునున్*
*నదనద్భావము, స్వార్థమున్ మఱియు నిస్స్వార్థంబు ; నర్వంబు నీ*
*యెదుట న్నిల్పితి నమ్మ! చూచికొని, నా కిమ్మింత మోక్షార్థమున్॥* ix

అమ్మా! ధర్మ మిక్కడున్నది. అధర్మమును అక్కడ పెట్టితిని. అచటనే పూజ్యతను అపూజ్యతను, నంతోషమును దుఃఖమును కూడ ఉంచితిని. నద్భావము అనద్భావము స్వార్థము నిస్వార్థము అన్నియు నీ యెదుటనే కలవు. అన్నిటిని చూచికొని నా కికనైనను ముక్తి ద్రవ్యమును ప్రసాదింపుము.

ఉ॥ *ఈయది తృప్తి నీ కిడిన, నీయక పోయిన బోవ నిమ్ము ; నా*
*కేయది యప్పగించితివో, యిప్పటి కెట్టులో నిర్వహించితిం ;*
*బ్రాయము వోయె, దేహము స్వభావ విపాకము నెందుచుండెడిన్ :*
*నా యపరాధముల్ మఱచి, న న్గృపజూడగదమ్మ శర్మదా!* x

నేను చేసిన ఈ పని నీకు తృప్తి కలిగించినను, కలిగింప కున్నను, పోనిమ్ము. కాని, నాకు నీ వేది అప్పగించితివో దానిని ఇప్పటి కెట్లో నిర్వహించితిని. ఇవుడు నా వయను మీఱినది. దేహము నహజమైన మార్పు చెందుచున్నది. నా తప్పులను లోపములను క్షమించి నన్ను దయచూడుము.

ఉ॥ *అంకిత మి ట్లొనర్చితి నమంచిత రీతి, మదీయ జీవితా*
*ద్యంకము నుండి నర్వ విషయాధృతముల్ నరిక్రొత్త రీతి ; న*
*న్నింక త్వదీయ వల్లకి ధ్వనించెడి నాదము నందు లీనమై*
*గ్రుంకగనిమ్ము భేదమును గోర్కె నెఱుంగని శాంతి కాంతినై॥* xi

నా జీవిత ప్రారంభము నుండి అన్ని విషయ నంబంధములను క్రొత్త పద్ధతిలో నీకు ఈ విధముగ అంకిత మొనర్చితిని. ఇక నన్ను నీ వీణలో ధ్వనించెడి నాదమునందు భేదము కోర్కె తెలియని శాంతి కాంతి నగుచు కలిసిపో నిమ్ము.

చేసిన కృత్యముల్ దెలిపి చింతిల దీరిక లేదు, మున్ను నే
జేసిన వేవో, చేసితిని ; చేయగ జేసిన నీ వెఱుంగవే?!
వాసియొ గాసియో యనుభవమ్ముల దోచును గాన, నిప్డు నిన్
బాసిన జీవ భావముల బల్కెద నించుక యాలకింపవే ||

# ప్రతిష్ఠా

అక్షరం పరమానందం విశ్వం విశ్వంభరాంతరం ।
నిర్గుణం గుణసంపృక్తం నిత్యం నిర్మల మద్భుతం ॥ 1

సోమ సూర్యానల జ్యోతి ర్నక్షత్ర గ్రహ భాసురం ।
ఆత్మయోనిం మహామాయా మవ్యక్తం హృది భావయే ॥ 2

పరబ్రహ్మాత్మికే దేవి పంచప్రేతాసనస్థితే ।
ఆద్యే ఆద్యంతరహితే శివే శివ వరాంబికే ॥ 3

వేద వేదాన్త విజ్ఞాతాం విజ్ఞానఘన రూపిణీం ।
ప్రపద్యే పరమాం నిత్యాం వాగ్రూపాం భవతారిణీం ॥ 4

బ్రాహ్మం సృష్టి ప్రమోదత్వా ద్వైష్ణవం స్థితి కల్పనాత్ ।
రౌద్రం సంహార కార్యేణ శాసనేనాథ చైశ్వరం ॥ 5

శివానందతయా శైవం శాక్తం శక్త్యుపసంక్రమాత్ ।
ఇత్థం తవ విలాసార్థం సకలం కల్పితం శివే ॥

నమోస్తుతే దేవి జగత్ప్రసూతే
త్రిశక్తి యుక్తే త్రిగుణైః ప్రవృత్తే
వేదాన్త వేద్యే విధి విశ్వ వంద్యే
కటాక్షయ త్వం ప్రకృతి స్వరూపే ॥

మంగళం దేవి సులభే మంగళం సర్వమంగళే
మంగళం భక్త వరదే హంసహృత్పద్మవాసిని ॥

మయాకృత మిదం స్తోత్రం తవ పాదాంబు జార్పితం ।
గృహాణ కృపయా మాతః ఆత్మాః భిన్న మహాద్యుతే ॥

'శ్రీపాదపాంశుః'



విశ్వవేదన



శ్రీమాత్రేనమః

# విశ్వవేదన పూర్వభాగము

శా॥ శ్రీ తత్త్వమ్ము నెఱుంగ నెంచి మదిలో జింతింతు దన్మూలమున్
శ్రీ తద్భావము సత్యమున్, సుఖదమున్, చిద్రూప, మానందమున్,
శ్రీ తత్త్వాధ్వ కళాది సర్వభువన శ్రేణీ నిధానంబునున్,
శ్రీ తద్భాసము, శక్తిభాసము, మహచ్ఛ్రీమాతృ సామ్రాజ్యమున్॥ 1

శ్రీతత్త్వమును (పరబ్రహ్మ స్వరూప స్వభావములను) తెలిసికొన దలచి, దాని మూలమును ఆశ్రయించెదను. అది సత్యము, సుఖదము, చిద్రూపము. ఆనందమే గాక, తత్త్వ+అధ్వ కళా భువనముల గలిగి, తద్రూపమున ప్రకాశించుచు, ఆదిపరాశక్తికి నివాసమైన శ్రీమాతృసామ్రాజ్యమని భావించెదను.

శ్రీ శబ్దమునకు లక్ష్మి, సరస్వతి, సంపద, ఐశ్వర్యము, తేజము, శోభ, వృద్ధి, బుద్ధి, కీర్తి, త్రివర్గము మున్నగు అర్థములుండుటవలన, శ్రీకారముతో కావ్యము నారంభించుట కవి సంప్రదాయమైనది. శ్రీవర్ణమును విశ్లేషించినచో, శ్+ర్+ఈ అని యగును. ఇందలి శ వర్ణము శుభమును, సుఖమును, ఆనందమును ; రేఫము విమర్శాత్మక జ్ఞానమును, తేజమును ; ఈ వర్ణము శక్తిని, లక్ష్మిని, శోభను ; సూచించును. కనుక శ్రీకారము శుభప్రదము సుఖదము ఆనందదాయకము స్వయంతేజోవిరాజితము విమర్శాత్మకము శక్తిమంతము సంపత్కరము అయిన చైతన్యమును లేక బ్రహ్మమును తెలుపును. అందువలన శ్రీకారము కావ్యాదిని నిలచినచో సర్వదోషములు తొలగునని తెలియవలెను.

శ్రీతత్త్వమనగా సచ్చిదానందము ద్వైత వివర్జితము అయిన స్వరూప జ్ఞానమని భావము. ఇది ముక్తి రూపమయిన శివశక్త్యాత్మక పరా స్వరూపమే. శాంత్యతీత కళా విలక్షణమైనది శుద్ధతత్త్వము. ఆ శుద్ధ తత్త్వము నుండి తక్కిన తత్త్వములు కలుగుటచే, అదియే సృష్టికి మూలము.

తద్భావము : తత్ యొక్క భావము తద్భావము. తత్ అనునది పూర్వపరామర్శకము.

*"ఏకమేవాఽద్వితీయం సన్నామరూప వివర్జితం ।*
*సృష్టేః పురాధునాప్యస్య తాదృక్త్వం తదుదీర్యతే"* ॥

\- శుకరహస్యోపనిషత్ (మం.5)

అనగా సృష్టికి పూర్వము స్వగతాది భేదములు లేక, నామ రూప రహితము అద్వితీయము ఏకైకము అయి, ఏది సత్యమని తెలియబడినదో, అదే సృష్ట్యనంతరము 'తత్' అని వ్యవహరింపబడుచున్నదని అర్థము.

తత్వములు : ఇవి పరమాత్మ సంబంధమైన జ్ఞానమును తెలుపుచు, చైతన్యము మనస్సుగను, పదార్థములుగను, మారుటందు తోచెడి వివిధ దశలనవచ్చును. "తత్వాని ప్రళయ పర్యంతస్థాయి వస్తూని షట్త్రింశత్సంఖ్యా కాన్యేవ ఘటాదీనాం తత్పదవాచత్వాఽభావాత్" - భాస్కరరాయులు (ల.స. వ్యాఖ్య 906 నామము). ప్రళయము కలుగు వఱకు ఉండి, జీవులకు సుఖ దుఃఖాది అనుభవముల గూర్చు వస్తువులు. దేహ ఘటాదులయిన ఇతరములు (అవి ప్రళయాంతము వఱకు ఉండవు కనుక) తత్వపద వాచ్యములు కావు. ఇవి ముప్పదియాఱు.

తత్వ సంఖ్యను ప్రాచీనులు అనేక విధములుగా నిర్ణయించిరి. సంప్రదాయమునుబట్టి సాంఖ్యమున 24, శైవ శాక్తములందు 96, 36గా చెప్పబడినవి. పరిగణనయందు కొన్నింటిని వదలి వేయుట వలనను, సూక్ష్మ భేదములను కూడ ప్రత్యేక తత్వములుగా గ్రహించుట వలనను, ఈ వ్యత్యాసమేర్పడి యుండును. ముప్పదియాఱు సంఖ్యయందే అన్ని తత్వములు ఇమిడి యున్నందున దానిని గ్రహింపవచ్చును. కాని " పంచవిగ్ంశ ఆత్మాభవతి" అను శ్రుతిని బట్టి తత్వములు 24 అనియు, 25వది ఆత్మ అనియు, అదే తత్వాతీత మనియు భావింపవలెను.

ఇక 36 తత్వముల పరిగణన మిట్లున్నది. శివ, శక్తి, సదాశివ, ఈశ్వర, శుద్ధవిద్యా, మాయా, కాల, కళా, విద్యా, నియత, రాగ, పురుష, ప్రకృతి, బుద్ధి, అహంకార, మనస్సు, త్వక్కు, చక్షు, శ్రోత్ర, జిహ్వా, ఘ్రాణ, వాక్కు, పాణి, పాద, పాయువు, ఉపస్థ, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ, ఆకాశ, వాయు, తేజ, జల, పృథ్వీతత్వములు 36.

సత్యము : త్రికాలా బాధ్యమైనది అనగా అన్ని కాలములలో మారనిది సత్యము. అట్టి సత్యమును తెలుపునది ఋతము లేక నాదము. అదే ఆత్మ.

చిద్రూపము : విమర్శాత్మకమగు చైతన్యము లేక జ్ఞానశక్తి. అనగా ఆత్మ పదార్థమును తెలియజేయు నదియు, చిత్తమును విస్తరింపజేయు నదియు అయిన శక్తి లేక సామర్థ్యము.

అధ్వలు : అధ్వ మనగా త్రోవయని సామాన్యార్థము. తనను తానెఱిగి సాయుజ్యరూప మయిన కైవల్యమును చేరుటకు చేర్చుటకు మార్గమని సంకేతార్థము. అధ్వములు ఆఱు కనుక వీనిని షడధ్వలందురు. శైవ శాక్తేయ సాంప్రదాయక గ్రంథములలో వీని కెక్కువ ప్రాధాన్యము గలదు. వీనిలో వర్ణ, పద, మంత్రాధ్వ లనునవి (విమర్శాంశములు) శబ్ద సంబంధములు కాగా, కళా, తత్వ, భువనాధ్వలు (ప్రకాశాంశలు) అర్థ సంబంధములుగా చెప్పబడినవి. మానవ దేహమున బొటనవ్రేలునందు కళాధ్వము, లింగమున తత్వాధ్వము, బొడ్డున భువనాధ్వము హృదయమున వర్ణాధ్వము, నుదుట పదాధ్వము, తలయందు మంత్రాధ్వము కలవు.

కళలు : వ్యష్టిగ కాని, సమష్టిగ కాని, వ్యక్తమయిన శక్తికి కళ యని సంకేతము. ఇందు ప్రధానమైనవి ఐదు. 1. శాంత్యతీతము (ఆకాశశక్తి), 2.శాంతి (వాయుశక్తి), 3. విద్యా (తేజశ్శక్తి), 4. ప్రతిష్ఠా (ఆపశ్శక్తి), 5.నివృత్తి (పృథ్వీశక్తి). ఇవన్నియు నాదము నుండి కలిగినవే. ఇవి గాక ఇంకను అనేక కళలున్నవి. శాక్త తంత్రములు 94 కళలను ప్రస్తావించినవి.

భువనములు : ఈ పదమునకు లోకములని అర్థము. ఒక్కొక్క తత్త్వమున కొన్ని భువనముల చొప్పున మొత్తము 224 భువనములు ప్రత్యేక నామములతో పరిగణింపబడినవి. శ్రీ సీతారామాంజనేయ సంవాదము, సర్‌జాన్ ఉడ్రోఫ్‌గారి "GARLAND OF LETTERS" గ్రంథములలో వీని ప్రస్తావన గలదు. జిజ్ఞాసువులు చూడవచ్చును.

శ్రీమాతృసామ్రాజ్యము: జగన్మాతయైన పరమేశ్వరియొక్క కార్య స్థానము - చేతనాచేతనమైన సృష్టి సర్వము. ఆమె 'విశ్వేశ్వరి - విశ్వరూప - విశ్వభ్రమణకారిణి - విశ్వగ్రాస' కూడ. (లలితా సహస్రనామ స్తోత్రము).

ఉ॥ *ఓమ్మని, వర్ణ బిందుజ సముజ్జ్వల నాదమునందు లీనమై,*
*యిమ్ముగ తత్కళా విభవమెంచి, ప్రశాంతత నాదరించి, మో*
*దమ్మున నిల్చి, శబ్దమయ తత్పదమున్ దరిసించి, సృష్టి స*
*ర్వమ్ము తదీయ కార్యముగ భావన సేయుదు కావ్యసంగతిన్* ॥ 2

తొలుత 'ఓం' అని ప్రణవమును ఉచ్చరించి, అందలి అ+ఉ+మ వర్ణములతో బిందువు చేరుటవలన నాదమునందు కరగిపోయి, అందలి కళాసంపదను స్పష్టముగ గణించి, ప్రశాంతతను పాటించి, ఆనందమున నిలిచి, నాదమయమైన బ్రహ్మ తత్వమును దర్శించి, ఈ సృష్టి సకలము ఆ

శబ్దబ్రహ్మముయొక్క కార్యముగా, కావ్యరచన కారంభించెడి ఈ సమయమున భావించెదను.

పరబ్రహ్మాత్మకము అయిన ప్రకాశ విమర్శలు రెండును స్పష్టముగ తోచుటకు ప్రారంభమయిన స్థితియే నాదము. కావ్యారంభమున నాదబ్రహ్మమగు ఓంకారమును స్మరించుట ఆర్ష సంప్రదాయము.

అకార, ఉకార, మకారములును, బిందువు, నాదము, కళ - ఈ యాఱును ఆనందమయిన పరమశాంతిగా పరిణమించిన రూపము ఓంకారము. ఇది బ్రహ్మమునకు వాచకము కనుక బ్రహ్మమే.

ఓంకార శబ్దము "అవ-రక్షణే" అను ధాతువునుండి నిష్పన్నమైనది. "అవతే ష్టి లోవశ్చ" (1 - 141) అను ఔణాదిక సూత్రమువలన 'మన్' ప్రత్యయమును విధించి, 'జ్వర త్వర స్రివ్య విమవా మువధాయాశ్చ' (పాణిని 6-4-20) అను సూత్రముచే 'ఊఠ్' చేసి, గుణము (ఓకారము) చేయగా 'ఓమ్' అయినదని పెద్దలు చెప్పుచున్నారు. 'అకార, ఉకార, మకార ఇతి తానేకధా సమభరత్తదేతదోమ్.' అని శ్రుతి.

*"ఓమిత్యేతదక్షరం పరంబ్రహ్మ| తదేవోపాసితవ్యం"-తారసారోపనిషత్*
*"ఓమితి బ్రహ్మ| ఓమి తీదం సర్వం |" - యజుర్వేదారణ్యే*

"ఓమితి బ్రహ్మ| ఓమితీదగ్ం సర్వం| ఓమిత్యేత దనుకృతి హస్మవా అప్యోశ్రావయేత్యాః శ్రావయన్తి | ...." - తైత్తిరీయ శిక్షావల్లి (9. అనువాకం)

"ఓమిత్యేత దక్షర మిదగ్ం సర్వం తస్యోప వ్యాఖ్యానం| భూతం భవద్భవిష్యదితి సర్వమోంకార ఏవ| యచ్చాన్య త్రికాలాతీతం తదప్యోంకార ఏవ |" - మాండూక్యోపనిషన్మంత్రము.

ఓంకారమే బ్రహ్మము. ఈ పదార్థము లన్నియు, ఆ ఓంకారము యొక్క స్పష్టీకరణమే. భూత భవిష్య ద్వర్తమానములును, అంతకుమించిన దేదైన ఉన్నచో అదియును, ఓంకారమే అని తాత్పర్యము.

ఓంకారమును ప్రణవము, ప్రళయము, ధ్రువము, తారము, విష్ణువు, బ్రహ్మప్రకాశము, మహాదేవుడని కూడ పిలచెదరు. "ఓంకారః ప్రళయః ప్రణవః తారః విష్ణుః బ్రహ్మప్రకాశః మహాదేవః ఇత్యాది పదానాం అక్షరమేవార్థ ఇతి యోగోదర్శితః |" - అధర్వశిఖోపనిషత్ భావార్థము. దీనినే పరానాద

మందురు. ఈ పరానాదము నుండియే సృష్టి ప్రారంభమగుటవలన, అది సృష్టికి మూలము.

నాదము : పూర్తిగా ఉచ్చరించుటకు శక్యము కాని నిత్య స్వరూపము. లేక ఓంకార ఉచ్చారణానంతరము కలిసిపోయెడి సూక్ష్మతరమైన శబ్దప్రవాహము. దీనినే అర్థమాత్ర అనియు చెప్పుచుందురు. " అర్థమాత్రాక్షరా నిత్యా స్వనిర్వాచ్య పదాత్మికా॥ " - వరాహ పురాణం

ప్రణవమందలి అకారము ఉకారమందును, ఉకారము మకారమందును, మకారము బిందు వనబడు అనునాసిక ధ్వనియందును, బిందువు శక్తిసారమైన నాదము లేక స్పందన (Vibration) యందును, ఈ నాదము కూడ చైతన్యముగా వ్యక్తమయిన కళయందును, కలిసిపోయి, తుదకు ఆనందరూపమున పరమశాంతిగా ఏర్పడును కనుక, ఈ ఏడింటిని ఓంకారము యొక్క సప్తాంగములని చెప్పుదురు.

బిందువు : సగుణబ్రహ్మమే. నామ రూపములు బిందువుతో ఆగిపోగా నాదము మాత్రము నాదముగనే మిగిలియుండును. "నాదరూపా - నామరూప వివర్జితా" అనెడి నామముల అంతర్యమిదియే.

ఓంకారాకృతిని పొందిన అ + ఉ + మ వర్ణములు, స్థూల సూక్ష్మ కారణ దేహములను, ఆ దేహాభిమాను లయిన విశ్వ, తైజస, ప్రాజ్ఞ లనబడు జీవులను బ్రహ్మ విష్ణు రుద్రులను తెలుపుచున్నవి. బృహత్పరాశరస్మృతి ఓంకార మింకను అనేక త్రిపుటులకు సంకేతమగుట తెలుపుచున్నది. వివరణకిచట అవకాశము లేదు.

శా॥ *ఆద్యంబైనది, దేశ కాల గుణ మర్యాదా విహీనంబునై*
*బోధ్యంబైనది, సూక్ష్మ మవ్యయమునై పూర్ణం బపూర్ణంబుగా*
*చోద్యంబైనది, జ్ఞానసుందర తను స్ఫూర్తిన్ విశిష్టంబునై*
*వేద్యంబైనది బ్రహ్మశక్తి, నను నావేశించి చోదించుతన్* ॥ 3

మొట్టమొదటిదియు, దేశము కాలము గుణము అనెడి హద్దులు లేక తెలియదగినదియు, సూక్ష్మమైనదియు, నశింపనిదియు, తెలిసిన వారికి పూర్ణముగను, తెలియని వారికి అపూర్ణముగను, ఆశ్చర్యమును కలిగించునదియు, జ్ఞానమనెడి అందమైన దేహముతో విశిష్టముగా తెలియ దగినదియు అగు వాగ్రూపిణియైన బ్రహ్మశక్తి (సరస్వతి) నాలో చేరి, నన్ను చక్కగా నడిపించును గాక!

సూక్ష్మముగ మొదట వ్యక్తమయిన నాదము, శబ్దమై, పదార్థ రూపముల దాల్చినది. దానివలన ప్రపంచ మేర్పడినది. కనుక అది ఆద్యము. ఆత్మయే నాదబ్రహ్మము ఓంకారము లేక సరస్వతీ పరాప్రకృతి.

"నిత్యోనిత్యానాం" - కఠోపనిషత్ (5-13) "నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం" - ముండకోపనిషత్, " సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" - తైత్తిరీయోపనిషత్, "సర్వం హ్యేతద్బ్రహ్మ" అని శ్రుతులు వచించుచుండుట వలన ఆత్మయే సత్యము, నిత్యము, జ్ఞానము, అనంతము, పరిపూర్ణము. అందువలన అది విడువ తగినది కాని, పుచ్చుకో దగినది కాని కాదు. "నాత్మాత్యాజ్యో నచాదేయః" వేదాంతపంచదశి. - "స్వప్రకాశం జ్ఞానం, సర్వప్రకాశకం జ్ఞానం, నిరావరణ చిన్మాత్రం జ్ఞానం, అనాద్యంతం నిరంతరవృత్తి వృత్తి సాక్షి చైతన్య మేవ జ్ఞానం" - శ్రుతి

చం॥ *స్వరములు కంఠ పద్మమున, వ్యంజనముల్ హృదయాద్యధ శ్రుతు*
*స్సరసిజ పత్ర భాగముల, క్షాయును హాయును నాజ్ఞయందు, ద*
*త్పరమ సహస్ర పత్రమున వర్ణ సముచ్చయముల్ స్ఫురింప, వా*
*క్పరిణతి కాద్యయైన శివకామము గొల్చెద ద్వాదశాంతమున్* ॥ 4

మన మిప్పుడు చూచెడి వర్ణము లేర్పడక పూర్వము, వానికి తొలిరూపములయిన అక్షరములు ధ్వనుల రూపమున మన శరీరమందలి వివిధ భాగములలో పుట్టి క్రమముగా ప్రస్ఫుటమయినవి. వీనికి మాతృకా వర్ణములని సంకేతము.

ఇందు అచ్చులు కంఠమందలి విశుద్ధ పద్మమందును, హల్లులు హృదయమునుండి దిగువ గల అనాహత, మణిపూర, స్వాధిష్ఠాన, మూలాధార పద్మపత్రములందును, మఱియు భ్రూమధ్యమందలి ఆజ్ఞయందును, మఱల అన్ని వర్ణములు అనేక ఆవృత్తులుగా సహస్రదళకమల పత్రములందును, తొలుత స్ఫురించి, వాక్కుగా పరిణతి చెంది, వ్యక్తమగుటకు కారణయిన ద్వాదశాంతమందలి శివకామమును - శివుని ఇచ్ఛారూప శక్తిని - స్తుతించెదను.

ద్వాదశాంత మనగా పండ్రెండు చక్రముల కావలిది - నిర్గుణ పరబ్రహ్మ స్థానము. మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూర, అనాహత, విశుద్ధ, ఆజ్ఞాచక్రము లాఱును, భ్రూమధ్యము నుండి సహస్రార పర్యంతము గల ఇందు (అర్ధేందు),

రోధిని, నాద, నాదాంత, సమనా, ఉన్మని అనెడి సూక్ష్మ చక్రము లాఱును, వీనికి అవల నుండునది పరబ్రహ్మ స్థానము. అదే సహస్రారము.

*"ద్వాదశాంతం లలాటోర్ధ్వం కపాలోర్ధావసానకం|*
*ద్వ్యంగు ళోర్ధ్వం శిరోదేశాత్ పరంవ్యోమ ప్రకీర్తితమ్ ||*

- చిద్గగన చంద్రికా

లలాటమునకు ఎగువగా, కపాలముయొక్క పైభాగము హద్దుగా రెండంగుళముల వఱకు వ్యాపించియున్న స్థానము ద్వాదశాంతము. దీనినే పరమవ్యోమము అని కూడ చెప్పుదురు. బ్రహ్మరంధ్రమునకు దిగువ భాగమున దీనిని గుర్తింవనగును. ఇచట గల జ్యోత్స్నా మండలమే ప్రకాశ బిందువు.

మూలాధారమునకు దిగువగా రక్త వర్ణముగల అధస్సహస్రదళ పద్మమునకు కులపద్మమని సంకేతము. ఈ పద్మము, దీని పైభాగమున ఉండెడి షడ్దల పద్మము, మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూర, అనాహత, విశుద్ధ పద్మములును, లంబికాగ్రమున (కొండనాలుక చివర) అష్టదళపద్మము, ఆజ్ఞా, త్రికోణాత్మక చక్రము, శుక్ల సహస్రారము, దాని కర్ణికయైన అకులపద్మము - ఈ ద్వాదశ కమలములకు అవల ఉండునది ద్వాదశాంతమని కొందఱి మతము. ఎట్లైనను బ్రహ్మరంధ్రమునకు లోవైపున, అనగా సహస్రారమనియే భావము.

సూక్ష్మ చక్రముల విషయమున బిందువు, అర్ధేందువు, రోధిని, నాదము, నాదాంతము, శక్తి, వ్యాపిక, సమనా, ఉన్మనా అని భ్రూమధ్యము నుండి సూక్ష్మ చక్రములను తొమ్మిదిగా పేర్కొని, వీనితో శ్రీచక్రమందలి భూరాది బింద్వంతముగల నవచక్రములకు సామరస్యము చెప్పియున్నారు.

"సహస్రదళ పద్మస్థా - సర్వవర్ణోప శోభితా" (ల.స.నా.)

*ఆధారే, లిఙ్గ, నాభౌ, హృదయ సరసిజే, తాలు మూలే, లలాటే,*
*ద్వేపత్రే, షోడశారే, ద్విదశ, దశదలే, ద్వాదశార్ధే, చతుష్కే,*
*వాసాన్తే, బాలమధ్యే, డఫ, కఠ సహితే, కంఠమూలే స్వరాణాం*
*హం - క్షం తత్వార్థయుక్తం సకల దల యుతం వర్ణరూపాం నమామి||"*

ఇది అన్తర్మాతృకాధ్యానం

ఈ శ్లోక భావమును పద్యతాత్పర్యమున చూచునది.

చం॥ *కనియెడి శక్తి గన్నులకు, గన్పడ జేసెడి శక్తి వెల్గుకున్,*
*వినియెడి శక్తి వీనులకు, విన్పడ జేసెడి శక్తి నింగికిన్,*
*మనియెడి శక్తి జీవులకు, మన్పెడి శక్తి ధరిత్రి కిచ్చి, మ*
*మ్మనయము శక్తిమంతులుగ నాదృతి బ్రోచెడి శక్తి గొల్చెదన్* ॥ 5

చూచెడి శక్తిని కన్నులకు, చూపించెడి శక్తిని వెలుగునకు, వినియెడి శక్తిని చెవులకు, వినిపించెడి శక్తిని ఆకాశమునకు, జీవించు శక్తిని జీవులకు జీవింపజేయు శక్తిని సర్వాధారయైన పృథివికి ఇచ్చి, మమ్ము నిరంతరము శక్తిమంతులుగా చేయుచున్న పరాశక్తిని సేవించెదను.

పరబ్రహ్మమును గూర్చి కేనోపనిషత్ (1-2)లో

"శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనోయద్ వాచోహ వాచం స ఉ ప్రాణస్య ప్రాణః । చక్షుషశ్చక్షు రతిముచ్యధీరాః ప్రేత్యాస్మాల్లోకా దమృతా భవన్తి॥" అని వర్ణింపబడినది. చెవికి చెవియై, మనస్సుకు మనస్సై, వాక్కుకు వాక్కుగా, ప్రాణమునకు ప్రాణముగా, కంటికి కన్నుగా ఉండెడి పరబ్రహ్మమును చూచు జీవులు ఈ లోకమున అమరు లగుదురని భావము. లింగ భేదములతో పరమేశ్వరుడని పరాశక్తియని చెప్పబడినది ఒక్కటే అని గుర్తింపవలెను. అసలు శక్తి అనునది నిష్క్రియాత్మకమైన చైతన్యముయొక్క క్రియాత్మకత్వమే కదా! నిష్క్రియుడైనంతకాలము అచల బ్రహ్మము - క్రియోపేతుడైనపుడు చల లేక శబల బ్రహ్మమగును. పరమేశ్వరి "మహాసత్త్వ - మహాశక్తి - సర్వశక్తిమయి". —(ల.స.నా).

ఉ॥ *సత్యము నేకమున్ పరమసౌఖ్యము కేవల మాత్మరూపము*
*న్నిత్యము సాక్షిభూతమును నిర్మలమున్ త్రిగుణాతి రిక్తమున్*
*బ్రత్యయమున్ స్వభావమును బ్రహ్మమునౌ గురు పాదరశ్మి సాం*
*గత్యము మన్మనః ప్రసృత కాంతుల నీనెడు భావ వీచికల్* ॥ 6

సత్యమయినది, ఏకైక మయినది, అనగా మఱొకటి లేనిది, శ్రేష్ఠతమ సుఖస్వరూప మయినది, పరిపూర్ణ మయినది, ఆత్మరూప మయినది, నిత్యము జీవు లొనర్చు కర్మలకు సాక్షిగ నుండి, ఆణవ మాయిక కార్మిక మాలిన్యములు లేక, సత్త్వ రజ స్తమో గుణములకు అతీతమైన జ్ఞానము లేక జ్ఞానహేతువైన బ్రహ్మ పదార్థమే శ్రీగురువు. (ఈ గురువుయొక్క అంశావతారములే లౌకికముగా మన సంస్కారముల బట్టి, మనల బోధించి సన్మార్గము చూపు

గురువులు). ఆ గురుదేవుని చరణ కిరణ సంయోగమువలన, నా మనస్సు నుండి వెల్లుబుకు కాంతి తరంగములు, భావములను ప్రసరింప జేయును గాక!

భారతీయ సంప్రదాయమున గురుస్థాన మత్యున్నత మయినది. "గుకారో హ్యంధకారస్యాత్ రుకార స్తన్నిరోధకః| అంధకార నిరోధత్వాత్ గురురిత్యభిధీయతే" || గుకార మనగా చీకటి. రుకారము దానిని నిరోధించునది. చీకటిని తొలగించుటవలన గురువు అని అర్థము. "గురుస్సాక్షాత్పరబ్రహ్మ" గురువే పరబ్రహ్మము. "న గురోరధికం" గురువు కంటె అధికమైనది లేదు. "శ్రీగురుః పరమ కారణభూతాశ్శక్తిః" భావనోపనిషత్. అన్ని కార్యములకు కారణమైన శక్తియే శ్రీ గురువు. జీవులలో కదిలి, కదిలించు పరాశక్తియే గురువు.

పరదేవత "గురుమూర్తిః - గురుమండల రూపిణీ" - (ల.స.నా.)

మ|| *సముడై, సర్వజనాను కూలుడయి, సత్సంస్కారియై, బ్రహ్మత*
*త్వమునం బండి, మదీయ పుణ్య ఫలమై ప్రాప్తించి, శ్రీవిద్య స*
*త్రమమై దోప నొసంగి, సత్య పథమున్ సారించి, చోదించి, నా*
*భ్రమ పోజేసిన మత్పితన్ గురుని సుబ్బారాయునిన్ మ్రొక్కెదన్* || 7

అందఱియెడ సమత్వము చూపుచు, సాధువై, ప్రజలతో ఒద్దిక గలిగి, నాయకుడై, మంచి సంస్కారము గలిగి, బ్రహ్మవిద్యయందు మిక్కిలి శ్రమించి, పరిపక్వస్థితిని పొంది, నా పుణ్యఫలముగా నాకు లభించి, శ్రీవిద్యను (శుభప్రదమగు బ్రహ్మ విద్యను) కష్టపడకుండ బోధించి, సత్యమార్గమును తెఱచి, నన్ను నడిపించి, నా భ్రమను తొలగించిన నా తండ్రియు గురువు అయిన, శ్రీ అగస్త్యరాజు సుబ్బారాయునికి మ్రొక్కెదను.

లౌకికముగ నా గురువైన పితృపాదులు శ్రీ అగస్త్యరాజు సుబ్బారాయుడు కేవలము ఆధ్యాత్మిక చింతనతో సాధు జీవితము గడపిన వాడు కాదు. ఆయన కర్మిష్ఠి. దేశ స్వాతంత్ర్యముకొఱకు నడచిన ఉద్యమములలో క్రియాశీలుడై, అనేక బాధ్యతాయుత పదవులను చేపట్టి, ప్రజల నడిపించిన నిస్స్వార్థపరుడైన స్వాతంత్ర్య సమరయోధుడు. అట్లని ఎన్నడు ఆత్మసాధన కర్తవ్యమును వీడ లేదు. వారు శ్రీవిద్యోపాసకులు. అహింసావ్రతులు. భగవద్గీతా పారాయణ రతులు. జప తపములు, దేవతార్చనము, వేద విహిత కర్మాచరణమందు అప్రమత్తులై యుండెడి వారు.

ఉ॥ *తత్త్వ మెఱుంగ, వేదములు దర్శనముల్ విధివత్ పఠింప, బ్ర*
*హ్మాత్త్వము దెల్పు సూత్ర పఠనాదు లొనర్ప, గురుప్రబోధ పూ*
*ర్ణత్వము నాకళించకొన, ప్రాణముల న్నియమించి యోగ ని*
*త్యత్వమునందు నిల్వ, హృదయాంతర చోదన వ్రాయ బూనితిన్* ॥ 8

గురుస్తుతి పిమ్మట తన స్థితి యేమిటో, తా నెందు కీగ్రంథమును వ్రాయ సంకల్పించెనో వివరించుచు వ్రాసిన పద్యమిది.

పరమాత్మ సంబంధమైన విజ్ఞానమును (తత్త్వమును) తెలిసికొన లేదు. దానిని గ్రహించుటకు ఉపకరించెడి ఋగ్ యజు స్సామాధర్వవేదములగాని, నియమన గ్రంథములైన శాస్త్రములగాని, క్రమపద్ధతిలో అధ్యయనము చేయ లేదు. బ్రహ్మ జిజ్ఞాసతో కూడిన బ్రహ్మసూత్రముల పఠ్లవేయ లేదు. గురూపదేశ మందలి పరిపూర్ణతను గ్రహింప లేదు. ఉచ్ఛ్వాస నిశ్వాసముల పద్ధతి ప్రకారము అదుపులో నిలిపి, యోగముయొక్క (జీవ బ్రహ్మైక్యము) నిత్యత్వములో నిలువ లేదు. కాని హృదయమం దనుభూతమైన చోదనవలన వ్రాయ దలచితిని.

<u>దర్శనములు</u> : నిబంధన గ్రంథములు లేక శాస్త్రములు. ఇవి ఆఱు. తర్కము, వ్యాకరణము, ధర్మము, మీమాంస (కర్మప్రతిపాదక శాస్త్రము), వైద్యము, జ్యోతిషము, మఱియు న్యాయ, వైశేషిక, సాంఖ్యయోగ, పూర్వ మీ మాంస, ఉత్తర మీమాంస అనువానికి షడ్దర్శనములని పేరు.

యోగనిత్యత్వము = నిర్వికల్ప సమాధి.

పద్యమందలి ప్రతి భావమును చతుర్థీ విభక్త్యంతముగ చెప్పికొనిన గ్రంథావతరణ ప్రయోజనము స్పష్టమగునని ఒక రసజ్ఞుని అభిప్రాయము.

ఉ॥ *ప్రేరణ మాత్మభావ పరివీక్షితమై, పరతత్త్వ బోధనా*
*సారమునై, శ్రుతి స్మృతి విచార్యమునై, స్తుతి రూప కావ్యమై,*
*చారుతరంబునై, సుగతి సాధనమై, యలరారుగాక! వి*
*స్ఫారితమౌచు నా కవిత సార్థకమై రహియించు గావుతన్* ॥ 9

ఇట్లు నాలో కలిగిన ప్రేరణము ఋషుల సంప్రదాయము నతిక్రమింపక, పరతత్త్వ బోధన యందు జడివాన వలె చూపట్టి, శ్రుతులందును స్మృతులందును విచారింపదగినదై, స్తుతి రూపమగు కావ్యమై, మనోజ్ఞమై, మోక్షసాధన మగుగాక! ప్రకాశితమైన నా కవిత చరితార్థమై ఆనందమును గూర్చుగాక!

శ్రుతులు : తపోగరిష్ఠులైన మహర్షులు ధ్యాన సమాధియందు వినిన భగవద్వాణియే శ్రుతి. శ్రుతులు అపౌరుషేయములు.

స్మృతులు : శ్రుతులకు మహర్షులిచ్చిన అర్థ వివరణలు పరంపరగా విని జ్ఞాపక ముంచుకొనబడినవి, స్మృతులు. శ్రుతుల వలె ఇవియును ప్రామాణికములే.

చం|| *రెపరెపలాడు భావములు ఱెక్కలు చాచి, మనోజ్ఞ భంగిమల్*
*నిపుణత బూవ, శబ్దమయ నిర్మల దివ్య రసప్రవాహినీ*
*స్నపిత రసజ్ఞ మానస లస స్నవ నీరజ హాస రేఖలై*
*విపుల కవిత్వ మాధురులు వీనుల విందొనగూర్చు గావుతన్* || 10

ముడిచికొనిన ఱెక్కలను చాచుట ద్వారా సద్దు చేయుచు, భావ విహంగములు సుందరములైన విన్యాసముతో, తమ నేర్పును ప్రదర్శింపగా, శబ్దమయము నిర్మలము అయిన ఆ అమర సుధారస ప్రవాహిని యందు స్నాన మొనర్చిన రసజ్ఞుల మానసములనెడి క్రొందామరల నవ్వు వలె విస్తారమైన కవిత్వపు తీయందనాలు వీనులకు విందొన గూర్చును గాక!

భావములు పులుగుల వలె ఱెక్కలు చాచి (విస్తరించి) ఒకప్పుడు సూటిగను (నిటారుగ), మఱొకప్పుడు ఆలోచనా స్ఫోరకముగను (ఏటవాలుగా) బహు భంగిమలలో, యథోచితముగ ప్రకటితములు కాగా, శబ్దములతో కూడి పవిత్రమైన ఆ అమృతానంద ప్రవాహమున (పరతత్త్వమును దెలుపునది కనుక అమృతము, ఆనందము కూడ) మునిగిన రసజ్ఞుల మనస్సులు వికసించిన పద్మము లగునని ఆకాంక్షింపబడినది.

చం|| *అచల మశబ్ద మవ్యయ మనంత మనాది యనన్యసామ్యమున్*
*రుచిరము కాంత్యతీత మనిరుద్ధము నిర్విషయైక గమ్యమున్*
*ప్రచురము ధ్వాంత సంశ్రిత విభా పరినిష్ఠ విశిష్ఠ మెల్లెడం*
*బ్రచరితమయ్యె నొక్కటి, పరాత్పరమైనది సృష్టిమూలమై*|| 11

చలింపనిది, నిశ్శబ్దమైనది, నశింపనిది, తుది మొదలు లేనిది, మఱియొక దానితో పోల్పరానిది, ఒప్పిదమైనది, కాంతి నతిక్రమించి యుండునది, అడ్డగింపరానిది, ఇంద్రియాతీత స్థితియందు మాత్రమే చేర దగినది, విరివియైనది, చీకటి వెలుగులు కలిసియుండుటవలన విశిష్ఠమైనది, శ్రేష్ఠముల కెల్ల మిక్కిలి శ్రేష్ఠమైనది, ఒకటి అన్ని యెడల వ్యాపించి సృష్టికి మూలమై యుండినది.

అది ఆత్మ, అన్నిటికంటె మిక్కిలి సూక్ష్మమైన శుద్ధ చైతన్యము. "ఆత్మావా ఇదమేక ఏవాగ్ర ఆసీ నాన్యత్కించనమిషత్" - ఋగ్వేదము. సృష్టికి పూర్వము ఆత్మ ఒక్కటే యుండెను, మఱియొకటి లేదని భావము. ఆ ఆత్మ —

"అశబ్ద మస్పర్శ మరూప మవ్యయం తథా రసం నిత్య మగంధ వచ్చయత్ అనాద్యనంతం మహతః పరం ధ్రువం ...." కఠోపనిషత్ (3-15) శబ్ద స్పర్శ రూప రస గంధములు లేనిది, శాశ్వతమైనది, ఆద్యంతములు లేనిది, మహత్తుకంటె అతీతమైనది, ఎట్టి వికారములు లేనిదని భావము. అది నిర్గుణ పరబ్రహ్మము లేక పరతత్వము లేక అచల బ్రహ్మము. అది నాదమై నాదబ్రహ్మ మనియు, శబ్దమై శబ్ద బ్రహ్మ మనియు, కదలుచు శబల బ్రహ్మ మనియు పిలువబడుచున్నది. శబ్ద బ్రహ్మమునుండియే సృష్టి ప్రారంభ మయినది.

ధ్వాంత సంశ్రిత విభా పరినిష్ఠ విశిష్టము - చీకటిచే ఆశ్రయింపబడిన వెలుగుయొక్క ఉనికివలన విశిష్టమైది: అనగా చీకటి వెలుగులు రెండును ఏకకాలమున ఉండినట్టిది (ఊహ్యము) మహామాయయైన మూల ప్రకృతిచే ఆవరింపబడి యుండినదని భావింపబడినది. ఈ విషయమున "ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి" ప్రకృతి పురుష లిరువురు ఆది లేని వారే అని భగవద్గీత (13 - 20) పలుకుచున్నది. ఇంకను ఋగ్వేదాంతర్గత నాసదీయ సూక్త ప్రవచనమును బట్టి కూడ ఇది స్పష్ట మగుచున్నది.

*"నా సదాసీ న్నో సదాసీ త్తదానీం*
*నా సీద్రజో నో వ్యోమాపరోయత్*
*కి మావరీవః కుహకస్య శర్మ*
*న్నంభః కిమాసీ ద్గహనం గభీరమ్ ॥*

*న మృత్యు రాసీ దమృతం న తర్హి*
*న రాత్ర్యా అహ్న ఆసీ త్ప్రకేతః*
*ఆసీ దవాతం స్వధయా తదేకం*
*తస్మా ద్ధాన్య న్నపరః కించనాస ॥*

*తమ ఆసీ త్తమసా గూఢ మగ్రే*
*ప్రకేతం సలిలం సత్వమా ఇదం*
*తుచ్ఛేనాభ్వపిహితం యదాసీత్*
*తపస స్తన్మహినాః జాయతైకమ్ ॥ "*

అది సత్తు కాదు, అసత్తు కూడ కాదు. అప్పుడు రజస్సు లేదు, వ్యోమమును లేదు. ఆవరించునదేది? శుభదమైన అంభస్సు ఎక్కడ ఉన్నది? అంతయు చొరరానిది, ఎఱుక పడనిది. మృత్యువు లేదు. అమృతము లేదు. రాత్రి లేదు. పగలు లేదు. స్వశక్తితో గాలి కూడ స్ఫురింపదు. అందువలన వేరైన దేదియు లేదు.

తొలుత చీకటే ఉండినది. చీకటియందు తెలియబడక బ్రహ్మము సత్స్వరూపమున ఉండెను. అది మాయచే ఆవరింపబడి ఉండెను. అందుండి జ్ఞానమయమగు విలక్షణ శక్తి తోచినది. అని స్థూలముగ పై సూక్తము యొక్క భావము.

స్వధయా = స్వీయమగు శక్తి ; అభువు = 1. జలము, 2. బ్రహ్మము

తుచ్ఛము = మాయ ; తపస్సు = జ్ఞానమయమైన విలక్షణ శక్తి

ఉ|| *శ్రీకర తత్త్వమయ్యు నది చిత్సుఖము స్విడనాడి, జీవుడై*
*ప్రాకృత లీలలం దవిలి, ప్రజ్ఞ దొఱంగ, నుపాధి దాల్చి, తా*
*నేకడ నుండెనో యెఱుగ కెంతయు నద్భుత దృశ్యజాతముల్*
*సేకుఱ సర్వము స్మఱచె చిత్తము కన్నుల కప్పగించుచున్||* 12

అది శుభమును గూర్చు తత్త్వమైనను, చిద్రూపమగు ఆనందమును వదలి, జీవుడై ప్రకృతితో క్రీడించుచు, ప్రజ్ఞ నశింపగా, శరీరమును దాల్చి, తానెచట నుండునది కూడ తెలియక, ఆశ్చర్యమును గొలుపు అందచందములను వీక్షించుచు, సర్వమును మఱచి, మనస్సును కన్నుల కధీనము చేసెను. అనగా చిత్తమును ఇంద్రియాయత్తము చేసి వానివెంట పరుగిడఁజొచ్చెను.

"జీవో బ్రహ్మైవ న పరః" "నహి జీవో నామ కశ్చిత్ స్వతంత్రః పదార్థః" జీవుడు బ్రహ్మమే - ఇతరుడు కాడు. జీవుడను పేరుగల దెందును స్వతంత్ర పదార్థము కాదు అని భావము.

ఇది జీవుని స్థితి - అవిద్య కారణముగా భేద భావమును పొందిన ఆత్మస్థితి. ఈ స్థితియందు జీవుని భావము లెన్ని విధముల ప్రసరించునో తెలుపు యత్నము క్రింది పద్యములలో కొంత వ్యక్తము చేయబడినది.

*"చైతన్యం యదధిష్ఠానం లింగ దేహశ్చ యః పునః*
*చిచ్ఛాయ లింగదేహస్థా తత్సంగో జీవ ఉచ్యతే ||* - *శ్రుతి*

చైతన్యము, దానియందు కల్పింపబడిన లింగ (సూక్ష్మ) దేహము, దానియందు ప్రతిబింబించిన 'చిత్తు' యొక్క ప్రతిబింబము (చిదాభాస), అన్నియు చేరి జీవుడగును. జీవుడు అస్వాతంత్రుడు. ప్రాణధారణమువలన జీవత్వము కలుగుచున్నది. జీవుడు 'సాక్షి' యొక్క ప్రతిబింబమే యని తెలియవలెను.

చిత్తమునకు మనస్సునకు సూక్ష్మ భేదమున్నను ఇచ్చట 'చిత్తము' మనస్సునకు పర్యాయముగ ప్రయోగింపబడినది.

ఉ॥ *ఈ సచరాచరం బఖిల మే పరతత్త్వ గతంబో! విశ్వ వి*
*న్యాసము సర్వ మే సగుణ నాద వినోదమొ! తారకావళీ*
*భాసిత శూన్య మే ప్రకృతి భావ వికాసమొ! ఆత్మ సంస్క్రియా*
*వాసిత సృష్టి కల్పన వివర్తన మే పరివర్తనం బొకో!* 13

ఈ కదలెడి జీవులు, కదలని వస్తువులు అన్నియు ఏ పరతత్త్వము నాధారము చేసికొని నిలిచియున్నవో! ఈ విశ్వమంతయు గుణయుతమైన ఏ నాదముయొక్క వినోద ఫలితమో! చుక్కలతో చక్కగా మెరిసెడి ఆకాశము ఏ ప్రకృతియొక్క భావవికాసమో! ఆత్మ సంస్కారమువలన ప్రకాశించెడి సృష్టి కల్పన ఏ మార్పువలన కలిగినదో!

ప్రకృతి భావము = ప్రకృతియొక్క తలంపు. పరివర్తనము = వస్తువులలో క్రమముగా కలిగెడి సహజమగు మార్పు ; వివర్తనము = స్వరూపమునకు హాని కలుగకుండ మఱియొక వస్తువుగ చూపట్టుట. త్రాడు పాముగ తోచుట వంటిది.

సృష్టికారిణియైన శక్తి, రూపముతో కాని రూపము లేక కాని తోప వచ్చును. ఈ శక్తినే సాంఖ్యులు ప్రకృతి అనియు, వేదాంతులు అవిద్య అనియు, వైయాకరణులు శబ్ద శక్తి అనియు, శైవులు శివశక్తి అనియు, వైష్ణవులు విష్ణుమాయ అనియు, శాక్తులు మహామాయ అనియు, పౌరాణికులు దేవి అనియు పలుకుచుందురు.

శా॥ *ఈ నక్షత్రములున్ గ్రహమ్ములును సూర్యేంద్వాది గోళంబు లె*
*ద్దానం దోచు? తదాద్యశక్తి యెదియో? తద్రూప మెట్లుండునో?*
*ప్రాణం బెకడ నుండి వచ్చి, యెట జేరం బోవునో? ఇంతకీ*
*మేనన్ నే నని పల్కు తత్త్వ మెదియో? మిథ్యాజగం బేమిటో!* 14

ఈ నక్షత్రములు సూర్యుడు చంద్రుడు మున్నగు గ్రహములు దేనిని ఆధారము చేసికొని నిలిచియున్నవో? వీనికి కారణమైన శక్తి యేదో? ఆ శక్తి స్వరూపమెట్టిదో? ప్రాణ మెక్కడి నుండి వచ్చుచున్నదో ? తిరిగి యెక్కడికి పోవుచున్నదో? ఇంతకు ఈ దేహమున 'నేను' అని వ్యవహరించెడి తత్వమేమిటో? మిథ్యగా తోచెడి ఈ జగ మేమిటి?

జిజ్ఞాసాపరుల కిట్టి సంశయములు కలుగుట అసహజము కాదు.

మ॥ *ఒక చైతన్య మనేక రూపములుగా నుక్షిప్తమై నిల్చెనా?*
*ఒక శబ్దంబు నభోంతరాళమున దా నుత్సారితంబయ్యెనా?*
*ఒక జ్యోతిస్సు మహద్విభాసియయి విశ్వోదంచితం బయ్యెనా?*
*ఒకటే లక్ష్యమగూర్చి సర్వము సముద్యోగించు నట్లొప్పెడిన్॥* 15

ఒక్కటే అయిన చైతన్యము అనేక రూపములుగా పైకుబికి వచ్చినదా? ఒకటైన శబ్దము (ఓంకారము లేక శబ్ద బ్రహ్మము) ఆకాశమంతయు నిండునట్లు రూపమును దాల్చెనా? ఏకైకమైన వెలుగు విశ్వము నాక్రమించినదా? ఒకానొక లక్ష్యసాధనకొఱకు అన్నియు పని చేయుచున్నట్లు తోచుచున్నది.

శా॥ *ఏదో శక్తి యదృశ్య రూపమున దా నీ విశ్వగోళంబులం*
*బ్రాదుర్భావము నెంది, స్పందనములన్ భాసించుచున్నట్లు, న*
*మ్మోదం బొప్ప తదీయ ప్రేరణమునన్ భూతాది వర్గంబులున్*
*పాదుల్ దప్పక సంచరించునట్లు, మద్భావంబు ఘోషించెడిన్॥* 16

కనిపింపని శక్తి యేదో తన కొఱకే ఈ విశ్వ గోళములుగా ఆవిర్భవించి స్పందనములతో ప్రకాశించుచున్న దనియు, అట్లే ఏదో తెలియని ప్రేరణము వలన సర్వ భూతములు తమ తమ స్థానములనుండి తప్పిపోక, నియమమును వీడక, అవిరామముగా తిరుగుచున్న వనియు, నా అంతరాత్మ ఘోషించుచున్నది.

ఆ విడదీయరాని కారణము పరాశక్తి లేక పరమాత్మ. "అప్రతర్క్య మనిర్దేశ్య మనౌపమ్యమనామయం। తస్యకా చిత్స్వత స్సిద్ధా శక్తి మాయేతి విశ్రుతాః ॥" - దేవీగీత (1-3). ఆ శక్తి తర్కింప వీలుకానిది, నిర్దేశింప అలవికానిది, ఉపమింప కుదురనిది. అది అనామయమైనది. చిత్తుకు స్వతస్సిద్ధమయినది. అదే మాయ. మాయ వలననే భేదభావము కలుగుచున్నది.

"It can be many things simultaneously, have many co-ordinated movements which to the finite reason may seem contradictory. It is one but innumerably manifold, infinately plastic, inexhaustibly adoptable". - Arabindo

అది ఏక కాలమున అనేకములుగా ఉండగలదు. పరిమిత చిత్తమునకు పరస్పర విరుద్ధములుగా తోచినను, అనేక సమానస్థాయి గమనములు గలిగి, ఒకటే అయినను అసంఖ్యాకమై, అనంతముగ రూపాంతరముల చెందుచు, అశేషముగ ఆనుకూల్యతను గలిగి యుండునని అరవిందయోగి ప్రవచనము.

ఈ కనిపించని శక్తినే శాస్త్రజ్ఞులు విశ్వశక్తి (Cosmic Energy) అనుచున్నారు. ఇదే జగత్తుకు మూలము కనుక, పరదేవత. శక్తికి ప్రత్యేక రూపము లేనందున అన్ని రూపములు ఆమెవే. అట్లే రూపరాహిత్యము కూడ ఆమెయే.

శక్తి - "సృష్టి స్థితి సంహారాదికం యేన శక్తతే తచ్ఛక్తిః" సృష్టి స్థితి సంహారాది కార్యములు దేనివలన జరుగుచున్నవో, అది శక్తి అని అర్థము.

పరాశక్తి 'విశ్వరూప - జగతీకంద - మిథ్యాజగ దధిష్ఠాన - నామరూప వివర్జిత - పంచకృత్యపరాయణ" - (ల.స.నా.)

మ॥ *ఎటు వీక్షించిన నింద్రియార్థములు ముందే నిల్చి వ్యామోహపుం*
*బటిమం జూపెడు ; లౌకికంబులును సంభావింప దుర్జ్ఞేయ సం*
*ఘటనాలంబములై దురంతములుగా గన్పింప, విభ్రాంతిమై*
*జటిలంబైన జగత్స్వభావ మెఱుగన్ సాధ్యంబు గాకుండెడిన్॥* 17

ఎచ్చట చూచినను శబ్దాది విషయములే ముందు ముందుగా కన్పించి, మోహముయొక్క నేర్పును (అతిశయమును) చూపుచున్నవి. ఇక లోక వ్యవహారాదులు తెలియరాని సంఘటనలను ఊతగ గొని అనంతముగ తోచుచుండ, భ్రాంతితో మిక్కిలి క్లిష్టమయిన ప్రపంచ స్వభావము నెఱుగుటకు సాధ్యము కాకున్నది.

ఐహిక విషయములు శారీరకానందములు ఆత్మజ్ఞానమును మఱుగుపఱచి, వివేకమునకు తావీయవు. అవి జ్ఞానకిరణముల చొరనీయవు కనుక విజ్ఞు డీ విషయమున జాగరూకత వహింపవలెను.

జటిలము = జడలు గలది, - మిక్కిలి క్లిష్టమయినదని భావము.

ఉ॥ *ఏ దెటులైన నెల్లెడల హృద్యమునై ప్రకృతి ప్రయుక్తమై*
*ఆదరణీయ నవ్య మధురానుభవ ప్రసృతంబునౌచు న*
*మ్మోదము గూర్చు, నివ్విడమి బుట్టుట సైత మదృష్ట మన్న భా*
*వోదయ మయ్యె, నత్య మెదియో గనరాని యయోమయ స్థితిన్* ॥ *18*

ఏ దేమైనను, అంతట హృద్యముగ తోచుచు, ప్రకృతిచే నడుపబడుచు, మనస్సును ఆకర్షించెడి క్రొత్త క్రొత్త తీయని అనుభవముల కల్పించి, ఇహాము కూడ ఆదరణీయమై ఆనందమును గూర్చుచున్నది. ఇంకను ఈ భూమిపై పుట్టుట కూడ అదృష్టమే అను అభిప్రాయమును, ఆసక్తిని కలిగించుటచే, ఏది సత్యమో తెలియజాలని కఠినస్థితి నెలకొనినది.

ఐహిక సుఖములు సత్యాసత్యముల తెలియనీయక జీవుని మభ్యపెట్టగా ఆతడు శరీరమే తా నను భ్రాంతితో కొట్టు మిట్టాడునని భావము.

చం॥ *కనబడు నీ ప్రపంచమును గాల్పనికం బను టెట్లు? కానిచో*
*వినబడు నా ప్రపంచ మవివేక వికల్ప మనంగ జెల్లునే?!*
*కనబడు దానియం దణగి కన్నులకుం గనరాక, యేకతా*
*జనిత మహత్వ పూర్ణమగు సత్య మొకండు వికాస మొందెడిన్*॥ *19*

కనిపించు ఈ ప్రపంచమును కేవలము కల్పిత మనలేము. అట్లని కనిపించకున్నను, శ్రుతి స్మృతి పురాణాదులలో వినబడిన బ్రహ్మావ్యాప్తి అవివేకమువలన కలిగిన దన గలమా? ఈ కనిపించు విశ్వమందే అంతర్యామియై భౌతిక నేత్రములకు గోచరము గాక, ఏకతారూపమైన చైతన్య వికాసమే (పరబ్రహ్మమే) గోచరించుచున్నది.

స్వప్నమున తోచునవి స్వప్నాంతమున కాన రావు. కారణము స్వప్నలోకము సత్యము కాదు కనుక. ఐనను స్వప్నావస్థ వఱకు అవి సత్యములే కదా! అట్లే జాగ్రదవస్థకు పరిమితమైన ఈ ప్రపంచము కూడ అసత్యమే. సత్యము శ్రుతి స్మృతులలో తెలుపబడి ఉన్నది. అదే నామ రూప రహితమైన పరమాత్మ లేక పరాశక్తి. అది అద్వితీయము సర్వవ్యాప్తమై ఉన్నది.

శా॥ *తానై సర్వము, సర్వమం దణగి, యంతశ్శక్తి రూపంబునం*
*బ్రాణాదుల్ స్పృశియించుచున్, వినుచు, నాస్వాదించుచున్, గంధ వి*

*జ్ఞానం బోచను, చూచుచుం, బహువిధాకారంబులం దోచు న*
*ద్దానిన్, దేని సమాశ్రయించి మది నిర్ధారంబు గావించెదన్‌॥* 20

అంతట తానై, జీవులలో ఇంద్రియముల ప్రేరేపించు అంతశ్శక్తియై ప్రాణములను స్పృశించుచు, శబ్దముల వినుచు, రసాదుల రుచిచూచుచు, గంధాదుల ఆఘ్రాణించుచు, వస్తువుల పరికించుచు, సర్వము తానై ఉండుటే దాని రూపము. ఇ ట్లనేక రూపములతో స్ఫురించు ఆ శక్తిని దేని నాధారము చేసికొని నిర్ధారించి చెప్పగలను?

పరబ్రహ్మము లేక పరాశక్తి విచిత్ర మయినది. దానికి అన్నివైపుల చేతులు కాళ్ళు కండ్లు ముఖములు చెవులే. అది వ్యాపించని చోటు లేదు. ఇంద్రియములు లేకున్నను ఇంద్రియ వ్యాపారముల ద్వారా ప్రకాశించును. జీవులలో అంతరాత్మయై వారు చేయు పనుల ద్వారా వ్యక్త మగుచుండును.

*"సర్వతః పాణి పాదం తత్సర్వతోఽక్షి శిరోముఖం*
*సర్వత్ర శ్రుతిమల్లోకే సర్వ మావృత్య తిష్ఠతి ॥ "*

- శ్వేతాశ్వతరోపనిత్ (3-16) మఱియు భగవద్గీత (13-14)

*"సర్వేంద్రియ గుణాభాసం సర్వేంద్రియ వివర్జితం ।*
*అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణభోక్తృచ ॥*

- భగవద్గీత (13-15)

అది (పరమాత్మ) అంతటను చేతులు కాళ్ళు కన్నులు తలలు ముఖములు చెవులు కలిగి ప్రపంచము నావరించి యున్నది. ఆ పరాశక్తి ఇంద్రియ గుణములను ప్రకాశింప చేయుచున్నను, ఇంద్రియములు లేక, నిర్లిప్తమై (దేనిని అంటక), సమస్తమును భరించుచున్నది అని భావము.

ఉ॥ *ఆకృతి లేని తత్త్వమది, ఆకృతు లాహ్వాయముల్ ధరించి తా*
*నాకరణిం బ్రవర్తిలుచు నందఱ దృప్తులజేయు ; దాని నే*
*జేకొని వర్ణమాల బరిచిత్రణ సేయుదు మాతృమూర్తిగా;*
*నా కమనీయ వా గ్విభవ మావరణంబయి పొల్చు గావుతన్ ॥* 21

ఆ తత్త్వమునకు ఆకారము లేదు. కనుక తమ తమ అభిరుచుల మేరకు మానవు లూహించిన విధమున ఆకృతుల ధరించి, ప్రవర్తించుచు, అందఱిని సంతృప్తుల జేయుచుండును. అట్టి తత్త్వమును అక్షరముల సహాయముతో తల్లిగా చిత్రించెదను. ఆ(నా) సుమనోజ్ఞమయిన శబ్ద సంపదయే ఆమెకు ఆవరణ మగుగాక!

పరతత్త్వము నిరాకారము, నిరాశ్రయము, అవ్యక్తమే అయినను, సర్వవ్యాప్తము.

*"ఉపాసకానాం కార్యాయ పురైవ కథితం ప్రియే।*
*గుణక్రియాను సారేణ రూపం దేవ్యాం ప్రకల్పితమ్॥ "*

- మహానిర్వాణ తంత్రమ్ (4-11)

ఉపాసకుల కార్యార్థము సాధకుని గుణ కర్మల ననుసరించి దేవి యందు వివిధ రూపములు కల్పితము లయినవని పరమేశ్వరుడు సతితో చెప్పిన మాటలు. "యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహమ్" - భగవద్గీత (4-11). ఎవ రే విధముగ న న్నాశ్రయింతురో వారి నట్లే అనుగ్రహింతునని భగవద్వాక్యము. "పితుః శతగుణం మాతా గౌరవేనాతిరిచ్యతే" తండ్రి కంటె తల్లి నూరు రెట్లు గొప్పది. కనుక పరమాత్మను నేను తల్లిగనే భావించితిని. "పీఠ మంబామయం సర్వం శివలిఙ్గశ్చ చిన్మయం" - శివపురాణము - పీఠము రూపమున సర్వసృష్టికి ఆధారమయిన మూల ప్రకృతియే తల్లి - (పార్వతి). లింగము అచింత్య మయిన పరతత్త్వము యొక్క గుర్తు (శివుడు).

పరమేశ్వరి "నిరాకార - నిత్య - నిరుపాధి" (ల.స.నా)

ఉ॥ *ఈ బహిరంతర ప్రకృతి కెయ్యది బీజము? శక్తి యెచ్చటో?*
*ప్రాభవరూప కీలకము భాసిలు నే కడనో? యటంచు నే*
*నా బలమున్ గ్రహించు టెటు లంచు మదిం దలకించి, యాత్రలన్*
*క్షోభ తొలంగ బోధనయు శోధన చేకుర టెంచి యాదటన్॥* 22

ఈ వెలుపలి ప్రకృతికి లోపలి స్వభావమునకు కారణ (బీజ) మేమి? దాని శక్తి ఎచ్చట కలదు? దాని ప్రాధాన్యమును దెలుపు రహస్యము (కీలకము) ఎక్కడున్నది? వాని బలమెంతయో తెలిసికొనుటెట్లు? అని మదిలో కుతూహలము కలుగుగా, యాత్రలవలన మనఃక్షోభము తొలగి బోధనయు సత్యశోధనయు కలుగుట భావించి, ఆదరముతో - (పై పద్యముతో అన్వయము)

మంత్రశాస్త్రమున మంత్రమునకు శక్తిని చేకూర్చెడి శబ్దానువర్తికి బీజమని సంకేతము. ఇచట, సృష్టి చేయవలయుననెడి పరమేశ్వరుని ఇచ్ఛారూపమగు శక్తియే బీజము. శక్తి అనగా నిర్వహణ సామర్థ్యము. అట్టి సామర్థ్యము మూల ప్రకృతినుండి కలిగినందున మూలప్రకృతియే శక్తి. కీలకమనగా నిర్వహణ సామర్థ్యమును లేక శక్తిని స్వాధీనపఱచు రహస్యము. ఇది జ్ఞానము. ఈ

జ్ఞానము (కీలకము) బిగముచేయు వంటిది. కీలకము తెలిసినచో శక్తిని, శక్తి ఎఱుక వడిన యెడల మూల కారణమగు వరమాత్మ నంకల్పమును, తెలిసికొన వచ్చును.

మ|| *నిను భావించి, త్వదీయ మూర్తి గన నందీపించు దీక్షారతిం*
*జని, నే గొండలు కోనలు న్వనములున్ సాంద్రాటవుల్ తీర్థముల్*
*గని, నంవిత్పరిపూర్ణ రూవ మెచటం గన్పట్టమిం గ్రుంగితిం;*
*దనయున్ న న్గృవ జూడ వేడెదను మాతా! యేల గన్పింపవే!* 23

వరతత్త్వమును ఆ విధముగ భావించి, భావించిన రూవమును దర్శింవనెంచి, దీక్షతో కొండలను కోనలను వనములను అడవులను తీర్థములను చూచి చూచి, జ్ఞానమయమైన నీ వరివూర్ణ రూవమును ఎచ్చటను చూడజాలక నిరాశతో క్రుంగితిని. నీ తనయుడనైన నన్ను దయజూడ వేడెదను. అమ్మా! నీవేల కన్పించుట లేదు?

నంవిత్పరివూర్ణరూవము= నంవిత్తు (జ్ఞానము)తో నిండిన రూవము.

"నత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" (శ్రుతి) అనుటవలన వరాశక్తి లేక వరమాత్మ న్వరూవము నత్యము జ్ఞానము అనంతమయినది.

ఉ|| *ఎక్కడ నుంటివో గురుతు లెట్టివో? నా హృదయాంతరంబునం*
*జిక్కని చీకటుల్ ముసిరె ; జేరవు చూడ్కులు ; చేయి సాచి నీ*
*చక్కని పాదవద్మముల న్పర్శకు సైతము నోచ ; తల్లి! నా*
*యక్కఱ దీర నేడు భవదంఘ్రి రుచుల్ వెలిగింపరాదొకో||* 24

తల్లీ! నీ వెక్కడున్నావో? నా హృదయమున మాత్రము చిక్కని చీకట్లు ముసిరినవి. చూవులానుట లేదు. నీ చక్కని పాదవద్మముల న్పర్శించుటకైనను వీలగుట లేదు. నా అవిద్యవలన తత్త్వము నెఱుగవలె ననెడి దృష్టి కూడ లేదు. అమ్మా! నా అవనరము తీరునట్లు నీ చరణ కిరణముల ప్రనరింవజేసి త్రోవజూవుము.

దేవీ పాదములనుండి మరీచులు (కిరణములు) వెలువడుచున్నవని "లోకన్య ద్వార మర్చిమ త్పవిత్రం జ్యోతిష్మ ద్భ్రాజమానం మహాన్వత్, అమృతన్య ధారా బహుధా దోహమానం చరణం నో లోకే నుధితాం దధాతు". అనెడి తైత్తిరీయ బ్రాహ్మణ శ్రుతి పాఠము సాక్ష్యముగ నున్నది. సాయుజ్యమునకు లేక బ్రహ్మలోకాదులకు ద్వారముగ నిలిచి వానిని

ప్రాప్తింపజేసెడి మయూఖములతో కూడి పవిత్రవంతమై చంద్ర, సూర్య కళా స్వరూపములతో ప్రకాశించుచు, బహుప్రకారములుగా అమృత ప్రవాహమును 72 వేల నాడీమార్గములలో వర్షించునట్టి పరాశక్తి పాదారవిందములు, సాధకులను తృప్తిపఱచుగాక అని భావము.

చం॥ *గణపతి త్వద్గృహాంగణము గాచుచునుండ, విలక్షణంబుగా*
*ననయము హంస, తద్ధ్వనిని హాయిగ బాడుచునుండ, సుప్తిలో*
*మునిగితొ మూల చక్రమున మూడును బై నర చుట్లు కాంతివై?*
*జనని! త్వదీయ దృక్ప్రభవ సాంత్వన సంస్థియ నాదరింపవే*॥ 25

ఇంటి ముంగిట నిలిచి గణపతి నీకు రక్షణ కూర్చుచుండగా, హంస విలక్షణమైన 'హంసధ్వని' రాగము నాలపించుచుండగా, కాంతి రూపమున మూడున్నర చుట్లుగా మూలాధార చక్రమున సుఖముగ నిద్రించుచుంటివా? అమ్మా! నీ కడగంటి చూపులు ప్రసరింపజేసి స న్నాదరింపుము.

ఇక్కడ నుండి అమ్మ కనిపింపక పోవుటకు కారణము లూహింపబడుచున్నవి.

గణపతి = గణేశత్వము గలవాడు. బ్రహ్మానుసంధానమున గణేశత్వము లభించును. దీనినేపుర్యష్టకాధీశత్వ మనియు చెప్పుదురు. పురమనగా శరీరము. పురుష శబ్దమునకు శరీరధారియైన జీవుడని భావము. కర్మేంద్రియ, జ్ఞానేంద్రియ, అంతరింద్రియ, ప్రాణపంచక, కామ, కర్మ, అవిద్య లనియెడి ఈ ఎనిమిది లక్షణములు గల పట్టణము- శరీరము. ఈ పట్టణముపై అధీశ్వరత్వము కలుగుటకు అనగా మాయాకల్పితములయిన పై గుణములపై అదుపు లేక సర్వాధికారము కలిగి యుండుటకు, జీవుడు స్వరూప జ్ఞానమును ఆశ్రయింపవలెను. అట్టి బ్రహ్మానుభావము కలిగిన గణేశుడు అమె యింటి కావరియని తెలియవలెను.

ఇంకను మూలాధారమునకు వెలుపల గణేశుడు నివసించుచు, జీవులకు వారి వారి కర్మల ననుసరించి ప్రవృత్తి నివృత్తి మార్గముల చూపుచుండు నందురు. "త్వం మూలాధారస్థితోనిత్యం త్వం శక్తి త్రయాత్మకః" - గణపత్యుపనిషత్. నాడులకు మూలస్థానమైన కందము, నాలుగు వ్రేళ్ళ వెడల్పున అండాకారమున ఉండుటచే దానినే గణేశునిగ చెప్పుదురు.

హంస = హంసమంత్రము - ఉచ్ఛ్వాస నిశ్వాస రూపమున ప్రతి జీవియు 'సోహం' మంత్రమును అనుక్షణము జపించుచుండుట తెలిసినదే. తద్ధ్వని = హంస ధ్వని రాగము.

సుప్తిలో -- కాంతివై = కుండలిని రూపమున మూడున్నర చుట్లు చుట్టుకొని నిద్రించు చుంటివా?

*"మూలాధారస్థ వహ్న్యాత్మ తేజో వ్యవస్థితా ।*
*జీవశక్తిః కుండలాఖ్యా ప్రాణాకారాఽథ తైజసీ ।*
*ప్రసుప్త భుజగాకారా త్రిరావర్తా మహాద్యుతిః ॥"*

— తంత్రరాజమ్

మూలాధారమున వహ్న్యాత్మక తేజస్సుతో నివసించెడి జీవశక్తి, ప్రాణాకారమైన తేజోరూపముతో, కుండలిని అని వ్యవహరింపబడుచు, మూడున్నర చుట్లు గల సర్పాకృతితో నిద్రించుచున్నదని భావము.

"మూలాధారైక నిలయా -- కుండలినీ" - (ల.స.నా)

మ॥ *పతితో పాచిక లాడుచుంటివో? కృపా పారీణవై లోక సం*
*తతి కల్యాణము గోరి, యేదో వ్రతమో తంత్రంబో మంత్రంబో నీ*
*పతి బృచ్ఛించుచు నుంటివో? విభుని భావం బెంచి లాస్యంబునం*
*దతి హేలాగతి దృక్ప్రసార పద విన్యాసంబులం దుంటివో?* 26

నీ భర్తతో పాచిక లాడుచుంటివా? దయార్ద్రవై లోకముల శుభమును గోరి ఏదేని వ్రతమో తంత్రమో మంత్రమో ఉపదేశింపుమని నీ భర్త నడుగుచుంటివా? లేక నీ నాథుని భావము గ్రహించి విలాసముగ పాదములను చూపులను కదలించుచు లాస్యము చేయుచుంటివా?

"తన్యతే విస్తార్యతే జ్ఞానం అనేన ఇతి తంత్రమ్" "ఆగతం శివ వక్త్రేచ గతంచ గిరిజా శ్రుతిః ఇత్యాగమం" జ్ఞానమును విస్తరించి తెల్పునది తంత్రము. ఇది శివుని నోటినుండి వెలువడి పార్వతి చెవిని చేరుటచే ఆగమమైనది. ఇది వేదతుల్యము. "మంతారం తారయతీతి మంత్రః" జపించువానిని తరింపజేయునది మంత్రము.

తాను బహురూపములు కావలె ననునది సర్వలోక విభుడైన పరమేశ్వరుని భావము. ఈ భావమును ఇచ్ఛాశక్తిగ గ్రహించి, జ్ఞానశక్తిగా విమర్శించి, క్రియాశక్తియై కార్యరూపమున పెట్టినది జగదీశ్వరియైన పరాశక్తియే

కదా! సృష్టి కొఱకు శృంగార భావ పూర్ణములయిన చూడ్కులను, లయము కొఱకు పాద ఘట్టనలతో కూడిన విన్యాసములను, ఆమె చేయునని వర్ణింపబడినది.

హేల = భ్రూ నేత్రాదుల కదలిక వలన చక్కగా తెలియదగిన శృంగార భావము.

చం|| *మహిషు వధింప బోయితివో? మత్తుల భండ విషంగ దైత్యుల*
*న్నిహతుల జేయ నేగితివో? నిర్దయ శుంభ నిశుంభ సంహతిన్*
*మహిత పరాక్రమారభటి మార్కొనుచుంటివొ? రక్తబీజ దై*
*త్య హరణ కార్యమగ్నవయి యాగితివో? కనరావు శాంభవీ ||* 27

శంభుని పత్నివయిన ఓ తల్లీ! మహిషుని వధించుట కేగితివా? మత్తులయిన భండుని విషంగుని చంపబోతివా? శుంభుని నిశుంభుని వారి సేనలను కూల్చుటకు సిద్ధమగుచుంటివా? రక్తబీజుని సంహరించు కార్యమున నుండి, ఆగిపోయితివా? ఏల కనిపింపవు?

పైన పేర్కొనబడిన వారందఱు పరాశక్తిచే నిహతులైన వారే. అది ఒక నాటి మాట. కాని అసురీశక్తులతో పోరాటము నిరంతరము జరుగుచునే ఉన్నది. కనుకనే పై విధములగు అనుమానముల కవకాశము కలిగినది.

మహిషుడు : ఇతడొక రాక్షసుడు. శివుని వరములవలన గర్వించి, దేవతలను బాధించి, తుదకు దుర్గాదేవివలన మరణించెను. అంతరార్థ మేమనగా జీవుని పశుప్రవృత్తియే మహిషుడు. దానిని నశింప జేయుటకు జ్ఞానశక్తి కావలెను. శ్రీదేవి ఇచ్ఛా జ్ఞాన క్రియా స్వరూపిణి. జీవుని పశుభావమును తొలగించుటే మహిషాసుర మర్దనము.

భండుడు : ఇతడు కూడ రాక్షసుడే. రుద్రుని కోపాగ్నివలన మన్మథుడు భస్మము కాగా, ఆ భస్మమును చిత్రకర్మ యను ప్రమథుడొకడు విగ్రహాకారముగ రచించెనట. దానిని చూచిన బ్రహ్మ బాగు బాగు అను అర్థమున భండ భండ అని పలుకుటతో విగ్రహమునకు ప్రాణము వచ్చి, శివుని క్రోధాగ్ని భస్మమునుండి పుట్టుటచే, క్రూరకర్మలు చేయుచు రాక్షసుల నాయకుడై దేవతలను బాధించెనని, పురాణగాథ. వీనిని వీని పట్టణమైన శూన్యకమును కూడ శ్రీదేవి కామేశ్వరాస్త్రముతో కాల్చివేసినది. "కామేశ్వరాస్త్ర నందగ్ధ సభండాసుర శూన్యకా" (ల.స.నా.).

ఆత్మస్వరూపుడైనను తన తత్త్వమును గుర్తింపక, స్థూల శరీరమే తా ననుకొనెడి అజ్ఞానముతో కూడిన జీవ భావమే భండాసురుడు. భండ శబ్దము ఆణవ మలమును సూచించునదిగా ప్రసిద్ధము. అజ్ఞానము అలక్ష్యము అహంభావము ఈతని గుణములు.

విషంగుడు - విశుక్రుడు - వీరు భండాసురుని సోదరులు. మంచికి ఆత్మోన్నతత్వమునకు విరుద్ధమయిన సంగమము కలవాడు విషంగుడు. అజ్ఞానము భోగలాలస విషయాభిలాష వీని లక్షణములు. ఇతనిని శ్యామలాదేవి సంహరించినది.

విశుక్ర శబ్దమునకు తేజోహీనుడని భావము (విగతశుక్రః). శుద్ధ సత్త్వము నుండి జారిన వాడు లేక శుద్ధ సత్త్వ స్వరూపు డయిన పరమాత్మనుండి దూరమైన వాడు. విశ్వకారణమైన చైతన్యమును కోల్పోయినవాడు. విషంగ విశుక్రు లిరువురు జ్ఞానము నావరించిన ఆసురీ శక్తులకు సంకేతము.

శుంభుడు - నిశుంభుడు - వీరు బ్రహ్మవరములవలన గర్వించిన దైత్యులు. వీరికి పురుషులవలన మృతి లేదు. వీరి దుశ్చర్యలను సహింప లేక దేవతలు ప్రార్థింప, దేవి తన దేహమునుండి కౌశికి అనెడి మహాశక్తిని సృష్టించి, ఆమెను తోడ్కొని దానవులతో యుద్ధమున కేగెను. శుంభుడు దేవిని తనను వివాహమాడుమని కోరగా, తనతో యుద్ధము చేసి గెలిచిన వానినే పెండ్లాడునని దేవి ప్రత్యుత్తరమిచ్చెను. అంత శుంభ నిశుంభులు ఆమెతో తలపడి మరణించిరి.

రక్తబీజుడు - ఇతడు శుంభుని సేనాధిపతి. వాని పనుపున దేవితో పోరాడి మరణించెను. అతని దేహమునుండి క్రింద పడిన నెత్తురు చుక్కల నుండి అసంఖ్యాకముగ రాక్షసులు పుట్టుచుండుటచే కాళి నాలుకలు చాచి, ఆ రక్త బిందువులను క్రింద పడనీయక త్రాగుచుండగా, దేవి ఆతనిని సంహరించినది. జీవులలో గల ఆశకు ఇతడు సంకేతము. ఒక ఆశ నశింపగా మఱొక క్రొత్త కోరిక చూపట్టుట వంటిది.

చం॥ *శివ నయనోజ్జ్వల జ్వలన శీర్ణ శరీరు సుమాస్త్రునిం బున*
*ర్భవునిగ జేసి, స్త్రీ పురుష భావ సమైక్యము గూర్చుచుంటివో?*
*భవముల ద్రెంచు చుంటివో? కృపామతి నార్తుల బ్రోచుచుంటివో?*
*శివమిథునైక రూపమున చిత్సుఖ లీలల దేలుచుంటివో?* 28

అమ్మా! ముక్కంటి కంటి మంటచే బూడిద అయిన మన్మథుని బ్రదికించుచుంటివా? స్త్రీ పురుషులకు అన్యోన్యము భావైక్యము

గూర్చుచుంటివా? లేక, నీ భక్తుల జన్మబంధములను త్రెంచుచుంటివా? దయతో ఆర్తులను రక్షించుచుంటివా? లేక అద్వయ మిథున రూపమున, చిదానంద లీలల దేలుచుంటివా?

మన్మథుని పునర్జన్మ వృత్తాంతము అందఱికి తెలిసినదే. మన్మథుడు గొప్ప దేవీభక్తుడు కావున, పరాశక్తి అనుగ్రహమును పొంది, అద్వితీయమైన శక్తితో స్త్రీ పురుషుల కలుపుచున్నాడు. స్త్రీ పురుషులకు భావ సమైక్యము లేనిచో సృష్టి యుండదు కనుక, సృష్టికారిణియైన జగన్మాత వారలకు మమతాను బంధము కూర్చుట సహజము. శివమిథునైక రూప మనగా శివా శివాఖ్యలు గల పార్వతీ పరమేశ్వరుల సామరస్యము. దీనిని అద్వయ మిథున మందురు. ఇదే అర్ధనారీశ్వర తత్వము. ఇందలి అనుభవము చిదానందమే కాని, అన్యము కాదు.

*"శివస్యచ శివాయశ్చ సామ్యం చైతన్యభావతః*
*యథాశివ స్తథాదేవి యథాదేవీ తథాశివః*
*నానయో రంతరం విద్యాత్ చంద్ర చంద్రికయోరివ"* ॥

శివశక్తుల సామ్యము స్వభావ సిద్ధమైనది. శివుడెట్లో అట్లే దేవియు, దేవి యెట్లో అట్లే శివుడు కూడ ఉందురు. చంద్రుడు చంద్రిక వలె వారి మధ్య అంతరము లేదు. ఇరువురి యందును ప్రపంచము నధిష్ఠించి యుండుట, సృష్టి స్థితి సంహార తిరోధాన అనుగ్రహ కార్యము లుండుట, ఏక విధాపస్థలుండుట, ఏకాహ్వాయము (ఒకే పేరు), ఏకరూపము (ఒకే రూపము) ఉండుట వలన పంచవిధ సామరస్యములు సిద్ధించినవి.

*"క్రియా వస్థా రూపం ప్రకృతి రభిధా పంచక సమం*
*తదేషాం సామ్యం స్యాదపనిషు చ యో వేత్తి స మునిః॥ "*
— శ్రీ గౌడపాదాచార్యులవారి సుభగోదయం (39వ శ్లోకోత్తర భాగం).

అర్ధనారీశ్వర వివరణ 86, 94, 96, 98, 118 పద్యముల కడ మఱికొంత చూడవచ్చును. "శివ శక్త్యైక్యరూపిణీ" (ల.స.నా)

శివుడు - త్రిగుణాతీతమగు శుద్ధతత్వ స్వరూపుడు. "నిస్త్రైగుణ్యతయా శుద్ధ తత్వాత్ శివః" ॥ "శుద్ధ బుద్ధ ముక్త స్వరూపం శివతత్వమ్" "సృష్టి స్థితి కర్త్రీ శక్తిః"

శా॥ *లోకాలోకన కాంక్ష నీ విభుని గాలుం గూడి యెందేగితో?*
*నీకై కూర్చిన భక్త మానస పసీ నిస్తుల్య కేళీగృహ*

*ప్రాకారాదుల జూచుచున్ మఱచితో రాగిల్లి? స్తోత్రాంచితం*
*బాకర్ణించుచు గాన లోలువ మతిన్ హర్షంబునం దుంటివో?* 29

లోకముల చూడవలె ననెడి కోరికతో కాలస్వరూపుడైన నీ పతివెంట ఎచ్చటి కేగితివో? భక్తుల మనస్సు లనెడి ఉపవనములందు నీకొఱకు నిర్మించిన కేళీగృహ ప్రాకారాదులను చూచుచు మఱచితివా? లేక భక్తులు నిన్ను స్తుతించుచుండ వినుచు ఆ గాన మాధుర్యమునకు ఆనందించుచుంటివా?

"కలనాత్ సర్వ భూతానాం మహాకాలః ప్రకీర్తితః" - శక్తి సంగమ తంత్రము (4-31) సర్వ భూత లయ కారకు డగుటచే అతడు మహాకాలుడు. ఇంకను కాలస్వరూపుడు. భూత భవిష్య ద్వర్తమానములు కాలమందలి భాగములు మాత్రమే. మహాకాలుడు పరమేశ్వరుడే.

శ్రీదేవి సామప్రియ-స్వరమయి-స్తోత్రప్రియ-గానలోలువ -(ల.స.నా.)

ఉ॥ *చూచితి స్నిగ్ధ సుందర విశుద్ధ శిలాప్రతిమల్ త్వదీయముల్,*
*చూచితి నింద్రనీల సమ సుందర కాంతి ఝురీ విలాసముల్*
*పూచిన తత్కళా విభవ పూర్తతలం గనులార ; నెంతయే*
*జూచితి జీవమానమగు శోభ వెలుంగు బహు స్వరూపముల్॥* 30

అమ్మా! నీ పున్నామని నునుపు దేలి సుందరములయిన పాలరాతి విగ్రములను చూచితిని. ఇంద్రనీల కాంతులతో సరితూగు కాంతి ప్రవాహపు విలాసము లొలికించు కళాపరిణతిని చక్కగా పరిశీలించితిని. జీవకళ లుట్టిపడు అనేక ప్రతిమలను చూచితిని.

ఎక్కడేమున్నదో అని చూచుట మానవుని ఆత్మాన్వేషణలో భాగమగుచున్నది.

మ॥ *ఒకచో భీకర కాళికా వపుషవై, యొండొక్కచో దుర్గవై*
*యొకచో జ్ఞానసుమాఖ్యవై, భ్రమరవై, యుద్యత్ప్రభన్ మూకవై*
*యొకచో శారదవై, నముద్రనుతవయ్యున్, జోగివై, కన్యవై*
*యొకచో నొక్కొక రీతి దోచు భవదీయోద్యోగముల్ నూచితిన్ ॥* 31

ఒకచోట (కలకత్తాలో) భయంకరమైన కాళికా రూపమునను మఱొక్క యెడ (విజయవాడలో) కనకదుర్గా రూపమునను ఉన్నావు. శ్రీకాళహస్తి

యందు జ్ఞానప్రసూనాంబవై, శ్రీశైలమున భ్రమరాంబవై, కొల్లూరున (కర్ణాటకము) మూకాంబవై, కాశ్మీరమున శారదాదేవివై, కొల్హాపురమున మహాలక్ష్మివై, కన్యాకుమారమున కన్యవై ఉన్న నీ యుద్యోగముల చూచితిని.

*"కాల సంగ్రహనాత్ కాళీ సర్వేషా మాది రూపిణీ*
*కాలత్వా దాది భూతత్వా దాద్యా కాళీతి గీయతే"* ||

— మహానిర్వాణ తంత్రము (4-32)

కాలమును లయింపజేయునది కనుక కాళి అనియు, కాలస్వరూపిణి యైనందునను ఆదిభూత మయినందునను, ఆద్య అనియు భావము. సృష్టికి పూర్వముండిన అంధకారమునే మహాకాళీ స్వరూపముగ అన్వయింప వచ్చునని కాళీ నామమును మహానిర్వాణ తంత్రము వివరించుచున్నది.

"SHE WHO COMMUNES WITH MAHAKALA, THE ABSOLUTE IS KALI, THAT WHICH SPORTS WITH KALA IS KALI. SHE IS THE PRIMAL ENERGY" - THE GOSPEL OF SRI RAMA KRISHNA. పరతత్త్వమైన మహాకాలునితో సన్నిహితతత్త్వము కలది కాళి. కాలునితో క్రీడించునది కాళి. ఆమె ఆదిశక్తి.

చం|| *ఉలి మొన చెక్కు నొక్కుల సముజ్జ్వలమై, కమనీయ శిల్పనా*
*విలసితమై, మనోజ్ఞమయి, విశ్రుతమై, రససిద్ధి గూర్చు న*
*క్కళలకు నాలవాలములుగా గననయ్యెడి మందిరంబుల*
*న్వెలసిన త్వత్స్వరూప పరివీక్షణ గూర్పదు తృప్తి నా మదిన్||* 32

ఉలి మొనతో చెక్కగా ఏర్పడిన నొక్కులతో నిగ్గుదేలి మనోజ్ఞమయిన శిల్పముతో ప్రసిద్ధి వహించి, ఆనందమును చేకూర్చుచు, కళలకు నెలవులై నిల్చిన మందిరములలో, నీ ప్రతిరూపములను చూచితిని కాని, అవి నా మనస్సునకు తృప్తి నీయ లేక పోయినవి. కారణము క్రింది పద్యమున తెలుపబడినది.

ఉ|| *స్పంద మనోజ్ఞమై త్రిగుణ భానురమైన త్వదీయ మూర్తి నా*
*మందర మందిర ప్రతిమ చూప సమర్థము కాదు, తల్లి! నీ*
*చంద మెఱుంగ నీకె తగు, చాలదు మానవ మేధ, యైన నీ*
*యందెల మ్రోతల న్వినగ హంసలు దీర్ఘ తపంబు సేయవా!* 33

స్పందనమువలన సుందరమై, త్రిగుణములతో ప్రకాశించు నీ రూపమును, ఆ మందిరమునందలి సుందర ప్రతిమ చూప జాలదు. అమ్మా! నీ విధము నీకే తెలియును కాని మానవుని బుద్ధి కందదు. ఏమైనను నీ పాద మంజీరముల మ్రోతల వినుటకే హంసలు సుదీర్ఘమయిన తపము చేయుచున్నవి కదా!

విగ్రహములు అచలములు నిర్జీవములు కనుక ఎంత చక్కగా చెక్కినను, వానిలో స్పందనము రాదు. అసలు సౌందర్య మంతయు, స్పందనమందే కలదు. స్పందన రూపమున నున్న పరానాదమును (పరాశక్తిని) ప్రతిమలు వ్యక్తము చేయ లేవు.

హంస - ఈ శబ్దమునకు జీవుడు, పరమాత్మ, ఒక పక్షి అని అర్థములు. పరమహంసలైన యోగులు యోగాభ్యాసమున కుండలినీ గమనమున వినియెడి దశవిధ నాదములలో గజ్జెల మ్రోత యొకటి. పరమేశ్వరి "పరా పశ్యంతీ మధ్యమా వైఖరీ రూప - నాదరూప - నాదమయి - నాద బ్రహ్మస్వరూపిణి" కదా!

తత్త్వాన్వేషణలో విఫలుడైన మానవుని విలపనము క్రింది పద్యములో వర్ణింపబడినది.

ఉ॥ *ఇక్కడ నన్ను నిల్పి యెట కేగితివమ్మ! వ్యామోహ శృంఖలం*
*జిక్కితి, సృక్కితిం దురిత సింధువునం బడి, నాదు శక్తికిన్*
*మిక్కుటమై యవిద్య గడి మించగ జూచుచు నూరకుంటి, నా*
*మ్రొక్కు పరిగ్రహించి పరిపూర్ణ దయామతి నుద్ధరింపవే॥* 34

అమ్మా! నన్నిచట నిలిపి నీ వెక్కడి కేగితివి? నేను వ్యామోహమనెడి గొలుసులతో కట్టబడి, పాపమనెడి సముద్రమున మునిగి, శ్రమ పడుచున్నాను. నా శక్తికి మించి అవిద్య (అజ్ఞానము) విజృంభింపగా, నే నేమి చేయ జాలక ఊరకున్నాను. నా వందనమును స్వీకరించి దయతో నన్నుద్ధరింపుము.

సాత్త్వికమైనది మాయ. గుణములచే మలినమైనది అవిద్య. స్థూలముగ రెండిటిని మాయ అని వ్యవహరింతురు. మాయ ఈశ్వరుని, అవిద్య జీవుని, ఆవరించియున్నవి. "సత్త్వ శుద్ధ్యవిశుద్ధిభ్యాం మాయాఽ విద్యే చ తే మతే"

"అవిద్యేతి చ మాయేతి ప్రకృతిర్మూలకారణమ్" - వేదాంతపంచదశి.

చం॥ జననివి నీవు, లోకముల చాలుల నీ కడగంటి చూడ్కులన్
మనుగగ జేయవో కరుణ పొంగి స్రవింప ; నయాచితంబుగా
దనయుడు మాతృ గర్భమున దాగి శరీరము దాల్చునాడె, ఆ
మనికికి రక్షణం బిడెడి మాత, కుమారుని సేమ మెంచదే॥ 35

నీవు తల్లివి. దయ పొంగి పొరల నీ కడగంటి చూడ్కులతో లోకములను ముంచుచుందువు. తల్లి గర్భమున బిడ్డ కనిపింపకయే శరీర మేర్పఱచుకొనునపుడు ఆయాచితముగా ఆ శిశుజీవనమునకు రక్షణయు పోషణయు చేకూర్చు తల్లి, కుమారుని క్షేమము కోరకుండునా? అట్లే న న్నిపుడు రక్షింపుము.

"దేవీహ్యేకాగ్ర ఆసీత్ సైవ జగదండ మసృజత" తొలుత దేవియే యుండెను. ఆమెయే జగమును సృష్టించెనని బహ్వృచోపనిషత్". ఆమె అనుగ్రహింపవలెనే కాని జీవుని బంధములు తొలగుటెంత? పరమేశ్వరి "జగతీకంద - జగద్ధాత్రి - అనేకకోటి బ్రహ్మాండజనని - ఆ బ్రహ్మకీటకజనని విశ్వమాత - అవ్యాజ కరుణామూర్తి" (ల.స.నా.)

ఉ॥ తాపము పాపమో యెఱుగ, శాంతి విదూర సుదూర యాత్రలో
దాప మొకండె దక్కినది, తావక శీతల దృక్ప్రసార ని
ర్వాపు వొనర్చి, నేడు పరితాపమునం గృశియించు నన్ను నీ
ప్రాపున నిల్పి తోడగుము భార్గవి! గమ్యము చేరునంతకున్॥ 36

ఓ తేజస్స్వరూపిణీ! శాంతికి దూరమైన ఈ దూర ప్రయాణములో అనేక జన్మముల నుండి నాకు తాపమే మిగులుచు వచ్చినది. ఈ పరిస్థితి నా కెవరైన ఇచ్చిన శాపమువలన కలిగినదో, పూర్వజన్మమున నే నొర్చిన పాపమువలననే కలిగినదో నాకు తెలియదు. నీ చల్లని చూపుల ప్రసరింప జేసి నా తాపమును తొలగించి, పశ్చాత్తాపముతో కృశించుచున్న నాకు రక్షణ గూర్చి, నేను గమ్యము చేరువఱకు నాకు తోడగుము.

మోక్షముకొఱకు అనేక జన్మములనుండి చేయు యాత్ర కంటె దూరమైనది లేదు. అది తాపత్రయములతో కూడినది. ఆధ్యాత్మిక ఆధిభౌతిక ఆధిదైవికములయిన బాధలకు తాపత్రయమని పేరు. మనస్సునకు నొప్పి కలిగించు ఆధులును శరీరమునకు బాధను గూర్చు వ్యాధులును ఆధ్యాత్మిక తాపము లనబడును. భూతములవలన (క్రూరజంతువులు మొ.) కలుగు ఉపద్రవములు ఆధిభౌతిక తాపములు. కఱవులు కాటకములు భూతప్రేత పిశాచాదులవలన కలుగు బాధలు ఆధిదైవికములు.

జగన్మాత "తాప త్రయాగ్ని సంపత్త సమాహ్లాదన చంద్రిక" - (ల.స.నా.)

ఉ|| *పుట్టెడి వేళ, కాలమయి పోయెడి వేళ, సధర్మవృత్తిలో*
*మెట్టెడి వేళ, ధర్మమున మేల్కొను వేళ, నిరాశ నెవ్వాగం*
*గట్టెడి వేళ, గష్టముల గాంచెడి వేళ, సుఖాల దేలి చూ*
*పట్టెడి వేళ, నన్యు లటు పాయక నిల్తువు నీ వొకర్తవే ||* 37

ఈ లోకమున ప్రవేశించునపుడు, లోకమునుండి మఱలి పోవునపుడు, అధర్మముగ ప్రవర్తించు నపుడు, మఱచిన ధర్మమును తిరిగి అనుష్ఠించునపుడు, నిరాశతో బాధపడునపుడు, కష్టాలలో నున్నపుడు, సుఖాల ననుభవించునపుడు, ఇతరుల వలె గాక, అన్ని వేళల నీ వొక్క దానివే (నా) వెంట నుందువు. న న్నెపుడు వీడవు.

వీడకుండుటకు జీవాత్మ పరమాత్మల అభిన్నత్వమే కారణము.

చం|| *ఎఱుగ నొకింత యే నెచటి కేగుచు నీ యెడ నాగిపోయితో!*
*ఎఱుగను సంసృతిం దవిలి యివ్విధి చక్రపరిభ్రమంబులన్*
*మఱి మఱి వచ్చిపోయెడి ప్రమాదము సైతము; కాలవాహినిం*
*బఱచు గుళాంకురం బటుల వర్తిలుచుంటిని, విశ్వసాక్షిణీ ||* 38

నే నెచటి కేగుచు ఈ లోకమున కాలు మోపి ఆగిపోయితినో నాకు తెలియదు. సంసారమున బడి చావు పుట్టువుల వలయమున ఈ విధముగా రాక పోకలు సాగింపవలసి యుండు ననెడి ప్రమాదము కూడ నాకు తెలియదు. కాల ప్రవాహములో కొట్టుకొని పోయెడి దర్భ పుడక వలె ఉన్నాను.

పరమేశ్వరి కాల రూపిణి, కాల ప్రవాహము ఆగి పోయెడిది కాదు. ఆరిపోవునదియు కాదు. ఇందులో అపవిత్రత, పవిత్రత, ఆవేశము, ఆర్భాటము, ఆవేదన, ఆనందము, నిస్పృహ, నిర్లక్ష్యము ఇట్లెన్నెన్నో మనః ప్రవృత్తులు ప్రతిబింబించు ఘటికలు, సందర్భములు, తరంగములుగా లేచి పడుచు, ఒకప్పుడు వ్యక్తముగను, ఒకప్పుడు అవ్యక్తముగను, మఱొకప్పుడు వ్యక్తావ్యక్తముగను ఉండునే కాని, ప్రవాహమును వీడి ఎక్కడికి పోవు. ఈ అనంత వాహినిలో జీవుడొక దర్భపుడక వలె ఉన్నాడు. ఈ దర్భ ఎన్ని అపవిత్ర స్థలముల స్పృశించినదో! అయినను సహజమైన తన పవిత్రతను కోల్పోవుట లేదు. అట్లే జీవుడును.

జీవుడు ఉపాధి భేదమువలన పవిత్రుడు అపవిత్రుడు, ఉన్నతుడు నతుడుగా తోచినను, సహజముగ పరమాత్మ వలె పవిత్రుడే. నిజమునకు అవిద్యచే ఆవరింపబడిన ఆత్మయే జీవాత్మ కదా!

మ॥ *అపురూపంబుగ జావు పుట్టువుల మధ్యం దోచు తద్దేహళీ*
*విపరీత స్థితి దాటు నాడయిన నే వీక్షింపనే లేదు ని;*
*న్నపు డే దేహముతోడ నాడితినొ, నేడా సంస్మృతుల్ వోయె ; నం*
*గ్రపకుం బ్రోడగదమ్మ విశ్వసృజన క్రీడా విశేషోజ్జ్వలా ॥* 39

ఓ జగన్మాతా! చావు పుట్టువుల గలువుచు అపురూపముగ కన్పించు ద్వారమును దాటు నాడయినను నిన్ను చూడలేదు. అపుడు నే నేదేహముతో ఆడితినో, ఇపుడా జ్ఞాపకములు లేవు. ప్రపంచ సృష్టి అనెడి క్రీడా విశేషముచే మిక్కిలి ప్రకాశించుచున్న తల్లీ! నికృష్టుడ నగు నన్ను దయజూడుము.

నిజమునకు జనన మరణముల కలిపెడి ద్వారము అపురూపమయినది. అది జీవితమున రెండు మార్గులే తెఱచుకొనును - పుట్టినపుడు, గిట్టినపుడు. నేను జీవించినంతకాలము నిన్ను చూడ లేక పోయినను, తనువు చాలించి క్రొత్త జీవితమును ప్రారంభించు నవుడైనను నిన్ను దర్శింప లేదు. నా దృష్టి వేషములందే కాని వేషధారణ చేయించు నీ మీద పడక పోవుట వింతగ నున్నది.

ఉ॥ *నే నొక వాహినీజనిత నిర్మల వీచికనై, త్వదీయ వి*
*జ్ఞాన మెఱుంగ ముందునకు సాగియు, భ్రాంతి జనింప సత్యము*
*న్గానక, పంకమం దఱగి, కాశ సమాహృత మానసుండనై*
*పూనిన దీక్ష మాని, విరబూచిన లౌకికమందు నిల్చితిన్ ॥* 40

నేను నదిలో లేచెడి నిర్మలమయిన తరంగము వలె, నీ విజ్ఞానమును గ్రహించు తలపుతో బయలు వెడలితిని. కాని నా మనస్సు భ్రాంతి చెందుటచే, సత్యమును గ్రహింప లేక, విషయ సుఖము లనెడి బురదలో పడి, తీరమందలి ఔల్లుపూవులచే ఆకర్షితుడనై, వివేకమును కోల్పోయి దీక్షను విరమించి, ఐహికములందే నిలిచియున్నాను.

లోకమున సహజముగ ప్రతి వ్యక్తియు ధర్మము తప్పక వర్తించుచు, జన్మము సార్థకము చేసికొన వలె ననియే యత్నించుచుండును. కాని వాని ప్రారబ్ధము వానికి విపరీత బుద్ధులను వ్యామోహములను కలిగించు చుండును.

అవకాశము దొఱకినపుడెల్ల విషయ వాంఛలు వాని నాక్రమించుచుండును. ఏ యదృష్టవంతుడో కాని ప్రారబ్ధమునుండి తప్పించుకొనలేదు.

తరంగమునకు ఏదో ఒక స్థితియందు పంకము (బురద) తోడి సాంగత్య ముండక తప్పదు. అయినను దాని జన్మము నిర్మలమయిన నీటి నుండి కలిగినదే. కొన్ని అలలు బురదయందే ఇంకిపోవును. అట్లే ఆత్మనుండి పై కుబికిన జిజ్ఞాన అనేకులలో అవిద్యారూపమయిన సంసార పంకమున నిలిచి నశించుచుండుట మన అనుభవములో నున్నదే. ఇందుకు ప్రారబ్ధమే కారణమనవలెను.

చం॥ *తనువు ధరించి, జీవితపు దారుల వెంట బరాజయంబులం*
*గనుచు, ననుక్షణంబు జయకాంక్ష నశింపమి మోహరించియున్*
*మనసు జయింపలేక యవమానము పాలయి క్రుంగిపోతి ; ఏ*
*మని నిను జేర దీ యవజయాంకములం గొని, వీరసేవితా ॥* 41

నేను శరీరమును దాల్చి జీవన మార్గములలో అనుక్షణము ఓడిపోవుచు, ఎట్లైనను జయింపవలె ననెడి కోరిక నశింపనందున, ఎదిరించి మనస్సును జయింపలేక అవమానముల పాలయి క్రుంగిపోయితిని. ఈ అపజయ సూచక చిహ్నములతో (TROPHIES), ప్రలోభములకు చలింపక ధైర్యమును వీడక యుండెడి వీరులచే సేవింపబడుచున్న ని న్నెట్లు చేరగలను? కనుక నీవే నన్ను చేరదీసికొమ్మని ప్రార్థన.

వీరులు - అవిద్య అహంకారము అరిషడ్వర్గమును జయించినవారు. "వీరా - వీర గోష్ఠి ప్రియా - వీరారాధ్యా - జయత్సేనా - ధీరా - ధీరసమర్చితా - విజయా" (ల.స.నా.) ఇత్యాది నామములు గలది పరమేశ్వరి. కనుక ఆమెను చేరుట అందఱికి సాధ్యము కాదు. కాని భక్తివలన సాధ్యము కానిది లేదు.

శా॥ *నీకై కూర్చితి భిన్నభావరస సాంద్రీభూత గీతంబులన్*
*నీకై నిల్చితి జీవనామృతదళా నిర్ణీత పుష్పాంజలిన్*
*నీకై చూచితి దిక్కు లంతములుగా నిర్నిద్ర రేయింబవల్*
*నీకై వేచితి నన్నివేళలను నందీపించు భక్త్యున్నతిన్ ॥* 42

అమ్మా! నీవు కనిపించినచో నీకు వినిపింపవలె నని వివిధ భావములతో రసములతో చిక్కనై మెత్తనైన గీతముల రచించి యుంచితిని. నీకొఱకు నా జీవితపు మధుర ఘట్టములతో నిర్ణయింపబడిన పుష్పాంజలి పట్టి నిల్చితిని.

నిద్రమాని దిగంతముల దాక నీకొఱకు వెదకి వేసారితిని. భక్తి పెల్లుబుకగా అన్ని వేళల నీకొఱకే వేచియున్నాను.

ఉ॥ *ఐనను తావకాంఘ్రి నలినాదృత భూషణ రత్న కింకిణీ*
*ధ్వానము వీనులం బడదు ; త్వన్ముఖదీప్తియు గాన రాదు ; మ*
*న్మానస సారసంబు రుచిమంతము కాదు ; తలంపు తీవ్రమై*
*మానదు నీదు దర్శన సమాహిత కాంక్ష ; నెడంద మూల్గెడిన్* ॥ 43

కాని నీ పాద పద్మములచే ఆదరింపబడిన రత్నాభరణముల చిఱు మువ్వల మ్రోత నా చెవులకు తగులనే లేదు. నా మనస్సనియెడి కమలము కాంతిమంతము కాలేదు. నా భావము మాత్రము తీవ్రమై నసిపోలేదు. నా హృదయము నిన్ను చూడవలె ననెడి గాఢమగు కోరికతో మూలుగుచున్నది.

మ॥ *ప్రతి పాదధ్వని నీదిగా దలచి మద్ద్వారంబున న్నిల్చితిం ;*
*ప్రతి కంఠస్వరమున్ త్వదీయమని సంభావించి పర్వెత్తితిం ;*
*ప్రతి రూపోద్గతమైన ఛాయ గని నీదై యుండు నం చెంచితిం ;*
*ప్రతి పర్యాయము వంచితుండనయి యశ్రువ్రాతము న్నించితిన్* ॥ 44

ఏ పదముల సవ్వడి వినిపించినను, అది నీదై యుండునని నా ద్వారము దగ్గరే కాచుకొని యుంటిని. ఏ కంఠస్వరము ధ్వనించినను నీదను భావముతో పరుగులిడితిని. ఏ రూపమునకు చెందిన నీడ కనిపించినను, నీదే అయియుండునని భావించితిని. ప్రతి పర్యాయము మోసపోయి కన్నులలో నీరు నింపుకొనుటే నాకు దక్కినది.

జీవు డాత్మ గవేషణలో పడిన శ్రమ, పొందిన నిరాశ, భావింపబడినది.

ఉ॥ *ప్రాకృతు పోలె ని ట్లెడద భారము దీరగ, నేడ్చి యేడ్చి, న*
*వ్యాకృతి తోడ నే వికృతి నైతిని, నా బ్రదుకొక్క గీతమై*
*వ్యాకృతి నెట్టులైన, గుణ భావ వినష్టము గాక వేదనా*
*స్వీకృతి నిల్చె శోకరస విస్తృతమై, భవదంకితంబుగా* ॥ 45

పామరుని వలె నా గుండె బరువు తీరుపఱకు ఏడ్చి యేడ్చి ప్రసన్నతను కోల్పోయి, క్రొత్త రూపమును సంతరించుకొంటిని. విశిష్టమయిన రూపము లేకున్నను గుణములను భావములను వినర్జింపక నా బ్రదుకు ఒక గీతముగ మారి కష్టములనే స్వీకరించినది. ఇందు తోచునది శోకమే. ఇది నీకే అంకితము.

నిరాశ వెన్నంటి యుండునది శోకమే కదా! విలపనమున హృదయము ఆర్ద్రమై భావము సునిశిత మగునని ధ్వని.

చం॥ *ప్రకటిత వాక్ప్రసారము భవత్కలనాద ధునీ తరంగమై,*
*వికసిత కీర్తి త్వ త్కచ సవిస్తర సుందర పుష్పహానమై,*
*వికృత విషాద వేదనలు వేనలి జారెడి పూలరేకులై,*
*సుకమున నీదు హాసమును, శోకమునన్ దరహాస మొప్పెడిన్॥* 46

వ్యక్తమయిన నా వాక్ప్రసారము నీ అవ్యక్త మధురమైన నాద ప్రవంతిలో ఒక తరంగమైనది. నాకు లభించిన ప్రతిష్ఠ నీ కొప్పు నలంకరించిన సుందర పుష్పవితానమే. నా జీవితమున రోత కలిగించిన విషాద ఘట్టములు నీ జడనుండి రాలివడిన పూలరేకులు మాత్రమే. ఇట్లు సుఖమందు నీ నగవు, దుఃఖమందు నీ చిఱునగవే నాకు కన్పించుచున్నవి.

ఉ॥ *మోయగ లేని భారముగ మూపున వార్ధక మెక్కి త్రొక్క గ*
*న్మాయక గోప బాల చరణోద్ధత తాండవ లీల జూచితిన్*
*హాయికి దూరమైన తుది యంకమున న్నటియించు వేళ గం*
*దోయిని మూయు గ్రొందెరల ద్రోచి కళా విభవంబ గాంచితిన్॥* 47

మోయలేని బరువుగా నా బుజముల నెక్కి త్రొక్కు ముసలితనము, బాధకు మారు, శ్రీకృష్ణుడు కాళీయుని శిరమున తాండవమాడిన నాటి స్థితిని చూపినది. సుఖమునకు నోచక జీవితపు తుది అంకమున నటించునపుడు నేత్రావరోధముగా నిలిచిన క్రొత్త తెరలను (కంటి పొరలను) ప్రక్కకు నెట్టి, అంతర్గత కళావైశిష్ట్యమునే కనుగొంటిని.

చం॥ *గళమున వాతము న్గఫము గ్రమ్ముచు నూపిరి నల్పనీని యా*
*యలనత, తావకీన చరణాద్భుత ఘట్టనగా దలంతు, నా*
*వలికెడి పల్కులందు దడబాటును, మేన వణంకు, గన్నులం*
*దులుకును, నీదు నీల కుటిలోజ్జ్వల కుంతల చాలనంబయో॥* 48

గొంతు కడ్డముగ కఫము వాతము క్రమ్ముకొని శ్వాస యాడని పరిస్థితి కలిగినచో, దానిని మహాద్భుతమైన నీ పాదముల త్రొక్కిడిగా తలచెదను. మరణ సమయమున కలుగు మాటల తడబాటును శరీరపు వణకును, చూపులలో భయమును వంపులు తిరిగిన నీ నల్లని కేశముల కదలికయే అగును.

ఉలుకు = భయము "ద్వితీయాద్వై భయం భవతి" బృహ. 1-4-2. రెండవ వస్తువు ఉన్నపుడే భయము కలుగును. మృత్యువు కనిపించినపుడు భయము కలిగి, అది కన్నులలో ప్రతి ఫలించును. మాటలలో తడబాటు, శరీరమున వణకును ప్రారంభమగును.

చం॥ *తను విక ద్వేష్య మెట్లగు? ప్రధానము దాని ధరించుటం గదా*
*యనుభవముల్ విచార్యములు నద్భుతముల్ గ్రహియింవ నేర్చు, నీ*
*జనన లయాదులం దవులు, శాశ్వత తత్త్వ విచార వైఖరిం*
*గనుగొను, 'నీవు-నే ననెడి కారణ కార్యము లిజ్జగంబునన్*॥ 49

ఇక శరీరము ద్వేషింప దగినది కాదు. పరమాత్మ సహితము దానిని (ఆవరణమును) ధరించుటవలననే ఆలోచనల రేకెత్తించు నట్టివియు, ఆశ్చర్యమును గొలువు నట్టివియు అగు అనుభవముల గ్రహించుచున్నాడు. జనన మరణముల పొందుచున్నాడు. తత్త్వ విచారము చేసి నిత్యానిత్యమును గుర్తించి 'నీవు-నేను' అని కారణ కార్యముల తెలిసికొనుచున్నాడు.
ప్రధానము = పరమాత్మ, ప్రకృతి, బుద్ధి.

"దేహం వినా కించిదస్యాత్ దేహోయం సర్వసాధనం" ధర్మార్థ కామమోక్షానాం మూల సాధనం" దేహము లేనిచో ఏమియు లేదు. ఈ దేహమే సర్వసాధనము. ధర్మార్థ కామ మోక్షము లనెడి పురుషార్థముల సాధించుటకు మూలము దేహమే కదా!

ఉ॥ *సాధన మాత్రమో తనువు సాధ్యము గా దలపోయకున్న నే*
*బాధయు నుండ, దైన విడబాయదు కర్మ ఫలానుభుక్తి, నం*
*శోధన కోర్చు శక్తియు బ్రచోదన మీయవె, సంచితాదులం*
*గా దనలేముగా పుడమి గాయము ద్రెళ్లెడు దాక శర్మదా!* 50

నిన్ను చేరుట కుపకరణమైన ఈ దేహము, ధ్యేయము కాదనెడి సత్యమును గుర్తించినచో, శరీరము ధరించుటవలన బాధ లేదు. అయినను పురాకృత కర్మఫలము అనుభవింపక తప్పదు కనుక, పరీక్షకు ఓర్చుకొనెడి శక్తి నిచ్చి నడిపింపుము. భూమి మీద ఉన్నంత కాలము సంచితమును, ప్రారబ్ధమును కాదనలేము కదా!

"ప్రారబ్ధం బలవత్తరం ఖలు విదాం భోగేన తస్య క్షయం" - వివేక చూడామణి. "ప్రారబ్ధం భోగ్యతే నశ్యేత్" "అవశ్యమేవాను భోక్తవ్యం కృతం

కర్మ శుభాశుభమ్" - శ్రుతి. ప్రారబ్ధము శక్తిమంతమైనది. అనుభవమున కాని నశింపదు. చేసిన కర్మ శుభమైనను, అశుభమైనను తప్పక అనుభవింపవలసినదే అని భావము.

ఉ॥ *కాయము నీ వొసంగినది, కాలము నైతము త్వ త్ప్రసాదమే,*
*ధ్యేయము నిన్ను జేరుటయె, ఏమి ప్రయోజన మాన చేసితో*
*యీ యవతీర్ణ రూపమున, నింక త్వదాశయ సిద్ధిగూర్పకే*
*పాయను దీని, ఈ నహనభావమె మామక భాగధేయమౌ ॥* 51

అమ్మా! ఈ దేహము నీ విచ్చినదే. కాలము (ఆయువు) కూడ నీ అనుగ్రహఫలమే. నా ధ్యేయము నిన్ను చేరుటే అయినను, ఇట్లవతరించిన నా యీ దేహమువలన నీ వేప్రయోజన మాశించితివో, అది నెఱవేఱు దాక దీనిని విడువను. ఈ సహన భావమె నాకు నీ వొసగిన అదృష్టముగ భావించెదను.

చం॥ *నలువురు చేరి నంతనమునం జిఱునవ్వులు చిల్కరింపగా*
*వెలువడి లోకమం దడుగు వెట్టితి నేడ్చుచు నొక్కనాడు నే*
*దెలియక ; శోకతప్తులయి దీనముగా బరిదేవనంబులం*
*బలుకగ వారు, వచ్చెదను బంధము ద్రెంచి, త్వదాజ్ఞ యైనచో ॥* 52

పలువురు బంధువులు చేరి ఆనందించుచుండ, ఏమియు తెలియని స్థితిలో రోదించుచు ఒకప్పు డీలోకమున ప్రవేశించితిని. వారు దీనముగ వేదనతో వెక్కి వెక్కి ఏడ్చుచుండ, నీ వాజ్ఞాపించినచో ఇవుడే శరీర బంధమును త్రెంచికొని వచ్చెదను.

మ॥ *తలవన్నాడు పురాకృతంబులు తమంతం బోక నంస్కారమై*
*నిలుచున్ భావిగతి ప్రదర్శకములై, నిర్దిష్ట కార్యంబులై,*
*తొలగం ద్రోయగ రాని వౌననుచు ; ఎంతో కుందితి న్నేడు త*
*త్ఫల రూపానుభవంబు దుర్భరముగా ; ప్రారబ్ధసంధాయినీ!* 53

పూర్వ జన్మలో పూర్వ దేహముతో చేసిన కర్మలు, ఆ శరీరము వలెనే తాము నశింపక సంస్కారముల రూపమున నిలిచియుండు నని కాని, రాబోవు జన్మములలో జీవన మార్గముల నిర్దేశించు నని కాని, నిర్ణీతము లయిన వాని పనుల నవి చేసికొని పోవుచుండు నని కాని, అనుభవింపక తప్పించుకొన వీలగునవి కావు అనికాని, అనా డనుకొన లేదు. అమ్మా! ప్రారబ్ధముల

అనుభవింపజేయుచుందువు. ఇపుడు నేను వాని ఫలితముల దుర్భముగా అనుభవించుచు ఎంతో బాధ పడుచున్నాను.

పరమేశ్వరి భవచక్ర ప్రవర్తిని (ల.న.నా.) 'కర్మసాక్షిణి - కర్మఫలప్రద' కదా! (ల.త్రి.స్తో.)

ఉ॥ *ఏ తనువుం దలంచి పులకించితినో మును, తత్స్వరూప మే*
*ది? తనువౌచు దోచినది ; దీప్తి విశీర్ణములై కనీనికల్*
*రోతను గూర్చె జానుపెడి రూపము మార్పడ గంటి గుంటలం ;*
*దా తను సోయగంపు వలులందె ఫలించెడు నేడు కేశముల్* ॥ 54

పూర్వము ఏ శరీరమును చూచికొని ఆనందించితినో, ఆ స్వరూప మిపుడు లేదు. కృశించి పోయినది. కనుపాపలు కాంతి తగ్గి కంటి గుంటల లోతులలో పడి, అందమును కోల్పోయి, అనహ్యముగ మారినవి. దేహసౌందర్యాపాదకము లయిన నిమ్నోన్నతముల చాలులందే కేశములు పండిపోయినవి.

శరీరము పరిణామశీల మనియు, అశాశ్వత మనియు, అదే శాశ్వత మనుకొనుట అవివేక మనియు భావము.

ఉ॥ *మక్కువ తగ్గె దేహమున ; మారిన దృష్టి వివేక లేశమున్*
*బ్రక్కను బ్రక్క నా కరము పట్టుక తోకొని పోవుచుండ న*
*న్నెక్కడికో, యపూర్వముగ నేగుచు, నా శిథిలాధివానమున్*
*గ్రక్కున వీడలేక, నిను గాంచుదు, గాంతు మదార్జితంబులన్* ॥ 55

ఇపుడు శరీరముపై వ్యామోహము తగ్గి నా దృష్టియందు మార్పు వచ్చినది. కొంచెము వివేకము కూడ కలిగినది. ఈ దృష్టి మార్పు, వివేక లేశము రెండును, నా చేతులు పట్టుకొని న న్నెక్కడికో (నీ యొద్దకు) అపూర్వముగ తీసికొని పోవుచుండ, ఇట నా పాడువడిన నివానమును (దేహమును) వీడ లేక, నీ సాన్నిధ్య భాగ్యమును వదలుకొన లేక, మాటి మాటికి ని న్నొకమారు, నా ఆర్జితముల నొకమారు చూచుచు, నిలచితిని.

శా॥ *ఏదో లోపము లేక, జీవితమునం దేలా సుఖంబుండదం*
*చాదిత్సాదృత బుద్ధి నెట్టులొ రహస్యం బింత కన్గొంటి ; నౌ*
*నీదౌ సన్నిధి నుండకుండుటయె, కానే కాదు వేఱొండు ; త్వ*
*త్పాదాబ్జస్థితి గాక మర్త్యులకు సంప్రాప్తించునే సౌఖ్యముల్* ॥ 56

జీవితమున ఏదో లోపము లేకున్న సుఖ మేల యుండదని, దానిని తెలిసికొనవలెననెడి పట్టుదలతో శ్రమించి నేటి కెట్లో ఆ రహస్యమును కొంత గ్రహించితిని. అది నీ సన్నిధానమున నుండకుండుటయే కాని, వేరొండు కాదు. అమ్మా! నీ పాద పద్మములందు తప్ప జీవులకు సుఖమెందు లభించును? లభింపదని భావము.

శా॥ *ఆనా డింద్రియముల్ స్వకార్యముల జేయం గూడిరానప్పు, డీ*
*ప్రాణంబుల్ సహితంబు దా మువశమింపం జూచుచున్నప్పు, డె*
*ద్దానిన్ ధారణ సేయ లేక మది నిస్త్రాణంబు గన్నప్పు, డీ*
*మేన న్నిల్చిన నన్ను గన్గొనుము కూర్మిన్ ముక్తి నందాయినీ ॥* 57

ఆనాడు నా యింద్రియములు తమ తమ కార్యముల నిర్వహించుటకు సహకరింపనపుడు, నా ప్రాణములు సహితము శరీరమును వీడి మఱలిపోవుటకు ఉద్యమించునపుడు, దేనిని కూడ నిల్పుకొన లేక మనస్సు బలహీనమైనపుడు, ఈ దేహమందు నిల్చిన నన్ను ప్రేమతో చూడుము. బంధముల తొలగించి ముక్తి నిచ్చుదానవు నీవే కదా!

పరాశక్తి 'బంధమోచని - సంసారపంక నిర్మగ్న సముద్ధరణ పండిత - ముక్తిద - ముక్తిరూపిణి' - (ల.స.నా.)

ఉ॥ *కాలము కర్మ మేకమయి, కంఠగతుండగు జీవు నుద్ధతిన్*
*గాలము వైచి లాగికొని కాయము ద్రెళ్లగ జేయునాడు, త*
*న్మాల యుతంబుగా సహముపో గడు దైన్యము నొందునాడు, స*
*న్నేలగ రమ్ము ప్రేమమున నెచ్చట నున్న శుభప్రదాయినీ!* 58

శుభముల నిచ్చు తల్లివి. కాలము కర్మము కలిసి వచ్చి కంఠమున (విశుద్ధ చక్రమున) గల జీవుని బలవంతముగా, గాలముతో లాగినట్లు లాగివేసి, దేహపతనమునకు కారణమైన సమయమున, నా గర్వము మొదలంట నశించి, నే నెంతో దీనముగ కన్పించునపుడు, నీ వెక్కడ నున్నను ప్రేమతో నన్ను పాలించుటకు దయసేయుము.

ఉ॥ *వేదనతోడ నే మరణ వేళ మతి భ్రమణంబు గల్గి ని*
*న్నాదట సంస్మరింతునో, తదన్యమునం దలపూని యుందునో,*
*కాదన కీవ వచ్చి, యనుకంప దలిర్ప భవద్భృకార్తులం*
*దీ దయనీయు నిల్పి, భవహీన పథంబున స్వీకరింపవే ॥* 59

మరణ సమయమున బాధతో, మతిభ్రమించుటచే నిన్ను మనసార స్మరింతునో లేక ఇతర విషయములందే బుద్ధిని నిల్పుదునో! అద్దు చెప్పక ఆ సమయమున నీవే వచ్చి కనికరింపదగిన ధన్యులతో నన్ను కూడ నిలిపి, మోక్షమార్గమున స్వీకరింపుము.

అంత్యకాలమున జీవుని భావము (సంసక్తత) ఎట్టిదుండునో దాని కనురూపమైన శరీరము మఱు జన్మమున కలుగుచుండును. ఇందుకు జడభరతుని కథ నిదర్శనము.

*"యం యం వాపి స్మరన్ భావం త్యజ త్యన్తే కళేబరం।*
*తం తమే వైతి కౌన్తేయ! సదా సద్భావ భావితః ॥ భగవద్గీత (8-6)*
*"ఎవడేయే భావంబుల దవిలి స్మరించుచును తనువు త్యజియించునో, ని*
*శ్చ్యవముగ వాడాభావము లవలంబన జేసి పొందు నన్యభవంబున్"*
— నిర్వచన భగవద్గీతా యోగము

ఉ॥ *మృత్యుభయంబుగా, దయిన మేనును వీడుట కేదొ జంకు, సాం*
*గత్యము దీర్ఘమౌట దమకంబు నశింపదు, కాని వింతలై*
*నిత్య వినూత్న లోకములు నిల్చెదు నాకొఱ, కీవు సైత మం*
*దత్యనురక్తి లేనగవు లందము లొల్కగ నుందు వంబికా ॥* 60

అమ్మా! మృత్యువనిన భయపడి కాదు. కాని శరీరమును వదలుట కేదో సంకోచము. శరీరముతో సాంగత్యము చాల కాలమునుండి యుండుట వలన, దాని యెడ మమకారము పోవుట లేదు. అయినను క్రొత్త లోకములు నాకొఱ కెదురు చూచుచున్నవి. అచట నీవు కూడ అత్యంతాభిమానముతో అందాలు చిందు చిఱునవ్వులతో కనిపించుచున్నావు. లోకమాత 'సర్వగత - సర్వలోకేశి' కదా! (ల.స.నా.)

తమకంబు = దేహాభిమానము - మోహము. మోహమే మృత్యువు. మోహ మనగా ప్రమాదము లేక ఏమఱుపాటు. అసత్యమును సత్యముగా భావించుట ప్రమాదము. దేహమును ఆత్మగా, అనగా అశాశ్వతమైనదానిని శాశ్వతమైనదిగా భావించుట, శాశ్వతమైన ఆత్మను గుర్తింపక పోవుట పొరబాటు. "మోహో మృత్యుః సమ్మతోయం కవీనాం। ప్రమాదం వై మృత్యు మహం బ్రవీమి" - సనత్సుజాతీయం (1-4) అట్టి పొరబాటు వలననే మృత్యువు కలుగుచున్నది.

చం॥ *మలువులు ద్రిప్పి త్రిప్పి వినుమానముగా రచియింప నీవు, నీ*
*తలవులు నా శరీరమును దాల్చి విలక్షణ కావ్య మయ్యె, నే*
*వెలుగుల నీడల న్నిలిచి వేసరి, తింక ముగింపు నెట్లు నం*
*ధిల నొనరింతువో జనని! తీరము చేర్పవె యిప్ప డేనియున్* ॥ 61

అమ్మా! అనేకములయిన మలువులు (మెలికలు) త్రిప్పి ఆశ్చర్యకరముగ నీవు రచింప, నీ భావములు నా దేహరూపమును దాల్చి, ఒక విలక్షణ కావ్యమైనవి. నేను ఆ కావ్యమందలి వెలుగు నీడలలో (సుఖదుఃఖాలలో) నిలిచి విసిగి పోయితిని. ఇక నా కావ్యమునకు ముగింపు నెట్లీయ దలచితివో? ఇప్పుడైనను నన్నొక తీరమునకు చేర్పుము.

చం॥ *శిథిలములైన శక్తులను జేరిచి ని న్నుభజియింప లేను, నా*
*శిథిల కుటీరమందు నివసింతువు, తావక పూజనార్థమై*
*శిథిలము గాని నా మనసు చేయు విలాపము నాలకింపవో!*
*శిథిలములందె శాంతి బరిశీలన సేయుచు విశ్రమించెదన్* ॥ 62

ఉడిగిపోయిన నా శారీరక శక్తులను కొనరి కొనరి మణల నొకచో చేర్చి, ని న్నిపుడు సేవింపలేను. బిగువు నడలి వడిపోనున్న నా కుటీరములో నీ వున్నావు కదా! నీ పూజ కొఱకు ఇంకను శిథిలము గాక నిలిచియున్న నా మనసు పడు బాధను, చేయు విలాపమును వినలేదా? పోనిమ్ము. ఈ శిథిలములందే, అందఱిచే విడువబడి నద్దుమణగిన స్థితిలో నీ శాంతి రూపమును చూచుచు విశ్రమించెదను.

బడలి వృద్ధాప్యమున మేను పట్టు దప్పి, శ్రమకు నోర్వని స్థితియందు శాంతి గోరి, నేడు బలవంతముగ మది నిలుపలేక, నియమ నిష్ఠల పూజల నెఱపుకంటె, ఆ పరమేశ్వరి యొక్క శాంతరూపమును జ్ఞాన దృష్టితో చూచుచు విశ్రమించుట కూడ ఆ తల్లి సేవయే యగును. బాహ్యపూజ మానస శోధనకు, పవిత్రీకరణకు, చిత్తైకాగ్రత ఉపకరించునదే కాని అదే పరమావధి కాదు. కనుకనే 'అంతర్యాగ సమారాధ్యా బహిర్యాగసుదుర్లభా' అని ల.స.నా. వివరించు చున్నది.

శిథిల కుటీరము = వృద్ధాప్యమందలి శరీరము

చం॥ *జననము తోడ జీవులకు జావును గల్గు నటుం చెఱింగియున్*
*జను లదియేలనో మరణ నంస్మృతి నైతము భీ పహంబుగా*

*గనుగొనుచుందు ; రా మరణ కాంతి వితాన సరిత్తరంగ సం*
*జనిత మహానుమోదమున, సర్వము నవ్యము భవ్యమౌ గదా ||* 63

పుట్టుక ననుసరించి జీవులకు మరణము వచ్చు చుండునని తెలిసికూడ చావును స్మరించుటకు మానవులు భయపడు చుందురు. ఆ మరణకాంతి తరంగములు చేకూర్చు ఆనందములో సర్వము క్రొత్తగను, శుభమును గూర్చునదిగను, సత్యముగను, యోగ్యముగను తోచును.

"జాతస్యహి ధ్రువో మృత్యుః" పుట్టినది మరణించక తప్పదని గీతావాక్యము. భవ్యము = శుభము, శుభమైనది, సత్యమైనది, యోగ్యమైనది.

చం|| *బ్రదుకున మృత్యుదేవి సహవాసము గూర్చి, యగమ్య గమ్యము*
*న్వెదకెడి వేళ, మచ్ఛ్రమము విస్మృతి బావు దయార్ద్ర వీవు ; నీ*
*యెదుట మదీయ సంచితము లెల్ల సమర్పణ జేసి నిల్చితిం ;*
*బెదరని ధైర్య మిచ్చి పరిశిష్ట సమాప్తికి దారి జూపవే ||* 64

తెలియని గమ్యమును (జన్మరాహిత్యమును) వెదకు సమయమున, బ్రతుకుతోడుగా మృత్యుదేవతను పంపి, నా మార్గాయానమును మరణరూపమైన మఱపుతో తొలగించుచున్న దయారాశివి. ఇపుడు నీ యెదుట నా సంచితము లెల్ల కుప్పవోసి సమర్పించి నిలిచియున్నాను. నాకు ధైర్యస్థైర్యముల నిచ్చి, మిగిలి యున్న యాత్రానమాప్తికి త్రోవ జూపుము.

జన్మరాహిత్యము లేక మోక్షము అనేక జన్మముల ప్రయత్నమున కాని సాధ్యము కాదు. దాని కొఱకు చేయు యత్నము ఒక అనంత యాత్ర వంటిది. కాగా జన్మములో పడిన శ్రమనంతను మరణరూపమయిన మఱపుతో తొలగించి, క్రొత్త జన్మమున నూతనోత్సాహ మిచ్చునది ఆ పరాశక్తియే.

సంచితము = పూర్వజన్మములలో కర్మలు చేయుట ద్వారా దాచుకొనినది. అది మంచిదైనను చెడ్డదయినను అనుభవింపక తప్పదు. జన్మములు సంచితాదుల ననుభవించుట కేర్పడినవే కదా!

ఉ|| *నా తుది మాట నొక్కటి వినంగదె తావక దివ్య దీప్తిలో*
*నా తనువుం ద్యజించుచు ననంత సుఖస్థితి నుండ నెంతు ; నీ*
*వీ తరి గాదటన్న, భవదీప్సితమే యగుగాక తల్లి! ఆ*
*హూతుడనై లయాంతమున నుజ్జ్వల బిందువు నౌదు జిత్ప్రభన్ ||* 65

అమ్మా! నా చివరి మాట నొకటి వినుము. నా యీ శరీరమును త్యజించి, నీ దివ్య తేజస్సులో లీనమయి సుఖముగ నుండ గోరుదును. ఇందుకు నీ విపు డంగీకరింపకున్న, నీ యిష్టమే కానిమ్మా. లయాంతమువఱకు వేచియుండి పిలువబడి వచ్చి నీ జ్ఞానమయ కాంతి సముద్రమున అఖండమయిన మహోజ్జ్వల బిందువునై పోవుదును.

పరమేశ్వరుని యెడబాటు సహింప లేని జీవులు, ముందు ముందుగా ముక్తికొఱకు శ్రమపడుచుందురు. కాని కొంద రభాగ్యులు లౌకికములందే మునిగి తేలుచు మోక్షమునకు యత్నింపరు. అట్టి మూఢులను కూడ లయాంతమున పరమాత్మ తనలో చేర్చికొనక తప్పదు. అందాక జనన మరణ ప్రవాహమున కొట్టుకొని పోవుట దుర్భరమే యైనను, అది వారి కా తల్లి నిర్ణయించిన విధి కనుక, తప్పదు.

చిత్తు = సర్వస్వతంత్రమై విశ్వోత్పత్తికి కారణమైన పరమాత్మ యొక్క జ్ఞానమయమగు చైతన్యశక్తి.

మ॥ *తొలుతన్ లేదు, తదంతమం దయిన నుద్యోతింప, దీ మధ్యలో*
*గల వోలెం గనుపించి మాయమగు నీ కాయంబు నిత్యంబుగా*
*దలచున్ జీవుడు తత్త్వము న్దెలియు యత్నం బెంచ ; కీ మిథ్యలో*
*దలదాకం దిగిపోయి, జీవితము వ్యర్థంబై చనం జూచుచున్* ॥ 66

ఆరంభమున లేనిదియు, అంతమున కూడ కనిపింపనిదియు, ఈ మధ్యకాలమున కలలో వలె కనిపించి కరగి పోవునదియు, అయిన ఈ శరీరము నే నిత్యమని భావించి అనత్యమైన భ్రాంతిలో జీవుడు కూరుకొని పోయి, తనను తా నెఱుగుటకై దేవు డిచ్చిన నదవకాశము (జీవితము) వ్యర్థము కాగా, చూచుచు, శాశ్వతమైన నీ తత్త్వమును తెలిసికొను యత్నమును చేయుట లేదు.

"అంతవంత ఇమేదేహా నిత్యస్యోక్తా శ్శరీరిణః" - భగవద్గీత (2-18)

ఈ దేహములు అంతము (నాశము) కలిగినవి. శరీరధారియైన ఆత్మ నిత్యమైనది.

*"అవ్యక్తా దీని భూతాని వ్యక్తమధ్యాని భారత!*
*అవ్యక్త నిధనాన్యేవ తత్రకా పరిదేవనా*॥ - *భగవద్గీత (2-28)*

భూతములు పుట్టుకకు ముందు వ్యక్తములు కావు (కనిపింపవు). పుట్టిన తరువాతనే (దేహములు దాల్చుటవలన) కనిపించును. మరణానంతరము మఱల కనిపింపవు. కనుక అవి (దేహములు) భ్రాంతి జనకములే. వానికై విచార మెందులకు? అని భావము. కలలో కనిపించెడి వస్తువులకు, ఆదియు అంతము ఉండవు. స్వప్నమున మాత్రమే కనిపించి, స్వప్నాంతమున మాయమగును కనుక, అవి మిథ్యలు. అట్లే ఈ దేహాదులు కూడ మిథ్యలే.

*"య న్నాదౌ య చ్చ నాస్త్యన్తే తన్మధ్యే భాత మప్యసత్*
*అతో మిథ్యా జగత్సర్వ మితి వేదాన్త డిండిమః*॥ *-శంకరభగవత్పాదులు*

ఆదియందును అంతమందును లేక, మధ్య ఏది కన్పించినను, అది మిథ్యయే యగును. దేహ మొక్కటే కాదు, ఈ జగత్తంతయు సృష్టికి పూర్వము లేనిది, ప్రళయము తరువాత ఉండనిదే కనుక మిథ్యయే యగును. అందువలననే "బ్రహ్మ సత్యం జగన్మిథ్యా" అని శ్రుతి వలుకుచున్నది.

ఉ|| *ఏ దగుపించునో యది లయించుట తథ్యమటంచు, జ్ఞానమై*
*యాదట జీవులందు పరమార్థము దెల్పుచు నిండి యుండినన్*
*నీదగు నామ రూపములనే మది నిల్పుచు, నంతరాత్మవై*
*బోధన సేయు నీ వెలుగు బోల్పుకొనన్ గమకింప రెంతయున్ ||* 67

కనిపించున దంతయు నశింపక తప్పదని నీవు నిరావరణమగు జ్ఞానరూపమున మానవులలో పరమార్థము దెలుపుచుండినను, వారు మాత్రము నీ నామరూపములనే తమ మదులందు నిల్పుకొని, జపించుచుందురు. అంతరాత్మవై బోధించుచున్న నీ ప్రకాశమును (జ్ఞానదీప్తిని) కొంచెమైనను గుర్తించుటకు యత్నింపరు. బాహ్యరూపమునకే ప్రాధాన్య మిచ్చుచు, అంతర్యామియైన పరమాత్మను తలపరని భావము.

"సర్వాత్మనా దృశ్యమిదం మృషైవ" - వివేక చూడామణి (294). ఇంద్రియములకు మనస్సునకు గోచరించున దంతయు మిథ్యయే. "యద్దృశ్యం తన్నశ్యం" "యజ్జన్యం తదనిత్యం" ఏది కనిపించునో అది నశించును. ఏది పుట్టునో అది అనిత్యమని భావము. ఇట్టి వేదాంతోక్తుల వలన ఆవరణమును (శరీరమును) ధరించిన ప్రతి వస్తువు నేడు కాకున్నను, ఎన్నడో ఒకనాడు నశింపక తప్పదు. బ్రహ్మ కూడ ప్రళయమున నశించును. నశింపనిది జ్ఞాన మొక్కటే. అది సత్యము కనుక నిత్యము. దానికి నాశమే కాదు. మార్పు కూడ ఉండదు. జ్ఞానము జ్ఞేయము ఆనందము కూడ అదే. ఇట్లు సచ్చిదానందమైనది పరమాత్మ. పరమేశ్వరి 'జ్ఞానద - జ్ఞానవిగ్రహా' (ల.స.నా.).

శరీరము కనిపించు చున్నది కనుక అనిత్యము. ఆత్మ అంతట నిండియున్నను, కంటి కగుపింపదు కనుక నిత్యము. అది జ్ఞాన రూపమున అందఱిలో ఉన్నది. గురువు దానిని ప్రకాశింపజేయు మార్గమును ఉపదేశించును. ఆయన చూపిన త్రోవను నడచి, తనయందే గల జ్ఞానమును (ఆత్మను) సాధకుడే గుర్తింపవలెను. ఆ జ్ఞానమునందే (పరమాత్మయందే) మానవు డొనర్చు సర్వ కర్మలు పరిసమాప్త మగునని "సర్వం కర్మాఖిలం పార్థ! జ్ఞానే పరిసమాప్యతే" అని భగవద్గీత (4-33) ప్రవచనము.

ఉ|| *నీ కొక దేహ మున్నదని, నిర్మల భక్తిని దోచి, కోరికల్*
*ప్రాకట రీతి దీర్తువని, భక్తి వియుక్తిని గానిపింపవం*
*చీ కరణిం దలంచుచు, గ్రహింపరు సృష్టి రహస్యమున్ ; సదా*
*నీ కమనీయ గాత్ర పరినిష్ఠితముల్ గద వస్తు జాతముల్ ||* 68

అమ్మా! నీకు ప్రత్యేకమైన రూప మొకటున్న దనియు, పవిత్రమైన భక్తివలననే నీవు ప్రత్యక్షమై వారి కోర్కెల దీర్చుచుందు వనియు, భక్తి లేనిచో కనిపింప వనియు, ఈ విధముగ భావించుచు సృష్టి రహస్యమును, మనుజాలు గ్రహించుట లేదు. ప్రపంచమున నిత్యము కనుల కగుపించు వస్తు సమూహము లన్నియు నీ మనోజ్ఞమయిన శరీరమందలివే కదా!

జీవులు భావించిన రూపములతో పరాశక్తి ప్రత్యక్షమై వారిని కటాక్షించు చుండుట యథార్థమే, అయినను అన్ని రూపములు ఆమెవే యని గుర్తింప వలెను. ఆమె లేని కాలము కాని, వస్తువు కాని, దేశము కాని లేదు. శబ్దబ్రహ్మమైన చైతన్యము, ప్రాణుల దేహములలో నుండెడి కుండలినియు, ఆమెయే.

*"చైతన్యం సర్వభూతానాం శబ్ద బ్రహ్మేతి మేమతిః ।*
*తత్ప్రాప్య కుండలీ రూపం ప్రాణినాం దేహమధ్యగాం॥"*

—శారదాతిలకం

రూపమున కాని రూపము లేక కాని ఆమె వ్యక్తమగుచునే యున్నది. ఆమె ఎక్కడి నుండియో వచ్చుట లేదు. తనయందే కలదని గ్రహింపవలెను.

శా॥ *అజ్ఞానాత్మక కర్మసంజనిత దేహం బొందు నీకేల? త్వ*
*త్ప్రజ్ఞారూపము సర్వ జీవగతమై, బాహ్యాంతర స్థాయియై,*
*విజ్ఞాతం బగుచుండ; విశ్వజననిన్ విశ్వాధికన్ విశ్వమున్*
*తద్జ్ఞుల్ ధీరులు గాక యన్యు లెఱుగన్ దర్శింప సాధ్యంబొకో॥* 69

అమ్మా! నీ ప్రజ్ఞాన స్వరూపము సకల జీవులలో వెలుపల లోపల నుండి చక్కగా తెలియబడుచుండ, అజ్ఞాన మూలమై కర్మలొనర్చుటవలన కలిగెడి దేహము నీ కెందులకు? దేహము లేకున్నను నీవు తెలియబడుచునే ఉన్నావు కదా! ఈ ప్రపంచమునకు హేతువును, ప్రపంచ స్వరూపమును, ప్రపంచాతీతమును, అగు నిన్ను, తత్వదర్శనులై శమ దమాది షడ్గుణ సంపన్నులయిన ధీరులుగాక, ఇతరులు తెలిసికొనుటకు గాని, చూచుటకు కాని సాధ్యము కాదు.

దేహము అజ్ఞానాత్మకమైనది. అది కర్మఫలము ననుభవించుటకొఱకు ఏర్పడినది. గోస్వామి తులసీదాసు మహాశయుడు హనుమాన్ చాలీసా ప్రారంభించుచు, "బుద్ధి హీనతనుజానుకై సుమిరౌ పవన కుమార్". శరీరము బుద్ధి హీనత (అజ్ఞానము) వలన ఏర్పడినదని తెలిసికొని పవనకుమారుని స్మరించెద నన్నాడు. మన మొనర్చు కర్మల బట్టియే జననము (దేహధారణము)

మరణము వచ్చుచుండును. దేహము ధరించినపుడు కర్మలు చేయకున్న జీవితము గడువదు. చేసినచో బంధము తప్పదు. ఇట్లు కర్మాచరణము ఒక విషవలయముగ తోచును. మఱి దీని నుండి తప్పించుకొను టెట్లు? బంధము లేకుండ చేసికొనుటకు అవకాశము కలదా? కలదు.

జ్ఞానయుతమై, కర్తృత్వమును తనయం దుంచుకొనక, చేయు కర్మ, బంధము కానేరదు. కర్మఫలమంతయు జ్ఞానమందే పరినమాప్తమగును.

ప్రజ్ఞారూపము - జ్ఞానము స్వరూపముగ గలది. దేవి చిత్స్వరూపిణి. అనగా ప్రజ్ఞారూపిణి. ఈ చైతన్యము విశ్వమంతట వ్యాపించి యుండుటచే ప్రతి జీవికి వెలుపల లోపల భాసించుచున్నది. కాని కనిపింపదు. ఆలోచింపగలగినచో బుద్ధికి తోచును. నదిలోని నీరు ఏ పాత్రతో ముంచిన ఆ పాత్ర ఆకారమున ఉన్నట్లు, ఏ ఆవరణము (దేహము) కలిగిన, ఆ ఆవరణముతో స్థూలదృష్టికి గోచరించును కాని, అంటియుండదు. "యథా సర్వగతం సౌక్ష్మ్యాదాకాశం నోపలిప్యతే । సర్వత్రావస్థితో దేహే తథా త్మా నోపలిప్యతే" ॥ అంతట వ్యాపించి యున్న ఆకాశము సూక్ష్మమగుటవలన ఎట్లు అంటియుండదో, అట్లే దేహమం దంతట ఉండెడి పరమాత్మ దేహముతో అంటియుండదని భగవద్గీత (13 - 33) పలుకుచున్నది. కనుక శరీరములు వేరు వేరుగా ఉన్నను వానియందలి ఆత్మ (ప్రజ్ఞ) ఒకటే అని తెలియవలెను.

ఆత్మరూపిణియైన ప్రజ్ఞయే విశ్వముగ రూపొందినది. అట్లు రూపొందుటకు తానే కారణమైనది (విశ్వజనని). హేతు వగుటవలన విశ్వముకంటె అధికమైనది (విశ్వాధిక).

తద్‌జ్ఞులు = తత్వవేత్తలు ; ధీరులు = కామక్రోధాది అరిషడ్వర్గమును జయించిన వారు.

ఉ॥ *భావముగా స్ఫురించి మది, వాక్కుగ వక్త్రమునందు వ్యక్తమై,*
*చేవగ నిల్చి దేహమున, చిన్మయ లీలల జూపుచుండినన్*
*నీవని నంతయైనను గణింపక, చావును పుట్టువున్ సదా*
*త్రోవల జూవ బోవుదురు దుఃఖమునన్ మఱి వత్తు రీక్రియన్* ॥ 70

భావ రూపమున మనస్సు నందును, వాగ్రూపమున నోటియందును, శక్తి (బలము) రూపమున శరీరమందును, నీవు నీ చిద్విలాసముల, చూపుచున్నను, ఆ చూపునది నీవే యని కొంచెమైనను గ్రహింపని మానవులు చావుపుట్టువులు చూపెడి త్రోవలలో దుఃఖమున పోవుచు వచ్చుచున్నారు.

కర్మ బంధములలో చిక్కి పరమార్థమును గ్రహింపక సంసారమున తిరుగుచుందురని భావము.

మ॥ *ప్రతి దేహంబున నీవు 'నే' ననుచు, నిర్ద్వంద్వంబుగా బల్క, త*
*ద్వ్యతిరేకంబుగ 'దేహమే' ననుచు సంభావించు జీవుండు, నీ*
*స్థితి గుర్తింపక, 'నేనె బ్రహ్మ' మన సందేహిం చవిద్యావృతిన్;*
*మతినిం దత్కృతినిం బురోగతిని సంభావింప లే, దజ్ఞతన్॥* 71

ప్రతి శరీరమునుండి నీవు "నేను-నేను" అని పలుకుచుండ, దానికి వ్యతిరేకముగా 'నేను దేహము' ననెడి భావముతో జీవుడు నీ ఉనికినే గుర్తింపక, అవిద్యాప్రభావమువలన 'నేను బ్రహ్మము'నని పలుక లే కున్నాడు. జీవుని భోగార్థము, విషయార్థముల కల్పించెడి మనస్సును కాని, అది చేసెడి పనిని గాని, దానిని వశము చేసికొను నపుడు లభించెడి అభ్యుదయమును (శుభమును) గాని చక్కగా తెలియ జాలకున్నాడు.

"ఏష సర్వేషు భూతేషు గూఢాత్మా న ప్రకాశతే" - కఠోపనిషత్తు పరమాత్మ అన్ని జీవరాసులలో 'అహం' అని వ్యవహరించుచు తెలియబడక మిక్కిలి గోప్యముగ ఉన్నాడు.

కర్తృత్వాభిమానియైన ప్రమాతను, ఆత్మ ప్రతిఫలించినపుడు అహంకారముగను, అది ప్రతిఫలింపనపుడు (ఆత్మాభాసయందు) కేవలము అంతఃకరణముగను చెప్పుచుందురు.

అంతరింద్రియములలో ఒకటగు మనస్సు, జాగ్రదవస్థయందు స్థూలరూపముతోడను, స్వప్నమున సూక్ష్మరూపముతోడను, భోగించుట కనువైన విధముగా శరీర వర్ణాశ్రమ జాతి భేద గుణక్రియాదులకు తగిన ఫలములను నిరంతరము కలిగించుచుండును.

*"మనః ప్రసూతే విషయానశేషాన్।*
*స్థూలాత్మనా సూక్ష్మతయా చ భోక్తుః।*
*శరీరవర్ణాశ్రమ జాతి భేదాన్।*
*గుణక్రియా హేతు ఫలాని నిత్యమ్"॥*

— వివేక చూడామణి (179) కనుక వివేకి మనస్సు విషయమున శ్రద్ధ వహింపవలెను

<u>బ్రహ్మము</u> - "బృహత్వాద్బృంహణత్వా ద్బ్రహ్మ" గొప్పదగుట వలనను, వ్యాపించు స్వభావము కలదగుట వలనను, బ్రహ్మ, "బ్రహ్మైవాత్మా

అనమంతా త్రిషష్టిత్యాతివా" బ్రహ్మమే ఆత్మ. ఆత్మ అనగా అంతట వ్యాపించియుండునది.

ఉ॥ *గమ్యము లేక గంధవహ కల్పిత మార్గములం జరించుచున్*
*రమ్య విహాయసంబున విరాజిలు శారద మేఘ పంక్తినా*
*నమ్య గభీప్సితం బెఱుగ జాలక, జీవులు సంచితాదులౌ*
*కామ్యములన్ భుజించెదరు కాని, గ్రహింపరు సత్య మింతయున్*॥ 72

అమ్మా! గమ్య మనునది లేక, రాత్రులందు అందముగ గాలి వాలున తిరుగాడు శరత్కాల మేఘ సమూహము వలె, కోరదగినది స్పష్టముగ తెలియక, అజ్ఞానాంధకారమున, సంచిత ప్రారబ్ధములు నడవునట్లు నడచుచు, జీవులు కామ్యకర్మ ఫలములను భుజించుచున్నారే కాని, సత్యమును కొంచెమైనను గుర్తించుట లేదు.

జీవులు అస్వతంత్రులు - ప్రాణధారణమువలన జీవత్వము కలుగు చున్నది. జీవుడు సాక్షి యొక్క (చిత్కళ) ప్రతిబింబము మాత్రమే.

*"చైతన్యం యదధిష్ఠానం లింగదేహశ్చ యఃపునః*
*చిచ్ఛాయా లింగదేహస్థా తత్సంఘో జీవ ఉచ్యతే'* ॥ - శ్రుతి

చం॥ *అవయవి నెట్లెఱుంగవో తదంగము, లాత్రియ సర్వసాక్షి! ని*
*న్నెవరు నెఱుంగ, రెల్లరను నీవ యెఱుంగుదు వంతరాత్మవై,*
*భువియు వియత్తు స్వర్గమును బూర్ణము లెట్లగు నొక్కటొక్క టే*
*అవియు త్వదంగ రూపముల వ్యక్తములై దనరారు చుండుటన్* ॥ 73

సర్వసాక్షిణి వయిన పరమేశ్వరీ! వస్తువుయొక్క వేర్వేరు భాగములు (అవయములు) తమ ఉనికికి మూలమైన అవయవిని (అవయములుగలది - వస్తువును) ఎట్లు తెలిసికొన జాలవో, అట్లే జీవులు తమ ఉనికికి కారణమైన నిన్ను తెలియ లేరు. సర్వాత్మవైన నీవు మాత్రము నీ అంశము లయిన జీవుల నందఱిని ఎఱుగుదువు. నీ విరాడ్రూపము అన్నిటిని మించి యుండుటవలన భూమి కాని, ఆకాశము కాని, స్వర్గము కాని, దేనికది పరిపూర్ణము కాదు. అన్నియు చేరిన సమష్టి రూపము నీది.

పరమేశ్వరి "విరాడ్రూప - విశ్వతోముఖి - సహస్రశీర్షవదన - సహస్రాక్షి - సహస్రపాత్ (ల.స.నా.)

ఆత్మ స్వయముగ సర్వమును చూచును కాని ఆత్మ నెవ్వడును చూడజాలడు. "యః పశ్యతి స్వయం సర్వం యం న పశ్యతి కశ్చన" - వివేక చూడామణి (129)

<u>సాక్షి</u> - జ్ఞాన (తెలివి) జ్ఞాతృ (తెలియువాడు), జ్ఞేయ (తెలియదగినది), తిరోధానములను (కనిపింపక పోవుట) తెలిసికొని, ఎట్టి వికారములు లేక, స్వయముగ ప్రకాశించునట్టి తేజోమయ మయిన చిత్తుయొక్క ప్రతిబింబము. సాక్షియే కూటస్థుడు.

<u>అంతరాత్మ</u> - జీవాత్మ, అంతరాత్మ, పరమాత్మ, నిర్మలాత్మ, శుద్ధాత్మ, జ్ఞానరూపాత్మ, మహాత్మ, భూతాత్మ అనునవి అష్టవిధములైన ఆత్మస్వరూపములని చెప్పుదురు. ఇందు ఉత్తమమైనది మహాత్మ. దానికే ఋతము మున్నగు పర్యాయములు ఏర్పడినవి.

*"ఋత మాత్మా పరంబ్రహ్మ సత్యమిత్యాదికా బుధైః |*
*కల్పితా వ్యవహారార్థం యస్య సంజ్ఞా మహాత్మనః ॥* " — శ్రుతి

చం॥ *మెలకువ నీ స్వరూపము ; నిమీలితమైన త్వదక్షిపక్ష్మమే,*
*ప్రలయమ యౌ జగంబులకు ; ప్రాజ్ఞులు సైతము కొంద ఱివ్విధిం*
*దలపక, నిద్ర బొమ్మనుచు దద్దయు జోలల బాడి, వేకువం*
*బలుకుచు సుప్రభాతముల, భగ్న మొనర్తురు త్వత్ప్రమోదమున్* ॥ 74

నీవు నిరంతర జాగ్రత్స్వరూపిణివి. మేలుకనియే యుందువు. నీ కను తెప్పలు మూసికొనినచో, లోకములకు ప్రళయమే యగును. ఈ విషయమును గుర్తింపని కొందఱు ప్రాజ్ఞులు కూడ, నిన్ను నిద్ర వుచ్చుటకు అత్యంతము జోలల పాడి, నీవు నిజముగ నిద్రించితి వనియే భావించి, వేకువను మఱల వచ్చి, మేలుకొలుపులను, సుప్రభాతములను పాడుచు, నీ యానందమునకు ఆటంకమును కల్పించుచున్నారు.

పరమేశ్వరి కాలస్వరూపిణి - సచ్చిదానంద విగ్రహ - నిరంతర నిర్నిద్ర - జాగరిణి - ఆమెను నిద్రబుచ్చుట మేల్కొలుపుట అర్థ రహితము. ఇంకను, ఆమె కన్ను తెఱచిన సృష్టియు, మూసిన లయము అగుననియు, కనుతెప్పల కదలికవలననే ఆమె కాలచక్రమును త్రిప్పుచున్నదనియు, శ్రీకాలశక్తివిలాసః గ్రంథమున కాలపరిగణన సందర్భమున చెప్పబడినది. చూడుడు.

*"ఊర్ధ్వ భ్రూవిభ్రమే సృష్టి రధో భ్రూవిభ్రమే లయః ।*
*ఊర్ధ్వసంధి స్సృష్టి కాలే హ్యాధస్సంధి ర్లయే భవేత్ ॥* **(65)**
*"ఏవం దేవీ భగవతీ స్వభ్రూ విభ్రమణేన చ*
*కాలచక్ర మిదం సర్వం భ్రామయత్యేవ సర్వదా ॥* **(70)**

మ॥ *లలితంబైనది నీ తనూలత ; సదా లావణ్య సౌజన్య ని*
*స్తులితంబైనది త్వద్విలాసమును ; సంస్తుత్యంబు నీ కీర్తియున్ ;*
*వెలయుం దావక విక్రమంబును మహాభీలారి వర్గంబు సం*
*చలితం జేయుచు ; నీదు శక్తి దెలువన్ శర్వుండె సాక్ష్యంబగున్ ॥ 75*

అమ్మా! నీ శరీరము తీగ వలె మృదువైనది. నీ విలాసము నిరంతరము లావణ్య సౌజన్యములవలన సాటి లేనిది. నీ కీర్తి మిక్కిలి పొగడదగినది. నీ పరాక్రమము భయంకరమైన విరోధి వర్గమును చలింపజేయునట్టిది. ఇట్టి నీ శక్తికి సాక్షి శర్వుడేయగును.

బాహ్యమునకు సూక్ష్మాతి సూక్ష్మముగ తోచినను, సర్వాతిశాయియై అభేద్యమైనది పరాశక్తియే. ఆ శక్తి యెదుట ఎంతటి బలవద్విరోధులైనను, (అరిషడ్వర్గాదులు) నిలువజాలరు. దృఢవ్రతుడై ఘోరతపశ్చర్య నుండిన శివుడంతటివాడు ఆమె లావణ్య సౌజన్యములకు, నిష్ఠావిశిష్టతకు, చలించి నన్నేలుకొమ్ము నీ వరవుడనంచు గారవించెనట. మఱియు అతడు శక్తిధరుడు. కావున శక్తి పారమ్యమును తెలుపు సామర్థ్య మాయనకే కలదు.

దేవీ భక్తులు సులభముగ నిరంకుశమైన అరిషడ్వర్గమును అధిగమింప గలరని భావము. దేవి 'మహాశక్తి - మహాసత్వ - మహావీర్య - మహాబల' (ల.స.నా.)

ఉ॥ *అక్షర రూపిణీ! నిను సమంచితరీతి నెఱుంగ నేర్తురే!*
*వీక్షణమాత్ర శబ్దమయ విశ్వము నర్థగతంబు సేయవో!*
*సాక్షిగ నిల్చవో కమల షట్క సువర్ణ విభాసివౌచు? నే*
*నక్షయ సౌఖ్యమెంచి నిను నాద్య సరస్వతి ప్రస్తుతించెదన్ ॥ 76*

అ మొదలు క్ష వరకు గల వర్ణములతో నశింపని రూపము గల తల్లీ! నిన్ను చక్కగా తెలియజాలరు. నీ చూపులవలననే శబ్దమయమైన ప్రపంచము అర్థవంత మైనది అనగా అకృతి దాల్చినది. మాతృకా వర్ణములుగా ఆఱు పద్మములందును ఆవిర్భవించి, చక్కని వర్ణములతో ప్రకాశించుచు సాక్షివై

నిలిచియున్నావు. అక్షయ సుఖమును (మోక్షమును) కోరి, ఆద్యమైన నీ సరస్వతీ రూపమును స్తుతించెదను.

"ప్రకాశనాత్మా సవితుః వాగ్రూపత్వాత్ సరస్వతీ" - అగ్నిపురాణము.

సూర్యప్రకాశకారిణి యగుటవలన సావిత్రియు, వాగ్రూపమువలన సరస్వతియు అయిన పరమేశ్వరి యని భావము. 'సరస్' ధాతువునకు 'సరః ప్రసరణే' ప్రసరించునది లేక వ్యాపించునది అని అర్థము. చైతన్య (చిచ్ఛక్తి) ప్రసరణమువలన సరస్వతియై, వ్యాప్తివలన వైష్ణవియైనది. కార్యరూపమయిన జగత్తునందు ప్రవేశించి ఉండుటచేతను, కార్యజగత్తు ఈ స్వరూపమందే పర్యవసించుచుండుటచేతను, విశ్వమయినది. ఇదే ప్రణవము లేక పరమాత్మ.

శబ్దమయ విశ్వము సర్గ గతంబు —

పరబ్రహ్మముతో అద్వయ మిథునమై యున్న శక్తి ఇట్టిదని తెలుప జాలని నాద రూపమున (IN THE FORM OF VIBRATION) తొలుత స్ఫురించి (ఈంకారముగా), మాత్రా సమ్మేళనమున ఓంకారమై, వ్యాహృతులై, పంచభూతములుగా రూపు దిద్దుకొని, విశ్వ సృష్టికి కారణమైనది. పిమ్మట గుణముల నేర్పఱచి, ఉత్తమ మధ్యమ అధమ వ్యక్తిత్వములతో భాసించినది. ఇట్లు సూక్ష్మమైన నాదమే వాక్కుగా వస్తువులుగా రూపొందుటచే, ఆద్యశక్తి సరస్వతియే యగును. ఇదే పరానాదము.

ఈ పరానాదమే, అంతస్సృష్టిలో శరీరమందలి షట్కమలముల యందు సత్యద్రష్టలచే చూడబడి 'పశ్యంతి'యైనది. పిమ్మట 'మధ్యమ'యై (వ్యక్తావ్యక్తములకు లేక పశ్యంతీ వైఖరులకు మధ్య ఉండుటవలన మధ్యమ), విశుద్ధమున అ నుండి అః వఱకు (16), అనాహతమున క నుండి ఠ వఱకు (12), మణిపూరమున డ - ఫ వఱకు (10), స్వాధిష్ఠానమున బ నుండి ల వరకు (6), మూలాధారమున వ నుండి స వఱకు (4), ఆజ్ఞ యందు హ, క్ష (2), మాతృకా వర్ణములుగా అవతరించినది. అనగా ఆయా స్థానములలో ఆయా ధ్వనులు అస్పష్టముగ వినబడినవి. ఈ అస్పష్ట శబ్దములే స్పష్టములైనపుడు, వైఖరి అయినది.

సాక్షి - చూచి, తెలిసికొని చెప్పునది. జాగ్రత్ స్వప్నావస్థలలో చూచియు, సుషుప్తియందు తెలిసికొనియు చెప్పునది ఏదో, అది సాక్షి — ప్రత్యగాత్మ. అనగా స్వప్రకాశమైన తేజోమయ చిత్ప్రతిబింబ చైతన్యము.

ఆద్య - సృష్టికి ముందుగా తోచిన శక్తి రూపము - ఈంకారము.

*"ఇ కారం విష్ణుదైవత్యం శక్తిర్మాయాచ పుష్టిదం*
*రూప కాంతి ప్రదం శ్రేష్ఠం వరేణ్యం మోక్ష సిద్ధిదమ్*
*మాయా దైవత మీకారం మహాజన వశీకరం*
*అంతర్మాయా జగద్వశ్యం సత్వరం తద్వరాననే ॥*

అని బీజనిఘంటువున ఇకార ఈకారముల అర్థములు వివరింపబడినవి. అట్లే అకారమునుగూర్చి "అకారం బ్రహ్మదైవత్యం సర్వదైవత మాతృకం, బీజం స్వాయంభువం మృత్యో క్షోభణంచ వశంకరమ్" అని తెలుపబడినది. పరమాత్మను అంటియుండునది శక్తి లేక మాయ. అట్లే అకారము పిమ్మట వ్యక్తమయినవి ఇకార ఈకారములు. 'అకారో వాసుదేవ వాచకః తస్య స్త్రీత్వార్థే ఈకారః - స్త్రీప్రత్యయః' కనుక అ + ఈ = ఈ. 'యస్యేతిచ' సూత్రరీత్యా ప్రాతిపదిక లోపింపగా ఈ మిగులుచున్నది. తెలియదగిన దేమనగా ప్రకాశబిందువు (సోఽకామయత) ననుసరించి విమర్శ రూపమగు ఈ కారము స్ఫురించినది. ఈ స్ఫురణము అశబ్దస్పందనమై 'అ + ఉ + మ' మాత్రా సంయోజనమున ప్రణవముగ అవతరించినది. ప్రణవ మనగా ప్రకృష్టమైన స్తోత్రరూపము (ఓంకారము) ; ప్రకాశ విమర్శాత్మకమైన స్తోత్రరూపమనియు చెప్ప వచ్చును.

| | | |
|---|---|---|
| మూలము పరమాత్మ—అకారము | సవము—ఈం | ప్రణవము—ఓమ్ |
| ఇది అహం ప్రధానభావము | (అ+ఈ = ఈ) | (అ+ఉ+మ = ఓమ్) |
| | 'ఇదం' ప్రధాన | అహమిదముల |
| | రూపము | సమప్రాధాన్యము కలది |

ప్రణవమునుండియే సృష్టి సకలము కలుగుటవలన సృష్టికి మూలము ఓంకారమే. ఓంకారమే పరమాత్మ లేక పరాశక్తి.

అక్షయ సౌఖ్యము = నశింపని సుఖము - మోక్షానందము.

ఉ॥ *పూర్ణమునం దపూర్ణముగ బ్రోతమునన్ స్ఫురియించు సూత్రమ*
*ట్లర్ణవమందు వీచి వలె, నగ్ని శిఖాలవ మట్లు, కర్వలిం*
*దూర్ణవిహీన వాయు వటు, దోపగ జీవి, స్వయంప్రమాణమై*
*పూర్ణమునౌ త్వదాకృతి యపూర్వము; నా మది నిండి యుండుతన్ ॥77*

పూర్ణమున (మహాకాశమున) అపూర్ణముగను (దహరాకాశము), వస్త్రమున నూలుపోగు వలెను, సముద్రమున తరంగము వలెను, అగ్నియందు చిఱుజ్వాల వలెను, వాయువున మందపవనము వలెను, నీయందు జీవుడు

భాసింపగా, నీకు నీవే ప్రమాణమై తోచెడి నీ పరిపూర్ణ స్వరూపము అపూర్వము. అది నా యెద నిండి యుండుగాక.
ప్రోతము = వస్త్రము ; కర్వలి = వాయువు ; తూర్ణవిహీనము = వేగము లేనిది.

శా|| *అవ్యక్తంబున బీజివై, ప్రకృతి భావాప్తిన్ మహత్తత్వమై,*
*నవ్యక్తిత్వ మహంకృతిం బడసి, నంశోభించి తన్మాత్రలన్*
*భవ్యంబై రహి పంచ భూతములుగా భాసించి, విశ్వాకృతిన్*
*భావ్యంబైన భవత్స్వరూపము సదావ్యక్తంబ లోకేశ్వరీ ||* 78

ఓ జగదీశ్వరీ! అవ్యక్తమున బీజము కలదిగా నిలిచి, మహత్తత్వమున ప్రకృతివై ఆ బీజమును ధరించి, అహంకారమున చక్కగా స్ఫురించి, తన్మాత్రలతో భాసించి, ఆనందమున పంచభూతములుగా ప్రకాశించి, ప్రపంచ రూపమున భావింపదగిన నీ స్వరూపము అవ్యక్తమే (ప్రకటితము కానిదే) అగుచున్నది. రూపముండిన కదా వ్యక్త మగుటకు.

విశ్వసృష్టికి బీజము అవ్యక్తమందే కలదు. బీజము కలవాడు బీజి పురుషుడు. కనుక అవ్యక్తమే పరమాత్మ లేక పరమపురుషుడు. బీజమును దాల్చునది స్త్రీ. అందువలననే ప్రకృతిని స్త్రీగా భావించెదరు. ప్రకృతినుండి ఏర్పడినది అహంకారము. అహమునుండి బుద్ధి మనస్సు మున్నగు తత్వము లేర్పడినవి.

*"ఇంద్రియేభ్యః పరాహ్యర్థాః, అర్థేభ్యశ్చ పరం మనః |*
*మనసస్తు పరాబుద్ధి ర్బుద్ధేరాత్మా మహాన్ పరః ||*
*మహతః పరమవ్యక్త మవ్యక్తా త్పురుషః పరః |*
*పురుషా న్న పరం కించిత్ సా కాష్ఠా సా పరాగతిః ||*

—కఠోపనిషత్తు (3-10,11)

ఇంద్రియములకంటె విషయములు, విషయములకంటె మనస్సు, మనస్సుకంటె బుద్ధి, బుద్ధికంటె మహత్తు, మహత్తుకంటె అవ్యక్తం, అవ్యక్తముకంటె పురుషుడు శ్రేష్ఠమయినవి. పురుషునికంటె పరమోత్కృష్ట మేదియు లేదు. అదే చివరది (కాష్ఠా = పరమావధి). అదే పరమగమ్యము అని భావము.

శుద్ధ చైతన్యము అన్నిటికంటె శ్రేష్ఠమై పురుషుడని వ్యవహరింప బడుచున్నది. కాని విశ్వసృష్టికి సహాయకారియై గుణ సంవలితమైన

విశ్వవేదన

ఆవరణరూపశక్తి అవ్యక్తమున తోచుటవలన, అవ్యక్తమును పురుషునిగను, విక్షేపశక్తి ప్రాధాన్యము గల మహత్తును (ప్రకృతిని) స్త్రీగను భావించుట జరిగినది. సూక్ష్మమైన శుద్ధ చైతన్యము ద్రవ్యమునకు చేతనకు ఆధారము. దానికంటె స్థూలమైన ప్రకృతి అవ్యక్తరూపమైన పదార్థము, శక్తికూడ అగుటవలన, పురుషుని ఆవహించి, ప్రేరేపించి, విశ్వమనియెడి స్వప్నమును కల్పించుచున్నది. ఈ ప్రక్రియలో సకల జీవాత్మ సమష్టి రూపమయిన హిరణ్యగర్భుడు (సూక్ష్మము), విరాట్టు లేక విష్ణువు (స్థూలము) రూపముల దాల్చిరి. విరాడ్రూపమే అహంకారము.

వ + వ్యక్తము = అవ్యక్తము. బీజమందు వృక్షము వలె, అన్ని తత్త్వములు, అన్ని వర్ణములు, తనయందు అస్పష్టముగ కలిగియుండునది కనుక అవ్యక్తము. అవ్యక్తమున ఆవరణశక్తి ఉన్నందున, విశ్వమునకు బీజమక్కడనే ఏర్పడినది. బీజాభివృద్ధికి దోహదకారిణి స్త్రీ యైనట్లు, విశ్వబీజము, ప్రకృతివలన మహత్తునందు పరిణతి చెందినది. కావున సృష్టి విధానమున తొలుత అవ్యక్తము, పిమ్మట మహత్తు చెప్పబడినవి. వ్యష్టి సృష్టిలో మహత్తే మనస్సని చెప్పబడుచున్నది.


*"ప్రధాన మవ్యక్తం యోని రవ్యక్తం, ప్రకృతి స్తమః*
*విష్ణోరేతాని నామాని నిత్య ప్రసవ ధర్మిణః ॥" - లింగపురాణం*

శా॥ *ఆధారాది షడబ్జముల్, నిటల మధ్యస్థాన, మాపైని సూ*
*ర్యాధిష్ఠానము, బ్రహ్మరంధ్రమును, దేహాంతస్థితంబైన త్వ*
*చ్ఛ్రీధామంబును దెల్పి, చక్రనవక శ్రేణిం బ్రభావించి, త*
*ద్బోధన్ నిన్నను ధన్యజీవులు సదా ముక్తుల్ గదా ముక్తిదా ॥* 79

అమ్మా ముక్తిప్రదాయినీ! మూలాధారము మున్నగు ఆఱు కమలములును (చక్రములును) నుదుటి మధ్యభాగమును, సహస్రారమును, బ్రహ్మరంధ్రమును, దేహమందలి నీ శ్రీచక్ర స్వరూపమును తెలుపగా, నవచక్రముల చక్కగా భావించి, దేహమే శ్రీచక్రమనెడి ఎఱుక పహించిన ధన్యజీవులు నిత్యముక్తు లగుచున్నారు.

శివశక్తుల శరీరమే శ్రీచక్రము. అదియే ప్రపంచము. ఇందు శివచక్రములు నాలుగు, శక్తి చక్రము లైదు, మొత్తం తొమ్మిది చక్రములు కలవు.

# శ్రీచక్రం శివయోర్వపుః



బిందు త్రికోణ వసుకోణ దశారయుగ్మం ।

మన్వశ్ర నాగదళ సంయుత షోడశారం ॥

వృత్తత్రయం చ ధరణీసదనత్రయం చ ।

శ్రీచక్రమేతదుదితం పరదేవతాయాః ॥

*బిందు త్రికోణ వసుకోణ దశార యుగ్మం*
*మన్వశ్ర నాగదళ సంయుత షోడశారం*
*వృత్తత్రి భూపురయుతం పరితశ్చతుర్ద్వాః*
*శ్రీచక్ర మేత దుదితం పరదేవతా యాః॥*

బిందువు, త్రికోణము, అష్టకోణము (వసుకోణం), అంతర్దశారం, బహిర్దశారం, చతుర్దశారం (మన్వశ్రము), అష్టదళపద్మము (నాగదళం), షోడశదళపద్మము (షోడశారం), చతురశ్రము (భూపురం) అని వానికి పేర్లు.

దేహమే శ్రీచక్రమని ఎచటెచట ఏయే చక్రములను భావింపవలెనో త్రిపురోపనిషత్తు వచించినది.

*బైందవం బ్రహ్మరంధ్రేచ । మస్తకేచ త్రికోణకం।*
*లలాటే వసుకోణం స్యాత్ । భ్రువోర్మధ్యే దశారకం ।*
*బహిర్దశారే కంఠేచ । మన్వశ్రం హృది సంస్థితం ।*
*నాభౌ చాష్టదళం పద్మం । స్వాధిష్ఠానే కళాశ్రకం ।*
*ఆధారే చతురశ్రం స్యా॥ న్నేవం చక్రవిభావయేత్ ॥*

బ్రహ్మరంధ్రమున బిందువును, తలయందు అనగా సహస్రారమున త్రికోణమును, నొసటి భాగమున అష్టకోణమును, కనుబొమల నడుమ ఆజ్ఞయందు అంతర్దశారమును, కంఠమందలి విశుద్ధమున బహిర్దశారమును, హృదయమందలి అనాహతమున చతుర్దశారమును, నాభిస్థానమున (మణిపూరమున) అష్టదళ పద్మమును, లింగస్థానమందలి స్వాధిష్ఠానమున షోడశదళమును మూలాధారమున భూపురమును (చతరశ్రము) భావించి మానసిక పూజసేయవలెను. ఇట్టి భావమువలన జీవుడు పరమాత్మ ఒకరే కాని వేరు కాదు అనెడి ఎఱుక అనుభవమునకు వచ్చును.

ఆధారము = మూలాధారము ; షడబ్జములు = ఆరు చక్రములు ; ఊర్ధ్వాధిష్ఠానము = సహస్రదళ పద్మము ; చక్రనవకశ్రేణి = తొమ్మిది చక్రముల వరుస ;

పరమేశ్వరి "ముక్తిద - ముక్తిరూపిణి" - (ల.స.నా.)

మ॥ *విధివై జీవుల భాగధేయముల సంపేక్షించి, నారాయణా*
*ఖ్య ధరిత్రిం గురుణాదృగంత పరిరక్షాదీక్ష బాలించి, యిం*
*పొదవం ద్రెంచి భవాది బంధముల, నేవుంబాపి రుద్రుండవై*
*తుదముట్టింతువు సృష్టి సర్వము సముద్యోతింతు వద్వైతమై ॥* 80


విశ్వవేదన

బ్రహ్మవై జీవుల అదృష్టములను సమీక్షించి, నారాయణుడవై జగమును నీ కరుణా దృష్టులతో సంరక్షించి, జన్మకర్మాది బంధముల త్రెంచి, రుద్రుడవై సృష్టినంతయు అంతము చేసి, అద్వైతమై చక్కగా ప్రకాశించుచుందువు.

దేవి త్రిమూర్త్యాత్మిక, "కేశ విష్ణు స్వరూపిణి" (క + ఈశ + విష్ణు స్వరూపిణి) కనుక సృష్టి స్థితి లయాది కృత్యములను ఆమెయే చేయుచున్నది. త్రిమూర్తులు పురుషులు కదా ఇది ఎట్లు పొసగు ననరాదు. "స్త్రీ రూపం చింతయే ద్దేవీం పుం రూపం వా విచింతయేత్| అథవా నిష్కలంధ్యాయే త్సచ్చిదానంద లక్షణం||" (జ్ఞానార్ణవం) అని దేవిని స్త్రీరూపమున గాని, పురుషరూపమునగాని లేక ఏ రూపము లేని సచ్చిదానందముగ కాని ధ్యానింపవచ్చును. శ్రుతి కూడ "న స్త్రీ న చ పుమాన్" అని బ్రహ్మ పదార్థము స్త్రీ కాదు, పురుషుడు కాదు. అని నిర్ద్వంద్వముగ ప్రకటించినది. కనుక సర్వేశ్వరి - సర్వమయి - తత్వాధికయైన పరాశక్తియే ఉపాస్య.

విధి - జీవుల జీవన విధానమును నిర్ణయించువాడు. "విధాత్రీ సృష్టికర్త్రీ - బ్రహ్మరూపా - బ్రహ్మజననీ" అని లలితా సహస్రనామము.

నారాయణుడు - ఈ శబ్దానికి పరమాత్మ - బ్రహ్మ - విష్ణువు - శివుడు - సూర్యుడు - చంద్రుడు - అగ్ని అని అర్థాలు. ఇట్లే 'నారద' శబ్దమునకు జ్ఞానమును విజ్ఞానమును (ప్రపంచ వార్తలను) తెలుపువాడని చెప్పుచున్నాము. 'నారం దదాతీతి నారదః' ।

*"ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపోవై నరసూనవః ।*
*తా యద స్యాయనం పూర్వం తేన నారాయణః స్మృతః ॥*
— మనుస్మృతి (1-10)

"నారాణా మయనం యస్మా త్తస్మా న్నారాయణః స్మృతః" - బ్రహ్మవైవర్త పురాణము.

"నయతీతి నరః ప్రోక్తా పరమాత్మా సనాతనః" - వ్యాసులవారు. నారము (నీరు) అయనముగ కలవాడు నారాయణుడు. అయన నివాసము నరులు కనుక నారాయణుడు. పంచభూతములు స్థానముగ గలవాడు నారాయణుడు. నారమునకు నీరు, నరులు, పంచభూతములు, జ్ఞానము అని అర్థము చెప్పుకొనవలెను. "నారాయణీ - నాదరూపా - నామ రూప వివర్జితా" (ల.స.నా.)

"నన్ను నేను నారాయణునిగను జగజ్జననియైన గౌరిగను, విభజించుకొనుటవలన నా తత్త్వమును, దేవతలు గాని ఋషులు కాని తెలియలేరు. నేనే దేవిని. విష్ణువును కూడ". అని కూర్మపురాణమున పరమశివుడు ప్రవచించినట్లు తెలుపబడినది.

రుద్రుడు - సంహారకారకుడైన శివుడే. "సంహారిణీ - రుద్రరూపా" (ల.స.నా.)

ఉ॥ *రాముడవై శివాకృతి బరాత్పర తత్త్వము దెల్పి రాధికా*
*శ్యాముడవౌచు ప్రేమ పరమార్థ మలౌకిక దివ్యభావనా*
*ధామముగా రచించి, భవతారిణివై, పరమేశ్వరార్థమై,*
*మామక హృత్సరోజ సుమమాధురివై, స్ఫురియింతు వంబికా॥* 81

అమ్మా! రాముడుగా అవతరించి శివరూపమును తోపింపజేయుట ద్వారా పరబ్రహ్మ తత్త్వమును తెలిపి, రాధాకృష్ణుడవై ప్రేమను అలౌకికమైన దివ్యభావనా నిలయముగ సృజించి, జన్మముల తరింపజేయుచు, పరమేశ్వరుని అర్థాంగివై నా హృదయ కమలమున నుండెడి మధువువై స్ఫురించుచున్నావు.

*"రమంతే యోగినో యస్మిన్ నిత్యానంద చిదాత్మని*
*ఇతి రామపదేనైతత్ పరంబ్రహ్మాభిధీయతే॥"* - పద్మపురాణము.

నిత్యానందమైన చిదాత్మయందు యోగు లెవనియం దానందింతురో, అట్టి రామపదము పరంబ్రహ్మమని ధ్యానించెదరు.

*"శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే*
*శివస్య హృదయం విష్ణు ర్విష్ణోశ్చ హృదయం శివః॥"*
— సంధ్యావందనము.

కావున శివ కేశవులకు భేదము లేదు. అట్లే రామునకు శివునకు, దేవికి రామునికి అభేదమని ఉపనిషదాదులు తెలుపుచున్నవి. రామరహస్యోపనిషత్తు నందలి క్రింది ధ్యానశ్లోకములే ఇందుకు నిదర్శనము.

*"రామం త్రినేత్రగం సోమార్థధారిణం శూలినం పరం*
*భస్మోద్ధూళిత సర్వాంగం కపర్దిన ముపాస్మహే ॥*
*"రామాభిరామాం సౌందర్యసీమాం సోమావతంసకాం*
*పాశాంకుశ ధనుర్బాణధరాం ధ్యాయే త్రిలోచనామ్॥"*

మూడు కన్నులతో చంద్రార్థభాగముతో శూలధారియై భస్మమును దేహమంతట పులుముకొనిన పరుడగు రాముని ఉపాసించెదము. సౌందర్యసీమయై, సోముని అలంకరించుకొని, పాశము అంకుశము ధనువు బాణములను ధరించి త్రిలోచనయై యొప్పు రాముని మనోహరత్వమును ధ్యానించవలెనని భావము.

*శివశక్తి సమాయోగమే రాము డనుటకు –*
*"రాకార శ్శక్తిభిః ప్రోక్తా మః శంభుః పరికీర్తితా*
*శివశక్తి సమాయోగో యోగ ఏవవ న సంశయః ॥"*
*యోగ ఏవ న సంశయః ॥*
– మహాకాళరాత్రీతంత్రము 'రామ ఇత్యభిధీయతే ' అని పాఠాంతరము.

రాకారము (అగ్నిబీజము) శక్తి అనియు, మకారము శంభు డనియు శివశక్తుల సమాయోగమే రాముడనియు, అదే యోగ మనియు భావము.

ఇంకను - "శ్రీరామ శ్శ్యామలాదేవీ శ్రీకృష్ణో లలితాంబికా" "కదాచి దాద్యా లలితా పుంరూపా కృష్ణవిగ్రహా" శ్రీరాముడు శ్యామలాదేవి అనియు, శ్రీకృష్ణుడు లలితాంబిక అనియు, ఒకప్పుడు ఆద్యయైన లలితయే కృష్ణుడుగా పురుషరూపమును దాల్చెననియు భావము. పంచభూతముల సృష్టించిన పిమ్మట ఆ భూతాంశముల గైకొని పరాశక్తి తొలుత కృష్ణరూపమును దాల్చినట్లు దేవీభాగవతమున కలదు.

*"నందగోప గృహే జాతా యశోదా గర్భ సంభవా*
*తతస్తౌ నాశయిష్యామి వింధ్యాచల వాసినీ॥" - దుర్గాసప్తశతి (11-42)*
*మఱియు, "భోగే భవానీ రూపాచ దుర్గారూపాచ సంగరే*
*కోపేతు కాళికా రూపా పుంరూపా మదాత్మికా ॥"*

భోగమందు భవానీ రూపము, యుద్ధమున దుర్గారూపము, కోపమున కాళికా రూపము, నా ఆత్మయే పురుషరూపము "అహం దేవీ న చాన్యోస్మి" నేను దేవినే అన్యము కాదు అని పరమేశ్వర వచనము.

రాధాకృష్ణుల ప్రేమ అత్యున్నతము ఆదర్శవంతము. అది దైహికము కాదు, అలౌకికము భక్తునికి భగవంతునికి మధ్య విడదీయరాని ఏ బంధము కలదో, జీవబ్రహ్మైక్యమున ఏ భావమున్నదో, అదే రాధాకృష్ణుల ప్రేమ. ఆ ప్రేమ లోకోత్తరము.

ఉ॥ *గుండియ నాక్రమించితివి కూరిమి లోకమునందు జాటగా ;*
*నిండుగ వాక్కులం దవిలి నిల్చితి వాత్మగతంబు దెల్పగా ;*
*నండగ నుండి దేహమున నన్ని పనుల్ నెఱవేర్పు సత్వమై*
*యుండెడి నీదు తత్వము మహోజ్జ్వలమౌ కరణ త్రయంబుగా ॥* 82

అమ్మా! నీవు లోకమున ప్రేమను చాటుటకై హృదయ భాగము నాక్రమించితివి. మనోగతమును తెలుపుటకొఱకు వాక్కుగా వ్యక్తమైతివి. కర్మలు చేయుట కాధారమైన శక్తిగా దేహమున నిల్చితివి. ఇట్టి నీ స్వభావము త్రికరణములుగా ప్రకాశించుచున్నది.

త్రికరణశుద్ధి లేక చేయు కర్మమేదైనను పరిపూర్ణ ఫలదము కాదు. త్రికరణ శుద్ధివలన పవిత్రత, దానివలన దేవతానుగ్రహము, తద్ద్వారా కర్మసాఫల్యము కలుగును. కనుక దైవానుగ్రహముకొఱకు ముందుగా దేహమును, మనస్సును, వాక్కును సంస్కరించుకొని సాధన చేయవలెను. ఇట్లు సంస్కరించుకొనుటయే త్రికరణశుద్ధి. శ్రీదేవి మనోవాక్కాయ కర్మలందేకముగ నుండి జీవులలో త్రికరణ శుద్ధి ఆవశ్యకతను బోధించుచున్నదని భావము.

ఏకైకమైన పరాశక్తియే లక్ష్మి వాణి గిరిజలుగా రూపముల దాల్చినదని ధ్వని.

చం॥ *వెలుపల లో పసించుచు వివేకయుతంబుగ బుద్ధివృత్తులం*
*దెలుపుచు, ధర్మసంగతగతి న్నడిపించు నియంత్రిణిన్ నినుం*
*దలతు ; నవిద్య జిక్కి నిజతత్వ విదూరుడనై, తమస్సున*
*న్నిలిచితి, దారి జూపుము సునిశ్చిత సత్యము జేర భార్గవీ ॥* 83

దేహమునకు వెలుపల లోపల పసించుచు, వివేకముతో కూడిన బుద్ధి వృత్తులను తెలుపుచు, ధర్మ మార్గమున నడిపించు నియంత్రిణివైన నిన్ను స్మరించుచున్నాను. అవిద్యయందు చిక్కుకొని నిజతత్వమునకు దూరమై, చీకటి యందున్న నాకు సత్యప్రకాశినివైన నీవే సత్యమును చేరు త్రోవ జూపుము.

*"బహిరంతశ్చ భూతానా మచరం చరమేవచ*
*సూక్ష్మత్వాత్తదవిజ్ఞేయం దూరస్థం చాంతికే చ తత్ ॥ భగవద్గీత (13-6)*

పరబ్రహ్మము చరాచరములందు వెలుపల లోపల వర్తించుచు, మిక్కిలి సూక్ష్మముగ నుండుటవలన, అజ్ఞానులకు తెలియబడక దూరమున నుండినను జ్ఞానులకు సమీపముననే యుండునని భావము.

"సైష పురత్రయం శరీరత్రయం వ్యావ్య బహిరంత రవభాసయంతీ" బహ్వృచోపనిషత్ (4), ఆమె (పరాశక్తి) శరీరత్రయమయిన మూడు పురములందు (స్థూల సూక్ష్మకారణ దేహములందు) వ్యాపించి వెలుపల లోపల ప్రకాశించుచున్నది.

తమస్సు = చీకటి - ఇక్కడ అజ్ఞానము లేక మాయ

ఉ॥ *నీ పద పారిజాత పరిణిష్ఠితమైనది నా మనంబు ; నే*
*బావర, దీనుడం దవుల వర్తిలు వాడ, దయార్ద్రి ; నన్ను నీ*
*దాపున నుండువారి వలె ధన్యు నొనర్పవె ; ఒక్కరీతిగా*
*దాపున దవ్వులం దుహిన ధాముడు చల్లుగదా సుధాంశువుల్* ॥ 84

పారిజాతముల వంటి నీ పాదములందు నా మనస్సు చక్కగా లగ్నమయినది. నేనా శిశువును (అజ్ఞానిని), దీనుడను, నీకు కడు దూరమున ఉన్నవాడను. నీదయ నర్థించుచున్నాను. నీ సన్నిధియం దుండెడి వారిని వలె నన్ను కూడ ధన్యుని చేయుము. చంద్రుడు దగ్గర దూర మనక, అంతటను ఒకే విధముగ కిరణముల ప్రసరించుచుండుట లేదా!

ఇచ్చట శ్రీ శంకర భగవత్పాదుల వారి సౌందర్యలహరి శ్లోకభావము స్మరింపబడినది.

*'దృశా ద్రాఘీయస్యా దరదళిత నీలోత్పల రుచా*
*దవీయాంసం దీనం స్నపయ కృపయా మామపి శివే!*
*అనేనాయం ధన్యోభవతి న చ తే హానిరియతా*
*వనే వా హర్మ్యే వా సమకర నిపాతో హిమకరః* ॥ (57)

అమ్మా! శివా! విశాలములై అరవిరిసిన నల్ల కలువల వంటి కాంతిగల నీ చూడ్కులతో, నీకు కడు దూరమున నున్న దీనుడనగు నన్ను తడుపుము. ఇందువలన ఇతడు ధన్యుడు కాగలడు. నీకు పోవున దుండదు. చంద్రుడు వనములందును భవనములందును తన చల్లని కిరణముల సమానముగ చల్లుట లేదా?

శా॥ *నీ చిద్భావము జీవరూపమున నందీపింప నాభాసమై*
*నీ చిద్భావము ప్రత్యగాత్మ యనగా నిల్చున్ సదా వానితో ;*

*నీ విద్గానము నామ రూప జగతి నిర్మింప నోంకారమై,*
*నీ విద్గానము స్వస్వరూపమగు దానిం దెల్పు నుద్దేశమై ॥* 85

అమ్మా! పరబ్రహ్మాత్మికా ! నీ చిత్ప్రకాశము జీవుని రూపమున ప్రతిఫలించి (అభాసమై) కన్పింపగా, నీ చిదాత్మ (సత్తా) ప్రత్యగాత్మ లేక కూటస్థుడను సంజ్ఞతో జీవుని వెంట వాని దేహమున వసించుచు, అతడొనర్చు సర్వకర్మలకు సాక్షిగా నున్నాడు. నీ చిత్కళనుండి పుట్టిన నాదము ఓంకారమై నామ రూప మయమైన విశ్వమును నిర్మింపగా, నీ చిద్రూపమైన గానము సామవేదమై, నిత్య సత్యమగు స్వరూప జ్ఞానమును తెలుపుచున్నది.

అభాసమనగా లేనిది ఉన్నట్లు తోచుట, అద్దములో ప్రతిబింబమువలె. చిదాభాసుడు జీవుడే. పరమాత్మ చిదాభాసుడై జీవభావమును వహించి, ఆత్మీయతను (స్వస్వరూప జ్ఞానమును) మఱచి పోవుచున్నాడు. కాని కంసాలి దాకలి వలె ఎట్టి మార్పు లేని కూటస్థుడు (చిదాత్మ) ప్రతి దేహమందును నివసించుచు, జీవుని కర్మలకు సాక్షియై యున్నాడు. చిచ్ఛక్తి ఓంకార రూపమున నాద బ్రహ్మము, శబ్ద బ్రహ్మమని పిలువబడుచు, నామ (పేర్లు) రూపములుగా (పదార్థములుగా) విశ్వమును నిర్మించుచున్నది. చిద్గతగానము (లయగతస్పందనము) సామవేదమై నిత్యము సత్యము అయిన జ్ఞానమూర్తిని (పరమాత్మను) తెలుపుచున్నది. కనుక సర్వము నీయొక్క వ్యక్తావ్యక్త స్వరూపమే కాని అన్యము కాదు.

ప్రత్యగాత్మ - మార్పులేని (నిర్వికారుడైన) పరమాత్మ. ఇతడే కూటస్థుడు, సాక్షి, చిదాత్మ, అను సంజ్ఞలతో తెలియబడుచున్నాడు.

జీవుడు - అంతఃకరణమున (మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము) ప్రతిఫలించిన ప్రత్యగాత్మ స్వరూపము.

జగతి – 'అతిశయేన గచ్ఛతీతిజగత్' అను వ్యుత్పత్తి వలన ప్రతిక్షణము మార్పు చెందు స్వభావము కలది. లేక ఏకముగా ఉండనిది. కాబట్టి, జనించి గతించునది - ప్రపంచము. ఇది భావమందే పుట్టి భావమందే లయించుచున్నది. బహిఃప్రజ్ఞ లేని వానికి ప్రపంచమే లేదు.

విశ్వరూపము వరాహోపనిషత్తులో ఇట్లు వర్ణింపబడినది.
"నాఽ నందం న నిరానందం న చలం నాఽ చలం స్థిరం
న న న్నాఽన న్నచైతేషాం మధ్యం జ్ఞాని మనో విదుః ॥

యథా సౌక్ష్మ్యా చ్చిదాభాన్య ఆకాశో నోపలక్ష్యతే ।
తథా నిరంశ శ్చిద్భావ స్సర్వగోఽ పి న లక్ష్యతే ॥

సర్వ సంకల్పరహితా సర్వ సంజ్ఞా వివర్జితా ।
సైషా చిదవినాశాత్మా స్వాత్మేత్యాది కృతాభిధా ॥

ఆకాశ శతభాగాచ్ఛా జ్ఞేషు నిష్కళ రూపిణీ
సకలామల సంసార స్వరూపైకాత్మదర్శినీ ॥

నాఽ స్తమేతి నచోదేతి నోత్తిష్ఠతి న తిష్ఠతి ।
న చ యాతి నచాయాతి న చ నేహ న చేహచిత్ ।
సైషా చిదమలాకారా నిర్వికల్పా నిరాస్పదా ॥

ఆనందమైనది కాదు, ఆనందము కానిది కాదు. కదలునది కాదు, కదలనిది కాదు. స్థిరమైనది. ఉన్నది కాదు, లేనిది కాదు, వీనికి మధ్యస్థముగ జ్ఞానాత్ముల మదులలో మాత్రము తెలియబడునది.

జ్ఞానము యొక్క ప్రతిఫలనము లేకుండుటవలన (చిదాభాస), ఆకాశ మెట్లు తెలియబడుట లేదో, నిరంశ యగుటవలన చిద్భావము అంతట నెలకొని యున్నను, గోచరము కాదు.

ఎట్టి సంకల్పములు, నామములు లేక, నాశ రహితమైన ఆ జ్ఞానము ఆత్మయని పిలువబడుచున్నది.

ఆకాశము యొక్క నూఱవ (స్వల్ప) భాగము మాత్రమే ప్రతిఫలించినట్లు, సకలము అమలము ప్రపంచ స్వరూపము అయిన నిష్కళారూపిణి, ఏకాత్మను జ్ఞానుల మదులలో దర్శింపజేయును.

ఉదయాస్తమయములు లేనిది, నిలిచికాని కూర్చొనికాని ఉండనిది, పోవునది కాని వచ్చునది కాని కానిది. అది కోరిక కాదు, కోర్కె కానిది కాదు, అమలమైన చిదాకారము, నిర్వికల్పము, నిరాశ్రయము అని భావము.

ఉ॥ శేషిగ నిన్నలంచి పరిశీలన జేసిన శేష మౌదు ; వా
శేషమునే గ్రహించి మది చింత నొనర్పగ శేషి వౌదు ; వీ
శేషము - శేషి రెండు ప్రవచించెడి సత్యము నీవ యౌట, ని
శ్శేషము నిన్నె నా హృదయ సీమ వెలింగెడి జ్యోతి గొల్చెదన్ ॥ 86

నిన్ను శేషిగా (ప్రధానమైనదిగ) భావించి విమర్శింపగా శేషముగ (అప్రధానమైనదిగ) తోచుదువు. శేషముగనే గ్రహించి ఆలోచించిన శేషి వగుదువు. ఇపుడు శేషము - శేషి అనెడి రెండు పదములు పలికెడి (తెలిపెడి) సత్యమునకు మూలాధారమై, నా హృదయమున జ్యోతివై వెలుగునది నీవేయని గుర్తించి నిన్నే సేవించెదను. శేషము నీవే - శేషియు నీవే అని భావము.

ప్రధానము తొలగిన మిగులునది శేషము. అది అప్రధానము. అట్లుగాక ఏమియు మిగులక స్థిరముగ నుండునది శేషి. ఇది ప్రధానము. ఇచట తెలియవలసినది, మహాప్రళయాంతమున సృష్టి సర్వము నశింపగా నశింపక స్థిరముగ ఉండున దెవరు ? శివుడా? శక్తియా? ఎవరు ప్రధానము ? ఎవ రప్రధానము? అని.

శక్తిని భరించువాడు శివుడగుట వలనను, ఆయనచే భరింపబడునది (భార్య) శక్తి కనుకను, శివుడే ప్రధానమని, శక్తి అప్రధానమని తోప వచ్చును. కాని శక్తి లేక ఏ కార్యము నిర్వహింపబడుట లేదు కదా? శివునికి భరించెడి సామర్థ్యము (భర్తృత్వము) శక్తివలననే కలుగుచున్నది. నిర్వహణ సామర్థ్యము శక్త్యంశమే కనుక, శక్తియే ప్రధానమని ఉత్తరకౌళులు శక్తి పారమ్యమును కీర్తించెదరు.

శివుని కాధారము శక్తి. శక్తి రూపము శివుడు. కావున శివుడు లేక శక్తి కాని, శక్తి లేక శివుడు కాని లేరు. చంద్రుడు వెన్నెలల వలె వారిలో భేదము లేదు.

"న శివేన వినా దేవి న దేవ్యా చ వినా శివః
ఏ తయో రంతరం నాస్తి చంద్ర చంద్రికయో రివ ॥"

— కామ కళావిలాసమ్.

మఱియును అధిష్ఠాన, అవస్థాన, అనుష్ఠాన, అన్వయ, ఆకారాది లక్షణములు, ఇరువురియందు ఉండుటచే, ఇరువురు సమానులేయని, సమయులు పల్కుదురు.

శక్తి ప్రాధాన్యమును చాటుచునే, పూర్వకౌళులు శివ శక్తులలో ప్రాధాన్యతాఽప్రాధాన్యతలు ఒకవరి ఒకరియందును, వేరొకవరి వేరొకరి యందును భాసించుచుండునని వాదింతురు. సృష్టికాలమున శక్తి ప్రాధాన్యత వహించి వరారూవమున అగ్రభాగమున నిలువగా, శివుడు వరాచిద్రూవమున సాధన మాత్రమై యుండును. కనుక సృష్టియందు శక్త్యంశము 'శేషి' (ప్రధానము), శివాంశము శేషము (అప్రధానము) అగుచున్న దనియు; ప్రళయ సమయమున శక్తి శివునియందొక భాగమై అప్రధానముగ నుండ, శివాంశము ప్రళయ రుద్రుడై, మహాకాలుడై సృష్టి నంతరింప జేయుననియు, ఈ స్థితియందు శివుడు శేషి, శక్తి శేష మగుననియు చెప్పుదురు.

'శేష - శేషి' భావము అద్వైతమునకు విరుద్ధము. అది భావనయందే కాని వాస్తవమునకు లేదు. సృష్టియందు కాని, స్థితియందు కాని, లయమందు కాని శక్తి - శక్తిమంతు లిరువురు ఒకటై యుండక తప్పదు. అట్టి తత్త్వమే వరతత్త్వము. అదే అద్వైతము.

శా॥ *విద్యారూపిణి వీవు, నేను జడతాఽవిద్యాంధతాకార దు*
*ర్భేద్యంబైన తమశ్శరీరుడ ; గృపా వీక్షా ప్రసారంబులం*
*బ్రోద్యత్తత్త్వ వథంబున న్నిలిపి న న్బోధింపు ; తద్ జ్ఞాన సం*
*పాద్యజ్జ్యోతి, మదీయమానస తమఃప్రాచుర్యము న్గూల్చుతన్॥* 87

అమ్మా! నీవు ప్రజ్ఞాన స్వరూపిణివి. నేనో, జడత్వము అవిద్యాంధత్వముల రూపమై భేదింపరాని తమస్సును దేహముగ గలవాడను. దయాప్రచురములైన నీ చూడ్కుల నాపై వఱపి, నన్ను తత్త్వమార్గమున నిలిపి, బోధించుటకు దయసేయుము. సంపాదింపదగిన ఆ జ్ఞాన జ్యోతి నా మనస్సు నావరించిన అజ్ఞాన మనెడి చీకటిని తొలగించును గాక!

*"విద్యాసు శాస్త్రేషు వివేకదీపే ష్వాద్యేషు వాక్యేషుచ కా త్వదన్యా ।*
*మమత్వగర్తేతి మహాంధకారే విభ్రామయత్యేతదతీవ విశ్వమ్ ॥"*

— దుర్గాసప్తశతి (11-31)

వివేకమనెడి దీపమును వెలిగించెడి విద్యలందును, శాస్త్రములందును, వేదవాక్యములందును నీవుగాక మఱెవ్వ రున్నారు? అయినను ఈ విశ్వమును మమకారమనెడి గుంటలో, మహాంధకారమున నిల్పి మఱల మఱల తిరుగుచుండునట్లు నీవే చేయుదువని భావము.

సత్త్వగుణము ఇంద్రియములుగను, ఇంద్రియాధిష్ఠాన దేవతలుగను, తమోగుణము ఆవరణము (వస్తువు)గను ఏర్పడునని తత్త్వజ్ఞులు చెప్పుదురు. తమత తమశ్శరీరుడనుట సాభిప్రాయము. విద్యయు జ్ఞానమును జ్యోతి స్స్వరూపములు. తత్త్వవిజ్ఞానమువలన అజ్ఞానాంధకారము నశించుట సహజము కదా!

పరమేశ్వరి విద్యారూపిణి-ఆత్మవిద్య-మహావిద్య-శ్రీవిద్య -(ల.స.నా.)

ఉ॥ *నీవు ధ్వని ప్రధానమగు నిర్మల నాద శరీర, నేను శ్వ*
*ద్భావ సముద్గతార్థగత పార్థివ దేహుఁడ; నీకు నాకు సం*
*భావన భేదమున్నను, స్వభావ పరిచ్యుతిగాదు; నామ రూ*
*పావధి దాటుచో నొకటియౌ గదే ద్వంద్వము కానరాదుగా॥* 88

ఓ చిద్రూపిణీ! నీవు ధ్వని ప్రధానమై నిర్మలమయిన నాదము స్వరూపముగ గలదానవు. నేనో, నీ భావమును దెలుపు అర్థమును - పదార్థమును. నా దేహము పృథ్వీసంభూతము. నీకును నాకును పిలువునందు భేధమున్నను, అది స్వభావమునుండి తొలగుటవలన కలిగినది కాదు. నామము రూపము అను హద్దులను దాటినచో ఒకటే యగును కదా! ద్వంద్వము కనిపించదు.

నాదము లేక శబ్దము వాక్కు యొక్క ఆదిమ అవ్యక్త రూపము. శబ్దమును దానిని అనుగమించి ఏర్పడు అర్థమును కలిసి ప్రపంచమును సృష్టించినవి. అపగా తొలుత పేరు వినబడినది. పిమ్మట దానికి లక్ష్యముగా వస్తువేర్పడినది. ఈ ద్వంద్వమే వాగర్థములు లేక నామరూపములు. అవి విడదీయరానివి. తమోగుణమువలన వస్తువు(పదార్థము) లేర్పడుట పై పద్యమున తెలుప బడినది.

*"సచ్చిదానంద విభవా త్సకలా త్పరమేశ్వరాత్*
*ఆసీచ్ఛక్తి స్తతో నాదో నాదాద్బిందు సముద్భవః॥" - శారదాతిలకం*

సచ్చిదానంద విభవుడైన సకల పరమేశ్వరునుండి శక్తియు, శక్తినుండి నాదము, (సాదాఖ్య లేక సదాశివుడు), నాదమునుండి బిందువు (ఈశ్వరుడు) కలిగిరి.

"సృష్ట్యున్ముఖ పరమశివ ప్రథమోల్లాస మఖండోః వ్యక్తో నాద బిందుమయ ఏవవ్యాపకో బ్రహ్మాత్మక శ్శబ్దః" సృష్టికి ఉన్ముఖుడైన పరమ

శివుని మొదటి ఉల్లాసము అఖండము, అవ్యక్తము అయిన నాద బిందువులు కలదనియు, దాని వ్యాపకము బ్రహ్మాత్మక శబ్ద మనియు, రాఘవభట్టు వివరణ.

పరమాత్మ మలరహితుడు. జీవాత్మ మల సహితుడు. పరమాత్మయని, జీవాత్మయని పిలచెదరు కనుక సంబోధనయందు భేదము కలదు కాని, అవిద్య తొలగినపుడు జీవాత్మయే పరమాత్మ యగును కావున, భేదము లేదు. ఆవరణము వలననే భేదము కలుగుచున్నది.

దేవి "పాదరూప - నామరూప వివర్జిత" - (ల.స.నా.)

చం॥ *అగుదు బహు ప్రకారము లటంచు జగత్ప్రభవైక హేతువై*
*స్వగతమునైన కామముగ స్పందనమందు త్వదీయ తత్త్వమున్*
*నిగమము లెన్న నేరవన, నేర్పున దెల్ప నవుజ్ఞ్య దమ్మ! నీ*
*యగపడు రూప వైభవము నైన వచించునే! విశ్వవిగ్రహా!* 89

విశ్వమే శరీరముగ గల తల్లీ! నే ననేక రూపములుగా విస్తరింతునని సంకల్పించి, సృష్టికి కారణమైన నీ కోరికను, ఇచ్ఛా జ్ఞాన క్రియా శక్తుల రూపమున స్పందింపజేసిన నీ తత్త్వమును వేదములే తెలుపజాలవన, ఆకృత పుజ్ఞ్యడెట్లు పలుకగలడు? వ్యక్తమైన నీ రూపసంపద నైనను తెలుపలేడు.

స్వగతమునైన కామము - అనగా అన్యప్రేరణము లేక తననుండి పెల్లుబికిన ఇచ్ఛ. రెండవదొకటి ఉండిననే కదా అన్యప్రేరణ కవకాశము. తనకంటె భిన్నమయినది వేరొకటి లేనందున పరమాత్మకు ప్రేరణము తన నుండే కలిగినది.

"సోఽ కామయత । బహుస్యాం ప్రజాయే యేతి । స తపోఽ తప్యత । సతపస్తప్త్వా । ఇదగ్ం సర్వ మసృజత ॥" - తైత్తిరీయోపనిషత్ - బ్రహ్మవల్లి - 6వ అనువాకము. పరమాత్మకు తా ననేక రూపములు కావలెనని కోరిక పొడముటచే చక్కగా ఆలోచించి ఈ జగమును సృష్టించెనని భావము. ఇట్లు ఈ ప్రపంచము, ప్రపంచమందలి సకల పదార్థములు, జీవులును ఆయన రూపములే కాని అన్యములు కావు. ప్రపంచ సృష్టి క్రమములో కలిగిన ఇచ్ఛా జ్ఞాన క్రియా శక్తి స్పందనములను సామాన్యుడు తెలిసికొనలేకున్నను, వాని ఫలితముగ ఏర్పడి, స్థూల నేత్రములకు అగుపించుచున్న, బాహ్య ప్రకృతినైనను సమగ్రముగా అర్థముచేసికొన లేక, భేదమును భావించి సత్యమును మఱచు చున్నాడు.

శా॥ నీ యిచ్ఛా పరిపూర్తి జ్ఞానయుతమై, నిత్యం క్రియోపేతమై,
మాయా మండితమై, గుణత్రయము సంభావించి సృష్టించుచో
నీ యానందము ప్రేమ భావముగ నందీపించె విశ్వంబునన్;
నీ యాకారము సర్వ సంభృతముగా నిల్చెన్ విరాడ్రూపమై ॥ 90

అమ్మా! నీ కోరిక (దేవమనుష్యాది బహురూపములుగా అగుదు ననియెడి ఇచ్ఛ) పరిపూర్ణతను కోరి, తొలుత జ్ఞానముతోడను, పిమ్మట క్రియతోడను కూడికొని, మాయారూపమున వికసించి, సత్త్వ రజ స్తమో గుణములను సంభావించి, లోకములను సృజించునపుడు, నీ ఆనందము విశ్వమున ప్రేమయై భాసించినది. సృష్టియందలి సర్వ వస్తు గుణ స్వభావముల చక్కగా ధరించిన నీ ఆకారము విరాడ్రూపమయినది.

పరమాత్మ యొక్క సృష్టికామము స్పందనరూపమున ప్రకాశము పొంది ఇచ్ఛాశక్తి అని పిలువబడినది. ఈ ఇచ్ఛయే బాగుగా విమర్శింపబడి జ్ఞానశక్తిగా మారినది. జ్ఞానశక్తి కార్యోన్ముఖమైనపుడు క్రియాశక్తియైనది. ఈ మూడు శక్తుల సమష్టి రూపమునకు మూలప్రకృతి అని పేరు. అదే మహామాయ లేక విష్ణుమాయ. ఈ మాయవలననే జగత్సమూహము లేర్పడినవి. "యా మా సా మాయా" బాహ్యదృష్టికి ఉన్నట్లు తోచి, విమర్శించి చూచినపుడు లేనిది మాయ. "సాకారోపి నిరాకారా మాయా బహు రూపిణీ" - మహా నిర్వాణతంత్రము.

"బ్రహ్మణో రవ్యక్తః । అవ్యక్తా న్మహాతః । మహతోఽహంకారః॥ అహంకారాత్పంచ తన్మాత్రాణి॥ పంచ తన్మాత్రేభ్యో పంచ మహాభూతాని । పంచ మహాభూతేభ్యోఽఖిలం జగత్॥" - శ్రుతి. సృష్టికి పూర్వము వ్యక్తము కానిది అవ్యక్తము. అది బ్రహ్మమునుండి ఏర్పడినది. అవ్యక్తమునుండి మహత్తు, మహత్తునుండి అహంకారము ఇట్లు పరిణామము చెందుచు మూలప్రకృతియే విశ్వముగ రూపము దాల్చినది.

ఇట్టిదని తెలియబడని మూలప్రకృతి సత్త్వోద్రిక్తమువలన అవ్యక్తముగను, అవ్యక్తమునుండి రజోద్రేకమువలన మహత్తు అనెడి విక్షేప (కదలెడి) శక్తిగను, మహత్తునుండి అహంకారముగను తోచి, వస్తు రూపమున అంతఃకరణముగను మనస్సు, బుద్ధి, చిత్తము, శబ్ద స్పర్శ రూప రస గంధము లనెడి తన్మాత్రలుగను, పృథివ్యాపస్తేజో వాయు రాకాశము లనెడి పంచ మహాభూతములుగను, వానినుండి త్వ క్చక్షు శ్రోత్ర జిహ్వా ఘ్రాణము లనెడి జ్ఞానేంద్రియములుగను

వాక్పాణి పాద పాయూపస్థలనెడి కర్మేంద్రియములుగను జగత్తు సర్వము వ్యక్తమయినది.

అవ్యక్తమున ఈశ్వరుడు, మహత్తున హిరణ్యగర్భుడు, అహంకారమున సర్వస్థూల పాలకుడైన విరాట్టు, కలిగిరి. మహత్తునుండి అంతఃకరణము గుణములు పుట్టినవి. అహంకారము వైకారిక, తైజస, భూతాది, నామములతో సాత్త్విక, రాజస, తామస రూపముల దాల్చి సృష్టి కుపకరించినది. శివశక్తుల సామరస్యము వికృతము (భంగము) అగుటవలన కలిగిన అహంకారము వైకారికము. దీనివలన దిక్కులు, వాయువు, అర్కుడు, వరుణుడు, అశ్వినులు, అగ్ని, ఇంద్రుడు, ఉపేంద్రుడు, మిత్రుడు, చంద్రుడు అనెడి ఇంద్రియాధిష్ఠాన దేవతలును ; తైజసాహంకారమునుండి ఇంద్రియములును ; భూతాద్యహంకారమునుండి పంచ తన్మాత్రలు, పంచ మహాభూతములు కలిగినవి.

## ఇంద్రియాలు - అధిష్ఠానదేవతలు

| | |
|---|---|
| మనస్సు - చంద్రుడు | జిహ్వేంద్రియము - వరుణుడు |
| బుద్ధి - చతుర్ముఖుడు | ఘ్రాణేంద్రియము - అశ్వనీదేవతలు |
| చిత్తము - క్షేత్రజ్ఞుడు | వాగింద్రియము - చతుర్ముఖుడు |
| అహంకారము - రుద్రుడు | పాణీంద్రియము - ఇంద్రుడు |
| త్వగింద్రియము - వాయువు | పాదేంద్రియము - ఉపేంద్రుడు |
| చక్షురింద్రియము - సూర్యుడు | పాయ్వింద్రియము - మృత్యువు |
| శ్రోత్రేంద్రియము - దిక్కులు | ఉపస్థేంద్రియము - ప్రజాపతి |

ఇట్లు మూలప్రకృతి విశ్వమై సకల సృష్టికి కారణమైనది.

శ్రీదేవి - 'విశ్వాత్మిక - విశ్వరూప - విశ్వధారిణి - విశ్వాధిక - ఇచ్ఛాశక్తి జ్ఞానశక్తి క్రియాశక్తి స్వరూపిణి - త్రిగుణ - త్రిగుణాత్మిక - (ల.స.నా.)

ఉ॥ *నిర్గుణమైనచో దెలియనేర రటంచు గుణ ప్రసన్నవై*
*సర్గము లెన్ని దొక్కటియు సర్వము నిర్వహణం బొనర్చి, సం*
*సర్గ నివృత్తి గేవలము సాక్షిగ నిల్చు సవిత్రి వీవు, నిన్*
*భర్గ వరేణ్య తేజమును బ్రాహ్మని వైష్ణవి రౌద్రి మెచ్చెదన్* ॥ 91

గుణ సంసర్గము లేని దానిని తెలిసికొనుట కష్టము కనుక, నీవు గుణములతో ప్రసన్నవై, నవ విధములైన సృష్టులను చేసి కూడ, వానితో

నంబంధము లేక, కేవలము సాక్షివై యున్నావు. సృష్టి స్థితి సంహార కార్యములను బ్రాహ్మి వైష్ణవి రౌద్రీ రూపములతో నిర్వహించు సవిత్రివి నీవు. భర్గనాత్మకమైన (నమస్త బంధములను పాపములను నశింపజేయునట్టి) కోరదగిన శ్రేష్ఠమయిన భర్గనామకమగు తేజస్స్వరూపిణివి. ఇట్లు ముగురమ్మలకు మూలరూపమైన నీకు మ్రొక్కెదను.

పరమాత్మకు గుణములతో కలయిక లేనంతకాలము రూపము కూడ లేదు. అపుడు పరశివ, పరానంవిత్ నామములతో పేర్కొనబడును. నిర్గుణము నిశ్చలమునైన ఈ పరతత్వము గుణములతో కూడి నగుణము నచలము అగును. అనగా శబల బ్రహ్మమై ఆవరణమును ధరించి వ్యక్తమగును. ఈ నగుణ బ్రహ్మమే సృష్టికి కారణము. ఈ సృజనాత్మక శక్తిని సావిత్రి (నవితృశక్తి) అందురు. ఇది పరమాత్మయొక్క శ్రేష్ఠమగు తేజమే కాని మఱియొకటి కాదు.

*"సవితా సర్వ భూతానాం సర్వ భావ శ్చ సూయతే*
*సృజనా త్ప్రేరణా చ్చైవ సవితా తేన చోచ్యతే ॥"*

—యోగయాజ్ఞవల్క్యము.

నర్వభూతములను భావములను సృజించి ప్రేరేపించుటవలన నవిత. ఇది ప్రేరేపక శక్తి.

భర్గ : "నర్వ పాపానాం నంసారన్య చ భర్జన నమర్థ తేజః నత్యజ్ఞానాది వేదాంత ప్రతిపాద్యం, అవిద్యానామ కర్మాది భర్జనాత్ భర్గః॥" - నంధ్యావందన భాష్యము.

నర్గమనగా సృష్టి. ఇది తొమ్మిది విధములుగ చెప్పబడినది. 1. మహత్సర్గము, 2. అహంకార నర్గము, 3. భూతనర్గము, 4. ఇంద్రియ నర్గము, 5. దేవనర్గము, 6. తమస్సర్గము, 7. వనస్పత్యాది నర్గము, 8. తిర్యక్ నర్గము, 9. మనుష్యనర్గము. దేవనర్గము నుండి మనుష్య నర్గము వఱకు ఒక్కొక్క దానిలో అవాంతర భేదములు గలవు. వివరణకు అవకాశము లేదు. పరమేశ్వరి "బ్రాహ్మి - బ్రాహ్మణీ - వైష్ణవీ - విష్ణురూపిణీ - రౌద్రీ - సావిత్రీ - నర్వసాక్షిణీ - సాక్షివర్జితా" - (ల.న.నా.)

శా॥ *అంతస్సృష్టియు బాహ్యసృష్టి యన, దేహంబందు, విశ్వంబునం*
*దంతర్యామిని వొచు, నెల్లెడల నాత్మానంద రూపంబునం*
*గ్రాంతిం దోచు శుభాకృతిన్ భగవతిం గళ్యాణి శ్రీమాత దు*
*ర్దాంత ధ్వాంత మయూఖ ని న్స్మరయు వారల్ ధన్యజీవుల్ గదా॥* 92

విశ్వవేదన

అంతస్సృష్టిగా దేహమందును, బాహ్యసృష్టిగా విశ్వమందును వర్తించుచు, అంతటను ఆత్మానందరూపమున చూపట్టుచున్న మంగళాకృతివి. ఐశ్వర్యయుతవు, కళ్యాణివి, మాతలకు మాతయైన శ్రీమాతవు. అణచివేయరాని చీకటికి వెలుగువు. నిన్ను చూచు వారలు ధన్యజీవులు కదా!

*"సృష్టిస్తు ద్వివిధా ప్రోక్తా బాహ్యాభ్యంతర భేదతః ।*
*అంతరా మానసీ ప్రోక్తా బాహ్యా భూతమయీ స్మృతా॥"*

— కాలశక్తి విలాసః

బాహ్యాభ్యంతర భేదములవలన సృష్టి రెండు విధములు. అందు మనస్సంబంధమైనది అంతస్సృష్టి. భూతములతో కూడినది బాహ్యసృష్టి. కనులకు ఊహకు కనిపించు స్థావర (కదలని) జంగమ (కదలెడి) వస్తు సముదాయము సర్వము బాహ్యసృష్టియే. అనగా లోకములు గ్రహములు నక్షత్రములు సకల జీవులు, దేవ దానవ యక్ష రాక్షస కిన్నర కింపురుష మానవ జంతు వృక్ష పక్షి సముదాయములతో ఏర్పడిన విరాడ్రూపము. దీనికి అధినేత్రి మూలప్రకృతి.

అంతస్సృష్టి అనగా పిండాండము - పిండమువలన అభివృద్ధి పొందు దేహము. బాహ్యసృష్టి యందలి పదార్థము లన్నియు ఇచట కూడ కలవు. ఇంద్రియాధిష్ఠాన శక్తులే దేవతలు. ఆధారాది చక్రములు లోకములు. రెండేసి చక్రములకొకటి వంతున అగ్ని సూర్య చంద్ర మండలములు. సాత్విక రాజస భావసంఘర్షణలు దేవదానవ యుద్ధములు. ఇట్లే తదితర విషయములు కూడ. దీనికి అధినేత్రి మహాత్రిపురసుందరి లేక కుండలినీ పరాశక్తి.

శా॥ *ఆదిన్ నీ వఖిలాండకోటి సృజన వ్యాపార దీక్షా విధి*
*స్ఫీదౌ తేజ మనేక రీతు లనుసంధింపం, దదీయాంశముల్*
*భేదంబున్ బ్రకటించి జీవగణమై విశ్వోద్గతిం బాప, నీ*
*వా దేహంబుల సాక్షివై నిలువవే యాత్మానుబంధంబునన్॥* 93

తొలుత అండ పిండ బ్రహ్మాండములను సృజించు దీక్షయందు నీ చైతన్యమును నీవు బహువిధములుగా విభజించుకొంటివి. అట్లు విభాజితములైన (వేరువడిన) చైతన్యాంశములు, ఆవరణముల ధరించి, భేదమును వహించి, జీవకోటిగా ప్రపంచపు పుట్టుకను వెల్లడింప, నీ వా జీవుల శరీరములందే ఆత్మబంధమువలన సాక్షివైయున్నావు.

ఇచట పరమాత్మాంశములయిన జీవుల పుట్టుక భావింపబడినది. సృష్టికి కారణము మూలప్రకృతి. ఇది శివశక్తి సమైక్య రూపము. సంవిద్రూపమైన పరాశక్తి లేక పరమాత్మకు తా ననేకము కావలె ననెడి కోరిక గల్గినది. ఆ ఇచ్ఛాస్ఫూర్తి జ్ఞానక్రియాత్మకమై సృష్టి ఏర్పడినది. సృష్టి యందలి ప్రతి పదార్థము ఎక్కడ నుండియో వచ్చినది కాదు. అంతవఱకు పరమాత్మయందు లీనమై పరమాత్మగా తెలియబడినదే. కనుక సృష్టితో కనిపించిన జీవుడు పరమాత్మకంటె వేరు కాదు. " బీజం మాం సర్వ భూతానాం విద్ధి పార్థ సనాతనం"

*"మత్తః పరతరం నాన్యత్కించిదస్తి ధనంజయ*
*మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ॥"*

భగవద్గీత (7-10,7)

నన్ను సమస్త ప్రాణుల బీజముగా తెలిసికొనుము. నాకంటె వేరైన దేదియు లేదు. దారమందు మణులవలె నాయందు ప్రపంచమంతయు కూర్చబడియున్నది అని భావము. కనుక జీవుడు ఆత్మయే. ఇంకను -

*"నిశ్చరన్తి యథా లోహపిండాంతస్థాః స్ఫులింగకాః*
*సకాశా దాత్మన స్తద్వత్ ప్రభవన్తి జగన్తి హి॥"* -యోగ యాజ్ఞవల్క్యము

కాలిన లోహపు ముద్ద నుండి అగ్ని కణములు వెలువడునట్లు లోకములు పుట్టుచున్నవి. "అజశ్శరీర గ్రహణాత్సజాత ఇతి కీర్త్యతే॥" - బ్రహ్మపురాణము. పుట్టుకయే లేని పరమాత్మ శరీరముల గ్రహించుటవలన జన్మించినట్లు చెప్పబడుచున్నాడు.

ఇట్లు సృష్టి ప్రారంభమున ఆత్మనుండి వెలువడి (ప్రతిఫలించి) ఆవరణమును దాల్చిన జీవాత్మ, అవిద్యవలన శరీరమే తాననియు, తాను వేరు ఆత్మవేరనియు భావించుటవలన ఆత్మ విస్మృతి కలిగినది. కాని తననుండి విడివడిన స్వీయాంశములను పరమాత్మ విసర్జింపలేదు. కనుక తాను కూడ జీవికి తోడై వాని హృదయ కమలమున ప్రవేశించియే యుండును.

"య దిదం కించ॥ తత్సృష్ట్వా॥ తదేవాను ప్రావిశత్॥ తదను ప్రవిశ్య॥ స చ్చత్యచ్చా భవత్ ॥" - తైత్తిరీయోపనిషత్ - బ్రహ్మవల్లి - 6వ అనువాకం.

పరమాత్మ ఈ ప్రపంచమనుదానిని సృజించి దానియందే అంతర్యామిగా ప్రవేశించెను. అట్లు ప్రవేశించి చేతనాః చేతన పదార్థములుగా

అయ్యెనని భావము. కాని అతడు సాక్షి మాత్రుడు కాగా, జీవుడు మాత్రము కర్మలొనర్చి, ఆ ఫలములను అనుభవించుచున్నాడు.

*"ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిష్వజాతే*
*తయో రన్యః పిప్పలం స్వాద్వ త్త్యనశ్నన్నన్యోఽభిచాకశీతి ॥"*

— ఋగ్వేదము

ప్రకృతి అనే చెట్టు నాశ్రయించి జీవుడు ఈశ్వరుడు అనెడి రెండు పక్షు లున్నవి. అందొకటి (జీవుడు) కర్మలొనర్చుచు, వాని ఫలములను (చావు పుట్టుకలు) ఆరగించుచుండగా రెండవది (ఈశ్వరుడు) నిర్వికారియై కేవలము సాక్షిగా నిల్చి, చూచుచుండునని భావము.

మ॥ *నవ యోన్యాత్మకమైన వ్యూహ రచనా నైపుణ్యముం జూప నీ*
*వవతీర్ణంబయి విశ్వమెల్ల, భవదీయాకార విస్ఫూర్తితో*
*శివమై సుందరమై ప్రశాంతిదమునై చిద్రూప దీపంబునై*
*రవళించుం బరమాద్భుతంబుగ మహాహ్లాదంబు సేకూర్చుచున్ ॥* 94

తొమ్మిది యోనులతో కూడిన వ్యూహ రచనయందు నీవు నీ నేర్పును ప్రదర్శింపగా, నీనుండి పుట్టిన ఈ ప్రపంచము కూడ నీ లక్షణములను పుణికి పుచ్చుకొనినట్లు, శుభమును సుఖమును కల్పించుచు మనోజ్ఞమై ప్రశాంతిని చేకూర్చుచు, చిద్రూపమైన దీపముగా మోక్షానందముగా అద్భుతమై అలరారుచున్నది.

యోని అనగా మూలకారణము. ప్రపంచ సృష్టికి ఆదికారణము శివశక్త్యాత్మకమైన మూలప్రకృతి లేక ఆదిపరాశక్తి. ఆ శక్తిని కేవలము స్త్రీయని కాని, పురుషుడని కాని, భావింపరాదు. అది జగత్పితరులైన పార్వతీ పరమేశ్వరుల సమైక్యరూపము. ఇందు శివ యోనులు నాలుగు, శక్తి యోనులైదు, సమష్టిగ నవయోను లయినవి. ఈ తొమ్మిది మూలకారణములవలన బ్రహ్మాండ పిండాండములు సృష్టింపబడినవి. సృష్టియందు శివశక్తుల ప్రమేయమును రేఖారూపమున తెలుపునది శ్రీచక్రము. అందీ యోనులు స్పష్టముగ చూపబడినవి.

వ్యష్టి సృష్టి యందు 1. త్వక్కు (చర్మము), 2. అసృక్కు (రక్తము), 3. మాంసము, 4. మేదస్సు (క్రొవ్వు), 5. అస్థి (ఎముక) అనునవి శక్తి భాగములు కాగా, 6. మజ్జ (ఎముకలందలి మూలగ), 7. శుక్రము, 8. ప్రాణము (ప్రధానశక్తి), 9. జీవుడు (వ్యక్తిగత ఆత్మ). శివాంశములైనవి.

*"త్వగసృఙ్మాంసమేదోస్థి ధాతవ శ్శక్తి మూలకాః
మజ్జాశుక్ల ప్రాణజీవ ధాతవ శ్శివమూలకాః ||
నవధాతుమయో దేహో నవయోని సముద్భవః ||" - శారీరకమీమాంస*

బాహ్య సృష్టియందు 1. పంచభూతములు, 2. తన్మాత్రలు, 3.కర్మేంద్రియములు, 4. జ్ఞానేంద్రియములు, 5. మనస్సు శక్తినుండి ఏర్పడగా, 6. మాయా, 7. శుద్ధ విద్యా 8. మహేశ్వర, 9. సదాశివులు శివునివలన కలిగినవి. ఇవి అన్నియు చేరి 25 తత్వములుగా సర్వమత సమ్మతము లయినవి.

ఇక వ్యూహ మనగా సృష్ట్యనుక్రమణికలో వ్యక్తమయిన జాతి లేక గణము (Category) అని భావము. శివ శక్తుల సమైక్య రూప మయిన శంభుడు సవాత్మకుడు. నవ వ్యూహముల ద్వారా ఆయన సృష్టిని ప్రకాశింపజేసెను. కాల, కుల, నామ, జ్ఞాన, చిత్త, నాద, బిందు, కళా, జీవములు నవవ్యూహములు. కాలము (Time sense), వర్ణములు (రంగులు), నామములు (పేర్లు), వీనికి సంబంధించిన జ్ఞానము అనగా భేదాభేదముల గుర్తించెడి సామర్థ్యము, బుద్ధికి ఇంద్రియములకు సంబంధించిన తెలివిడి శక్తి, పరా పశ్యంతీ మధ్యమా వైఖరీ నాదములు, ఆధారాది ఆజ్ఞాంత షట్చక్రములు, ఏబది అక్షరములు, వీనిని అనుభవించువాడు (జీవుడు) - వీనిని నవవ్యూహములని తెలియ వలెను. ఇందు జీవవ్యూహము భోక్త, జ్ఞాన వ్యూహము భోగము, కాలవ్యూహము భోగ్యము.

చం|| *ప్రసరణ శీలవై శివపరం బనిరుద్ధమునైన శక్తివై
ప్రసృత వియత్స్వరూపమయి, వాయువునై చలన ప్రసంగతెం,
గనిగొని లేచి వహ్నివయి, క్రమ్మర గ్రిందకు జారి యంబువై,
మసృణ నిరోధక స్థితి గ్రమంబుగ బృథ్విగ రూపుదాల్చితే ||* 95

అంతట వ్యాపించు స్వభావము గల నీవు శివుని కంటె అధికురాలవై అనగా శివతత్వమును మించి, నిరోధింపరాని శక్తివై ఆకాశభూతముగ నైతివి. పిమ్మట చలనాత్మకవై వాయుభూతముగను, ప్రకాశాత్మకవై ఊర్ధ్వగమనమున అగ్నిగను, అధోగమనమున రసాత్మకవై క్రిందకు జారి జలముగను, అవతరించితివి. తుదకు ఘనీభవించి నిరోధక స్థితియందు పృథివిగ నైతివి. పంచభూతములు నీవే యని భావము.

"అహం పంచభూతా న్యపంచ భూతాని। అహ మఖిలం జగత్" - శ్రీదేవ్యుపనిషత్ (3). ఆకాశాది పంచభూతములు నేనే. లయకాలమున బ్రహ్మముపం దవి లీనమైనపుడు అపంచభూతములుగ ఉండునది కూడ నేనె. జగమంతయు నేనే అని శ్రీమాత పలికినది.

సృష్టి సమయమున శక్తి ప్రసరణ మెన్ని విధముల జరిగినదో, పంచ భూతము లెట్లేర్పడినవో తెలిపెడి వర్ణనమిది. తత్త్వక్రమమున మొదటిది శివతత్త్వము. రెండవది శక్తి తత్త్వము. శక్తి అనగా పరమాత్మయైన శివుని సామర్థ్యమే. వ్యాపకస్థితిలో ఈ శక్తి అడ్డు లేనిదై ఋజుగమనమున సరళరేఖలుగా కదలి, ఆకాశభూతమైనది. కనుక ఆమె (శివాని) వ్యోమకేశి కాగా, శివుడు వ్యోమకేశుడైనాడు. మరల అదే శక్తి తిర్యగ్గమనముతో - ముందుకు వెనుకకు ప్రక్కలకు ఒక క్రమము లేకుండ ప్రసరించి, వాయు భూతమైనది. పిమ్మట తాప ప్రకాశాత్మకమై (వేడి వెలుతురు కలిగి) ఊర్ధ్వ గమనముతో వ్యాపకోన్ముఖమై అగ్నిభూతమైనది. అందుండి తరళ చలన శీలయై (ప్రకాశము గమనము కలది) అధోగమనముతో సంకోచత్వమునకు దారితీయుచు, ఆపశ్శక్తిగా మారినది. అంతటితో నిలుపక ఘనీభవించి కఠినమై నిరోధక స్థితియందు పృథ్వీభూతమయినది.

పంచభూతోత్పత్తిని గూర్చి తైత్తిరీయము "తస్మాద్వా ఏతస్మా దాత్మన ఆకాశ స్సంభూతః। ఆకాశా ద్వాయుః। వాయో రగ్నిః। అగ్నేరాపః। అద్భ్యఃపృథివీ" - (బ్రహ్మవల్లి 1అనువాకం) అని పల్కినది.

"తిర్యగూర్ధ్వ మధశ్శాయీ రశ్మయ స్తస్య సంతతా । సంతాపయతి స్వందేహ మాపాదతల మస్తకం॥" అని మంత్రపుష్పమున పిండాండగత వైశ్వానరాగ్ని వర్ణింపబడుట గమనార్హము.

శివ శబ్దము 'వశతి' ధాతువునుండి కలిగినది. స్వయం ప్రకాశక జ్ఞానస్వరూపుడు లేక విశ్వమును ప్రకాశింపజేసినవాడని భావము.

"శివపర పరాశక్తి - - వ్యోమకేశి" (ల.స.నా.)

చం॥ *శివు కి నీ కభేదము విశిష్టమ యైనను శక్తివౌచు నీ*
*పవిరళ మూర్తి భేదముల నాత్మమయంబుగ విశ్వమెల్ల నం*
*భవితము చేసి, భూత పరిపాలన కేళ గిరీశ విష్ణు వా*
*గ్ధవుల సృజించు తత్తమము తత్వ సుదర్శనమై రహించెదిన్॥* 96

శివునికి నీకు భేదము లేదనుట స్పష్టము. అది విశిష్టమయినదే. కాని శక్తి రూపమున నీవే అనేక రూపముల దాల్చి ఈ విశ్వము నేర్పఱచితివి. పంచభూతముల పాలించుటకు ఈశ్వరుని రుద్రుని విష్ణువును బ్రహ్మను సృష్టించితివి. వారి నియామకము తత్త్వదర్శినియై ఒప్పుచున్నది. శ్రీదేవి "పంచభూతేశి - పంచబ్రహ్మస్వరూపిణి' కూడ.

"న శివేన వినాశక్తిః న శక్త్యా చ వినా శివః" శివుడు లేక శక్తియు, శక్తి లేక శివుడును లేరు. వారికి అభేదము సహజమై యున్నది. "మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్" - భగవద్గీత (9 - 10) నా పర్యవేక్షణలో ప్రకృతి చరాచర జగత్తును సృష్టించుచున్నదని భగవద్వాక్యము. కనుక సృష్టికి కారణము మూలప్రకృతియైన శక్తియేయని స్పష్టము. "తస్యా ఏవ బ్రహ్మాజీజనత్ విష్ణు రజీజనత్ । రుద్రో జీజనత్ ।" - బహ్వృచోపనిషత్తు(2). ఆ చిచ్ఛక్తి నుండి బ్రహ్మ విష్ణు రుద్రులు జనించిరని భావము.

శ్రీదేవి సదాశివ తత్త్వాత్మిక. 'సదాశివ కుటుంబిని' అని లలితా సహస్రనామము. ఈ సదాశివునే వైష్ణవులు శ్రీమహావిష్ణువనియు, బౌద్ధులు అవలోకితేశ్వరుడనియు చెప్పుదురు. వాస్తవమునకు ఇచటినుండియే సగుణార్చనయు, అవతార ప్రాప్తియు కనిపించుచున్నవి. అంతకు పూర్వ ముండిన స్థితి నిర్గుణము నిరాకారము కనుక, వాక్కుకు మనస్సునకు అందదు. అది పరానంవిత్తు లేక నిర్గుణపరబ్రహ్మము. సదాశివతత్త్వమే చిదానందము. 'యత్ర వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" అనెడి స్థితి.

సదాశివ తత్త్వము నుండి ఏర్పడినది ఈశ్వర తత్త్వము. ఇది 'ఇదమహం' విమర్శాత్మకము. అనగా ఇదము అహము రెండును కలిసియున్న స్థితి - భేదరహిత స్థితి. తరువాత వచ్చునది విద్యాతత్త్వము. ఇది భేదాః భేద విమర్శాత్మకము. విద్యా తత్త్వాంతర్గతులే బ్రహ్మ విష్ణు రుద్రులనబడు త్రిమూర్తులు.

సదాశివుడు ఆకాశభూతమును, ఈశ్వరుడు వాయుభూతమును, రుద్రుడు అగ్ని భూతమును, విష్ణువు జలభూతమును, బ్రహ్మపృథ్వీభూతమును, పాలించుటకు నియోగింపబడినారు. ఆకాశమునుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్నినుండి జలము, జలమునుండి పృథివి ఏర్పడినట్లే, సదాశివాంశముగా ఈశ్వరుడు, ఈశ్వరాంశగా రుద్రుడు, రుద్రాంశగా విష్ణువు, విష్ణ్వంశమున బ్రహ్మ అవతరించిరి. వైష్ణవ సంప్రదాయమున విష్ణువునుండి రుద్రుడు పుట్టినట్లు చెప్పుటలో భేదము లేదు. అక్కడ విష్ణువు అనగా

సదాశివుడే - శ్రీమన్నారాయణుడు. ఇవి తత్వాంశములు. అధిష్ఠాన దైవముల గుణములు ఆయా భూతములలో ప్రస్ఫుట మగుచుండుటను గ్రహింపవచ్చును.

బ్రహ్మాండ పిండాండములలో ఈ క్రమమే గోచరించుచున్నది. చూడుడు.

| బ్రహ్మాండము | పిండాండము | అధిష్ఠాన దైవము | వానికార్యములు |
|---|---|---|---|
| పంచభూతములు | చక్రములు | — | — |
| పృథివి | మూలాధారము | బ్రహ్మ | సృజనము |
| జలము | మణిపూరము | విష్ణువు | సృజన పోషణములు |
| అగ్ని | స్వాధిష్ఠానము | రుద్రుడు | సృజన పోషణ సంహారములు |
| వాయువు | అనాహతము | ఈశ్వరుడు | సృజన పోషణ సంహార తిరోధానములు |
| ఆకాశము | విశుద్ధము | సదాశివుడు | సృజన పోషణ సంహార తిరోధాన అనుగ్రహములు |

గమనిక - షట్చక్ర నిరూపణ గ్రంథమును చూచునది

ఉ॥ *బుద్ధిగ, నేనుగా, మతిగ భూమికలన్ ధరియించి, కార్యముల్*
*సిద్ధము చేసి, యింద్రియ విశేషములం బ్రకటించి, కర్మసం*
*బద్ధుల జేసి మానవుల, బార్థివ లింగము జుట్టికొంచు, నీ*
*విద్ధర నిద్దుర న్మునుగు, దెంత శ్రమించితొ సృష్టి విక్రియన్* ॥ 97

అమ్మా! బుద్ధిగను అహంకారముగను మనస్సుగను భూమికల ధరించి అవి చేయవలసిన కార్యముల సిద్ధము చేసితివి. మానవులలో కర్మేంద్రియ, జ్ఞానేంద్రియములను ప్రకటించితివి. ఇంద్రియ ప్రేరితులై వారు కర్మ లొనర్చునట్లు చేసి, వారిని ఆ కర్మలతోడనే బంధించితివి. తుదకు కార్యముల పరిసమాప్తి చేసి, పృథ్విని (మూలాధారము)చేరి, స్వయంభూ లింగమును చుట్టికొని గాఢనిద్రలో ప్రవేశించితివి. సృష్టి వికారములతో ఎంత అలసితివో కదా!

పరాశక్తియే పరమేశ్వరుని ఇచ్ఛానుసారము సృష్టికార్యమును ప్రారంభించినది. మొదట ఆమె బాహ్యసృష్టి యందు మహత్తుగను (Cosmic Buddhi) అంతస్సృష్టిలో బుద్ధిగను, వ్యక్తమయినది. కనుక ఆత్మకు సన్నిహితముగ నుండునది బుద్ధియే. ఇది నిర్ణయాత్మక మగుటచే ప్రధానమైనది. పిమ్మట ఆమె బాహ్యాభ్యంతర సృష్టులు రెండిటియందును, అహంకారము (నేను నే ననునది) అయినది. అనంతరము మనస్సై, సంకల్ప వికల్పాత్మక రూపమును దాల్చినది.

*"అంతఃకరణ మేకం స్యా ద్వృత్తి భేదా చతుర్విధం ।*
*యథాతు సంకల్ప వికల్ప కృత్యం తథా భవేత్తన్మన ఇత్యభిఖ్యం ॥*
*స్యా ద్బుద్ధి సంజ్ఞంచ యథా ప్రవేత్తి సునిశ్చితం సంశయ హీన రూపం॥*
*అను సంధాన రూపం తచ్చిత్తం చ పరికీర్తితం॥"*

– దేవీగీత (36,37,38)

ఇంద్రియముల పనిచేయించునది మనస్సు. మనస్సును నడపునది అహంకారము. అహంకారమునకు మూలము బుద్ధి. బుద్ధి ప్రకాశాత్మకము. కాగా, అహంకారమును, వ్యక్తిగత చైతన్యముగా (Personal Consciousness) గుర్తింపనగును.

బుద్ధియందు సత్వగుణము, అహంకారమున రజోగుణము, మనస్సునను ఇంద్రియములందును తమోగుణము, ప్రాధాన్యము వహించును. త్రిగుణములు ప్రకృతి ధర్మములే కదా! బుద్ధి, ఇంద్రియాదులలో ప్రతిఫలించుచు, సంస్కారముల గ్రహించు చుండును. సాంఖ్యము ప్రకారము ఇదే జ్ఞాపక శక్తికి స్థానము.

బుద్ధి నిర్ణయాత్మకము కనుక సారథి. మనస్సు సంకల్ప వికల్పాత్మకము కావున కళ్ళెము. ఇంద్రియములు చోదింపబడునవి అగుటచే గుఱ్ఱములు. జీవుడు అనుభవించువాడు కనుక భోక్త. విషయములు ఇంద్రియములను ఆకర్షించును కావున మార్గములు. నే నని పలికెడి ఆత్మ, ఇంద్రియములు మనస్సుతో కూడియుండుటవలన, జీవభావమును పొంది భోక్త అగుచున్నాడు.

*"ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవతు ।*
*బుద్ధింతు సారథిం విద్ధి మనః ప్రగ్రహ మేవ చ ॥*
*ఇంద్రియాణి హయానాహు ర్విషయాంస్తేషు గోచరాన్ ।*
*ఆత్మేంద్రియ మనోయుక్తం భోక్తేత్యాహు మనీషిణః॥"*

—కఠోపనిషత్తు (3-3,4)

'ఇద్దర'- ఈ భూమియందు లేక ఈ దేహమున, అనగా పృథ్వీభూతమున. అంతఃసృష్టిలో ఇది మూలాధారము. ఇచటనే స్వయంభూ లింగము కలదని, దానిని చుట్టికొని ($3\frac{1}{2}$ చుట్లు) కుండలినీ రూపమున శక్తి నిద్రించుచుండునని తెలిసిన విషయమే. సర్పము చైతన్యమునకు ప్రతీక, కనుక శక్తిని కుండలినిగా చెప్పుచుందురు.

శా॥ *వాగర్థంబుల పోలె నీవు శివుడున్ ప్రాధాన్యము న్బాప నే*
*భాగంబున్ వచియింతు శ్యేష్ఠమని ? ఏ పార్శ్వంబు శ్రేష్ఠంబగున్?*

*కాగా, నిన్నె ప్రధాన మంచు నుడువంగా జెల్లు, సౌందర్యమున్*
*లోగొంటన్ జగదేక కల్పనకళా లోలత్వముం జూపుటన్ ||* **98**

వాక్కు - దాని అర్థము వలె నీవును శివుడును నమ ప్రాధాన్యము వహించుచుండ, ఏ భాగమును మొదటిదని, ఏ భాగము మేలైనదని చెప్పగలను? కాకున్న నీవు అందానికి హద్దు వయినందునను, జగత్తు నిర్మించు కళయందు ఆనక్తిని చూపుటవలనను, ఒక విధముగా నిన్నే ప్రధాన మనవచ్చును.

"న శివః శక్తి రహితో న శక్తిః శివ వర్జితా"-తంత్రాలోకం-ఆహ్నిక 3.
"న శివేన వినా దేవి దేవ్యాచ న వినా శివః
ఏతయోరంతరం నాస్తి చంద్ర చంద్రికయోరివ" -కామకళా విలానము

ఇట్టి తంత్రాగమ సిద్ధాంత వచనములవలన శివశక్తులకు భేదము లేదు. శివ శక్తి స్వరూపము లయిన ప్రకాశ విమర్శాంశలు కలియుటచే మిశ్రమ బిందు వయిన "అహం" ఏర్పడినది. ఇం దేది లేకున్నను సృష్టి లేదు. ఆధునిక శాస్త్ర పరిశోధనలబట్టి కూడ ప్రతి జీవియందును స్త్రీ పురుష సంబంధమైన 'జీన్సు' ఉండునని తెలినది. ఈ దృష్టితో శివ శబ్దమందలి 'శి' వర్ణమును విశ్లేషించిన యెడల 'శ్ + ఇ' అగును. ఇ అనునది శక్తి. అది ప్రాణము (స్వరము). ఇ లోపించిన శ, శక్తిని కోల్పోయి, ప్రాణము లేనిదగును. సంస్కృతాంధ్ర భాషా మర్యాద ననుసరించి హల్లు (శ్) అజంతముగా పలుకబడును. కనుక శ్, శ గా మారి, వ తో చేరిన శవ యగును. అపుడు అమంగళార్థము స్ఫురించును. ప్రాణశక్తి లేని శరీరము కాని, శరీరము లేని ప్రాణము కాని రాణింపవు. రెండిటికి సమ ప్రాధాన్య మున్నది. కావున శివునిలో శక్తియు, శక్తి నావరించి శివుడును ఉందురనునదే అర్ధనారీశ్వర తత్త్వము.

*"శివ శ్శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం*
*నచే దేవం దేవో నఖలు కుశలః స్పందితుమపి" -సౌందర్యలహరి(1)*

శివుడు శక్తితో కూడినపుడే జగత్తును సృష్టించుటకు సమర్థు డగును. లేని యెడల ఆయన దేవుడే అయినను, కదలుటకు కూడ అశక్తుడే యగునని భావము. అంబిక "శివశక్త్యైకరూపిణి - వామదేవి" - (ల.స.నా.)

ఇక "వామదేవాయ నమో జ్యేష్ఠాయ నమః శ్రేష్ఠాయనమో --" అను శివస్తుతి శివానియైన శక్తికి కూడ అన్వయించును. కనుక శివశక్తులలో ఒకరు మాత్రమే జ్యేష్ఠులని కాని శ్రేష్ఠులని కాని భావించుట తగదు. ప్రధాన శబ్దమునకు పరమాత్మ - ప్రకృతి - బుద్ధి - ముఖ్యము అను అర్థములు చెప్పబడినవి.

శా॥ సర్వాతీతము తావకాద్భుత వపుస్సౌందర్య మూహింపగా
వేర్వండెవ్వడు ; తావకాంఘ్రి వలిసీ విస్తుల్య శోభారుచుల్
సర్వన్ భానుడు సోము డయ్యనలుడున్ భ్రాజిష్ణులై మించరే
సర్వప్రాణిచయంబు గట్టువడ బుష్పాస్త్రుండు శాసింపడే ॥ 99

అద్భుతమైన నీ దేహ సౌందర్యము అన్నిటిని మించినది, ఊహ కందనిది. నీ అడుగు దామరలనుండి వ్యాపించు కాంతి కిరణములవలన సూర్యుడు చంద్రుడు అగ్నియు తేజశ్శాలురై మించిరి కదా! ఇక మన్మథుడన్ననో సర్వప్రాణి సమూహములను శాసనబద్ధులుగా చేయుచున్నాడు. నీ పాద సౌందర్యమే ఇట్లుండ, దేహసౌందర్యము నెవ డూహింపగలడు?

పరమేశ్వరి పాదములనుండి అనంతకోటి కిరణములు వ్యాపించుచుండ అందుండి సూర్యుడు 116, చంద్రుడు 360, అగ్ని 108 ని మాత్రమే గ్రహించి తేజశ్శాలురై లోకములకు వెలుగు నిచ్చుచున్నట్లు, "లోకస్యద్వార మర్చిమ త్పవిత్రం |" అనెడి తైత్తిరీయ బ్రాహ్మణ శ్రుతి పాఠము తెలుపుచున్నది. సౌందర్యాధి దేవతయైన మన్మథుడు దేవీ చరణముల భజించి, లోకములను (స్త్రీ-పురుష మానసములను) శాసించుచుండుట విదితమే కదా! మరీచులు (కిరణములు) శ్రీదేవీ పాద సంజాతములు.

చం॥ పరశివు నూర్ధ్వభాగమున బద్మజుడున్, దను మధ్యమందు శ్రీ
హరియు, నధఃకళేబరమునందు త్రిశూలియు మూడు మూర్తులన్
స్ఫురణను గూర్ప దత్త్రిపురసుందర సుందరివై రహించు నిన్
బరశివ చిత్స్వరూప నిరుపాధి దయావధి దెల్ప శక్యమే॥ 100

పరశివుడు త్రిమూర్త్యాత్మకుడు. ఆయన మూర్తిలో పైభాగమున బ్రహ్మయు, మధ్యభాగమున విష్ణువు, అధోభాగమున రుద్రుడు స్ఫురింపగా మూడు మూర్తులతో విలసిల్లు ఆ త్రిపురసుందరుని అర్ధాంగము నాక్రమించిన సుందరివి. పరశివానామమున నొప్పు చిద్రూపిణివి. ఉపాధిలేని దానవు. దయకు హద్దువయిన నిన్ను తెలుపుట సాధ్యము కాదు.

"త్రీణి పురాణి బ్రహ్మ విష్ణు శివ శరీరాణి యస్మిన్ స త్రిపురః - పరశివః" "త్రిభిః ధ్యాతృ ధ్యాన ధ్యేయైః పురా త్రిపురా; త్రిభిః బ్రహ్మ విష్ణు రుద్రైః పురావా; త్రిభిః సత్వ రజ స్తమో గుణైర్వా పురా; ఇచ్ఛా జ్ఞాన క్రియా దిభిః పురా త్రిపురా".

బ్రహ్మ విష్ణు రుద్రు లనెడి మూడు పురముల (శరీరముల) దాల్చినవాడు త్రిపురుడు - అనగా పరశివుడు. ధ్యాన ధ్యాతృధ్యేయములు త్రిపురములు. బ్రహ్మ విష్ణు రుద్రులు ముప్పురు త్రిపురములు. సత్వ రజస్తమో గుణములు మూడును త్రిపురములు. ఇచ్ఛా జ్ఞాన క్రియా శక్తులు మూడును త్రిపురములు. వీనికంటె పూర్వముండినది త్రిపురా, ఇంకను ఇడా పింగళా సుషుమ్నా నాడీత్రయము కూడ త్రిపురయే. అందు వసించు శక్తి త్రిపురసుందరి. ఉదాత్త అనుదాత్త స్వరితము లనెడి మూడు స్వరములకు పూర్వమే ఉండిన నాద స్వరూపిణి త్రిపురా. కనుక త్రిపురా శబ్దమువలన పరబ్రహ్మమే తెలుపబడినది. త్రిపురుడు త్రిపురా, పరశివుడు పరశివా, శబ్దములు అఖండము ఏకైకమైన శివశక్తులకు సంబంధించినవే.

శరీరమున ప్రజ్ఞాన బ్రహ్మమే త్రిపురుడు. స్థూల సూక్ష్మ కారణ శరీరములకు కారణము ఆయనయే కదా! మూలాధార మందలి కుండలినీ పరాశక్తియే త్రిపురసుందరి. దేహేంద్రియముల కధిష్ఠానములయిన వివిధ శక్తులే దేవతలు. ఆ శక్తులన్నియు కుండలినీ రూప మహాత్రిపురసుందరిని సేవించుచున్నవి. " ఇంద్రియ వ్యపదేశేన వ్యాచక్షం తే తాశ్చ దేవతాః" - జ్ఞానవాశిష్ఠము.

చం॥ *త్రిపురములౌ శరీరములు, దేహి హృదంతర భాసి యీశుడే*
*త్రిపుర హరుండు, నీవు త్రిపురేశ్వరి పౌదువు, జీవ భావమే*
*త్రిపుర దనూజ్ఞుడగు, వివేక యుతంబగు తద్విమర్శయే*
*త్రిపురములన్ దహించుటని తెల్పుదు బూర్వకథారహస్యమున్* ॥ 101

స్థూల సూక్ష్మ కారణ శరీరములే త్రిపురములు. జీవుని హృదయ కుహరమున నుండెడి ఈశ్వరుడే (ప్రత్యగాత్మ) త్రిపురహరుడు. బుద్ధిరూపమున నుండు నీవు త్రిపురేశ్వరివి. తాను వేరనెడి జీవభావమే త్రిపురాసురుడు. ఈ వివేకముతో చేసెడి తత్వ విమర్శయే త్రిపురముల దహించుటని పురాణగాథా రహస్యమును తెలిపెదను.

వివేకముతో చేయు విమర్శవలన సంచిత ప్రారబ్ధ సంస్కారములు కూడ నశించును. సంస్కారములు తొలగుటవలన కారణశరీరము పోయి సచ్చిదా నందము ప్రాప్తించును.

"సర్వం కర్మాఖిలం పార్థ! జ్ఞానే పరిసమాప్యతే" - భగవద్గీత (4-37) కనుక జ్ఞాన యుతమైన ఆత్మ విమర్శ అవసరము.

ఉ॥ వ్యాహృతులందు సప్త భువనాకృతులన్ విరచించి, మించి, త
ద్వ్యాహృతి మూలమై నిలిచి, యాత్మ సముద్ధరణాప్తి భూమికా
దోహద శీలవై వెలుగు ద్రోవను జూపెడి మూలశక్తి! ని
న్నాహిత భక్తి భావమున నర్చన జేసెడి భాగ్యమీగదే ॥ 102

వ్యాహృతుల రూపమున ఏడు లోకముల నిర్మించి, వాని కతీతముగ ఆధారమై యున్నావు. ఆత్మోద్ధరణ కేర్పడిన సప్త భూమికలకు సహాయకారిణివై అర్చిరాది మార్గమును (వెలుగుబాటను) చూపించు మూలశక్తివి నీవు. నిన్ను భక్తితో అర్చించెడి అదృష్టము నిమ్ము.

భూః భువః సువః మహః జనః తపః సత్యం - ఇవి వ్యాహృతులు. స్థూల సూక్ష్మ కారణములుగా మూడు లోకముల నేర్పఱచి, ప్రకాశపఱచుట వలనను, తొలుత పరమేశ్వరుని జ్ఞాన శరీరమునుండి వ్యాహరించుట (పలుకుట) వలనను, వీనికి వ్యాహృతులని పేరు వచ్చినది. వ్యాహృతి అనగా వ్యవహరించునది అని అర్థము. పైన పేర్కొనిన వ్యాహృతు లేడును అవే పేర్లతో ఏడు లోకములకు సంకేతములైనవి.

"భవంత్యస్మాద్భూతానీతి భూః" వీనివలన భూతములు పుట్టుచున్నవి కనుక "భూః",

"భావయతి - సావయతి - విశ్వమితి భువః" సర్వప్రపంచమును స్థాపించువాడు కావున భువః

"సుఖరూపత్వాత్ - స్వః - స్వశబ్దోహి సుఖవాచీ" సుఖరూపుడగుటచే 'స్వః' లేక సువః

"సర్వోత్కృష్టత్వేన పూజ్యత్వాన్మహ ఇత్యుచ్యతే" సర్వోత్కృష్టు డగుటచే పూజ్యుడు మహః

"జనజననే - సర్వజననకర్తా, సకల జగజ్జనకర్తృత్వాజ్జనః" జగములను సృష్టించువాడు కనుక జనః

"తప-ఆలోచనే-సర్వవిషయకాలోచన కర్తృత్వాత్తపః" జగద్రక్షణాదుల గూర్చి ఆలోచించెడివాడు తపః

"ఉత్తమ జ్ఞానానందరూపత్వా త్సత్యం" "సత్యం కాలత్రయాబాధ్యం" పూర్ణజ్ఞానానందములు కలవాడు కనుక 'సత్యం'

ఈ ఏడు లోకములను బ్రహ్మమయములని తెలిసికొనవలెను.

భూమికలనగా ఆధారములు (Bases). ఇవి సప్తసంఖ్యలో ఉన్నందున సప్తభూమికలని పేరు గాంచినవి. విరాడ్రూపమైన వివిధ లోకములలో నుండెడి చైతన్యానుభవమును (Experience of Consciousness) బట్టి ఇవి ఏర్పడినవి.

చైతన్యముయొక్క సామాన్యానుభవము (Normal Experience) భూలోకము. ఇచ్చటనుండి ఊర్ధ్వలోకముల వైపు వెళ్లునపుడు అనులోమానుభవమును (Super Normal Experience), అధోలోకముల దెస పోవునపుడు విలోమానుభవమును (Sub-Normal Experience) కలుగు నందురు. చైతన్యముయొక్క ఆధిక్యత అల్పత్వములబట్టి భూమికలు మారుచుండును. బాహ్యదృష్టికి తొలుత వేరు వేరుగా కనిపించెడి వ్యక్తులు, వస్తువులు అనుభవమున ఒకటిగా అగుపించు స్థితియే సత్యము. ఇది అద్వైతము. ఈ పరిణామమున తోచు వివిధ దశలను ఈ ఏడు భూమికలు వ్యక్తము చేయును. వివరములను నా 'శ్రీమాతగాయత్రి' గ్రంథమున చూడవచ్చును.

'గాయత్రీ వ్యాహృతి సంధ్యా ద్విజబృంద నిషేవితా' - (ల.స.నా.)

శా॥ *సృష్టిం గూర్ప రజో గుణ ప్రకృతివై చిద్రూపివై బ్రాహ్మివై*
*స్రష్టం జేరు మరాళ వాహనవు, నిన్ సంధ్యామహాదేవి సం*
*తుష్టిన్ దుష్టవిదూర భావశమనిన్ దోషావహం గొల్చెదన్*
*వ్యష్టిన్ సృష్టిరహస్యము న్దెలుపు త్వద్వ్యాపార మూహించెదన్*॥ 103

సృష్టిచేయు నపుడు రజోగుణ ప్రకృతి వహించి, హంస నధిరోహించి, బ్రహ్మనాశ్రయించి, బ్రాహ్మివైన చిద్రూపిణీ శక్తి వగుదువు. నీవే సంధ్యా మహాదేవివి. దుష్టులకు దూరమైన దానివి. పాపముల నశింపజేసి మాలిన్యముల తొలగించెడి నిన్ను తృప్తిగా సేవింతునుగాక! వ్యష్టియందు (శరీరమున) సృష్టి రహస్యమును తెలిపెడి నీ కార్యవిధానమును పరిశీలించెదను.

*"విక్షేపశక్తి రజసః క్రియాత్మికా యతః ప్రవృత్తిః ప్రసృతాపురాణీ*
*రాగాదయో స్యాః ప్రభవన్తి నిత్యం దుఃఖాదయో యే మనసో వికారాః॥"*

త్రిగుణములలో క్రియాత్మకమైనది రజోగుణము. ఇది మాయయొక్క విక్షేపశక్తి అనబడుచున్నది. మనోవికారములయిన రాగద్వేషాదులు, సుఖ దుఃఖాదులు ఈ విక్షేపశక్తినుండియే కలుగును. రజోగుణము లేక, కావ్యసృష్టి కాని కార్య సృష్టి కాని జరుగదు. ప్రాతస్సంధ్యా సమయమున ధ్యానింపబడు గాయత్రీదేవి రజోగుణ విశిష్ట కావున విద్రుమ (పగడము) వర్ణము కలిగి యున్నట్లు ఆమెను ధ్యానించెదరు. ఆమె శక్తియే బ్రాహ్మి.

<u>సంధ్య</u> - అనగా ముక్కు కనుబొమలు కలియుచోట ధ్యానింపబడునది అని భావము. అనగా ఆజ్ఞా చక్రమున దృష్టిని నిలిపి ధ్యానింప దగినది.

బ్రహ్మ తత్వవేత్తలు అట్లే ధ్యానింతురు. ఇంకను సం + ధ్య = చక్కగా (తనను కూర్చిన యధార్థ జ్ఞానముతో) ధ్యానింపబడునది సంధ్య.

"గాయత్రీం బాలాం రక్తాంగీం రక్తవాననం హంసస్కంధ సమారూఢాం బ్రహ్మదైవత్యాం చతుర్ముఖీం --- ఆవాహయామి" - గాయత్రీ కల్పము. మరాళము = హంస = శరీరగత ప్రాణము లేక వాయువు. ఈ హంస, దేహమున సంచరించుచు కుండలినీ చలనమునకు తోడ్పడును. కుండలినియే గాయత్రి లేక బ్రాహ్మీశక్తి కదా !

"ప్రకర్షేణ మహదాది కార్యకారణ సంఘాతం కరోతీతి ప్రకృతిః" మహత్తత్త్వము మున్నగు కార్య కారణ సమూహమును చక్కగా నిర్వర్తించునది ప్రకృతి. స్వభావము కనుక ఆత్మకంటె భిన్నమయినది కాదు.

మ॥ *పశు బంధంబుల విప్ప దాన వగుటం, బ్రాణాది వర్గంబు నీ*
*వశమం దుండు కతంబునన్ బనపనిం బ్రజ్ఞాన భవ్యాకృతిం*
*బశుదేహావరణుం బ్రపూర్ణ కరుణం బాలింతువో యంబ! మ*
*త్పశుభావంబును ద్రోచి పాశములు విప్పన్ రమ్ము లోకేశ్వరీ॥* 104

అమ్మా! పశువుల బంధములను తొలగించు దాన వగుటవలనను, ప్రాణాదులు నీ అధీనమందుండుట చేతను, ప్రజ్ఞాన స్వరూపు డయిన నందీశ్వరుని, పశుదేహావరణమున ఉండినను నిండు ప్రేమతో నీ వాహనముగ చేసికొని రక్షించుచున్నావు. నా పశుభావమును తొలగించి కర్మబంధముల విప్పుటకు రమ్ము. నన్ను కూడ నందీశ్వరుని వలె వాత్సల్యముతో పాలింపుము.

అభేద జ్ఞానము లేనివారు అనగా అవిద్యావృతులైన జీవు లందఱు పశువులే - కర్మపాశ బద్ధులే. పరాశక్తి కరుణవలననే ఈ బంధములు తొలగిపోగలవు. రుద్రుని శక్తియైన రౌద్రి సంహారకారిణి కావున ప్రాణికోటి ఆమె వశమందుండక తప్పదు. నందీశ్వరుడు ప్రజ్ఞాన స్వరూపుడైనను, పశుశరీరము ఆవరణముగ దాల్చుటవలన రౌద్రి వానిని తన వాహనముగ చేసికొని ఆదరించినది.

ఇది మాధ్యాహ్నిక సంధ్యాదేవి వర్ణనము. మాధ్యందిన సంధ్యా సమయమున వృషభ వాహనయైన సావిత్రి ఆరాధింపబడును. ఆమె శక్తియే రౌద్రి. సావిత్రి ప్రసవిత్రి లేక సృజనాత్మకశక్తి కనుక, ప్రపంచమును ప్రసవించిన ఆదిపరాశక్తియే.

"మాధ్యందిన సంధ్యాయాం సావిత్రీం యౌవనమధ్యస్థాం మాధ్యందిన సంధ్యాం శ్వేతాంగీం శ్వేతవాననం వృష స్కంధ సమారూఢాం రుద్ర దైవత్యాం త్రినేత్రాం, వరదాక్షమాలా భయ హస్తాం త్రిశూలధారిణీం — ఆవాహయామి" - గాయత్రీ కల్పము.

బసవడు వలె జీవుడు కూడ పశువే. "పాశబద్ధస్తథా జీవః పాశముక్తస్సదా శివః". జీవుని బంధించు పాశములు విశిష్ఠమయినవి. అవి - 1. అవిద్యా - ఆత్మానాత్మ వివేకము లేకుండుట. ఇది తమస్సు. 2.అస్మిత — ఆత్మ కాని దేహమును ఆత్మగా తలచుట. ఇది మోహము. 3.రాగము - విషయములందానక్తి. ఇది మహామోహము. 4. ద్వేషము - కోరిక నెరవేరనపుడు కలిగెడి పగ - ఇది తమిస్రము. 5. అభినివేశము - యుక్తము కాదని తెలిసి కూడ విడువ లేక పోవుట. ఇది అంధతామిస్రము లేక దౌర్బల్యము. ఈ ఐదు క్లేశములకు తోడు మాయ, కర్మ, త్రిగుణములు. ఈ ఎనిమిదికి అష్టపాశములని పేరు. ఇవి జీవుని మఱల మఱల జన్మలెత్తునట్లు చేయుచుండును. పరమేశ్వరి అనుగ్రహమువలన ఇవి నశించును. పరదేవత "పశుపాశ విమోచని - పాశహంత్రి" - (ల.స.నా.)

ప్రజ్ఞాన భవ్యాకృతి - ప్రజ్ఞానము వలన భవ్యమైన ఆకృతి కలవాడు- నందీశ్వరుడు. ఈయన మాహేశ్వర సూత్రములకు వేదాంత పరమైన అర్థమును కాశికామూలమున ప్రకాశింపజేసిన ప్రజ్ఞాన స్వరూపుడు. " యేనవా రూపం పశ్యతి. యేనవా శబ్దం శృణోతి" కనులు చెవులు మున్నగు ఇంద్రియముల ద్వారా రూప శబ్దాదులను ఏది గ్రహించుచున్నదో అది ప్రజ్ఞానము అనగా ఆత్మ. కనుక నే ప్రజ్ఞానం బ్రహ్మ అని శ్రుతి పలుకుచున్నది.

బంధము - "అవిచార కృతో బంధః విచారాన్మోక్షో భవతి" - శ్రుతి పైంగలోపనిషత్తు. సత్యాసత్యముల విచారింపక పోవుటవలన బంధమేర్పడును. విచారమువలన మోక్షము కలుగును.

శా|| *నీ యుద్గీథము గానమై భువనముల్ నిండార, నారాయణుం*
*డా యానంద సుధా మహార్ణవమునే యాత్మాధివాసంబుగా*
*జేయం, జిత్ప్రభయున్ సహస్రఫణియై సేవింప శయ్యాకృతిన్*
*నా యుల్లంబున దోచు వైష్ణవి చిదానందంబు చేకూర్చుతన్ ||* 105

నీనుండి పైకుబికి వచ్చిన సామవేదము గానమై లోకముల నిండినది. జ్ఞానగమ్యుడైన నారాయణుడు ఆ గానానందమును క్షీరసాగరముగా తన

నివానము చేసికొనెను. అవుడు చిత్కాంతి వేయి వడగల నాగరాజుగ మారి వానికి పాన్పు అయ్యెను. ఈ విధముగ నా హృదయమున వైష్ణవీ రూవముతో స్ఫురించిన శ్రీమాత చిదానందమును ప్రసాదించును గాక!

అచల బ్రహ్మమునందే అంతర్గతమై యుండిన చైతన్యము ఇచ్ఛాశక్తి రూవమున పైకుబికి వచ్చి నాదముగా - ప్రణవముగా - వ్యక్తమయినది. ఈ నాదమును జ్ఞానశక్తి గుర్తించినది. ఆ ఓంకారనాదమును లేక సామవేదమును ఆస్వాదించుటకు చిత్కాంతియే స్వయముగ వేయి శిరస్సులతో ప్రత్యక్షమయిన దని ధ్వని.

"వా గే వర్క్ప్రాణ స్సామో మిత్యేత దక్షర ముద్గీథ స్తద్వా ఏతన్మిథునం యద్వార్చ ప్రాణశ్చర్క్చ సామచ" -చాందోగ్యోవనిషత్తు (1-1-5) వాక్కేఋక్కు. ప్రాణమే సామము. ఓమ్ అనెడి అక్షరమే ఉద్గీథము. ఈ మిథునము ఓమ్ అను అక్షరమందు చేరియున్నది. " అథఖలు య ఉద్గీథ స్స ప్రణవోయః। ప్రణవస్స ఉద్గీథ" - ఛాందోగ్యము (1-5-1)

నారాయణుడు - నారమును (జ్ఞానమును లేక జలమును) అయనముగ (త్రోవగా లేక నివానముగ) కలవాడు - మహావిష్ణువు. అనగా ఆయన జ్ఞాన గమ్యుడు, జ్ఞానశక్తి స్వరూవుడని భావము.

సహస్రఫణీ - వేయి (బహు) ఫణములు (వడగలు) కలవాడు - ఆది శేషుడు ఈయన చిచ్ఛక్తి స్వరూవుడే.

"శిశు ర్వేత్తి వశు ర్వేత్తి వేత్తి గాన రసం ఫణీ" గానరసము ఆస్వాదింవ గల సామర్థ్యము శిశువులకు వశువులకు సర్పములకు కలదట. శిశువన కుమారస్వామి. వశువు నందీశ్వరుడు, ఫణి శివుని మెడలోని సర్పరాజు. వారు నిరంతరము శివసాన్నిధ్యమున నుండుటచే అది సాధ్యమైనదని భావము.

"వైష్ణవీ - విష్ణురూపిణీ - నారాయణీ - నాదరూపా - సామగాన ప్రియా - గానలోలుపా - చిత్కళా - ఆనందకలికా" (ల.స.నా.)

శా॥ *ఓజస్వంతము సృష్టి పోషకము నిత్యోన్మేషమౌ వైష్ణవీ*
*తేజంబున్ ఋతము స్వప్రమేయమును నాదిత్యాంతరంగంబు ని*
*ర్వ్యాజానంత సుఖ ప్రదాయకము గాయత్రీ వరారూవము*
*న్భావింతు స్సిను మన్మనః ప్రకృతి సంభూత ప్రసూనంబులన్॥ 106*

నీవు ఉత్సాహ రూపమైన ఓజస్సువు. సృష్టి పోషకత్వము నీ ధర్మము. నిరంతరము వికసించుచు వ్యాప్తి గాంచెడి వైష్ణవీ రూప తేజస్సువు. సత్యము నీవే. యథార్థముగ తెలియదగిన దానవు నీవే. సూర్యమండల మధ్యస్థవు. ప్రయోజన మాసించకయే సుఖముల నిచ్చు గాయత్రీ పరాశక్తివి. నా మనస్సని యెడి ప్రకృతినుండి పుట్టిన పూవులతో ని న్నర్చించెదను.

ఓజస్వంతము - ఓజస్సు గలది. బలోత్సాహ రూపమై శుక్రముకంటె మిన్నయైన తేజోధాతువునకు ఓజస్సని పేరు. "ఓజోస్తు తేజోధాతునాం శుక్రాంతానాం పరం శ్రుతం".

ఋతము - ఆత్మయొక్క నిత్యత్వము - పరబ్రహ్మము. "ఋత మాత్మా పరంబ్రహ్మ సత్య మిత్యాదికా బుద్ధైః కల్పితా వ్యవహారార్థం యస్యసంజ్ఞా మహాత్మనః" - మహోపనిషత్తు. ఋతము ఆత్మా పరంబ్రహ్మ సత్యము మున్నగునవి వ్యవహారముకొఱకు కల్పింపబడినవి. ప్రమేయము=యథార్థముగ తెలియదగినది.

ఆదిత్యాంతరంగము -సవితృమండలమధ్యభాగము. అందు వర్తించుచు సృష్టి స్థితి సంహార కార్యముల నిర్వర్తించు పరాశక్తి.

గాయత్రి - గయలనెడి ప్రాణముల రక్షించునది. "గయాన్ ప్రాణాన్ త్రాయతేతి గాయత్రీ" - ఐతరేయబ్రాహ్మణము. "గాయత్రి ప్రోచ్యతే తస్మా ద్గాయంతం త్రాయతే యతః" - యాజ్ఞవల్క్యుడు. తనను గానము చేయువారిని రక్షించునది కనుక గాయత్రి అని చెప్పబడినది.

సాయం సంధ్యానమయమున ఆరాధింపబడు దేవత సరస్వతి. ఆమె శక్తి వైష్ణవి. అనగా సర్వవ్యాప్త మయినది. అన్ని శక్తులకంటె మొదట వ్యక్తమయినది కనుక వృద్ధ - లయకాల మూల ప్రకృతి స్వరూపిణి.

"సాయం సంధ్యాయాం సరస్వతీం వృద్ధాం కృష్ణాంగీం కృష్ణవాననం గరుడ స్కంధ సమారూఢాం విష్ణుదైవత్యాం చతుర్భుజాం శంఖ చక్ర గదా ధారిణీం - - - ఆవాహయామి" - గాయత్రీ కల్పము.

స్వరూప విశ్రాంతి నిచ్చునది వైష్ణవీ శక్తి. అనగా తన అసలు రూపమున విశ్రమింపజేయునది. "వైష్ణవీ-విష్ణురూపిణీ-ఓజోవతీ-ద్యుతిధరా" (ల.స.నా.)

శా॥ *లోకాన్వీక్షణ కౌతుకం బలర, నాలోకింత్రు యోగీశ్వరుల్*
*రాకల్ పోకలు మాని, యాంతర గతిన్ లక్ష్యంబు గావించి, యే*
*కైకంబౌ పరతత్వ మన్నియెడలం దేపార గాలంబుతో*
*నేకత్వంబు భజించి, సర్వము త్వదీయేక్షాభిగమ్యంబగున్* ॥ 107

లోకముల వెదకెడి కుతూహలముతో యోగులు శారీరకముగ వచ్చి పోయెడి శ్రమ లేకుండ అంతర దృష్టితో ఏకైక మయిన పరతత్వము అంతటను వ్యాపించి యుండుట వలన, కాలముతో తాము కూడ కలసిపోయి సర్వమును నీ దయావీక్షణములచే చేరదగినదిగా చూచుచుందురు.

అంతరగతి - ఇంద్రియములనుండి మఱలింపబడిన దృష్టి. పరతత్వము సర్వవ్యాపకము కావున యోగులు తమ తమ దేహములందే సూక్ష్మ రూపమున నుండెడి లోకములందు దృష్టిని సారించి, జనన మరణ పరిశ్రమము లేక ఆయా లోకములను అందలి వింతలను చూచుచుందురు. పరాశక్తి కాల స్వరూపమే కనుక ఆమెయందు తమ దృష్టిని లీనముచేసినపుడు భూతభవిష్య ద్వర్తమానములు సర్వము ఎట్టయెదుట నున్నట్లే కనిపించును. వానిని దర్శించుటకు ప్రత్యేకముగ శ్రమింప అవసరముండదు.

"భ్రువో ర్ఘ్రాణస్య చ యః సంధిస్తత్ర హి సంధ్యాం బ్రహ్మవిద ఉపాసతే" కనుబొమలు ముక్కు కలియు ప్రదేశము (ఆజ్ఞాచక్రము) సంధి యనబడును. అందుధ్యానింపబడునది సంధ్య. తత్వము తెలిసిన వారు పరమేశ్వరిని అచ్చట ఉపాసింతురు. ఆమె సర్వమయి కనుక సర్వము వారికి అందే కనిపించును. "శ్రీమాత కాలరూపిణి - కాలహంత్రి" - (ల.స.నా.)

ఉ॥ *వెన్నెముకన్ గ్రహించి కనిపింపని కవ్వము చేసి, త్రాళ్లుగా*
*బన్నుచు శ్వాస యుగ్మమును, భస్త్రికలం గడు త్రచ్చి త్రచ్చి, యా*
*పన్నుతి నీవు సాగర సముద్భవవై సిరివైన చందమున్*
*గన్నులు మూసి, యోగ గతి గాంతురు ధీరులు కామితార్థదా*॥ 108

వెన్నెముకను కవ్వముగను, ఉచ్ఛ్వాస నిశ్వాసములను కవ్వపు త్రాళ్లగను చేసి, యోగాభ్యాసమున చేయు భస్త్రికల ద్వారా చిలికి చిలికి, వేడిని పుట్టించి, క్షీరసాగర మథన సమయమున శ్రీ మహాలక్ష్మిగా నీవు అవతరించిన విధమును యోగమార్గమున కన్నులు మూసికొనియే ధీరులు దర్శించుచుందురు.

యోగులు మూలాధారమున నిద్రించు శక్తిని మేల్కొలుపుటకు, ఉచ్ఛ్వాస నిశ్వాసములద్వారా (ప్రాణాయామముద్వారా) సాధన

సేయుదురు. సాధన ప్రక్రియలలో ఒకటి, భస్త్రికల సహాయముతో నాడులను కదపి వేడిని పుట్టించుట, ఆ వేడికి కుండలిని లేచి బ్రహ్మనాడి (సుషుమ్న) వెంట బ్రహ్మ విష్ణు రుద్ర గ్రంధుల భేదించుకొనుచు, సహస్రార మండలి శివుని చేరును. వారి కలయికయే యోగము. కుండలినీ ఉత్థానము మహాలక్ష్మి అవతరణమువలె మహిమాన్వితమని భావము. శ్రీమాత రమయే కదా! ఆమె సౌభాగ్యలక్ష్మీకామకళ.

భస్త్రిక - పొట్టను వెన్నెముకకు తగులునట్లు కదలించు ఒక యోగ ప్రక్రియ. ధీరులు - కామ క్రోధాది షడ్వర్గమును జయించినవారు. శ్రీదేవి 'ధీర - ధీరసమర్చిత' (ల.స.నా.)

శా॥ *స్వాధిష్ఠానమునం గృశానుడును, సూర్ధ్వంబందు సుష్టాంశుడున్*
*బాధింపన్ సహియించి, దీక్షమెయి ద త్పార్శ్వస్థలీపూరమం*
*దాదిన్ ఘోర తపం బొనర్చి, శివు నాత్మాధీశుగా గొన్న నీ*
*ప్రాధాన్యంబు స్ఫురింప గుండలినివై భాసింపవే జీవులన్*॥ 109

నీవున్న చోట అగ్నియు, పైనుండి సూర్యుడును కలిగించు తాపమున కోర్చుకొని, దీక్షతో సమీప మండలి జల ప్రవాహమున నిలిచి, తొల్లి భయంకరమైన తపన్సు చేసి, శివుని మెప్పించి పతిగా బడసిన నీ గొప్ప తనమును స్ఫురింపజేయుచు, జీవులలో నీవుండెడి అగ్నిమండలము (స్వాధిష్ఠాన మూలాధారములు), పైనున్న సూర్యమండలము (అనాహత మణిపూరములు) కలిగించు తాపమును భరించి, మణిపూరమున నిలిచి, కఠోరమైన తపన్సు చేసి సహస్రారమండలి శివుని చేరుచుందువు.

మూలాధారమున నిదుర లేచిన కుండలినీ శక్తి స్వాధిష్ఠానాది చక్రముల దాటి ఊర్ధ్వగామినియై సహస్రారమున పతియగు శివుని చేరుటకు, చేయు యత్న మిచట వర్ణింపబడినది. వేసవియందు అగ్నుల మధ్యను, శిశువున జలకుండము నడుమను నిలిచి తపము చేయుట ధీరులకే చెల్లును. పరమేశ్వరి 'ధీర - ధీర సమర్చిత ' - (ల.స.నా.)

స్వ + అధిష్ఠానము = తన యిల్లు. షట్చక్రములలో ఆధారమునుండి రెండవది.

మ॥ *ఇడయుం బింగళయుం ద్వితీయ గళమందేపారు హారంబులై*
*కడు శోభింపగ, వెండి బంగరులతో గావించిన స్థైంతయే*

*నడరున్ శీతమయూఖ చిత్రకిరణాఖ్యాతంబులౌ నాడు ; లిం*
*వడర న్నీవు నుషుమ్న నూర్థ్వగతి నీ యాత్మేశునిం జేరుచో॥* 110

నీవు మూలాధారమున నిద్ర లేచి నహస్రార స్థితుడైన నీ భర్త శివుని చేరబోవు నవుడు, ఇడా పింగళ లనెడి చంద్ర నూర్య నాడులు నీ కంఠసీమ నలంకరించిన వెండి బంగారపు హారముల వలె శోభించుచున్నవి.

ఎడమ ముక్కు రంధ్రమునుండి ప్రనరించు గాలికి చంద్రనాడి అనియు, ఇడా నాడి అనియు పేర్లు. ఇది చల్లగా తెల్లగా నుండును. కుడి ముక్కుద్వారా ప్రనరించునది నూర్యనాడి లేక పింగళానాడి. ఇది వెచ్చగా వచ్చగా నుండును. వీని మధ్య నూక్ష్మముగ ప్రనరించునది నుషుమ్నానాడి. దీనికి బ్రహ్మనాడి అని కూడ పేరు. మూలాధారమునుండి కుండలిని ఇడా పింగళా నాడులు అనునరింపగా నుషుమ్నా మార్గమున నహస్రారమును గూర్చి ప్రయాణించును. ఆ నాడుల వర్ణములబట్టి (తెలుపు పనుపు) అవి పరాశక్తి ధరించిన వెండి బంగారపు హారములుగా భావింపబడినది.

శ్రీనూక్తమున "హిరణ్యవర్ణాం హరిణీం నువర్ణ రజతస్రజాం" అని మొదటి ఋక్కు పలుకుట గమనింపవలెను. ఇక "ఇడా చ నామ నిశ్వానా సోమ మండల నంచరా। పితృయాన మితి జ్ఞేయం వామ మాశ్రిత్య తిష్ఠతి". ఇడా నాడి నిశ్వాన రూపమున చంద్రమండలమున నంచరించుచు, పితృయానమని (ధూమ మార్గమనియు) పిలువబడుచు ఎడమ భాగము నాశ్రయించి ఉన్నది. "దక్షిణే పింగళా నాడీ వహ్ని మండల గోచరా। దేవయాన మితి జ్ఞేయం పుణ్యకర్మాను సారిణీ ॥" పింగళానాడి దక్షిణ (కుడి) భాగమున వ్యాపించి అగ్నిమండలమున గోచరించుచు పుణ్యకర్మానుసారిణియై యుండును. దీనినే దేవయానమని అర్చిరాది మార్గమనియు చెప్పెదురు.

ఉ॥ *హ్లాద మొనంగు నార్తులకు, నబ్జకర ప్రనరంబు రీతి, నా*
*వేదన గూర్చు బాపులకు వేడివెలుంగు వెలుంగు తైవడిన్,*
*నీదగు దివ్య తేజ మవనిన్ జ్వలియించుచు, నాశ్రితాళి కా*
*మోదము గూర్చు, బంధ పరిముక్తికి మార్గము చూపు నంబికా॥* 111

అమ్మా! నీ దివ్య తేజము ఆర్తులకు చంద్రకిరణ ప్రసారము వలె ఆనందమును,పాపులకు నూర్యుని వేడియైన వాడి కిరణముల వలె తాపమును, కలిగించును. ఇట్లు చంద్రనూర్యాత్మకమైన నీ దివ్యతేజము జ్వలియించుచు (వెలుగొందుచు) నిన్నాశ్రయించిన భక్తులకు జన్మ బంధవిముక్తికి త్రోవను జూపుచు ఆనందప్రద మగుచున్నది.

శ్రీసూక్తమున 5వ ఋక్కు "చన్ద్రాం ప్రభాసాం యశసా జ్వలంతీం శ్రియం లోకే దేవ జుష్టా ముదారాం - -" అని శ్రీదేవిని ప్రస్తుతించుచున్నది. శ్రీదేవి తన దివ్యతేజముతో (ప్రభాసాం) లోకమున ఆశ్రిత పారిజాతమని కీర్తివహించి (యశసా) వితరణమే స్వభావముగా (ఉదారాం) భక్తుల కానందమును (చన్ద్రాం) అభక్తులకు తాపమును (జ్వలంతీం) కూర్చుచు, దేవతలచే సేవింపబడుచున్నది(దేవజుష్టాం) అని కుండలీకరణ శబ్దములవలన తెలియుచున్నది.

శా॥ *మూలాధారమునన్ సువర్ణరుచియై మొల్కెత్తి, హృత్సీమ ద*
*ల్లాలిత్యంబున సాగి పై కెగసి, లీలా లోల శంపాద్యుతిం,*
*బాలం బూచు శిరంబునన్, శశికళా స్ఫూర్తిన్ విడంబించి ; నే*
*నే లీలన్ భవదీయ తేజమును నూహింతుం త్రికూటాత్మికా* ॥ 112

మూలాధారమున బంగారవు కాంతితో మొలిచి, హృదయ సీమను మెఱువు తీగవలె పెరిగి, శిరమున (బ్రహ్మరంధ్రమున) చంద్రకళవలె తోచి, నీ తేజము వుష్పించినది. అమ్మా! త్రికూటాత్మికా! దానిని నే నెట్లున్నదని ఊహింపగలను?

వాగ్భవ కామరాజ శక్తి కూటములకు త్రికూటములని పేరు. శిరోభాగమున వాగ్భవ కూటము, కంఠమునకు దిగువగా నడుము వఱకు మధ్య కూటము లేక కామరాజ కూటము, నడుమునకు క్రింది భాగము శక్తి కూటము అని తెలియవలెను.

"శ్రీమద్వాగ్భవ కూటైక స్వరూప ముఖ పంకజా
కంఠాధః కటిపర్యంత మధ్య కూట స్వరూపిణీ
శక్తి కూటైక తాపన్న కట్యధో భాగధారిణీ" - (ల.స.నా.)

ఈ పద్య భావమే గ్రంథాంతరములం దిట్లు చెప్పబడినది.

*"ఆధారే తరుణార్క బింబ రుచిరం హేమ ప్రభం వాగ్భవం*
*బీజం మన్మథ మింద్రగోప సదృశం హృత్పంకజే సంస్థితం*
*రంధ్రే బ్రహ్మ పదే చ శాక్త మపరం సోమ ప్రభా భాసురం*
*యే ధ్యాయన్తి పదత్రయం తవ శివే తే యాన్తి సౌఖ్యం పరమ్* ॥

— చంద్రకాళాజ్ఞానం

*"యోనౌ కనక పుంజాభం హృది విద్యుచ్చయోజ్జ్వలం*
*ఆజ్ఞాయాం చన్ద్రసంకాశం మహస్తవ మహేశ్వరి ॥*

— సౌభాగ్య హృదయం

చం॥ *వెలుగుల ముద్దవై తమము విప్పి, సహస్రదళాంబుజ స్థితిం*
*జెలువము మావ నీవు, తమ చిన్మయ వర్ణ సముచ్చయంబులం*
*బలుకుచు నీకు స్వాగతము, పత్రములు స్వీకరించు ; నమ్మ! నిన్*
*జలజనివాసినిం దలతు సత్వ సమృద్ధిని గోరి నెమ్మదిన్ ॥* 113

వెలుగుల ముద్ద వలె అవిద్య అనెడి చీకటిని విరియించి సహస్రదళ పద్మమున సౌందర్య పరమావధివైన నీవు ప్రవేశింప, ఆ పద్మపత్రములు వికసించి, చిన్మయములైన వర్ణ సమూహములతో నీకు స్వాగతము పల్కినవి. ఇట్లు పద్మనివాసినివైన నిన్ను సత్వగుణ సమృద్ధికొఱకు మదిలో ధ్యానించెదను.

*"యజ్జగ ద్భానకం భానం నిత్యం భాతి స్వతఃస్ఫురత్ ।*
*స ఏవ జగత్సాక్షీ సర్వాత్మా విమలాకృతిః ॥*

ఏ తేజ మెల్లపుడు తనంత తాను ప్రకాశించుచు, జగత్తును ప్రకాశింపజేయుచున్నదో అదియే లోకమునకు సాక్షియై సర్వాత్మయై మాలిన్య రహితమై యున్నదని భావము.

" *జ్యోతిషా మపి తజ్జ్యోతిస్తమసః పరముచ్యతే*
*జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్ ॥* "

— భగవద్గీత (13-18)

బ్రహ్మము సూర్యచంద్రాగ్నులకు కూడ ప్రకాశము నిచ్చునట్టిది. తమస్సుకంటె వేరైనది. జ్ఞాన స్వరూపమైనది, జ్ఞానముచే తెలియదగినది. జ్ఞానము వలననే చేరదగినది, జీవులందఱి హృదయాలలో నెలకొని యుండునది అని భావము. అది వెలుగుల కెల్ల వెలుగు నిచ్చెడి తొలి వెలుగు. ఐహికాధ్యాత్మికము లయిన చీకటులను పోనడచు మహత్తేజము.

అజ్ఞానమునకు వ్యతిరిక్త మయినది జ్ఞానము. పరమేశ్వరి చిన్మయి కనుక జ్ఞాన స్వరూపిణి. ఆ తల్లి అవిద్యారూపమగు చీకటిని తొలగించి, కులమార్గ మందలి షట్కమలములనే గాక, సహస్రార కమలమును కూడ ప్రభావితము చేసి నిరంజనయై నిల్చిన సౌందర్యసీమ. కమల (షట్కమలములు)

సంబంధమువలన ఆమె పద్మస్థిత. పద్మవాసిని. పద్మవర్ణ, పద్మభూషిత అని పిలువబడుచు మహాలక్ష్మియైనది.

శా॥ *భ్రూమధ్యం బమృతాంశు సాంద్ర రుచులం బొల్పార, దత్తేజమున్*
*ధీమంతుల్ గనుచుంద్రు యోగ నిరతిన్ దివ్యానుభోగంబుగా,*
*సామీచీన చిరంతనేప్సిత విశేషానంద ధామంబుగా*
*శ్రీమంతంబగు త్వత్కటాక్ష రుచిరశ్రీ చిద్విలాసంబుగా ॥* 114

కనుబొమల మధ్య భాగము మూల ప్రకృతి స్థానము. అది మనస్సునకు కూడ నిలయమే. అక్కడే మూడవ కన్ను (అంతర్నేత్రము) ఉండునందురు. అనగా పరమాత్మయొక్క ఆజ్ఞ అక్కడ వ్యక్తమగును. కనుకనే ఆ స్థానమున ఆజ్ఞాచక్రమును చెప్పుదురు.

అక్కడ చంద్రుని తఱపి వెన్నెల మనోహరముగ ప్రకాశించుచుండును. ఆ తేజస్సును అంతర్దృష్టితో యోగమార్గమున చూచువారికి, అది యొక దివ్యాను భోగముగను, ఎంతో కాలమునుండి ఎదురుచూచుచుండిన శ్రేష్ఠతమమైన ఆనందము సమీపించినట్లును, మంగళప్రదమైన నీ కటాక్ష సంపద్విలాసముగను చూపట్టును.

శా॥ *కైలాసంబన క్షీరసాగరమునా ఖ్యాతిన్ మణిద్వీపమై,*
*యాలోక్యంబగు త్వన్నివాసము సహస్రారంబున న్నిల్చి, త్వ*
*ల్లీలా దర్శన లోలురై మఱపునన్ లీనంబుగా సర్వమున్*
*నీలో దా మొకరై రహింతురు గదా నిర్వృత్తి దేవోవతీ॥* 115

ఓ తేజస్స్వరూపిణీ! కైలాస మనియు, క్షీరసాగరమనియు, మణిద్వీప మనియు ఖ్యాతి వహించి దర్శనీయమైన నీ నివాసము, బ్రహ్మరంధ్రమందలి సహస్రార పద్మమే. యోగు లా సహస్రారమున నిల్చి, నీ లీలల దర్శించుటందు కుతూహలురై సర్వమును విస్మరించి ఆనంద పారవశ్యమున తాము కూడ నీయందొకరై మోక్షమును పొంది ఆనందించెదరు.

ఆ స్థానమును చేరిన భక్తునికి భగవంతునికి భేదముండదు. రూప నామములు కరగిపోయి, త్రిపుట్యైక్యము చేకూరుటచే అద్వైత సిద్ధి కలుగును. అపుడు అంతయు ఆనందమే.

కైలాసము శివుని నివాసము. కనుక వాని అర్ధాంగియైన పార్వతికి (శక్తి) కూడ నివాసమే యగుచున్నది. క్షీరసాగరము విష్ణుపత్నియైన శ్రీమహాలక్ష్మికి

జన్మస్థానము. మణిద్వీపము ఆదిపరాశక్తియైన లలితా మహాత్రిపుర సుందరి యొక్క వాసస్థానము. పై మూడు స్థానముల నామములు ఆరాధ్యదైవముల బట్టి భిన్నముగా వినిపించినను నిజమునకు ఒకటే యనవలయును. పరతత్త్వమొకటే అయినపుడు స్థానములు వేరు వేరుగా ఉండుటకు అవకాశము లేదు కదా! వ్యష్టి సృష్టిలో ఈ స్థానము లన్నియు సహస్రదళ పద్మమందే భావింపబడి ధ్యానింపబడుచున్నవి.

ఉ॥ *జాగ్రతి విశ్వభావమును, స్వప్నమునందున దైజసత్వమున్,*
*బాగుగ నిద్రపోవు స్థితి ప్రాజ్ఞతయున్ వహియించి, యన్నిటన్*
*సాగుచు జీవభావమున, సాక్షిపరత్వమునం దురీయవౌ*
*నీ గమనాగమమ్ముల గణింప వశంబె! జగద్వినోదినీ ॥* 116

జగన్నాటకమున వినోదించు తల్లివి. మేల్కొని యుండునపుడు విశ్వునిగను స్వప్నమున తైజసునిగను, సుషుప్తియందు ప్రాజ్ఞునిగను, ఇట్లు ఆయా అవస్థలతో జీవభావమున చూపట్టుచున్నను, సాక్షి పరత్వమున తురీయవై యుండెడి నీ రాక పోకల తెలిసికొన జాలము.

*"బహిష్ప్రజ్ఞో విభుర్విశ్వో హ్యన్తఃప్రజ్ఞస్తు తైజసః*
*ఘనప్రజ్ఞ స్తథా ప్రాజ్ఞః ఏక ఏవ త్రిధాస్మృతః॥"*

బహిః ప్రజ్ఞ గలిగి వ్యాపకుడయి యుండువాడు విశ్వుడు. అంతః ప్రజ్ఞ గలవాడు తైజసుడు. ఘనీభూత ప్రజ్ఞ గలవాడు ప్రాజ్ఞుడు. ఇట్లు ఒకడే అయిన ఆత్మ ముగ్గురుగా చెప్పబడుచున్నాడని భావము.

ఇక జ్ఞానేంద్రియ కర్మేంద్రియములు మనస్సుచే నడిపింపబడుచు తమ తమ విధులను నిర్వహించు సమయము జాగ్రదవస్థ. ఈ యవస్థలో జీవునికి విశ్వుడని పేరు. ఇంద్రియములు విశ్రాంతి తీసికొనునపుడు కూడ మనస్సు మేల్కొని స్వప్న సంబంధమయిన స్వీయసృష్టియందు నిమగ్నమయిన స్థితి స్వప్నావస్థ. అపుడు జీవునికి తైజసుడని పేరు. మనస్సు కూడ విశ్రాంతి తీసికొనునపుడు సుషుప్త్యవస్థ అనబడును. ఈ స్థితియందు జీవుని ప్రాజ్ఞుడని పిలచెదరు. అన్ని అవస్థలలో జీవుని కర్మలకు సాక్షియై ఉండెడివాడు. తురీయుడు లేక పరమాత్మ - పరాశక్తి.

జాగ్రదవస్థలో కన్నులనుండియు స్వప్నమున కంఠమున నిలిచియు, సుషుప్తియందు హృదయమునుండియు, తురీయమున శిరస్సు నుండియు, సాక్షి చూచుచుండునని బ్రహ్మోపనిషత్ తెలుపుచున్నది.

*"నేత్రస్థం జాగరితం విద్యా త్కంఠే స్వప్నం సమావిశేత్।
సుషుప్తం హృదయస్థం తు తురీయం మూర్ధ్ని సంస్థితం।
తురీయం నామ తదవస్థావన్న స్సాక్షితియావత్॥*
-మాండూక్యోపనిషత్ (గౌ.కా.3)

ఉ॥ *అన్నమయంపు దేహమును నాత్మ యటంచు దలంచి, ప్రాణ నం
వన్నము దేహమౌట, నది ప్రాణము యౌనని యెంచి, మానసం
బున్నది గాన, అద్ది యయియుండు ననన్ నరిపోక, బుద్ధి న
ర్వోన్నతి గాదటంచు, రహి బోక, తురీయము ని న్దలంచెదన్॥* 117

అన్నమువలన వృద్ధి పొందెడి దేహమే ఆత్మయని తలచితిని. కాని దేహము ప్రాణయుత మగుటచే అది ప్రాణమై యుండు ననుకొంటిని. ప్రాణముకంటె ఉన్నతమై మనస్సు ఉండుటచే, మనస్సే ఆత్మయని భావించితిని. మరల ఆలోచించి, అది కూడ నరికాదని నిర్ణయాత్మకమైన బుద్ధిగా దానిని తలచితిని. బుద్ధి కూడ నర్వోత్తమము కాదని దానిని విసర్జించి ఆనందమే గొప్పదనుకొంటిని. తుదకాయానందమును కూడ కాదని తురీయముగా నిన్నే తలచుచున్నాను.

అన్నమయ ప్రాణమయ మనోమయ విజ్ఞానమయ ఆనందమయ కోశములు ఒకదానికంటె ఒకటి సూక్ష్మములయి పరాశక్తి నివాన స్థానములై పంచకోశము లనబడుచున్నవి. 'పంచకోశాంతరస్థితా' అని లలితా సహస్రనామము. ఈ కోశములు జీవునికి సంబంధించినవి.

ఇందు జీవుడు విశ్వ తైజస ప్రాజ్ఞ నామములతో తెలియబడుచున్నాడు. ఆత్మకు సంబంధించినది తురీయము. తురీయమనగా నాల్గవది. దీనికే సమాధ్యవస్థ యని వేదాంత పరిభాష.

*"స్వప్న నిద్రాయుతా వాద్యౌ, ప్రాజ్ఞ స్త్వస్వప్న నిద్రయా
న నిద్రాం నైవ చ స్వప్నం తుర్యే పశ్యంతి నిశ్చితాః॥
- మాండూక్యోపనిషత్తు (5) గౌడపాదీయ కారికా (14).*

విశ్వ తైజసు లిర్వురు స్వప్నముచేతను (భేదము), నిద్రచేతను (అవిద్యా) బంధితులు కాగా, ప్రాజ్ఞుడు కేవల నిద్రచే (అజ్ఞానము) బంధింపబడి యున్నాడు. తురీయుడు స్వప్నమువలన కాని, (అన్యథా గ్రహణము), నిద్రవలన కాని (అవిద్య), బంధితుడు గాక యున్నాడు. ఆయన అనిద్రుడు, అస్వప్నుడని నిశ్చితాభిప్రాయముగా తత్త్వవేత్తలు చెప్పుచున్నారు.

మఱి తురీయస్థితి ఎట్లుండు ననగా —

"నాంతః ప్రజ్ఞం న బహిః ప్రజ్ఞం నో భయతః ప్రజ్ఞం
న ప్రజ్ఞానఘనం న ప్రజ్ఞం నాప్రజ్ఞం, అదృష్ట మవ్యవహార్య
మగ్రాహ్య మలక్షణ మచింత్య మవ్యపదేశ్య మేకాత్మ ప్రత్యయ సారం
ప్రపంచోపశమం శాంతం శివమద్వైతం చతుర్థం మన్యంతే స ఆత్మా
స విజ్ఞేయః ॥"

— మాండూక్యోపనిషత్తు (7)

స్వప్నావస్థలో గల జ్ఞానము అంతఃప్రజ్ఞ. అట్లే జాగ్రదవస్థలో గల జ్ఞానము బహిఃప్రజ్ఞ. నిద్రావస్థలో తోచెడి జ్ఞానము ఉభయతఃప్రజ్ఞ తురీయమందున్న జ్ఞానము పై మూడు విధములయినది కాదు. ప్రజ్ఞాన ఘనస్వరూపమును కాదు. జ్ఞానము లేనిది కూడ కాదు. మఱి యెట్టిదనిన - కనిపింపనిది, నిర్ణయించుటకు కాని గ్రహించుటకు కాని వీలు పడనిది, ఎట్టి గురుతులు లేనిది, ఊహ కందనిది, కపటము కానిది, ఆత్మయొక్క సారమైనది ప్రపంచము - పంచభూతాది వికారము లన్నియు - నశించిన పిమ్మట కూడ ఉండునట్టిది, శాంతము ఆనందమునై మఱియొకటి లేనిదై యుండెడిది. దానిని తురీయమని చెప్పుదురు. ఆ తురీయమే ఆత్మ. అదే తెలిసికొనదగినదని భావము. తురీయము = పరబ్రహ్మము.

చం॥ *పురుషుని రీతియున్ మగువ పోలిక నీ వెపు డెట్టు లైతో! త*
*త్పరమ రహస్యము న్దెలియు వారలు లేరు ; త్వదీయ భావమే*
*పర గుణయుక్తి రెండగుచు పత్నిలుపో పతి పత్నులౌచు, నుం*
*దరమగు వామ భాగము ప్రధానముగా భవదీయరూపమో ॥* 118

పురుషుని వలెను స్త్రీ వలెను నీవు ఎపుడు ఎట్లు మారితివో ఆ రహస్యమును తెలిసిన వారు లేరు. నీ కోరికయే రెండు రూపములతో పతి పత్నులై యుండును. ఆ పరిణామములో సుందరమైన నీ వామ (ఎడమ) భాగము ప్రాధాన్యము వహించి స్త్రీ రూపమును దాల్చియుండును. కనుకనే ప్రధానమని పిలువబడుచున్నది.

ఒకడే అయిన పరమాత్మ ఆత్మానందముకొఱకు రెండవ దానిని కోరి రెండు రూపములుగా అయ్యెనని ఉపనిషత్తులు పల్కుచున్నవి. కనుక పురుషుడు స్త్రీ అనునవి ఒకే శక్తియొక్క విభిన్న రూపములే కాని అన్యములు కావు.

"నవై నైవ రేమే తస్మా దేకాకీ న రమతే । న ద్వితీయ మైచ్ఛత్‌| సహైవా నాన యథాస్త్రీ పుమాగ్ం సౌ నంపరిష్వక్తౌ । న ఇదమే వాత్మానం ద్వేధాపాతయ త్తతః| పతిశ్చ పత్నీచా భవతామితి||' -బృహదారణ్యక శ్రుతి (3-4-3)

"ఆత్మానం ద్విధా కరో దర్థేన స్త్రీ అర్థేన పురుషః" - సుబాలోపనిషత్‌

వామా శబ్దమునకు ఉత్తమ స్త్రీ లేక వామా నామముగల పరాశక్తి అని సామాన్యార్థము. వామలోచన అనినపుడు సుందరమైన కన్నులు గలది అని అర్థము. కనుక వామాశబ్దమువలన పరాశక్తి సౌందర్యసీమ అని కూడ ద్యోతక మగుచున్నది. "స్వాంతః స్థిత ప్రపంచ వమనాత్‌ విశ్వజనయిత్రీ శక్తిః " తనయందలి ప్రపంచమును వెలుపలికి తెచ్చుటవలన విశ్వమును సృష్టించిన శక్తి వామ అని వ్యుత్పత్తి. 'వామా' ప్రాధాన్యము గల ఎడమ భాగము, వామ భాగము.

ప్రధానమునకు పరమాత్మ, ప్రకృతి, బుద్ధి, ముఖ్యము అని అర్థములు. పరాశక్తికి లింగ భేదము లేకున్నను, శక్తి శబ్దము స్త్రీలింగ మయినందున స్త్రీగనే భావింపవలెను.

చం|| *ప్రకృతియు పూరుషం డనెడి ద్వంద్వము భేదము పల్కు గాని, త*
*త్సకలము బ్రహ్మమన్న శ్రుతి సారము పారము నీవ యౌట, నీ*
*ప్రకటిత రూపమే పురుష భావము, నీవు తదంతరంగమై*
*వికసన మొందు శక్తివి సవిత్రివి బ్రాహ్మివి విశ్వతోముఖీ ||* 119

ప్రకృతి - పురుష లనెడి ద్వంద్వము భేదమును సూచించును గాని "సర్వంహ్యేతద్బ్రహ్మ" 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అని శ్రుతులు పలుకుచుండ, భేదమునకు అవకాశము లేదు. కాగా వ్యక్తమైన నీ రూపమే పురుషుడు. పురుషుడనగా పరమాత్మ. సాంఖ్యమున జీవుడు. ఆ పురుషుని హృదయము నుండి శక్తి రూపమున వికసించు ప్రకృతివి. అనగా అవ్యక్తమైన ఉపాదాన కారణము లేక స్వభావము. అంతట ముఖములు గల ఓ తల్లీ! నీ వీ సృష్టిని కూర్చిన బ్రాహ్మీశక్తివి. విశ్వమును ప్రసవించిన సవిత్రివి.

"ప్రకృష్ట వాచకః ప్రశ్చ కృతిశ్చ సృష్టి వాచకః । సృష్టౌ ప్రకృష్టా యా దేవీ ప్రకృతి స్సాప్రకీర్తితా ॥ " దేవీ భాగవతము (9-1-5) ప్రకృష్టమయిన సృష్టి అనగా సృష్టియందు ప్రకృష్టమయిన దేవి ఎవరో ఆదేవి ప్రకృతి.

*"ప్రకృతిం పురుషం చైవ వి ద్ధ్యనాదీ ఉభావపి।*
*వికారాం శ్చ గుణాం శ్చైవ విద్ధి ప్రకృతి సంభవాన్॥"*

—భగవద్గీత. (13-20)

ప్రకృతి పురుషులు ఇరువురు ఆది లేని వారే. పరమాత్మయొక్క రూప సామర్థ్యములే. వికారములు (మార్పులు) సత్వరజస్తమో గుణములు ప్రకృతి నుండి పుట్టినవి. కార్య కారణముల కల్పించుటందు ప్రకృతియు, సుఖ దుఃఖముల అనుభవించుటందు పురుషుడును హేతువు లగుచున్నారు.

పిండాండమున క్షేత్రము - క్షేత్రజ్ఞులనువారే, బ్రహ్మాండమున ప్రకృతి - పురుషులని వ్యవహరింప బడుచున్నారు. క్షేత్రమనగా దేహము. ఇది భూతాత్మకము అనగా పంచభూతములవలన ఏర్పడినది. కావున వికారములను (మార్పులను) పొందుచుండును. క్షేత్రజ్ఞు డనగా శరీరమును ధరించిన జీవుడు. శరీరధారి అయినందున పురుషుడయ్యెను. త్రిగుణములు వాని వికారములయిన రాగ ద్వేషాదులు స్వభావముగ కలది ప్రకృతి.

చం॥ *నిను భరియించి యీశ్వరుడు నిల్పు కొనెం దన భర్తృభావ, మా*
*యునికిని జేసి భార్యవన నుంటివి నీవు తదీయ శక్తివై ;*
*కనుగొన శక్తి - శక్తుడును గాంచని భేదము సృష్టి చేసి, యీ*
*మనుజుల భర్తగా బురుషు, మానిని భార్యగ జేసితో భువిన్॥* 120

నిన్ను (శక్తిని) భరించుటవలన ఈశ్వరుడు తన భర్త పదవిని నిలుపుకొనెను. ఉనికివలన నీవు భరింపబడి భార్య అను పేరున వాని శక్తివై యున్నావు. శక్తికి శక్తిమంతునకు - అనగా నీకును శివునికి లేని భేదమును సృష్టించి, ఈ భూమి పయి మానవులలో మాత్రము పురుషుని భర్తగను, స్త్రీని భార్యగను చేసితివా యేమి?

శక్తిని భరించుటవలన ఈశ్వరుడు భర్త (భరించువాడు) అయ్యెను. అనగా ప్రభువయ్యెను. శక్తి సంపదవలననే ఆయనకు, ప్రభుత్వ మబ్బినది. ఉపాధి (ఆశ్రయము) లేక శక్తి వ్యక్తము కాదు కావున, తన ఉనికిని బట్టి భరింపబడి ఆమె భార్య అయ్యెనే కాని వాస్తవమునకు ఒకటి వ్యక్త లేక ప్రకాశ రూపము (శివుడు), రెండవది అవ్యక్త లేక విమర్శరూపము (శక్తి) అనగా విమర్శవలన తెలియదగినది. వైదికు లీ శివ శక్తులను అద్వయ మిథునమని పిలచెదరు.

ప్రకృతి పురుషులు, వారి ప్రతిరూపము అయిన స్త్రీ పురుషులు, ఇరువురు సమప్రాధాన్యము గల ఒకే యొక చైతన్య స్వరూపులే. ఆత్మాంశ సంభూతులే. ప్రకృతి ఉపాధులను (శరీరములను) సృష్టించి, గుణముల ద్వారా కర్మానుష్ఠానమునకు ప్రోత్సహించగా, పురుషుడు ఆ ఉపాధుల ద్వారా సుఖ దుఃఖ రూపములైన కర్మఫలములను అనుభవించు చుండును. ఈ విషయమునే భగవద్గీత (13-20,21)

*"కార్య కారణ కర్తృత్వే హేతుః ప్రకృతి రుచ్యతే ।*
*పురుష స్సుఖ దుఃఖానాం భోక్తృత్వే హేతు రుచ్యతే ॥*

*"పురుషః ప్రకృతి స్థో హి భుఙ్క్తే ప్రకృతిజాన్ గుణాన్*
*కారణం గుణ సఙ్గోస్య సదసద్యోని జన్మసు ॥"*

లౌకికముగ కూడ స్త్రీ సుఖ దుఃఖములను సంతానమును సృష్టించు హేతువు కాగా, వాని ఫలముల అనుభవించు వాడు పురుషుడే కదా!

ఉ॥ *ఇక్షు శరాసనంబు ధరియించుట నీ తలపేమొ కాని, సూ*
*క్ష్మేక్షిక జూచు వారలకు నింపు, శ్రమంబును, భుక్తి నింపు నీ*
*దీక్షకు మారు రూపమని తెల్పుటకో యన నొప్పు ; కానిచో*
*వీక్షితమౌనె యించుగడ బ్రీతి దృఢత్వ రసానుకూలతల్ ॥* 121

నీవు చెఱకు వింటిని ధరించుటందు గల ఆంతర్యమేమిటో తెలియదు కాని, సూక్ష్మముగ పరిశీలించినచో, ఆనందము, ఆయాసము, అనుభవము అనురాగములతో లోకమును నింపుచున్న నీ నియమమునకు మఱియొక రూపముగా దానిని ధరించితివేమో అనిపించుచున్నది. కానిచో దానియందు (చెఱకునందు) తీయందనము కాఠిన్యము రసానుకూలతలు ఏల కన్పించును?

సృష్టి సర్వము ప్రేమమయమైనను, మనకట్లు కనిపించుట లేదు. ప్రేమానందములతో దుఃఖానుభవము కూడ కలదు. ప్రేమ ఫలించిన ఆనందము. ఫలింపకున్న దుఃఖము. రెండిటికి కారణము ప్రేమయే. కనుక ఈ మూడు గుణములతో (అనురాగము ఆనందము దుఃఖము) సృష్టి కూడియున్నట్లు తోచును. ఈ గుణముల సమష్టి సంకేతము ఇక్షుచాపము కావచ్చును. చెఱకున కాఠిన్యము (కష్టము), రసము (సుఖము) కలవు. తదనుభవము ఆనందమును గూర్చును. జీవుడు సృష్టి చక్రమున ప్రవేశించుట

బాధాకరము (చెఱకు నమలుట వంటిది). ఆవేదనయందే ఒక ఆనందము (ఇంపు) ఒక ప్రేమానుభవము (రసము) ఉండుట సృష్టి విచిత్రము.

మ॥ *మన మాధారము గాగ వెల్గి జను తన్మాత్రల్ ప్రకోపించి, జీ*
*వుని గార్యోన్ముఖు జేయు, రాగమును నేపుం జూపి యాకర్షణం*
*బున వర్తింమను, క్రోధ మంకుశమనం బొల్పుం, బ్రవృత్తి న్నివృ*
*త్తిని రెంటన్, భవదీయ హస్తగత మీ తీరెల్ల లోకేశ్వరీ ॥* 122

మనస్సును ఆధారము చేసికొని తన్మాత్రలు విజృంభించి ఇంద్రియముల ద్వారా జీవునిచే కర్మలు చేయించును. లాలన (అధికమగు కోరిక) విషయముల వాకర్షించును. క్రోధము అంకుశము వలె వర్తించును. ప్రవృత్తి నివృత్తుల రెండిటియందును ఇవి ఇట్లే పనిచేయుచుండును. ఈ విధమంతయు నీ చేతులలో కలదు.

శబ్ద స్పర్శ రూప రస గంధములు తన్మాత్రలు. తన్మాత్ర అనునది ఏదేని ఒక భూతముయొక్క పరిమితిని దెలుపు సూక్ష్మరూపము లేక శక్తిసారము. చెవి, చర్మము, కన్ను, నాలుక, ముక్కు అనునవి జ్ఞానేంద్రియములు. వాక్కు చేయి పాదము పాయువు ఉపస్థ అనునవి కర్మేంద్రియములు. వీని ద్వారా జీవుడు కర్మలొనర్చుచుండును.

మనస్సుద్వారా గ్రహింపబడు శబ్ద స్పర్శాదులు స్త్రీపుత్రాదుల సల్లాపముల వినుటకు, వారిని కౌగిలించుకొనుటకు, వారి రూపముల చూచుటకు, మధుర పదార్థముల రుచిచూచుటకు, పరిమళముల వాసనచూచుటకు జీవుని ప్రోత్సహించి వానిచే ఆయా కర్మల చేయించి బంధముల పెంచుకొను నట్లు చేయును. ఇది ప్రవృత్తికి సంబంధించినది.

ఇక నివృత్తి మార్గమున ఆత్మకు సంబంధించిన సద్వచనముల వినుటకు, విశ్వాత్మతో స్వాత్మను (జీవాత్మను) ఏకము చేయుటకు, ఆ దివ్యతేజమును చూచుటకు, పరమానందము ననుభవించుటకు, చైతన్య కుసుమమును ఆఘ్రాణించుటకు పురికొల్పి, సంసార బంధముల నొకటొకటే త్రెంచికొను నట్లు చేయును. ఇదంతయు మనస్సువలననే జరుగుచున్నది. "మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః" మనస్సే మనుజుని బంధమునకు మోక్షమునకు కారణమని తెలియవలెను.

ఆత్మస్వరూపిణియైన శ్రీమాత నాలుగు చేతులలో చెఱకు విల్లు, పూవుటమ్ములు, అంకుశము, పాశము లుండుటను వర్ణింతురు. తీయని

భావములు గల మనస్సే ఇక్షు చాపము. పంచతన్మాత్రలే పూలబాణములు. క్రోధ మంకుశము. రాగము పాశము.

*"రాగ స్వరూప పాశాఢ్యా, క్రోధాకారాంకుశోజ్జ్వలా।*
*మనో రూపేక్షు కోదండా, పంచతన్మాత్ర సాయకా॥ - (ల.స.నా.)*

ఆ తల్లి (పరాశక్తి) ఆత్మాః భిన్నము (తనకంటె వేరుకానిది) అనియు, తన మనస్సే ఆమె ధరించిన శరాసన మనియు, తన్మాత్రలే బాణము లనియు, తన మోహమే (రాగము) పాశ మనియు సాధకుడు గ్రహింపవలయును.

చం॥ *కలుముల గూర్చు నీ చరణ కంజములన్ స్మరియించి లక్ష్మి ; తా*
*బలుకుల నిచ్చు ద్వచ్చరణ భాసిత నూపుర కింకిణీ ధ్వనుల్*
*దలచి సరస్వతీ రమణి ; తద్రుచి జోదన సేయు సంధ్యయుం ;*
*జెలువ మిడున్ త్వదంఘ్రి నఖ చింతన తద్రతి దేవి సర్వదా ॥ 123*

లక్ష్మీదేవి నీ పాదపద్మముల స్మరించి సంపదలను, సరస్వతీదేవి నీ పాదముల అలంకరించిన మంజీర ధ్వనుల తలచి పలుకులను, సంధ్యాదేవి ఎఱ్ఱని నీ చరణ కాంతుల గ్రహించి ప్రచోదనను, రతిదేవి అందముల చిందెడి నీ కాలి గోళ్ళను స్మరించి సౌందర్యమును తమ తమ భక్తులకు ప్రసాదించు చుందురు. సర్వార్థములు నీ పాదములనుండియే లభించునని భావము.

కంజము = నీటిలో పుట్టినది - పద్మము, శంఖము, మకరము, కచ్ఛపము మున్నగునవి. నవ నిధులలో పద్మము మహాపద్మము శంఖము, మకరము కచ్ఛపము అనునవి కొన్నిటికి పేర్లు. పరదేవత పాదములు నిధులకు నిధానములు. కావున లక్ష్మీదేవి ఆమె చరణముల స్మరించి సంపదల నీయగా, శబ్దబ్రహ్మమైన సరస్వతి ఆమె పాదముల నలంకరించిన చిఱు గజ్జెల మ్రోతల భావించి వాక్కుల నిచ్చును. ఇట్లే సంధ్యాదేవియు రతిదేవియు ఆ తల్లి పాదములందు వారి వారి కనుకూలము లయిన గుణములను ఆశ్రయించి తమ తమ భక్తులను తృప్తి పఱచెదరు.

పరమేశ్వరి "సచామర రమావాణీ సవ్య దక్షిణ సేవిత-- కటాక్ష కింకరీభూత కమలా కోటి సేవిత -- శింజాన మణి మంజీర మండిత శ్రీపదాంబుజ -- రతి రూప -- రతి ప్రియ (రతిదేవి యెడ మిక్కిలి వాత్సల్యము గలది) సంధ్య -- ద్విజ బృంద నిషేవిత - - (ల.స.నా.) "లక్ష్మీవాణీ నిషేవిత" - (త్రిశతి)

ఉ॥ *నీ కనుఱెప్ప లే వగది నిల్చు నటుల్ భువనంబు లన్నియుం*
*జేకొను సృష్టి సంస్థితుల, ఛిన్నములై లయమందు, నంతలో*
*నాకృతులం దొలంగు, బునరావృతి బొంది వినూత్న సృష్టియై*
*నీ కమనీయ పాద నలినీ ద్యుతులందు వెలుంగు శాశ్వతీ!* 124

నీ కను ఱెప్పపాటుల ననుసరించి లోకము లన్నియు సృష్టి స్థితి లయముల పొందుచున్నవి. అంతలోనే తిరోధానమై మరల అనుగ్రహింప బడుచున్నవి. ఇట్లు నూతన సృష్టియై అవి నీ పాదరాజీవముల కాంతులవలననే ప్రకాశించుచున్నవి.

శ్రీదేవి "శాశ్వతి", "పంచకృత్యపరాయణ". "ఉన్మేష నిమిషోత్పన్న విపన్న భువనావళిః" - (ల.స.నా.). సృష్టి స్థితి లయ తిరోధాన అనుగ్రహము లనునవి పంచ కృత్యములు. ఇవి అన్నియు ఆమె కను ఱెప్పల కదలికలవలననే జరుగుచుండును.

*"ఊర్ధ్వ భ్రూవిభ్రమే సృష్టి రధో భ్రూవిభ్రమే లయః ।*
*ఊర్ధ్వ సంధి స్సృష్టికాలే హ్యాధస్సంధిర్లయే భవేత్ ॥*
*ఏవం దేవీ భగవతీ స్వభ్రూ విభ్రమణేన చ*
*కాలచక్ర మిదం సర్వం భ్రామయత్యేవ సర్వదా॥'*

-కాలశక్తి విలాసః (65-70)

శ్రీదేవి కనుఱెప్పలు పైకి లేచినపుడు సృష్టియు, క్రిందకు వాలినపుడు లయమును కలుగు ననియు, ఇట్లు ఆమె భ్రూవిభ్రమమువలననే కాల చక్ర మెల్లప్పుడు తిరుగుచుండు ననియు భావము.

ఉ॥ *శైవము వైష్ణవం బనగ, సౌరము నా, నిటు లెన్ని పేరులం*
*దావకమౌ విభూతులు ప్రధానముగా నొక కొన్ని గొంచు నం*
*భావన చేసి లోకమున బల్కు మతంబుల వెన్క, నాద్యవై*
*చేవగ నిల్తు వీవ యని, చెప్పుదు సత్యము, సత్యరూపిణీ ॥* 125

నీ అనంత కళ్యాణ గుణ విభూతులలో కొన్నిటిని మాత్రము గ్రహించి, శైవము వైష్ణవము సౌరము మున్నగు నామములతో బహు విధములుగా బోధించు మతములకు ఆధారముగా నిలచి యుండునది సత్యస్వరూపిణివైన నీవే యని యథార్థమును వచించెదను.

పరతత్వము రూప నామ గుణ రహితమై సత్య జ్ఞానానందయుతమైన ఒక శక్తి (ENERGY) మాత్రమే. దానిని వివిధ మతములు వివిధములుగా ప్రవచించుచున్నవి. "ఏకం స ద్విప్రా బహుధా వదంతి" - శ్రుతి. ఒకటే అయిన సత్యమును వేదవిదులు అనేక విధములుగా చెప్పుచున్నారు. మఱియు "ఏకం సంతం బహుధా కల్పయన్తి" "ఏకో దాధార భువనాని విశ్వా" - ఋగ్వేద ప్రవచనములు. "ఏకమేవాఽ ద్వితీయం బ్రహ్మ" - ఛాందోగ్యం

ఉ॥ *వాతమునందు స్పందనము, వారి ద్రవంబు, శిలన్ దృఢత్వమున్*
*జేతనయందు ప్రాణమును, శిఖ్యున దాహము, నింగి శూన్యమున్*
*ద్యోతన మౌట నీ వచట దోచుటనే కద! సర్వశక్తి సం*
*ఘాతము త్వత్స్వరూపమని తాంచెద సృష్టి రహస్య మంబికా! 126*

గాలిలో స్పందనశక్తి, నీటిలో ద్రావకశక్తి, శిలలో దృఢత్వశక్తి, చేతనలో ప్రాణశక్తి, అగ్నిలో దాహకశక్తి. ఆకాశమున శూన్యశక్తి - ఇట్లనేకముగ శక్తులగుపించుటకు కారణము నీ వచట నుండుటనే కదా! అన్ని శక్తుల సమష్టి రూపము నీ వనునది సృష్టి రహస్యము.

దేవి 'ఆదిశక్తి - పరాశక్తి - మహాశక్తి - సర్వశక్తిమయి' (ల.స.నా.) మఱియు 'సర్వాంతర్యామిని - విశ్వరూప - విశ్వధారిణి'.

ఉ॥ *ఏకముగా ననేకము, ననేకముగా మఱి యేకమైన నీ*
*పోకడ లెన్న నా భుజగభూషణుడేని యెఱుంగునే? త్వదీ*
*యాకృతి నిర్ణయింప విధియైన సమర్థుడే? వేయి నోళులన్*
*నీ కమనీయ సంస్తవము నేర్చునె సేయ, ఫణీంద్రు డేనియున్॥ 127*

ఏకమును అనేకముగను అనేకమును ఏకముగను, అపగా ఒకటే అగు పరతత్వమును బహు రూపములుగను, బహుళముగ తోచు ప్రపంచమును ఏకాత్మగను (పరమాత్మగా) చూపించు నీ పోకడలు సర్వజ్ఞు డయిన శివునికి గూడ తెలియవేమో! బహు విధములుగ స్ఫురించు నీ రూపమును నిర్ణయించుటకు సకల ప్రాణుల శాసించు విధి కూడ సమర్థుడు కాడు. సర్పరాజగు ఆదిశేషుడు కూడ వేయి నోళ్లున్నను, నిన్ను స్తుతింప జాలడు.

ప్రళయమున కూడ నశింపని పరమేశ్వరుని శక్తి లేక సామర్థ్యము కనుక, ఆమె 'శాశ్వతి' - బహురూప - వ్యక్తావ్యక్త రూపిణి - నిర్గుణ - నిరుపాధి

- నిరీశ్వర - శివవర (శివుని కూడ అతిక్రమించి యుండెడి శక్తి) ఏకాకిని - (ల.న.నా.)

ఉ॥ *ఉన్నది లేనటుల్ మఱియు నుండని దున్నటు లీవు చూప, నే*
*మున్నదొ లేదొ తా రెఱుగకుంద రవిద్య మునింగి మానవుల్;*
*మున్నుగ నీదు తత్వ మవబోధము గాక గ్రహింప వచ్చునే?*
*క్రన్నన భేద భావము తొలంగునె జీవుల ? తత్వదర్శినీ!* 128

ఓ తత్వదర్శినీ! ఉన్నది లేనిదిగను, లేనిది ఉన్నదిగను, నీవు చూపు చుండుటచే అవిద్యయందు కూరుకొని పోయిన మానవులు, ఏది సత్యమో ఏ దసత్యమో తెలియకున్నారు. ముందుగా నీ తత్వమును అర్థము చేసికొనక, దానిని గ్రహింప జాలరు. వారి నావరించిన భేదభావము తొలగదు.

లోకమున తెలియవలసిన విద్యలు రెండు గలవు. ఒకటి పరావిద్య. రెండవది అపరావిద్య. పరా అనునది బ్రహ్మవిద్యా రూపమైనది. అపరా అనునది గుణయుతమై ప్రపంచాకారమై ఉన్నది. అదే మాయ. ఈ మాయ జ్ఞానుల బుద్ధులను కూడ బలవంతముగ ఆకర్షింప గలదు.

"యా మా సా మాయా", "మాయా చ తమో రూపా" అని పూర్వోత్తర తాపిన్యుపనిషత్తులు వివరించుచున్నవి. ఉన్నట్లు కనిపించినను, లేనిది మాయ. మాయ చీకటివలె సత్యమును ప్రకాశింప చేయదు. బ్రహ్మము తానే యైనను, జీవుడు అవిద్యా ప్రభావమువలన తాను వేరని ఈశ్వరుడు వేరని భావించుచు, నిజముగ లేని ప్రపంచమును సత్య మనుకొని, ప్రాపంచిక సుఖములకై అఱ్ఱులు చాచు చున్నాడు. ఉన్నది బ్రహ్మమొక్కటే. లేనిది ప్రపంచము అని చెప్పినను గుర్తింపడు. దేహ పతనానంతరము ప్రపంచ మెక్కడ ఉన్నది ? ఈ అసత్య ప్రపంచమునే సత్యమనుకొనుట (భ్రాంతి) మాయాకల్పితము మాత్రమే. మఱియు "మాయాం శబల బ్రహ్మ రూపిణీం" అను వచనమును బట్టి మాయ బ్రహ్మమందొక విలక్షణ లక్షణమే యగును. స్వరూప జ్ఞానమువలననే మాయ తొలగును. "స్వరూప జ్ఞానేన వినా మాయా న శామ్యతి".

శా॥ *నీ మాయం బడిపోని ధీరుడొకడే; నీవే యతం డొటు ద*
*త్సామర్థ్యంబు లభించియుండు; నతడున్ తత్త్వస్వరూపుండునై,*
*కామేశుండయి పంచకృత్యముల సంకల్పించు గ్రీడార్థమై;*
*సోమార్కాంగ లలాట నేత్రముల సంశోభించు దద్రూపమున్॥* 129

అమ్మా! నీ మాయలో చిక్కక నిల్చిన ధీరుడొకడే కలడు. ఆతడు నీవే కనుక, ఆ సామర్థ్య మాయన కబ్బినది. ఆయన కూడ తత్త్వస్వరూపుడై కామేశ్వరుడై (కోరికలకు అధినాథుడై), సృష్టి స్థిత్యాది పంచకృత్యములను కేవలము క్రీడకొఱకు సంకల్పించుచున్నాడు. ఆయన రూపము చంద్రుని అర్థాంగము, నొసటి కన్నులతో ప్రకాశించుచున్నది.

"దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా" అలౌకికమై గుణములచే నొప్పు నా మాయ దాట నలవికానిది అని భగవద్వాక్యము (భ.గీ.7-14)

పరబ్రహ్మాత్మికయైన పరదేవత మహామాయా స్వరూపిణి. ఆమె మాయ మిక్కిలి బలవత్తరమైనది. మాయకు లొంగని వారు జ్ఞానులు మాత్రమే. అపుడు వారు వేరు కాక పరమాత్మ స్వరూపులే అగుదురు. కావున పరమాత్మ ఒక్కడే మాయకు లొంగని వాడు. కొందఱు జ్ఞానులు కూడ కొన్ని సందర్భములలో మాయాజాలమున చిక్కుకొని, వివేకము కోల్పోయి, ఇంద్రియార్థముల వెంట పడిన గాథలు పురాణములలో గలవు. విశ్వామిత్రాదుల చరిత్ర లిందుకు నిదర్శనము.

*"జ్ఞాని నా మపి చేతాంసి దేవీ భగవతీ హి సా।*
*బలాదాకృష్య మోహాయ మహామాయా ప్రయచ్ఛతి" - దుర్గాసప్తశతి*

భగవతియగు ఆ దేవియే - మహామాయయే — జ్ఞానుల మనస్సులను కూడ బలవంతముగ ఆకర్షించి వ్యామోహమునందు నిల్పుచున్నదని భావము. కాని ఇట్టి మాట పరమాత్మయందు నిరర్థక మగుచున్నది. కారణము ఆమెయే పరమాత్మ కనుక.

పరమేశ్వరుడు పరాశక్తి ఒక్కరేయని 'సోమార్థాంగ, లలాట నేత్ర, కామేశా' ది విశేషణములతో ధ్వనింపజేయబడినది. పంచకృత్య పరాయణత్వము పరమేశ్వరీ పరమేశ్వరులకే పరిమితమని గ్రహింప గలరు.

(స + ఉమ) = సోమ = 1. ఉమతో కూడినవాడు, 2. చంద్రుడు.

లలాట నేత్రుడు = నొసట కన్ను గలవాడు - శివుడు. ఇది జ్ఞాననేత్రము. ఆయన మూడు కన్నులు సోమ సూర్యాగ్నులు. భూత వర్తమాన భవిష్యత్తుల చూచెడివని కొందఱి వ్యాఖ్యానము. ఆ తల్లి విషయమున కూడ అట్లే చెప్పబడినది.

కామ + ఈశుడు = కామమునకు (కోరికకు) ప్రభువు. ప్రపంచమును సృష్టింప వలెననెడి కోరిక (సోఽకామయత) అయననదే. ఆ కోరికకు (జగత్) రూపకల్పన చేసినది కామేశ్వరి. వారిరువురకు అభేదము.

పంచకృత్యములు - సృష్టి స్థితి సంహార తిరోధాన అనుగ్రహములు. ఇవి పరమేశ్వరునియందు కలవు. సృష్టికొఱకు బ్రహ్మను, స్థితికొఱకు విష్ణువును, సంహారము కొఱకు రుద్రుని, తిరోధానము (కనిపింపకుండచేయుట) కొఱకు ఈశ్వరుని, అనుగ్రహము కొఱకు సదాశివుని ఆదిపరాశక్తి కల్పించినది.

చం॥ *అమృతమయూఖ తుల్యమగు నానన కాంతి నతిక్రమించు య*
*త్నమున, వినీల నీరదమునా స్ఫురియించు త్వదీయ కైశిక*
*ప్రముదిత బర్హిణంబునయి, ప్రాజ్ఞత దోపగ షణ్ముఖుండనై,*
*విమలము నీ ధ్రువాఖ్య కల వీక్షణ సేయుచు నుందు శాంభవీ* ॥ 130

అమ్మా! శాంభవీ! నీ ముఖ చంద్రుని అతిక్రమించు యత్నమున (ఓడి) నల్లనైన మేఘమువలె స్ఫురించు నీ కొప్పును చూచి ఆనందించు నెమిలి నయ్యెదను. బుద్ధి వికాసము కలుగుటవలన (ఆ మయూరము నధిరోహించెడి) షణ్ముఖుడనయ్యెదను. అపుడు నీ ధ్రువాఖ్య కలను చూచుచు ఉండిపోగలను.

షణ్ముఖుడైన సుబ్రహ్మణ్యుడు శ్రీదేవి సన్నిధానమున ఉండుట వలన ఎల్లపుడు ఆమెయొక్క నిత్యత్వమును చూడగలడు. సన్ముఖ, చిన్ముఖ, ఆనందముఖ, లీలాముఖ, జ్యోతిర్ముఖ, సర్వతోముఖములనునవి షణ్ముఖములు. ఇందు సన్ముఖము సత్యమును, చిన్ముఖము జ్ఞానమును, ఆనందముఖము ఆనందమును, లీలాముఖము ప్రవృత్తిని, జ్యోతిర్ముఖము తేజస్సును, సర్వతోముఖము సర్వవ్యాపకత్వమును తెలుపు సంజ్ఞలు. ఇవి పరమాత్మయొక్క లక్షణములే. ఇట్టి గుణములు కల పరమహంస షణ్ముఖుడే కదా!

దేవియొక్క పదునైదు కళలు వృద్ధి క్షయముల పొందుచుండగా పదునారవ కళ మాత్రము ధ్రువకళ అనెడి పేరున స్థిరముగ ఉండును.దానిని చూచుచు ఆనందమున నుండుటే సమాధి.

అమృత మయూఖుడు = చంద్రుడు - పరదేవత అమృతము వర్షించి 72వేల నాడులకు ఆనందమును, జీవ సత్వములను ప్రసాదించును. బర్హిణము = నెమిలి, షణ్ముఖుడు = పార్వతీపుత్రుడు, దేవసేనాని.

శ్రీమాత 'విద్యాః విద్యాస్వరూపిణీ - పరాః పరా' - (ల.స.నా.)

ఉ॥ సిగ్గుగ భేద భావముగ జేరు నవిద్య దొలంగ ద్రోచి, నీ
నిగ్గగు తత్త్వమున్ దెలియ నేర్పుము, బ్రహ్మమయైన వృత్తియం
దొగ్గగ నా మనంబు, భవదుజ్జ్వల తేజము నాక్రమింపని
మ్మొగ్గల మౌచు, గోరను తదన్యము నింక, గుహాధివాసినీ ॥ 131

హృదయ కుహరమున, పంచకోశములకు అతీతముగా, ఎక్కడో లోతున నివసించెడి తల్లీ! నాయం దనేక జన్మలనుండి పాతుకొని యున్న భేదభావమును తొలగించి, సారవంతమై మిగిలిన నీ తత్వమును స్పష్టము చేయుము. బ్రహ్మాపరోక్షవృత్తిని వహించునట్లు నా మనస్సును లెస్సగా నీ దివ్యతేజమును ఆక్రమింపనిమ్ము. ఇది తప్ప మఱియొకటి నిన్ను యాచింపను.

సిగ్గు భేదభావమునకు చిహ్నము. మఱియొక రున్నపుడే కదా సిగ్గగును. ఒంటరి యైనపుడు దానికి అవకాశము లేదు. "భేదోయ మజ్ఞాన నిబంధనః" - కఠోపనిషత్తు (2-1-11) భేదము అజ్ఞానమువలన కలిగినదే. పరబ్రహ్మ తత్వము తెలిసినపుడు మనస్సునకు బ్రహ్మాపరోక్షవృత్తి కలుగును. బ్రహ్మమే అయిన వృత్తి అని భావము. అనగా మనస్సు బ్రహ్మముగా ప్రతిఫలించుట. 'తదాకార ఆకారిత అంతఃకరణ వృత్తిత్వం అనుభవం - తన్మయత్వం" వస్త్వాకారముగ రూపము వహించిన చిత్తవృత్తిత్వమే అనుభవము. దీనినే తన్మయత్వమందుము. బ్రహ్మము నిర్గుణమైనను వస్తు రూపమున కనిపింపక పోయినను, మనస్సు బ్రహ్మభావమునుపొందునని తాత్పర్యము.

గుహాధివాసిని = జ్యోతిస్స్వరూపమైన పరమాత్మ - శ్రీమాత 'పంచ కోశాంతరస్థితా' - 'అంతశ్చరతి భూతేషు గుహాయాం విశ్వమూర్తిషు' - శ్రుతి.

సిగ్గు = లజ్జ, హ్రీ, సకల జీవులలో సిగ్గుగా వ్యక్తమగు భావము పరదేవతయే. "లజ్జా (ల.స.నా.). ' లజ్జాపద సమారాధ్యా - లజ్జాఢ్యా - హ్రీం - హ్రీమతి - హ్రీంశరీరిణీ - హ్రీంమతిః - హ్రీం శీలా' - (లలితా త్రిశతి)

ఉ॥ కోర నవిద్య సంస్కృతిని గూర్చు విశృంఖల దీన హీన సం
స్కారము ; సద్గుణోత్తమ విచార వివేక నిధానమౌ సుసం
స్కారము నైన మొల్లను ; సుఖం బిడు బంధ విముక్తి నొక్కటే
కోరుదు, జ్ఞాన కలికను కోరికలన్ వెలిగింతు నారతిన్ ॥ 132

అవిద్య కారణముగా సంసారమున నెట్టిది దీనమైన హీన సంస్కారమును (Prenatal Tendency) కోరను. అట్లే సద్గుణోత్తమమై

వివేకమునకు నెలవైన సుసంస్కారమును కూడ అభిలషింపను. సుఖమున కాశ్రయమైన బంధరాహిత్యమునే అర్థించెదను. జ్ఞాన జ్వాలతో నా కోరికల నన్నిటిని హారతిగా వెలిగించెదను.

గుణముల చేరికవలన మలినమైనది అవిద్య. దానివలననే సంస్కార రూపమున బంధము లేర్పడుచున్నవి. హీన సంస్కారమువలన హీన జన్మలు, సుసంస్కారములవలన ఉత్తమ జన్మలు లభించును. కాని మోక్షము కలుగదు. సంస్కారము నశించినపుడు, అనుభవింప వలసిన దేమియు లేక, ముక్తి కలుగును. బంధరాహిత్యమే ముక్తి. అది సుఖాస్పదము.

పరమేశ్వరి 'ముక్తిద - ముక్తి రూపిణి - ముక్తినిలయ - కైవల్య పదదాయిని' కావున ఆమె కటాక్షమునకై యత్నింప వలయును.

ఉ॥ *మాయను మున్గు లోకము తమః ప్రచురంబగు గాఢ నిద్రలో*
*హాయిగ దోగు వేళ హృదయాంతర బోధన జేసి వచ్చితిన్ ;*
*నీ యభిమానము న్దెలిసి నిర్భృతి గన్నుల హర్ష బాష్పముల్*
*మూయ ద్పదీయ పాదముల ముందల, నోవ సుఖాస్పద స్థితిన్* ॥ 133

ఓ జగన్మాతా! చీకటి విరిసిన గాఢ నిద్రలో లోకము హాయిగ నిదురించు సమయమున అంతరాత్మచే మేల్కొలుపబడి వచ్చితిని. నీకు నాయందు గల వాత్సల్యమును తెలిసికొని కన్నులలో ఆనందబాష్పములు నిండగా నీ ముందల ఆనందముతో నిలిచియున్నాను.

*"యా నిశా సర్వ భూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।*
*యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః॥"*-భగవద్గీత (2-69)

అజ్ఞానమువలన పామరులకు ఏది (పరమార్థము) రాత్రివలె తోచునో (కనిపింపదో), అది యోగులకు పగలు వలె స్పష్టముగ కనిపించును. దేనిని (విషయవ్యాప్తిని) ప్రాకృతులు జాగ్రదవస్థలో చక్కగా చూచుచుందురో, దానిని రాత్రియందు వలె జ్ఞానులు చూడరు. జీవులు ఎఱుక లేక తమను తాము మఱచు వేళ, అవిద్య తొలగిన వారు మాత్రమే ఆత్మానందమును అనుభవించుచు మేల్కొని యుందురనియు, విషయ వ్యాప్తి పరిగణింప రనియు భగవద్వాక్యము. పరమేశ్వరి దయాస్వరూపిణి. ఆమె వాత్సల్యమునకు అవధి లేదు. కావున జ్ఞానమును ప్రసాదించి తన సన్నిధికి ఆమెయే రప్పించుకొను నని తాత్పర్యము.

ఉ॥ దాసుడనైతి దేహ పరిధానము దాలిచి ; జీవుడైతి త్వ
ద్భాసుర చిత్కళాంశమయి, వర్తిలు చుండుట ; నీవ నేనుగా
భాసిలు దాత్మ భావమున నానిదలంపక ; ఇంత చాలు నీ
వేసము బాన లేల? త్యజియింతు నభేదమునందు పూర్ణమై॥ 134

అమ్మా! దేహమనెడి వస్త్రమును ధరించుటవలన (నీకు) సేవకుడనైతిని. మహోజ్జ్వలమైన నీ చిత్కళాంశమగుటవలన జీవుడనైతిని. ఇక ఆత్మభావము వహించి భేదమును పాటింపక నీవే నేనుగా విరాజిల్లుదును. ఈ వేషము భావ ఎందులకు ? అభేదమునందు (అద్వైతము) పరిపూర్ణత నొంది, వీనిని వదలి వేసెదను. నామరూప రహితమైన అద్వైతసిద్ధిని పొందెదను.

*"దేహబుద్ధ్యాస్మి దాసోహం జీవబుద్ధ్యా త్వదంశకః ।*
*ఆత్మబుద్ధ్యా త్వమేవాఽహం ఇతిమే నిశ్చితామతిః॥"*

—అధ్యాత్మరామాయణం

జీవునికి దేహమే తా ననుభావము అవిద్యవలన కలుగుచున్నది. కనుక అవిద్య తొలగ నంతవఱకు ద్వైత ముండక తప్పదు. నేను వేరు దేవుడు వేరు అని భావించుటే ద్వైతము. ద్వైతమువలన తనను దాసునిగను, భగవంతుని ప్రభువుగను చిత్రించుకొనుట జరుగుచున్నది. అట్లుగాక, 'నేను పరమాత్మ యొక్క చేతనలో ఒక అంశమును మాత్రమే కాని, పరమాత్మ నెట్లగుదును?" అనెడి భావము జీవునికి ఉండుటయే విశిష్టాద్వైతము. "నీ దాసుని దాసుని దాసుడ" అని చెప్పుటలో ఈ అంశమే స్ఫురించును. జీవభావమును దాల్చిన నేను ఆత్మనే, అన్యము కాదు అనెడి స్థితియే అద్వైతము.

అద్వైతమున వేరొకటి ఉండుటకు వీలు లేదు. ఇవి అన్నియు మానవుని ఆలోచనా సరణి పైనను, సాధన ప్రగతి పైనను ఆధారపడియున్నవి. కేవలము భావనయందే గాక, ఆ భావమును ఆచరించు నపుడు అద్వైత సిద్ధి కలిగినదని తలపవచ్చును. దానికై మానవుడు నిరంతరము యత్నింపవలెను.

భగవద్గీత (11 - 54) లో శ్రీకృష్ణ భగవానులు "జ్ఞాతుం ద్రష్టుం చ తత్వేన ప్రవేష్టుం చ పరంతప" అని తత్వార్థమును స్పష్టము చేసియున్నారు. తాను వేరు దైవము వేరను భావము గల మానవుడు తొలుత జ్ఞానమువలన తత్వమును తెలిసికొని (జ్ఞాతుం), తాను పరమాత్మయొక్క అంశమగు జీవుడగుటను చూడవలెను. (ద్రష్టుం). పిమ్మట అందు ప్రవేశించి (ప్రవేష్టుం) జీవుడు పరమాత్మ ఒకరే కాని వేరు కాదని ఏకము కావలెను. అందువలన పై

మూడు శబ్దములు - "జ్ఞాతుం ద్రష్టుం ప్రవేష్టుంచ" మత త్రయము యొక్క సారాంశములుగా ఉన్నవి. సాధన సాఫల్యమునకు భగవాను డుపదేశించిన యోగము 'అనన్యమగు భక్తియే' అని ఆ శ్లోకముయొక్క పూర్వార్థమునందే తెలుపబడినది.

శా॥ *పంచత్వంబును బొంది దేహము స్వభావ వ్యాప్తిమై నిల్వ, నా*
*పంచత్వంబును వీడి భూతములు నిర్వ్యాప్తిన్ గుణాపేతలై*
*పంచత్వంబు నెఱుంగ రాని యొక తత్త్వంబందు లీనంబుగా,*
*మించం దోచెడి నిశ్చలత్వమున, సంప్రీతిం బ్రమోదించెదన్* ॥ 135

దేహము నశించి తనకు కారణము లయిన పంచభూతములలో కలిసిపోగా, ఆ పంచభూతములు కూడ తమ పంచత్వమును వీడి, అది (ఐదగు భావము) లేని ఏకైక తత్వమున లీనమగును. అపుడు అన్నిటను మించి స్ఫురించు నిశ్చలత్వమున చక్కగా ఆనందించెదను.

పంచత్వమనగా మరణమని అర్థము. పంచ భూతముల సమ్మేళనమున ఒకటిగ ఏర్పడిన శరీరము మఱల పంచభూతములుగా విడిపోవుటని భావము. దేహము దగ్ధమైనపుడు (దహింపబడునది దేహము) అందలి ఐదు భూతములు వ్యాప్తి చెంది, తమకు సంబంధించిన మహాభూతములలో చేరిపోవును. ఇది కూడ ఒక విధమగు పంచీకరణమే. కాని అంతవఱకు వేరు వేరుగా ఉండిన ఆ పంచమహాభూతములు కూడ లయకాలమున, తమ వ్యాప్తిని ఉపసంహరించుకొని, ఏకమగును. అనగా అపంచీకృత మగును. అవి ఏ తత్వమునుండి ఏర్పడినవో ఆ ఏకైక తత్వమందే లీనమగును. అపుడు మిగులునది స్పందనా రహిత నిశ్చలత్వము మాత్రమే. అది వాక్కు కాని మనస్సు కాని అందుకొనలేని స్థితి. "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహా" - (తైత్తిరీయ బ్రహ్మవల్లి 9వ అనువాకము). అట్టి నిశ్చలత్వమున 'నేను' ఆనందించు నను.

ఇచట పంచీకరణమును గూర్చి క్లుప్తముగ తెలిపెదను. "స్రష్టుకామో జగద్యోని స్తమోగుణ మధిష్ఠాయ సూక్ష్మ తన్మాత్రాణి భూతాని స్థూలీకర్తుం సోఽ కామయత, సృష్టే పరిమితాని భూతా న్యేకమేకం ద్విధా విధాయ, తయో రేకం పునః చతుర్ధా వికృత్వా, స్వస్వేతర ద్వితీయాంశైః పంచ పంచధా సంయోజ్య, పంచీకృత భూతై రనంతకోటి బ్రహ్మాండాని తత్తదండోచిత చతుర్దశ భువనాని, తత్తద్భువనోచిత గోళక స్థూల శరీరాణ్యసృజత్॥" - పైంగలోపనిషత్తు.

జగత్తును సృష్టింపనెంచిన జగత్కారణుడగు పరమాత్మ తమోగుణము నధిష్ఠించి సూక్ష్మములై యున్న, తన్మాత్రలను (శబ్ద స్పర్శ రూప రస గంధములను) స్థూలము చేయదలచి, తన సృష్టికి కావలసినంత వఱకు తన్మాత్రలను వేరు చేసి, తొలుత ఒక్కొక్క భూతమును రెండుగా విభజించెను. మఱల ఆ రెండు భాగములలో ఒక దానిని నాలుగుగా చేసి, రెండవ భాగమును అట్లే యుంచెను. ఈ నాలుగు భాగములను ప్రతిభూతముయొక్క అర్థభాగమునకు ఒక్కొక్కటి పంతున కలిపెను. ఇట్లు ఐదు భూతములను సంస్కరింపగా - ఆ భూతముయొక్క నిజాంశ సగమై, మిగిలిన నాలుగు భూతముల యొక్క అంశములు తక్కిన సగమునై స్థూలము లైనవి. ఉదాహరణకు ఆకాశభూతములో ఆకాశాంశము 1/2, వాయ్వంశము 1/8, అగ్న్యంశము 1/8, జలాంశము 1/8, పృథ్వ్యంశము 1/8 ఉండును. ఇట్లు స్థూల భూతము లేర్పడుటకు "పంచీకరణ"మని పేరు. పంచీకృతములయిన మహాభూతాంశములవలన, వ్యష్టి సమష్టి సృష్టులకు సంబంధించిన స్థూల శరీరములు ఏర్పడినవి. అనగా పిండాండ బ్రహ్మాండములు రూపొందినవి.

ఉ॥ *ఒక్కొక మెట్టు నెక్కి చన, నుండిన దేమియు గానరా, దహం*
*బొక్కటి తక్క, నయ్యదియు నుండెనొ లేదొ వచింప వాక్కుకుం*
*జిక్కదు, మానసంపు బరిశీలన కంద, దశబ్ద శబ్దమై*
*నెక్కొని స్తబ్ద వైఖరిని నిల్చు, తదాత్మ జయించుగావుతన్* ॥ 136

ఆత్మసాధనలో ఒక్కొక్క మెట్టు నెక్కుచు పోప పోప, తుదకు అహము తప్ప ఏముండెనో అగుపింపదు. ఆ అహము కూడ ఉన్నదో లేదో తెలుపుటకు, అది మాటలకు చిక్కదు, మనస్సునకు దక్కదు. శబ్దము కాని శబ్దమై పరానంవిత్ రూపమున నెలకొని యుండును. సర్వకృత్యములు ఉడిగినట్లు తోచు తద్రూపమైన ఆత్మ జయించును గాక!

ఆత్మ సచ్చిదానందమై నిత్యమై యున్నను, ఇంద్రియముల ద్వారా తెలియబడదు. సాధనలో కొంత దూరము పఱకే అహము కనిపించును. కాని తుద కా అహము కూడ తొలగిన స్థితిలో - సమాధియందు (సమ + ధీ సమమైన జ్ఞానముతో ఒకటై పోవుట) ఆత్మను ఊహాతీతమైన, తెలుప జాలని, మితి లేని, ఆనందముగా స్వానుభవమున గ్రహింపవలసినదే. ఈ విషయమునే కైవల్యోపనిషత్తు.

*"అచింత్య మవ్యక్త మనంతరూపం*
*శివం ప్రశాంత మమృతం బ్రహ్మయోనిం*

*తదాది మధ్యాంత విహీన మేకం*
*విభుం చిదానంద మరూప మద్భుతమ్ ॥"*

అని సూచించినది. అట్టి పరమాత్మకు జయమని ఉపసంహార వాక్యము.

ఉ॥ *శ్రీశ్వర తత్వసంగతి నిరీర్ష్యుడు శిష్టు డగస్త్యరాజు స*
*ర్వేశ్వరరావు సత్కవి, కవిత్వ కళాకృషికుండు, కాంథివి*
*శ్వ దసూన పాద జలజాంతర నిత్య నివాసి, వ్రాసె దా*
*శాశ్వత సత్యమున్ మధు రసాకృతి నీ కృతి విశ్వవేదనన్ ॥* 137

శ్రీ = పరాశక్తి యొక్కయు, శ్రీశ్వర = లక్ష్మీపతియైన మహా విష్ణువు యొక్కయు, శ్రీశ్వర = శుభప్రదుడగు శివుని యొక్కయు, తత్వ = వేదాన్తభాసితమైనట్టియు అనగా శాక్తేయ, వైష్ణవ, శైవ, తత్వ, విచారములందు ఈర్ష్య లేని వాడు, సదాచార సంపన్నుడు, బుధ విధేయుడైన శ్రీ అగస్త్యరాజు సర్వేశ్వరరావు సత్కవి - మంచికవి. సత్యపదార్థమును తెలిసిన కవి. కవిత్వ మనెడి కళయందు నిత్యము కృషి చేయువాడు. కొదువ (వెలితి) లేని శ్రీదేవి పాద పద్మములందు నిరంతరము నివసించువాడు. ఆయన విశ్వుని వేదనను, తేనె వలె మధుర మనోజ్ఞమయిన ఆకృతిగా ఈ కృతిని రచించెను.


సత్కవి, కావ్యకళాకృషీవల, మధుర కవి అనునవి కవికి పురస్కార సూచకముగ లభించిన బిరుదములు.

ఇక శ్రీ శబ్ద విచారము -

'శ్ + ర్ + ఈ' కలిసిన శ్రీ యగుచున్నది. శ్రీశ్వర శబ్దమందలి శ్రీ వర్ణము తేజః పుంజాత్మక చిచ్ఛక్తిని తెలుపును. ఇంకను శుభప్రదాయిని, (i)శ్రీవిద్యా రూపిణియగు 'పరశివా' అనియు (ii) లక్ష్మీదేవి అనియు, (iii)జగజ్జననియైన పార్వతి అనియు అర్థములు సాధ్యములే కావున శ్రీశ్వర శబ్దమునకు మంగళప్రదుడు పరానందచిద్రూపుడైన పరశివుడనియు, లక్ష్మీపతియైన మహావిష్ణువనియు, పార్వతీ విభుడైన శివుడనియు, అర్థములు సిద్ధించుచున్నవి. శ్రీయందలి శ్ - శివునికి, ర్ - తేజస్సునకు, ఈ - కామకళారూప శక్తికిని సంకేతములు.

*ఓం తత్సత్*

# కవి పరిచయము



'శ్రీపాదపాంశువు'

## శ్రీ అగస్త్యరాజు సర్వేశ్వరరావు

జననము : రక్తాక్షి - మార్గశీర్ష - శుక్ల పంచమి, ఆదివారము, 30 నవంబర్, 1924.

జన్మ స్థలము: గువ్వడి, వరికుంటపాడు మండలం నెల్లూరు జిల్లా.

జననీజనకులు : శేషమ్మ, సుబ్బారాయుడు

విద్యాభ్యాసము :

గురుకులవాసము – 8-10 సం. మధ్య శ్రీతాళ్ళూరు సూర్యనారాయణగారి యొద్ద, వెంగనపాళెం.

ఆంగ్లవిద్య – 11-20 సం. మధ్య వేంకటగిరి రాజా కళాశాల, నెల్లూరు.

వృత్తి విద్య – B.Ed., మహారాజా కళాశాల, విజయనగరం

స్నాతకోన్నతవిద్య – M.A., శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము, తిరుపతి

వృత్తి : అధ్యాపకత్వము, ప్రస్తుతం ప్రధానాధ్యాపకుడుగా విశ్రాంత జీవనం.

ప్రవృత్తి : గ్రంథపఠనము, కావ్యరచన, ఆధ్యాత్మిక సాధన, సంఘసేవ.

బిరుదములు : కావ్యకళాకృషీవల, మధురకవి, సత్కవి.

రచనలు (ముద్రితములు) : ఉదయగిరి దుర్గము, ఓంకారేశస్తవము, పూచినపూలు, ఆంధ్రగీతాంజలి, శ్రీరామసుధా తరంగిణి, శ్రీమాత గాయత్రి, భజగోవిందం, విశ్వవేదన.

అముద్రితాలు : Fountain of Nectar, ప్రశ్నోత్తర మణిమాల, వ్యాసమంజరి, భావవీణ ఇత్యాదులు.